

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 12

గురువారం 4-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



విశాఖలో పరుగుల సంద్రం

272 పరుగులు చేసిన కోల్‌కతా.. ఢిల్లీపై 106 పరుగుల తేడాతో గెలుపు - 14లో



54 మందికి రాజ్యసభ వీడ్కోలు

ముగిసిన మన్మోహన్‌సింగ్ మూడు దశాబ్దాల ఇన్నింగ్స్ - 6లో

ఫ్యాక్ట్‌చెక్

నిర్జీవం బాబు సంస్కృతి.. జవజీవం జగన్ జాగృతి!

- అస్మదీయుల కోసం బాబు హయాంలో డెయిరీల మూత
- చిత్తూరు డెయిరీకి జగన్ హయాంలోనే జవజీవాలు
- పునః ప్రారంభానికి శరవేగంగా చర్యలు.. చక్కెర కర్మాగారాలనూ మూసేసింది బాబే
- నేడు ఆ కార్మికులను ఆదుకున్నది జగన్
- వాస్తవాలను దాస్తున్న రామోజీ

5లో


చిత్తూరు జిల్లా పూతలపట్టులో జరిగిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

ధర్మాన్ని గెలిపించండి

విశ్వసనీయత, మోసం.. రెండింటిలో మీరు దేనివైపో ఆలోచించండి

పూతలపట్టు సభలో ప్రజలకు సీఎం జగన్ పిలుపు

- మీ బిడ్డ ఒక్కడిపై వీరంతా యుద్ధం చేస్తున్నారు
- మంచి కోసం కుటుంబం అంతా కూర్చుని ఆలోచించండి.. మీ బ్యాంక్ స్టేట్‌మెంట్ చూసుకోండి
- ఎప్పుడూ జరగని విధంగా లబ్ధి కలిగిఉంటేనే నాకు మద్దతుగా నిలవండి
- అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, రైతులు, విద్యార్థులు.. అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూర్చాం
- 2014లో ఇదే చంద్రబాబు ఇదే పార్టీలతో జత కట్టారు.. ఇప్పుడు చెబుతున్న సూపర్ 6, సూపర్ 7 తరహాలోనే హామీలు
- అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ నెరవేర్చకుండా మోసం చేశారు.. ఈ చంద్రబాబు అనే చంద్రముఖి మన జోలికి రాకుండా చెక్ పెడదాం

10లో

"చంద్రబాబు ఇప్పుడు మరీ దిగజారిపోయాడు. మూడు రోజులుగా అవ్వాతాతలు పడుతున్న బాధలన్నీ మీకు కనిపిస్తున్నాయి. ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే సూర్యుడు ఉదయిస్తున్నాడో లేదోగానీ, వలంటీర్లు మాత్రం చిరునవ్వుతో వచ్చి తలుపుతట్టి సెలవుదినమైనా, పండుగ దినమైనా అవ్వాతాతల ముఖంలో చిరునవ్వులు చూస్తూ మనవళ్లుగా, మనవరాళ్లుగా పింఛన్ అందించే వారు. ఇది గిట్టని చంద్రబాబు పథకం ప్రకారం ఎలక్షన్ కమిషన్‌కు నిమ్మగడ్డ రమేష్ అనే తన మనిషి చేత లేఖలు రాయించి, ప్రెజర్ పెట్టించి వలంటీర్ వ్యవస్థకు అడ్డు వేయించారు. ఈ రోజు ఆ నడవలేని వయసులో అవ్వాతాతలు పెన్షన్ అందుకునేందుకు పడుతున్న అగచాట్లు చూస్తున్నప్పుడు చంద్రబాబు నాయుడు మనిషా లేక శాడిస్టా అని అడుగుతున్నాను."

\- సీఎం వైఎస్ జగన్


పూతలపట్టు వద్ద సీఎం జగన్‌ను ఆప్యాయంగా ముద్దాడుతున్న చిన్నారి

వన్స్ మోర్ జగన్..

బస్సు యాత్ర దారిపొడవునా అందరి నోటా ఇదే మాట

సీఎం జగన్‌కు నీరాజనం.. రోడ్డుపైకి తరలి వచ్చిన గ్రామాలకు గ్రామాలు

మేలు చేసిన జననేతకే తమ ఓటు అని స్పష్టీకరణ

ఏం చూసి చంద్రబాబుకు ఓటేయాలని నిలదీత

ఎన్ని జెండాలు జత కట్టినా వారు చిత్తే..


తామంతా అన్ని విధాలా ఆదుకున్న ఈ ప్రభుత్వం వెంటే..

ఎలుగెత్తి చాటిన చిత్తూరు, తిరుపతి జిల్లాల ప్రజానీకం

11లో

సీఎం జగన్ లేఖపై ఏం చేశారు?

విశాఖ ఉక్కుపై కేంద్రాన్ని ప్రశ్నించిన హైకోర్టు



- ముఖ్యమంత్రి లేఖను గౌరవించాల్సిందే
- సీఎం లేఖ రాస్తే స్పందించకపోవడం సరికాదు
- స్పందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది
- సీఎం లేఖను పక్కనపెట్టి నిద్రపోవడానికి వీల్లేదు
- మీ కౌంటర్‌లో ఎక్కడా సీఎం లేఖ ప్రస్తావన లేదేం?
- ఆ లేఖ విషయంలో ఏం చేశారో స్పష్టంగా చెప్పండి
- భూముల విక్రయంపై పూర్తి వివరాలతో అఫిడవిట్ వేయండి
- అసలు ఏ చట్టం కింద ప్రైవేటీకరణ చేస్తున్నారు?
- ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించారా?
- అసలు విశాఖ ఉక్కు చరిత్ర తెలుసా? అంటూ ధర్మాసనం ప్రశ్నల వర్షం
- మా సొంత డబ్బుతో కొన్న 25 ఎకరాలనే విక్రయిస్తామన్న 'ఆర్‌ఐఎన్‌ఎల్'

2లో



త్వరలో ఇంటర్, పది ఫలితాలు

- ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం నేటితో ముగియనుంది. ఈనెల 12వ తేదీ నాటికి ఇంటర్ ఫలితాలను వెల్లడించే అవకాశమున్నట్టు సమాచారం. పదో తరగతి మూల్యాంకనం కూడా ఈనెల 8వ తేదీతో ముగియనుంది. ఈ ఫలితాలను కూడా వీలైనంత త్వరగా ప్రకటించే అవకాశముంది.

16లో



వైఎస్సార్‌సీపీలో చేరిన కుప్పం టీడీపీ నేతలు

- సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన ఉమ్మడి చిత్తూరు జెడ్పీ మాజీ చైర్మన్ ఎం.సుబ్రమణ్యంనాయుడు
- కుతూహలమ్మ కుమారుడు, టీడీపీ నేత ఎ.హరికృష్ణ, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి కూడా..

11లో

దిగ్విజయంగా పింఛన్ల పంపిణీ

చంద్రబాబు అండ్ కో కుట్రలను అధిగమించి పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం

- బుధవారం మధ్యాహ్నం నుంచే సచివాలయాల్లో అవ్వాతాతలకు పింఛన్లు
- ఆరు గంటల్లోనే 26,00,064 మందికి రూ.785.25 కోట్లు పంపిణీ
- మరో 3 రోజులు కొనసాగనున్న పంపిణీ
- బుధవారం మధ్యాహ్నం నుంచి పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. వలంటీర్ల బంధాన్ని బాబు అండ్ కో తెంచడంతో ఆ సమాచారం తెలియక వృద్ధులకు ఇబ్బందులు
- ఎక్కువగా అనారోగ్య సమస్యలున్న వృద్ధులు, దివ్యాంగులు వంటి వారికి ఇంటి వద్దే పింఛన్ ఇస్తామన్న అధికారులు

12లో


ఒంగోలు 9వ డివిజన్‌లోని ఇందిరమ్మకాలనీ సచివాలయంలో పింఛన్‌దారులకు నగదు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

బాబు కుట్రలతో పండుటాకులు విలవిల

పింఛన్ కోసం సచివాలయాలకు వెళ్లొస్తూ ఒక్కరోజే 20 మంది మృత్యువాత

- వేసవి కావడంతో వడదెబ్బ, తీవ్ర అస్వస్థతకు గురవుతున్న వృద్ధులు
- చంద్రబాబు వల్లే తమకు ఈ అవస్థలు వచ్చాయని మండిపడుతున్న లబ్ధిదారులు
- తమ ఉసురు ఆయనకు తగులుతుందని శాపనార్థాలు.. చేయాల్సిందంతా చేసి టీడీపీ నేతల డ్రామాలు
- పాలకొల్లు, పెనమలూరుల్లో టీడీపీ అభ్యర్థులు నిమ్మల, బోడె ఓవరాక్షన్

- వివరాలు 12లో


కృష్ణా జిల్లా గంగూరులో వజ్రమ్మ మృతదేహం వద్ద టీడీపీ నేత బోడె ప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కుటుంబసభ్యులు



ఇంటింటికి వెళ్లి పింఛన్లు ఇవ్వడం ఏపీలోనే ఉంది..

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు తీసుకెళ్లడం మంచి పని

సీజే నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్య

వలంటీర్లపై నిషేధం వ్యవహారంలో జోక్యానికి తిరస్కృతి

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సంతృప్తికరమని వెల్లడి



2లో

అవ్వాతాతల ఉసురు బాబుకు తగలక తప్పదు



- పేదల ఆగ్రహంలో కూటమి కొట్టుకుపోవడం ఖాయం
- రెండు నెలలు పెన్షన్ ఆపితే.. వలంటీర్లపై గెలిచినట్టా?
- వలంటీర్లను నోటికొచ్చినట్టు వాగింది మీ నోళ్లే కదా?
- సచివాలయ ఉద్యోగులున్నారని ఇప్పుడే గుర్తొచ్చిందా బాబూ?
- పచ్చనేతల కుట్రలపై మాజీమంత్రి పేర్ని నాని ఫైర్

12లో

పచ్చ నోట్ల పంపిణీ కేంద్రాలు



బాబు బృందం వ్యాపార సంస్థలే డంపింగ్ స్థావరాలు

'మార్గదర్శి' కేంద్రంగా అక్రమ నిధుల పంపిణీ

నారాయణ విద్యా సంస్థల నుంచే నల్లధనం దందా

టీడీపీ బడాబాబుల షిప్పింగ్, ఆక్వా కంపెనీలే అక్రమ నిధుల గిడ్డంగులు.. ప్రలోభాలు.. విచ్చలవిడిగా నోట్ల దందా.. భారీగా దొంగ ఓట్లే లక్ష్యం

ఎన్నికల్లో అక్రమాలకు చంద్రబాబు బరితెగింపు

3లో

టీడీపీలో హాహాకారాలు

చంద్రబాబుపై సీనియర్ల తిరుగుబాటు

- సీట్ల కేటాయింపులో విఫలమయ్యారని ఆవేదన
- బీసీ సాకుతో ఏలూరు సీటు యనమల అల్లుడికి ఇవ్వడంపై మాగంటి బాబు ఆగ్రహం
- నమ్మించి మోసం చేశారంటున్న కిమిడి నాగార్జున, బండారు సత్యనారాయణమూర్తి
- అనపర్తి బరిలో ఇండిపెండెంట్‌గా నల్లమిల్లి!.. కోవూరులో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రచారంలో వర్గపోరు

3లో



- ఆదోని, ఆలూరు, మంత్రాలయం, కోడుమూరు, నంద్యాల, డోన్ టీడీపీ ఇన్‌చార్జ్‌లకు దక్కని టికెట్లు
- మంత్రాలయం, కోడుమూరు, ఆదోనిలో చల్లారని నిరసన జ్వాలలు



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

చింత లేకుండా వ్యవసాయం



మాది వ్యవసాయ కుటుంబం. ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం జలపావారిగూడెంలో నాకున్న కొద్దిపాటి పొలంతోపాటు గ్రామంలో కొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నా. అమ్మానాన్నలు నాతోనే కలిసి ఉంటారు. గ్రామ సమీపంలో సుమారు మూడెకరాల పొలం ఉంది. గతంలో సరైన నీటి సదుపాయం లేక వర్షాలపై ఆధారపడి ఏడాదికి ఒక పంట మాత్రమే పండించే వాళ్లం. సరైన దిగుబడులు లేక, ఆర్థిక ఇబ్బందులు పడేవాళ్లం. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మా కుటుంబానికి ఏ విధమైన లబ్ధి కలగలేదు. వ్యవసాయం చేయాలంటే పెట్టుబడికి డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులకు గురయ్యేవాళ్లం. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించిన తరువాత వైఎస్సార్ జలకళ పథకం ద్వారా బోరు వేయడంతో పాటు, మోటార్ అందజేశారు. ఉచిత విద్యుత్ సర్వీస్ అందింది. దీంతో నాకు సుమారు రూ.5 లక్షల వరకు ప్రభుత్వం నుంచి లబ్ధి కలిగింది. ఇప్పుడు ఏటా రెండు పంటలు పండించే అవకాశం కలిగింది. రైతు భరోసా ద్వారా రూ.13,500 అందుకుంటున్నా. దానివల్ల పెట్టుబడికి అప్పు చేయాల్సిన అవసరం రావట్లేదు. నాకు ఇద్దరు కుమారులు. అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు అందుతోంది. నాన్నకు వృద్ధాప్య పింఛన్, రైతు భరోసా, అమ్మకు డ్వాక్రా ద్వారా సున్నా వడ్డీ, ఆసరా వంటి పథకాలు అందాయి. ఇంతగా మేలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– గంగు హరిప్రసాద్‌రెడ్డి, జలపవారిగూడెం
(యు.లక్ష్మీనారాయణ, విలేకరి, కామవరపుకోట)

స్వశక్తితో గౌరవంగా జీవిస్తున్నాం



నా భర్త ఆదివిష్ణు ప్లంబింగ్ పనులు చేస్తుంటారు. ఆయన సంపాదన మా కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోయేది కాదు. ప్రభుత్వం అందించిన సాయంతో దుస్తుల వ్యాపారం చేపట్టా. దీని ద్వారా కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచా. విశాఖపట్నం జిల్లా చిట్టివలసకు చెందిన నేను డ్వాక్రా గ్రూప్‌లో సభ్యురాలిని. వైఎస్సార్ ఆసరా ద్వారా మొత్తం రూ.93,750, సున్నా వడ్డీ పథకం కింద రూ.19,500 వచ్చింది. పీఎం స్వనిధి ద్వారా రూ.10 వేలు వచ్చాయి. ఆ డబ్బుతో ఇంటి దగ్గరే దుస్తుల వ్యాపారం ప్రారంభించా. మా పిల్లలు యువశ్రీ, జ్యోతిశ్రీ ప్రభుత్వ పాఠశాలల్లో 10, 8 తరగతులు చదువుతున్నారు. అమ్మఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు వస్తోంది. మా అత్త సాధమ్మకు వైఎస్సార్ పింఛన్ కానుక అందుతోంది. నాలాగే ఎందరో మహిళల జీవితాలలో జగనన్న సంక్షేమ పథకాలు వెలుగు నింపాయి. ఈ ప్రభుత్వం వల్లే ఇప్పుడు స్వశక్తితో గౌరవంగా జీవించగలుగుతున్నాం.

– తమ్మిన నీలిమ, చిట్టివలస
(గేదెల శ్రీనివాసరెడ్డి, విలేకరి, తగరపువలస)

అప్పు చేయకుండా పిల్లల చదువులు



మాది మధ్య తరగతి కుటుంబం. మాకు ఒక కుమార్తె హిమజ, కుమారుడు నేతాజీ ఉన్నారు. నెల్లూరు రూరల్ 27వ డివిజన్ చంద్రమౌళినగర్ 6వ వీధిలో నివాసముంటూ 15 ఏళ్లుగా చిన్న దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాం. ఎప్పుడూ ఒడిదుడుకుల జీవనమే. దుకాణం మీద వచ్చే ఆదాయం సరిపోయేది కాదు. ఏ ప్రభుత్వం మమ్ములను పట్టించుకున్న పాపాన పోలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్థిక సమస్యలు తీరాయి. మా అమ్మాయి ఎంబీఏ, అబ్బాయి బీటెక్ చదువుతున్నారు. ఇద్దరికీ కలిపి జగనన్న విద్యా దీవెన కింద రూ.1,86,712, వసతి దీవెన కింద రూ.40,600 అందింది. అంతకు ముందు రెండేళ్లపాటు ఏటా రూ.15 వేలు వంతున అమ్మ ఒడి పథకం ద్వారా అందింది. జగనన్న తోడు పథకం ద్వారా వడ్డీలేని రుణంగా రూ.పది వేల వంతున తీసుకున్నాం. వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందింది. పేదలందరికీ ఇళ్ల పథకంలో మాకు విలువైన స్థలం ఉచితంగా ఇచ్చారు. అందులో ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం రూ. 1.80 లక్షలు అందించారు. ఇప్పుడు మేమంతా సంతోషంగా జీవిస్తున్నామంటే అందుకు ఈ ప్రభుత్వమే కారణం. ఎప్పటికీ సీఎం సాయం మరువలేము.

– కొండూరు రామచంద్రరాజు, నెల్లూరు
(కొలగాని శ్రీనివాసులు, విలేకరి, నెల్లూరు సిటీ)

సీఎం జగన్ లేఖపై ఏం చేశారు?

- విశాఖ ఉక్కుపై కేంద్రాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- సీఎం లేఖ రాస్తే స్పందించకపోవడం సరికాదు
- స్పందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది



సాక్షి, అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు బదులుగా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని కోరుతూ సీఎం వైఎస్ జగన్ రాసిన లేఖపై ఏం చర్యలు తీసుకున్నారో తెలియచేయాలని హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ముఖ్యమంత్రి లేఖ రాస్తే ఇప్పటివరకు స్పందించకపోవడం ఎంత మాత్రం సరికాదంది. ముఖ్యమంత్రి రాసిన లేఖపై స్పందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని తేల్చి చెప్పింది. సీఎం లేఖ రాస్తే దానిని పక్కన పెట్టి నిద్రపోవడానికి వీల్లేదని, సీఎం లేఖను గౌరవించాలని తేల్చి చెప్పింది. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం దాఖలు చేసిన కౌంటర్‌లో ఎక్కడా ముఖ్యమంత్రి రాసిన లేఖ గురించి, దానిపై తీసుకున్న చర్యల గురించి కేంద్రం ప్రస్తావించలేదని ఆక్షేపించింది. విశాఖ ఉక్కు కర్మాగారం కోసం వివిధ వర్గాలు ఇచ్చిన భూమిని విక్రయించే విషయంలో పూర్తి వివరాలను అఫిడవిట్ రూపంలో తమ ముందుంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అసలు ఏ చట్టం కింద విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేస్తున్నారు? ప్రైవేటీకరణకు అనుమతించే చట్టం ఏదైనా ఉందా? ప్రైవేటీకరణకు ముందు ఆ కర్మాగారం ఉద్యోగులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఇతర లబ్ధిదారులను సంప్రదించారా? ఈ విషయాలన్నింటిపై మీ వైఖరి ఏమిటో స్పష్టంగా చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరోవైపు విశాఖ ఉక్కు కర్మాగారం కొనసాగేందుకు అవసరమైన నిధులను విదేశాల నుంచి తెస్తానని, ఇందుకు ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేటరీ యాక్ట్ కింద ప్రత్యేక ఖాతా తెరిచేందుకు అనుమతించాలన్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వినతి విషయంలో ఏం చర్యలు తీసుకున్నారో కూడా తెలియచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ న్యాపతి విజయ్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మేం కొన్న 25 ఎకరాలనే అమ్ముతున్నాం

ధర్మాసనం ఈ సమయంలో జోక్యం చేసుకుని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌ఐఎన్‌ఎల్) తరఫు న్యాయవాదిని వివరణ కోరింది. ప్రైవేటీకరణ నిజమేనా? భూములు అమ్ముతున్న మాట వాస్తవమేనా? అని ప్రశ్నించింది. ఉక్కు కర్మాగారంలో పెట్టుబడుల ఉపసంహరణ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వ్యవహారమని ఆర్‌ఐఎన్‌ఎల్ తరఫు న్యాయవాది సన్నపురెడ్డి వివేక్ చంద్రశేఖర్ నివేదించారు. ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం సేకరించిన భూముల్లో వేటినీ అమ్మడం లేదన్నారు. ఆర్‌ఐఎన్ఎల్ తన సొంత నిధులతో కొనుగోలు చేసిన 25 ఎకరాలను మాత్రమే విక్రయించనున్నట్లు తెలిపారు. దీంతో ధర్మాసనం వివేక్ చెప్పిన వివరాలను రికార్డ్ చేసింది. మరో న్యాయవాది వై.కోటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ భూముల అమ్మకాన్ని అడ్డుకోవాలని కోరుతూ అనుబంధ పిటిషన్ దాఖలు చేశామని, యథాతథస్థితి కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు.

ప్రైవేటీకరణపై పలు వ్యాజ్యాలు...

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మాజీ ఐపీఎస్ జేడీ లక్ష్మీనారాయణ, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌తో పాటు సువర్ణరాజు తదితరులు వేర్వేరుగా 'పిల్స్' దాఖలు చేశారు. రేషన్‌కార్డుదారులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలిచ్చేలా ఆదేశాలివ్వాలంటూ కూడా పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై జస్టిస్ శేషసాయి ధర్మాసనం తాజాగా మరోసారి విచారణ జరిపింది.

సీఎం లేఖ గురించి కేంద్రం ఏమీ చెప్పడం లేదు...

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తాను ఆమరణ నిరాహార దీక్ష చేశానని తొలుత కేఏ పాల్ వాదనలు వినిపించారు. కేంద్ర మంత్రి విశాఖకు వచ్చి తనను కలిశారన్నారు. కేంద్రం అనుమతిస్తే తాను ఇక్కడే కూర్చొని రూ.8 వేల కోట్ల నిధులను రప్పించి ఏ ఖాతాలో కావాలంటే అందులో జమ చేయిస్తానని చెప్పారు. లేని పక్షంలో ఏ శిక్షకైనా తాను సిద్ధమేనన్నారు. 45 ఏళ్లలో ఉక్కు కర్మాగారం పన్నుల కింద రూ.54 వేల కోట్లు చెల్లించిందని తెలిపారు. మరో పిటిషనర్ తరఫు న్యాయవాది యలమంజుల బాలాజీ వాదనలు వినిపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిందన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయాలను సూచించిందా? అని ప్రశ్నించగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాశారని, ఆ లేఖ సంగతి ఏమిటో కేంద్రం చెప్పడం లేదని నివేదించారు.

విశాఖ ఉక్కు చరిత్ర తెలుసా..?

ఆ 25 ఎకరాలు కాకుండా సేకరించిన మిగిలిన భూముల సంగతి ఏమిటి? ఆ భూముల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏమిటి? అసలు విశాఖ ఉక్కు కర్మాగారం చరిత్ర తెలుసా? ఎన్ని ఉక్కు కర్మాగారాల్లో పెట్టుబడుల ఉపసంహరణకు నిర్ణయం తీసుకున్నారు? ఎన్ని ఆచరణలోకి వచ్చాయి? అంటూ కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిపై హైకోర్టు ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వ న్యాయవాది సీవీఆర్ రుద్రప్రసాద్ స్పందిస్తూ భూముల అమ్మకం విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిపాదన లేదన్నారు. పిటిషనర్లది ఆందోళన మాత్రమేనన్నారు. ఏం చేసినా పారదర్శకంగా చేస్తామని, పత్రికా ప్రకటన ఇస్తామని చెప్పారు. దీంతో అన్ని వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం సూచించగా మూడు వారాల్లో అందచేస్తామని రుద్ర నివేదించారు. నిధులు తెచ్చే విషయంలో ఏమైనా వినతిపత్రం ఇచ్చారా? అని ధర్మాసనం ప్రశ్నించగా మార్చిలో అందచేసినట్లు కేఏ పాల్ పేర్కొన్నారు. ఆ వినతిపై ఏ చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచిస్తూ తదుపరి విచారణను ధర్మాసనం వాయిదా వేసింది.

ఇంటింటికి వెళ్లి పింఛన్లు ఇవ్వడం ఏపీలోనే..

ఇలా ఇంటి వద్దకే పథకాలను తీసుకెళ్లడం మంచి పని

- సీజే నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్య
- వలంటీర్లపై నిషేధం వ్యవహారంలో జోక్యానికి తిరస్కృతి
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సంతృప్తికరమని వెల్లడి

సాక్షి, అమరావతి: ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం ఆంధ్రప్రదేశ్‌లో తప్ప దేశంలో మరెక్కడా లేదని, ఇలా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను తీసుకెళ్లడం చాలా మంచి పని అని హైకోర్టు వ్యాఖ్యానించింది. పెన్షన్లు పంపిణీ చేయకుండా వలంటీర్లపై నిషేధం విధిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) గత నెల 30న జారీ చేసిన ఉత్తర్వుల విషయంలో జోక్యానికి నిరాకరించింది. ఏప్రిల్, మే, జూన్ నెలల పెన్షన్ల పంపిణీ విషయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, వృద్ధులు, రోగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్లకే వెళ్లి పింఛన్లు అందచేసే ఏర్పాట్లు చేశామన్న కేంద్ర ఎన్నికల సంఘం వాదనను పరిగణనలోకి తీసుకుంది. ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో తమ జోక్యం అవసరం లేదంది. ఎన్నికల సంఘం ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్‌ను) కొట్టేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సచివాలయాల్లో క్యూలో నిల్చుకుని పెన్షన్ తీసుకోవాల్సి వస్తోంది

పెన్షన్లు పంపిణీ చేయకుండా వలంటీర్లపై నిషేధం విధిస్తూ ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులను చట్ట విరుద్ధంగా ప్రకటించి, వాటిని రద్దు చేయాలని కోరుతూ గుంటూరు జిల్లా, కుంచెనపల్లి, మున్నంగికి చెందిన వంగా వరలక్ష్మి, వంగా బిందు, అల్లు సునీత దాఖలు చేసిన పిల్‌పై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది గుండాల శివప్రసాద్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల సంఘం ఉత్తర్వుల కారణంగా పెన్షనర్లు గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి క్యూలో నిల్చుని పింఛన్లు తీసుకోవాల్సి వస్తోందన్నారు. పక్షవాతం, కిడ్నీ తదితర రోగాలతో బాధపడే వారు పింఛను పొందలేని పరిస్థితి ఉందన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ప్రత్యామ్నాయల సంగతి ఏమిటని, దేశవ్యాప్తంగా ఎలాంటి విధానం అమలవుతోందని ఆరా తీసింది. ఇంటింటికి వెళ్లి పెన్షన్ ఇవ్వడం ఈ రాష్ట్రంలో తప్ప ఎక్కడా లేదని, ఇది మంచి పని అని వ్యాఖ్యానించింది.

■ కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ స్పందిస్తూ, తమ ఆదేశాల మేరకు పెన్షనర్లు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిందన్నారు. వృద్ధులు, రోగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఇళ్లకే వెళ్లి పింఛన్లు ఇచ్చేలా కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మిగిలిన వారు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా పింఛన్లు పొందేలా ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఈ మేరకు ఈ నెల 2న మెమో జారీ చేసిందని తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు ఈ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కొనసాగుతాయన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సంతృప్తి చెందామని ధర్మాసనం తెలిపింది. అలా అయితే తాను లేవనెత్తిన అంశాలన్నింటినీ రికార్డ్ చేయాలని, తరువాత తాను సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని శివప్రసాద్‌రెడ్డి చెప్పారు. మీరు ఏం చెప్పాలనుకుంటున్నారో చెప్పండని శివప్రసాద్‌ను ధర్మాసనం కోరింది. పెన్షన్లు పంపిణీ చేయకుండా వలంటీర్లపై నిషేధం విధిస్తూ ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులు ఏకపక్షమని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సంప్రదించకుండానే నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. రాజకీయ దురుద్దేశాలతోనే నిమ్మగడ్డ రమేష్ ఆధ్వర్యంలో పనిచేసే సిటిజన్ ఫర్ డెమొక్రసీ ఎన్నికల సంఘం వద్ద పిటిషన్ దాఖలు చేసిందన్నారు. గతంలో ఆయన రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా పనిచేశారని తెలిపారు. శివప్రసాద్ వాదనలు విన్న ధర్మాసనం.. పిల్‌ను కొట్టేస్తున్నట్లు తెలిపింది. దేశంలో మిగిలిన అన్ని చోట్లా ప్రజలే వెళ్లి పెన్షన్లు తీసుకుంటున్నారని వ్యాఖ్యానించింది. ఇదే అంశంపై మరో ఐదుగురు కూడా పిటిషన్ దాఖలు చేశారని మరో న్యాయవాది చెప్పగా, ఆ వ్యాజ్యాన్ని కూడా కొట్టేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

సీఎం మార్ఫింగ్ ఫొటోలపై వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు



అడిషనల్ సీఈవో కోటేశ్వరరావుకు ఫిర్యాదు చేస్తున్న మల్లాది విష్ణు, గౌతమ్‌రెడ్డి తదితరులు

సాక్షి,అమరావతి: సీఎం వైఎస్ జగన్ ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ గౌతమ్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. సచివాలయంలో బుధవారం అడిషనల్ సీఈవో కోటేశ్వరరావును ఆయన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. పింఛన్లపై రెండో రోజు కూడా వాయిస్ మెసేజ్‌ల ద్వారా టీడీపీ దుష్ప్రచారంపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... సోషల్ మీడియా ద్వారా వ్యక్తిత్వ హననం చేయడం బాబు సిద్ధాంతమని ఆరోపించారు. టీడీపీ నేత జీవీఎస్ ఆంజనేయులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిపై ఓ చర్చిలో చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా అడిషనల్ సీఈవోకు ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు. బాలల హక్కులు హరిస్తున్నట్లు టీడీపీ చేస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రెసిడెంట్ మనోహర్‌రెడ్డి, లీగల్ సెల్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత నారాయణమూర్తి పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

- అక్రమ మద్యం, నగదు, డ్రగ్స్, ఉచితాలపై నిఘాపెట్టి నియంత్రించండి
- ప్రతి ఓటరు తన ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి
- అన్ని పార్టీలకు సమాన అవకాశాలివ్వాలి
- సీఎస్‌లు, డీజీపీలు, కేంద్ర ఏజెన్సీలతో కేంద్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్
- ఏపీ సీఎస్, డీజీపీ, అధికారుల హాజరు

సాక్షి, అమరావతి: ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుత, హింసారహిత ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించింది. ఇందుకోసం గట్టి చర్యలు తీసుకోవాలని రాష్ట్రాల సీఎస్‌లు, డీజీపీలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులు, కేంద్ర ఏజెన్సీ అధికారులను ఆదేశించింది. ఓటర్లు నిర్భయంగా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలు ఉండాలని సూచించింది. ఎన్నికల తనిఖీల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అన్ని పార్టీలకు వివిధ అంశాల్లో సమాన అవకాశాలు ఇవ్వాలని సూచించింది. సాధారణ ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం ఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్, కమిషనర్లు జ్ఞానేష్‌కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధు రాష్ట్రాల సీఎస్‌లు, డీజీపీలు, కేంద్ర ఏజెన్సీ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లోక్‌సభతో పాటు వివిధ రాష్ట్రాల శాసనసభలకు జరగనున్న ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైనవారందరూ సమన్వయంతో చర్యలు తీసుకోవడంపై దిశానిర్దేశం చేశారు. మద్యం, నగదు, మత్తుపదార్థాలు, ఆయుధాల అక్రమ రవాణా, తాయిలాల పంపిణీపై కఠినమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. భద్రతా దళాల తరలింపు, సున్నిత ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలు, రాష్ట్రాల సరిహద్దుల్లో చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలిచ్చారు. పోలింగ్ రోజున అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్ని మూసేయాలని సూచించారు. నేరస్తులు, సంఘవిద్రోహ శక్తులపై నిఘా ఉంచాలని చెప్పారు. లైసెన్స్‌డ్ ఆయుధాలను సకాలంలో డిపాజిట్ చేయించుకోవాలని, నాన్‌బెయిలబుల్ వారెంట్లను వెంటనే అమలు చేయాలని సూచించారు. ముప్పు ఎదుర్కొంటున్న నేతలు, అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని నిర్దేశించారు. వ్యయ పర్యవేక్షణ కట్టుదిట్టంగా ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ ఎక్కడా రీ పోలింగ్‌కు అవకాశం లేని విధంగా ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్‌కు 48 గంటల ముందు (సైలెంట్ పీరియడ్) ఓటర్లను ప్రభావితం చేసేందుకు డబ్బు, మద్యం వంటి తాయిలాల పంపిణీకి ప్రయత్నాలు జరుగుతాయని, వాటిని సమర్థంగా అడ్డుకోవాలని చెప్పారు.

కట్టుదిట్టంగా కోడ్ అమలు: సీఎస్ జవహర్‌రెడ్డి



ఈ వీడియో సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుండి ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటివరకు రూ.258 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. రాష్ట్ర సరిహద్దుల్లో 150 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 132 ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు, 632 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయని ఆయన చెప్పారు.

పటిష్ట భద్రత: డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సరిహద్దు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి మావోయిస్టుల సమస్య ఉండే 91 పోలింగ్ కేంద్రాలను గుర్తించి కట్టుదిట్టమైన భద్రతాచర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇటీవల మహారాష్ట్రకు పంపిన 10 కంపెనీల పోలీసు బలగాలను తిప్పి పంపడమేగాక అదనపు బలగాలను పంపాలని ఆయన కోరారు. ఏపీసీఈవో ముఖేశ్‌కుమార్ మీనా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నీరబ్‌కుమార్‌ప్రసాద్, రజత్‌భార్గవ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్త, అదనపు డీజీపీ బాగ్చి, పన్నుల చీఫ్ కమిషనర్ గిరిజాశంకర్, ఎక్సైజ్ కమిషనర్ వివేక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్

రెండో విడత 12వ తేదీ వరకు.. ఇంజనీరింగ్ తర్వాతే బీఆర్క్



సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్) రెండో విడత గురువారం నుంచి దేశవ్యాప్తంగా మొదలుకానుంది. దీని కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే అడ్మిట్ కార్డులను విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలోనూ పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్ష జరుగుతుందని అధికార వర్గాలు తెలిపాయి. జేఈఈ మెయిన్ తొలి విడత జనవరి 25వ తేదీన జరిగింది. ఈ పరీక్ష ఫలితాలను కూడా వెల్లడించారు. ఈసారి జరిగే రెండో విడత పరీక్షకు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు లక్ష మంది హాజరయ్యే వీలుంది. దేశవ్యాప్తంగా ఈ ఏడాది జేఈఈ రెండు విడతల పరీక్షలకు 11 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తొలి విడతలో అర్హత సాధించని వారితో పాటు, మంచి ర్యాంకుకు అవకాశం లేని వారు కూడా ఈ దఫా పరీక్షకు హాజరవుతున్నారు. గతంలో బీఆర్క్(బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్ట్) పరీక్షను ముందే నిర్వహించే వారు. ఈసారి ఈ పరీక్షను ఇంజనీరింగ్ జేఈఈ తర్వాత నిర్వహిస్తున్నారు.

ఒక్క నిమిషం నిబంధన కచ్చితంగా అమలు

జేఈఈ మెయిన్స్–2 పరీక్ష ఈనెల 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ జరుగుతుంది. 12వ తేదీ మాత్రం బీఆర్క్, మిగతా రోజుల్లో ఇంజనీరింగ్ జేఈఈ మెయిన్స్ ఉంటుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, రెండో షిఫ్ట్ సాయంత్రం 3 నుంచి 6 వరకూ పరీక్ష జరుగుతుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరు. రెండు గంటల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఎన్టీఏ సూచించింది.

40 ప్రశ్నలొస్తే అర్హత

జేఈఈ మెయిన్స్ పరీక్షలో ఫిజిక్స్, కెమెస్ట్రీ, మేథ్స్ పేపర్ల నుంచి మొత్తం 75 ప్రశ్నలిస్తారు. ఒక్కో ప్రశ్నకు 4 మార్కులుంటాయి. తప్పుగా ఆన్సర్ చేస్తే 1 నెగెటివ్ మార్క్ ఉంటుంది. గత పేపర్లను బట్టి చూస్తే విద్యార్థులు మొత్తంగా 40 ప్రశ్నలకు సరైన జవాబులు ఇవ్వగలిగితే మెయిన్స్ అర్హత సాధిస్తారని ప్రముఖ గణిత శాస్త్ర నిపుణులు ఎంఎన్ రావు తెలిపారు. 60 ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలు ఇస్తే మంచి ర్యాంకు వస్తుందన్నారు. కొన్నేళ్ళుగా మేథ్స్ పేపర్ కఠినంగానే ఉంటోందని, సుదీర్ఘ ప్రశ్నలకు జవాబు రాసేప్పుడు సమయం వృథా కాకుండా చూసుకోవాలని సూచించారు.

అర కోటికి ఆధారాలేవి రామోజీ?

- 24 గంటలు గడిచినా పట్టుబడ్డ డబ్బుకు ఆధారాలు చూపని 'మార్గదర్శి'
- అది ఎన్నికల్లో పంచే డబ్బే అన్న అనుమానాలకు బలం
- పట్టుబడిన డబ్బు వివరాలు సీజర్స్ యాప్‌లో అప్‌లోడ్
- తమ డబ్బే అని అప్పీల్ చేసుకున్న తర్వాత తదుపరి చర్యలు
- ఆదాయపు పన్ను అధికారులకూ సమాచారం.. విచారణలో సరైన ఆధారాలు చూపించాల్సిందే



సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరంలో అర కోటికి పైగా నగదు, చెక్కులతో ఈనాడు రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది అడ్డంగా దొరికిపోయి 24 గంటలు దాటినా ఇంతవరకు వాటికి ఆధారాలు చూపించలేకపోయారు. మంగళవారం మధ్యాహ్నం పోలీసు తనిఖీల్లో ఇద్దరు మార్గదర్శి సిబ్బంది ఇద్దరి వద్ద రూ.51,99,800 నగదుతో పాటు రూ.36,88,675 విలువైన 51 చెక్కులు పట్టుబడ్డ విషయం తెలిసిందే. దీనిపై వారు పొంతన లేని సమాధానాలు చెప్పడం, ఆధారాలు చూపకపోవడంతో ఆ సొమ్మును, చెక్కులు పోలీసులు ఎన్నికల అధికారులకు అప్పగించారు. బుధవారం రాత్రి వరకు మార్గదర్శి సంస్థ ఉన్నతస్థాయి ఉద్యోగులెవరూ దానికి ఆధారాలు చూపించకపోవడంతో ఆ సొమ్మును ఎన్నికల్లో పంపిణీ కోసం టీడీపీ నేతలకు అందించడానికి తీసుకెళ్తున్నారన్న ఆరోపణలకు బలం చేకూరుతోంది. ఈ నగదు వివరాలను సీజర్ యాప్‌లోకి అప్‌లోడ్ చేసి సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారులు వెల్లడించారు. సీజర్స్ సిస్టమ్‌లో కేసు నమోదు చేశారు. జిల్లా సీజర్స్ కమిటీ బృందం ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తోంది. తమ డబ్బే అని మార్గదర్శి అప్పీల్ చేసుకున్న తర్వాత ఐటీ అధికారులకు సమాచారమిస్తామంటున్నారు. ఆధారాలు చూపించకపోతే డబ్బును సీజ్ చేసి నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

సీతంపేట బ్రాంచి నుంచే..

ఈ నగదు మొత్తం సీతంపేట బ్రాంచి నుంచి తరలించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ద్వారకానగర్ యూనియన్ బ్యాంక్‌కు తీసుకెళ్తున్నామని చెప్పిన మార్గదర్శి సిబ్బంది ఇంతవరకూ ఎలాంటి ఆధారాలూ చూపించలేదని జిల్లా సీజర్స్ కమిటీ సభ్యులు సత్యనారాయణ, సుధాకర్ తెలిపారు. నిజంగా ఇది వారి డబ్బే అయితే అప్పీల్‌కి దరఖాస్తు చేసుకుంటే.. ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇస్తామని చెబుతున్నారు. రూ.10 లక్షలకు పైబడి నగదు దొరికితే ఐటీ అధికారుల సమక్షంలోనే విచారణ జరుపుతామని చెప్పారు. ఐటీకి, ఎన్నికల కమిషన్‌కు స్పష్టమైన ఆధారాలు చూపించిన తర్వాత అన్నీ పక్కాగా ఉంటే నగదు తిరిగి అప్పగిస్తామని, లేదంటే నగదు, చెక్కుల్ని సీజ్ చేసి ఆ సంస్థకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

దొంగ డాక్యుమెంట్స్ సృష్టిస్తారా?

సీతమ్మధారలో లీజుకు తీసుకున్న స్థలాన్ని కాజేసే కుట్రలో భాగంగా రోడ్డు విస్తరణలో స్థలానికి పరిహారం కోసం అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసిన చరిత్ర గురివింద రామోజీరావుది. అలాంటి డ్రామోజీ.. ఆధారాలు సమర్పించి నగదు తీసుకెళ్లకుండా, వేచి ఉండటంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. బహుశా.. ఈ డబ్బు మార్గదర్శికి చెందింది కాదనీ, టీడీపీ నేతలకు అందించేందుకు తీసుకెళ్తున్న సొమ్మే అన్న అనుమానాలూ దృఢపడుతున్నాయి. డబ్బుని ఎలాగైనా దక్కించుకునేందుకు రామోజీరావు దొంగ డాక్యుమెంట్స్ సృష్టించడానికే ఇంత సమయం తీసుకుంటున్నారన్న వదంతులూ ఉన్నాయి.

క్లుప్తంగా...

ఎన్నికల నియమావళికి టీడీపీ తూట్లు

పెనమలూరు టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ నిర్వాకం



తోఫా పంపిణీ కార్యక్రమంలో ముస్లిం మహిళలతో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

కంకిపాడు: ఎన్నికల ప్రవర్తనా నియమావళికి టీడీపీ తూట్లు పొడుస్తోంది. రంజాన్ తోఫా పంపిణీ పేరుతో ముస్లింలకు టీడీపీ నేతలు నిత్యావసరాలను తాయిలంగా ఇచ్చి ఆకర్షించే యత్నం చేశారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గ పరిధిలోని కానూరులో ఓ స్వచ్ఛంద సంస్థ పేరిట ముస్లిం మహిళలకు తోఫాను టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ పంపిణీ చేశారు. టీడీపీ, జనసేనకు బీజేపీ తోడవ్వటంతో ముస్లింలు ఎక్కడ దూరమైపోతారో అనే భయం టీడీపీ అభ్యర్థిని పట్టిపీడిస్తోంది. దీంతో ఆ వర్గాన్ని ఆకర్షించేందుకు నిత్యావసరాలను తోఫాగా అందించారు. బాహాటంగా తోఫాలను పంపిణీ చేసినా, ఆ అంశం పత్రికల్లో ప్రచురితమైనా అధికారులు మాత్రం స్పందించలేదు. ఈ విషయమై ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజును సాక్షి వివరణ కోరగా.. తోఫా పంపిణీపై ఫిర్యాదు రాలేదన్నారు. తోఫాపై అభ్యర్థి, ఆ పార్టీ ఫోటోలు ఉంటే చర్యలు ఉంటాయన్నారు. తోఫా ఇవ్వటం ద్వారా ప్రలోభానికి గురిచేయటం కాదా? అన్న ప్రశ్నకు విచారించి నోటీసులు జారీ చేస్తామన్నారు.

టీడీపీ ముఖ్య నేత ఇంట్లో చీరల పట్టివేత

విలువ రూ.20 లక్షలు ఉంటుందని అంచనా



టీడీపీ నేత వెంకటరమణ ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసు అధికారులు

పామర్రు: కృష్ణా జిల్లా పామర్రు మండలం పెరిశేపల్లిలో ఓటర్లకు పంచేందుకు సిద్ధం చేసిన చీరలను మంగళవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.20 లక్షలు ఉంటుందని అంచనా. ఓటర్లను ప్రభావితం చేసేందుకు విజయవాడలో కొనుగోలు చేసిన చీరలను పెరిశేపల్లిలో టీడీపీ ముఖ్యనేత చాపరాల వెంకటరమణ గృహంలో ఉంచారు. దీనిపై పామర్రు సీఐ సుభాకర్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలకు సమాచారం అందింది. విషయాన్ని గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్‌కు తెలిపి పెరిశేపల్లి వెళ్లి ఇంటిని సోదా చేయాలని అడగ్గా.. ఇది తన ఇల్లు కాదని, ఇంటి తాళాలు తన వద్ద లేవని టీడీపీ నేత బుకాయించారు. రెండు గంటల వాగ్వాదం తర్వాత ఇంటి తాళాలు పోలీసుల చేతికందాయి. 46 బండిల్స్‌లో మొత్తం 7,680 చీరలు ఉన్నాయి. వీటి విలువ దాదాపు రూ. 20 లక్షల వరకు ఉంటుందని ప్రాథమిక అంచనా వేశారు. పట్టుబడిన చీరల బండిల్స్‌ను పామర్రు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

'ఓటు వేయకపోతే ఫైన్' ప్రచారాన్ని ఖండించిన ఈసీ

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోకపోతే బ్యాంక్ ఖాతాల నుంచి కేంద్రం రూ.350 మినహాయించుకుంటుందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతోన్న ప్రచారాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఖండించారు. ఓటు హక్కు వినియోగించుకోని వారిని గుర్తించి వారి ఆధార్ నంబర్ ఆధారంగా వారి ఖాతాల నుంచి రూ.350 కట్‌చేయడానికి కోర్టులు కూడా అనుమతించినట్లు చేస్తోన్న ప్రచారాన్ని ఖండిస్తూ ఆయన బుధవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతోన్న ఇటువంటి దొంగ పత్రికా ప్రకటనలను ఒకటికి రెండు సార్లు ధ్రువీకరించుకోవాలని పేర్కొన్నారు. వార్తల్లో వాస్తవం ఎంత ఉందో అనే విషయాన్ని https:// mythvsreality.eci.gov.in ద్వారా తెలుసుకోవాలని సూచించారు.

తెలంగాణ

ఏపీలో మళ్లీ జగన్‌దే సర్కారు

- టీడీపీ అధినేత చంద్రబాబు పని అయిపోయింది
- బీజేపీతో పొత్తు పెట్టుకొని ఆయన తప్పు చేశాడు
- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

సాక్షి, హైదరాబాద్: ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావడం ఖాయమని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ వ్యాఖ్యానించారు. ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు పని అయిపోయిందని, బీజేపీతో పొత్తు పెట్టుకొని ఆయన చాలా తప్పు చేశాడన్నారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పుట్టిన టీడీపీ, అదే కాంగ్రెస్‌తో తెలంగాణలో పొత్తు పెట్టుకోవడంతో కనుమరుగైంది. ఇప్పుడు బీజేపీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా చంద్రబాబు తప్పు చేశాడు. జాతీయపార్టీలతో పొత్తులు పెట్టుకున్న ప్రాంతీయ పార్టీలేవీ తర్వాతి కాలంలో మనుగడ సాధించిన దాఖలాలు లేవు. పొత్తు తర్వాత జతగూడిన పార్టీలను మింగేస్తాయి' అని మాగంటి అన్నారు.

టీడీపీలో హాహాకారాలు

చంద్రబాబుకు 'నేతల పోటు' / సీనియర్ల తిరుగుబాటు



సాక్షి, అమరావతి/ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)/ఆత్మకూరు రూరల్/అమలాపురం టౌన్/సాక్షి ప్రతినిధి, నెల్లూరు/సాక్షి ప్రతినిధి కర్నూలు: తెలుగుదేశం పార్టీలో ఆగ్రహ జ్వాలలు చల్లారడంలేదు. పొత్తులు, సమీకరణలు, ధన ప్రభావంతో సీట్లు గల్లంతైన సీనియర్ నేతలు చంద్రబాబు తీరుపై గతంలో ఎన్నడూ లేనివిధంగా దుమ్మెత్తిపోస్తున్నారు. అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తుతున్నారు. ప్రతిజిల్లాలోనూ అసమ్మతి తీవ్రస్థాయిలో రాజుకోవడంతో టీడీపీ అధినేత చంద్రబాబుకు ముచ్చెమటలు పడుతున్నాయి. 30కిపైగా నియోజకవర్గాల్లో సీట్లు రాని నేతలు టీడీపీ అభ్యర్థులను ఓడిస్తామని ప్రకటించడంతో బాబు తల పట్టుకుంటున్నారు. తాజాగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీనియర్ నేత, మాజీ ఎంపీ మాగంటి బాబు తన అసంతృప్తిని వెళ్లగక్కారు. ఏలూరు ఎంపీ సీటును యనమల రామకృష్ణుడి అల్లుడు మహేష్‌కు కేటాయించడాన్ని తప్పు బట్టారు. చాలాఏళ్లుగా తమ సామాజికవర్గానికి కేటాయించే సీటును బీసీకివ్వడం సరికాదని, ఈ సీటును బీసీలకు ఇవ్వాలని ఎవరడిగారని ఆయన మంగళవారం రాత్రి చంద్రబాబును కలిసినప్పుడు ప్రశ్నించారు. తమకు కనీసం చెప్పకుండా తమ సీటును మార్చడం అవమానించడమేనని నిలదీశారు. బీసీల్లో యనమల కుటుంబం తప్ప మరొకరు దొరకలేదా? ఎక్కడో కడప నుంచి అభ్యర్థిని తీసుకురావడమేమిటీ అంటూ మాగంటి సంధించిన వరుస ప్రశ్నలకు చంద్రబాబు వద్ద సమాధానం లేదని సమాచారం. చంద్రబాబు ఎంత బుజ్జగించినా, ఎన్నికల తర్వాత రాజ్యసభ సీటు ఇస్తానని నమ్మబలికినా మాగంటి శాంతించలేదు. ఆయన తన దారి తాను చూసుకోవడానికి సిద్ధమవుతున్నారని సమాచారం. చంద్రబాబును కలిసి బయటకు వచ్చిన వెంటనే బాబుపై నమ్మకం లేదని వ్యాఖ్యానించి కోపంగా వెళ్లిపోవడం దీనికి బలం చేకూరుస్తోంది. చంద్రబాబుతో చర్చలు ఆశాజనకంగా సాగలేదని పార్టీ శ్రేణులకు మాగంటి బాబు రాసినట్టు చెబుతున్న ఓ లేఖ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

➤ కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ఆదోని, ఆలూరు, మంత్రాలయం, కోడుమూరు, నంద్యాల, డోన్ నియోజకవర్గాల్లో టికెట్లు దక్కని టీడీపీ ఇన్‌చార్జులు అసమ్మతిబావుటా ఎగురేశారు. ఆదోనిలో పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న మీనాక్షినాయుడు సీటును బీజేపీకి కేటాయించడంపై మండిపడుతున్నారు. తానుగానీ, తన తనయుడుగానీ ఇండిపెండెంట్‌గా బరిలో దిగాలని యోచిస్తున్నారు. ఆలూరులో టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ పార్టీ అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. కుటుంబానికి ఒకే సీటు అంటూ తనను పక్కన పెట్టడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. మంత్రాలయంలో రాఘవేంద్ర, నందికొట్కూరులో గిత్త జయసూర్యకు టికెట్లు కేటాయించిన తర్వాత గెలుపు అవకాశాలు సన్నగిల్లాయని నివేదికలు అందడంతో ఈ సీట్లను మార్చే యోచనలో చంద్రబాబు ఉన్నట్టు సమాచారం. కోడుమూరులో ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి వర్గాల మధ్య టిక్కెట్ పంచాయతీ తెగలేదు. విష్ణు ప్రతిపాదించిన బొగ్గుల దస్తగిరి అభ్యర్థిత్వాన్ని కోట్ల వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఆకేపోగు ప్రభాకర్‌కు టిక్కెట్ ఇవాల్సిందేనని పట్టుబట్టినా అధిష్టానం స్పందించకపోవడంతో ప్రచారంలో పాలుపంచుకోవడం లేదు. డోన్ ఇన్‌చార్జ్ మన్నే సుబ్బారెడ్డిని కాదని కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి టికెట్ ఇవ్వడంతో సుబ్బారెడ్డి సైలెంట్ అయ్యారు. ప్రచారంలో మాత్రం పాల్గొనడం లేదు. నంద్యాలలో భూమా బ్రహ్మానందరెడ్డి కూడా అభ్యర్థి ఫరూక్‌కు సహకరించడం లేదు.

➤ విజయనగరం జిల్లా చీపురుపల్లిలో పదేళ్లుగా పని చేస్తున్న కిమిడి నాగార్జునను కనీసం పరిగణనలోకి తీసుకోకుండా ఆ సీటును ఆయన బంధువు కళా వెంకట్రావుకు కేటాయించడంపై పార్టీ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఉన్నత స్థాయిలో ఉద్యోగం చేస్తున్న తనను బాబు తన అవసరం కోసం రాజకీయాల్లోకి తీసుకువచ్చి ఇప్పుడు కనీసం మాటమాత్రంగానైనా చెప్పకుండా పక్కకు తప్పించడంపై నాగార్జున కన్నీటి పర్యంతమయ్యారు.

➤ పెందుర్తి సీటును జనసేనకు కేటాయించడం, అక్కడ తన వ్యతిరేకి పంచకర్ల రమేష్‌ను ఆ పార్టీ నుంచి పోటీ చేయిస్తుండడాన్ని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి జీర్ణించుకోలేకపోతున్నారు. చంద్రబాబు తనను ఇంతలా మోసం చేస్తారని అనుకోలేదని ఆవేదన చెందుతున్నారు. కొన్నిరోజులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన ఆయన ఇక రాజకీయాల నుంచి విరమిస్తానని నిర్వేదం వ్యక్తం చేయడంపై పార్టీ శ్రేణులు ఆవేదన చెందుతున్నాయి.

➤ అనపర్తి సీటును తొలిజాబితాలోనే తనకు కేటాయించి.. అంతలోనే మళ్లీ బీజేపీకి ఇవ్వడంపై మండిపడుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు.

➤ రాజంపేట సీటును పార్టీ శ్రేణులకూ తెలియని సుగవాసి సుబ్రహ్మణ్యంకి కేటాయించడంతో బత్యాల చెంగల్రాయుడు తిరుగుబాటుకు సిద్ధమయ్యారు.

➤ హజ్ కమిటీ రాష్ట్ర మాజీ చైర్మన్ మోమిన్ అహమ్మద్ హుసేన్ బుధవారం తెలుగుదేశం పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేశారు. త్వరలో వైఎస్సార్ సీపీలో చేరనున్నట్లు ఆయన కర్నూలు జిల్లా ఆత్మకూరులోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. 30 ఏళ్లుగా టీడీపీలో క్రియాశీలకంగా పనిచేసిన హుసేన్ పలు కీలక పదవులలో సేవలందించారు. ఆయనతో పాటు టీడీపీ రాయలసీమ స్థాయి నాయకుడైన కుమారుడు మోమిన్ ముస్తఫా, స్థానిక మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ అయిన మరో కుమారుడు ముష్తి కూడా టీడీపీకి రాజీనామా చేశారు.

➤ అనంతపురం అర్బన్ సీటును దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అనే కొత్త వ్యక్తికి ఇవ్వడంతో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర చౌదరి వర్గం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే.

➤ టీడీపీ కోవూరు నియోజకవర్గ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లిలో బుధవారం నిర్వహించిన ప్రచారంలో పార్టీలోని వర్గ విభేదాలు బయటపడ్డాయి. ప్రచార రథమెక్కేందుకు యత్నించిన వవ్వేరు బ్యాంక్ మాజీ చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డిని పోలంరెడ్డి దినేష్‌రెడ్డితో పాటు స్థానిక టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఆయన అనుచరులనూ మెడపట్టి తోసేశారు. మరొకరిని కాలితో తన్నడంతో కిందపడిపోయారు. దీంతో సూరాతోపాటు ఆయన అనుచరులు అవమానభారంతో వెనుదిరిగారు. సూరా ఇటీవలే టీడీపీలో చేరారు. ఆయన చేరికను పార్టీ శ్రేణులు వ్యతిరేకిస్తున్నారు. ప్రశాంతిరెడ్డి కూడా అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూరాకు హుకుం జారీ చేయడం గమనార్హం. ఇదిలా ఉంటే ప్రశాంతిరెడ్డి ప్రచారానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. దీంతో ఆమె అర్ధాంతరంగా ప్రచారాన్ని ఆపేసి వెనుదిరిగారు.

➤ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి, జిల్లా అధ్యక్షుడికి ఫ్యాక్స్, వాట్సాప్‌ల ద్వారా బుధవారం పంపించారు. పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడినా తనకు న్యాయం జరగలేదని, జనసేనకు పట్టు ఉన్న అమలాపురాన్ని టీడీపీ చేతిలో పెట్టడమేమిటని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని వివరించారు.

పవన్‌కళ్యాణ్ వింత పోకడ

- ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చే వలంటీర్లను వద్దన్నారు
- పింఛన్‌దారులకు పార్టీ నేతలు సాయం చేయాలంటూ పిలుపునిచ్చారు
- ఇది తమ పార్టీకి అనుకూలంగా ప్రభావితం చేసినట్లే కదా అంటున్న విశ్లేషకులు

సాక్షి, అమరావతి: పింఛన్‌దారుల విషయంలో పవన్ కళ్యాణ్ వింత పోకడలు పోతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పింఛన్‌దారులకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా లబ్ధిదారులకు ఇంటి వద్దే వలంటీర్లు పెన్షన్ అందిస్తున్న విషయం తెలిసిందే. ఇది నచ్చని పవన్.. వలంటీర్లపై లేనిపోని అభాండాలు వేశారు. చివరకు చంద్రబాబుతో కలసి పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, చంద్రబాబు సన్నిహితుడు నిమ్మగడ్డ రమేష్‌కుమార్ తదితరుల ఫిర్యాదుల మేరకు పింఛన్ల పంపిణీలో వలంటీర్ల ప్రమేయాన్ని ఎన్నికల కమిషన్ తొలగించింది. ఇప్పుడు పింఛన్‌దారుల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. దీనినుంచి బయటపడటానికి తన పార్టీ శ్రేణులతో పాటు బీజేపీ, టీడీపీ కార్యకర్తలకు పవన్ ఓ పిలుపునిచ్చారు. 'పింఛన్లు తీసుకోవాల్సిన వృద్ధులకు, దివ్యాంగులకు తోడుగా ఉండండి. వారిని పింఛన్ ఇచ్చే కార్యాలయానికి మీ వాహనంపై జాగ్రత్తగా తీసుకువెళ్లి తర్వాత ఇంటి వద్ద దించండి' అంటూ బుధవారం ట్వీట్ చేశారు. రాజకీయాలకు అతీతంగా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చే వలంటీర్లను వద్దన్న వాళ్లే.. ఇప్పుడు పింఛన్‌దారులకు తోడుగా ఉండాలంటూ కార్యకర్తలకు పిలుపునివ్వడం పట్ల రాజకీయ విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీకి అనుకూలంగా పింఛన్‌దారులను వలంటీర్లు ప్రభావితం చేస్తున్నారంటూ గగ్గోలు పెట్టిన వాళ్లే.. ఇప్పుడు నాయకులకు ఈ పిలుపునివ్వడం ద్వారా తమ పార్టీకి అనుకూలంగా ప్రభావితం చేసినట్లే కదా అని ప్రశ్నిస్తున్నారు. ఇది ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్లే అవుతుందని చెబుతున్నారు.

పవన్ ఎన్నికల ప్రచారం వాయిదా

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ జ్వరం బారినపడటంతో ఎన్నికల ప్రచారాన్ని అర్ధంతరంగా వాయిదా వేసుకొని హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. గత నెల 30న పిఠాపురంలో పర్యటించి నాలుగు రోజులు అక్కడే వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బుధవారం తెనాలి, గురువారం నెల్లిమర్ల, 5, 6, 7 తేదీల్లో అనకాపల్లి, యలమంచిలి, పెందుర్తిలో ఆయన పర్యటించాల్సి ఉంది. వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకోవడానికి ప్రచారాన్ని వాయిదా వేశారు. రీ షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని పార్టీ బుధవారం పేర్కొంది.

పచ్చ నోట్ల పంపిణీ కేంద్రాలు

సాక్షి, అమరావతి: ప్రజాబలంతో ఎన్నికల్లో విజయం సాధించలేమని స్పష్టం కావడంతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పచ్చ నోట్ల దందాకు తెరతీశారు. రూ.వేల కోట్లు వెదజల్లి ఎన్నికల్లో అక్రమాలకు బరి తెగించేందుకు సన్నద్ధమయ్యారు. దశాబ్దాలుగా తన కుట్ర రాజకీయాల్లో భాగస్వాములైన ఈనాడు రామోజీరావు, పొంగూరు నారాయణలతోపాటు టీడీపీ బడా బాబుల వ్యాపార సంస్థలనే నల్లధనం డంపింగ్ యార్డులుగా మార్చేశారు. విశాఖ నుంచి నెల్లూరు వరకు పచ్చనేతల షిప్పింగ్, ఆక్వా కంపెనీలను నల్లధనం కంటైనర్లకు గమ్యస్థానాలుగా చేసుకున్నారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు టీడీపీ తరలిస్తున్న నల్లధనం బాగోతం ఇప్పటికే రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, పోలీసుల సోదాల్లో బయటపడింది. కాకపోతే దొరికింది గోరంతే! గుట్టుచప్పుడు కాకుండా సిద్ధం చేసిన గిడ్డంగుల్లో టీడీపీ పెద్దలు గుట్టలు గుట్టలుగా అక్రమ నిధులు దాచిపెట్టినట్లు స్పష్టమవుతోంది.







విశాఖలో స్వాధీనం చేసుకున్న మార్గదర్శి నగదు, నెల్లూరులో పట్టుబడిన 'నారాయణ' సొమ్ము, బాపట్లలో స్వాధీనం చేసుకున్న రాయల్ మెరైన్ కంపెనీ సొమ్ము

కుట్రలకు 'మార్గదర్శి'

చంద్రబాబు రాజకీయ, ఆర్థిక కుట్రల్లో భాగస్వామి ఈనాడు రామోజీ మరోసారి నల్లధనం తరలింపు బాధ్యతను భుజానికెత్తుకున్నారు. మీడియా ముసుగులో నిత్యం ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వంపై బురద చల్లుతున్న ఆయన మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాలను టీడీపీ అక్రమ నిధుల తరలింపు కేంద్రాలుగా మార్చారు. రోజూ చిట్‌ఫండ్స్ కార్యాలయాల ద్వారా టర్నోవర్ ముసుగులో అక్రమ నిధులను చాప కింద నీరులా టీడీపీ అభ్యర్థులకు చేరవేస్తున్నారు. విశాఖలో ఎలాంటి పత్రాలు లేకుండా మార్గదర్శి కార్యాలయం నుంచి తరలిస్తున్న రూ.51.88 లక్షల నగదు, రూ.39.29 లక్షలు విలువ చేసే చెక్కులను తాజాగా పోలీసులు గుర్తించి జప్తు చేయడం తెలిసిందే. అయితే మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేంద్రంగా సాగుతున్న నల్లధనం దందాలో పట్టుబడిన ఈ మొత్తం సముద్రంలో కాకి రెట్ట లాంటిదే. ఆర్థిక అక్రమాల కోసం మార్గదర్శి చిట్‌ఫండ్స్ మొదటి నుంచి పక్కా పన్నాగంతో వ్యవహరిస్తోంది. డిజిటల్ చెల్లింపులు కాకుండా నగదు లావాదేవీలు నిర్వహిస్తోంది. విశాఖ బ్రాంచిలో మూడు రోజుల లావాదేవీల మొత్తాన్ని తాము తరలిస్తున్నట్లు సోదాల సందర్భంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది చెప్పారు. మూడు రోజులకే ఒక్క బ్రాంచిలో రూ.51.88 లక్షలు లావాదేవీల పేరుతో నల్లధనాన్ని తరలిస్తున్నారంటే ఏ స్థాయిలో అక్రమాలకు టీడీపీ సిద్ధపడిందో ఊహించవచ్చు. దీని ప్రకారం నెలకు రూ.5.10 కోట్లు వసూలు చేస్తున్నట్లే. రాష్ట్రంలోని 37 బ్రాంచిల ద్వారా నెలకు సగటున రూ.188.70 కోట్లు వసూలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. మే నెలలో నిర్వహించనున్న ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు జనవరి నుంచి ఈ విధంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ద్వారా అక్రమ నిధులు తరలిస్తున్నట్లు భావిస్తున్నారు. ఇలా మార్గదర్శి కార్యాలయాల నుంచి రూ.వందల కోట్లను ఇప్పటికే గుట్టు చప్పుడు కాకుండా తరలించినట్లు స్పష్టమవుతోంది. 2022 నవంబరు నుంచి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో కొత్త చిట్టీలు వేయడం లేదు. అయినా సరే ఈ స్థాయిలో నగదు లావాదేవీలు నిర్వహిస్తుండటం వెనుక లోగుట్టు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల కమిషన్ రాష్ట్రంలోని 37 మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సోదాలకు ఆదేశించి నగదు లావాదేవీల రికార్డులను తనిఖీ చేస్తే అక్రమాల బాగోతం బట్టబయలవుతుందని పరిశీలకులు పేర్కొంటున్నారు.

దొంగ ఓట్ల బడి 'నారాయణ'

మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణకు చెందిన నారాయణ విద్యా సంస్థలు ఎన్నికల అక్రమాల శిక్షణా కేంద్రాలుగా మారాయి. నారాయణ విద్యా సంస్థల్లో చదువులు ఎలా చెబుతారో తెలియదు కానీ ఓటర్లను ఎలా ప్రలోభాలకు గురి చేయాలి? నోట్లు పంచి ఓట్లు ఎలా కొనుగోలు చేయాలి? అనేది టీడీపీ శ్రేణులకు పక్కాగా బోధిస్తారు. 2014, 2019 ఎన్నికల్లో అక్రమ నిధుల తరలింపు కేంద్రాలుగా నారాయణ విద్యా సంస్థలే ప్రధాన పాత్ర పోషించాయన్నది బహిరంగ రహస్యం. టీడీపీ హయాంలో అమరావతిలో భూదందాలో నారాయణ 'ఎన్‌స్పైరా' నుంచే అక్రమ నిధులు తరలించారన్నది సీఐడీ దర్యాప్తులో ఇప్పటికే వెల్లడైంది. ఏపీ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు ఇటీవల నెల్లూరులోని ఎన్‌స్పైరా కార్యాలయాల్లో నిర్వహించిన తనిఖీల్లో ఈ బాగోతం బట్టబయలైంది. నారాయణ విద్యా సంస్థల నిర్వహణ వ్యయం పేరిట అక్రమ నిధులు తరలిస్తున్నట్లు బయటపడింది. ఈదఫా ఎన్నికల్లో మరింత బరి తెగించారు. ఎన్‌స్పైరా ముసుగులో అక్రమ నిధుల పంపిణీకి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయడం పచ్చ పన్నాగానికి పరాకాష్ట. జిల్లా కేంద్రాల్లోని నారాయణ విద్యా సంస్థలు, వాటి కార్యాలయాల నుంచే టీడీపీ అభ్యర్థులకు అక్రమ నిధుల పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్నారు. విద్యార్థులు చెల్లించిన ఫీజుల ముసుగులో చడీచప్పుడు కాకుండా కుట్రను అమలు చేసేందుకు ఉపక్రమించారు. నారాయణ విద్యా సంస్థల్లో విద్యార్థులు, వారు చెల్లించిన ఫీజుల వివరాలు, బ్యాంకుల్లో జమ చేస్తున్న మొత్తం, ఇతర వ్యయం పేరిట చూపిస్తున్న లెక్కలను పరిశీలిస్తే ఈ అక్రమాల గుట్టు రట్టు కావడం ఖాయం. ఎన్నికల కమిషన్ నారాయణ విద్యా సంస్థల్లో సమగ్రంగా సోదాలు నిర్వహించి రికార్డులు, బ్యాంకు ఖాతాలను తనిఖీలు చేయాలని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు.

తీరం వెంట అక్రమ నిధుల డంపింగ్ యార్డులు

రాష్ట్రానికి ఉన్న పొడవైన తీరప్రాంతాన్ని ఎన్నికల అక్రమాలకు చుక్కానిగా చేసుకోవాలని చంద్రబాబు కుట్ర పన్నారు. అందుకోసం విశాఖ నుంచి నెల్లూరు వరకు టీడీపీ బడాబాబులకు చెందిన షిప్పింగ్, ఆక్వా కంపెనీలను దొంగ నోట్ల కేంద్రాలుగా, అక్రమ నిధులను తరలించే కంటైనర్లుగా మార్చుకోవడం ఆయన బరి తెగింపు రాజకీయాలకు నిదర్శనం. బాపట్ల టీడీపీ అభ్యర్థి వేగ్నేశ నరేంద్ర వర్మకు చెందిన రాయల్ మెరైన్ కంపెనీ కంటైనర్లలో తరలిస్తున్న అక్రమ నిధులు మార్చి 28న పోలీసుల సోదాల్లో బయట పడటం గమనార్హం. విదేశాల్లోని టీడీపీ సానుభూతిపరుల నుంచి సేకరించిన నిధులను లావాదేవీల ముసుగులో కంటైనర్ల ద్వారా మన రాష్ట్రంలోని పోర్టులకు తరలించడం ఆ పార్టీ పెద్దల లక్ష్యం. విశాఖ, కాకినాడ, నెల్లూరులో చంద్రబాబుకు అత్యంత సన్నిహితులైన బడా బాబుల షిప్పింగ్ కంపెనీలు, ఆక్వా కంపెనీల గిడ్డంగులకు తరలించి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చేరవేయాలని పన్నాగం పన్నారు. ఇప్పటికే విశాఖలోని ఓ షిప్పింగ్ కంపెనీ యజమానికి చెందిన గిడ్డంగులు అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలకు అక్రమ నిధుల పంపిణీ కేంద్రాలుగా మారాయి. విశాఖ, భీమిలీ తీరప్రాంతంలోని టీడీపీకి బడాబాబుకు చెందిన ఓ హేచరీస్ కంపెనీ స్థావరంగా ఉత్తరాంధ్ర అంతటా అక్రమ నిధులు తరలించేందుకు కుట్ర పన్నుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అదే రీతిలో కాకినాడ జిల్లాలో టీడీపీ అభ్యర్థి ఒకరు తీరప్రాంతంలోని హేచరీలు, ఆక్వా కేంద్రాలు అడ్డాగా అక్రమ నిధులు తరలింపును పర్యవేక్షిస్తున్నారు. నెల్లూరు కేంద్రస్థానంగా గ్రేటర్ రాయలసీమ జిల్లాల్లో ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు టీడీపీ తెరతీసింది.

రాష్ట్రమంతా పర్చూరు మోడల్

ఎన్నికల్లో రూ.వేల కోట్లను వెదజల్లడమే కాకుండా క్షేత్రస్థాయిలో ఓటర్లను ప్రభావితం చేసే పన్నాగాన్ని పక్కాగా పర్యవేక్షించాలని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. 2019 ఎన్నికల్లో పర్చూరు నియోజకవర్గంలో అమలు చేసిన పథకాన్ని ఈసారి మరింత పకడ్బందీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలన్నది ఆయన కుతంత్రం. పర్చూరు టీడీపీ ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు గత ఎన్నికల్లో పాల్పడిన అక్రమాలు ఇటీవల డీఆర్ఐ సోదాల్లో వెలుగులోకి వచ్చాయి. మండలాలు, పంచాయతీలవారీగా ఓటర్లకు పంపిణీ చేయాల్సిన విధానం, ఇతర ప్రాంతాల నుంచి దొంగ ఓటర్లను రప్పించడం, అందుకోసం నిధుల వ్యయం, ఓట్ల కొనుగోలు, దొంగ ఓట్ల పర్యవేక్షణకు వివిధ స్థాయిలో బాధ్యుల నియామకం తదితరాలతో ఓ బ్లూప్రింట్‌ను రూపొందించి ఎమ్మెల్యే సాంబశివరావు అమలు చేశారు. తన వ్యాపార సంస్థ నోవా అగ్రిటెక్ ఆర్థిక వ్యవహారాల ముసుగులో ఆ కుతంత్రాన్ని అమలు చేశారు. అదే రీతిలో బ్లూప్రింట్‌ను టీడీపీ ప్రధాన కార్యాలయం నుంచి అన్ని నియోజకవర్గాలకు పంపి కుట్రను పక్కాగా అమలు చేయాలన్నది చంద్రబాబు పన్నాగం. అందుకోసం మార్గదర్శి చిట్‌ఫండ్స్, నారాయణ విద్యా సంస్థలు, టీడీపీ బడాబాబులకు చెందిన షిప్పింగ్, ఆక్వా, ఇతర కంపెనీలను వాడుకోవాలని కుతంత్రం రచించారు. చంద్రబాబు, లోకేశ్, రామోజీ, నారాయణ, పచ్చ కోటరీలోని ఇతర ముఖ్యులు సర్వం తామై ఈ ఎన్నికల కుతంత్రం పర్యవేక్షణ బాధ్యతలు తీసుకోవడం గమనార్హం. ఎన్నికల్లో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడటం, రూ.వేల కోట్లు వెదజల్లడం, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, అవసరమైతే భయోత్పాతం సృష్టించేందుకు చంద్రబాబు, ఎల్లో గ్యాంగ్ సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో పచ్చ ముఠా అక్రమ నోట్ల గిడ్డంగులపై వెంటనే దాడులు నిర్వహించేలా ఎన్నికల కమిషన్ క్రియాశీలం కావడం ఒక్కటే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్షని పరిశీలకులు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


మూడు రోజులు వడగాడ్పులు

12 జిల్లాలపై ప్రభావం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణం కంటే 3–4 డిగ్రీలు ఎక్కువగా రికార్డవుతూ ఉష్ణతాపాన్ని వెదజల్లుతున్నాయి. కొద్దిరోజుల నుంచి నాలుగైదు జిల్లాలకే పరిమితమైన వడగాడ్పులు రానున్న మూడు రోజుల్లో మరిన్ని జిల్లాలకు విస్తరించనున్నాయి. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, ఎన్టీఆర్, కాకినాడ, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, వైఎస్సార్, తిరుపతి జిల్లాల్లో వడగాడ్పులు వీస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆయా జిల్లాల్లో సాధారణం కంటే 3నుంచి 5 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశాలున్నాయి. కోస్తాంధ్ర కంటే రాయలసీమలో ఉష్ణతీవ్రత మరింత ఎక్కువగా ఉండనుంది. బుధవారం అత్యధికంగా నంద్యాలలో 43 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కర్నూలులో 42.7, అనంతపురంలో 42.6, కడపలో 42.2, తిరుపతిలో 40.5, జంగమహేశ్వరపురంలో 40 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు గాలుల దిశలో మార్పులు సంభవించడం వల్ల ఈ నెల 7 నుంచి మూడు రోజులపాటు కోస్తాంధ్రలో 8, 9 తేదీల్లో రాయలసీమలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

వైద్యారోగ్యశాఖ అప్రమత్తం

సాక్షి, అమరావతి: ఎండ తీవ్రత, వడగాడ్పుల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ బుధవారం ఓ ప్రకటనలో సూచించింది. బాలింతలు, చిన్నారులు, వృద్ధులు ఎండ ఎక్కువ ఉంటే బయటకు వెళ్లొద్దని సూచించింది. ఎవరైనా బయటకు వెళ్లాల్సి వస్తే తలపై టోపీ/గొడుగు/తెలుపు రంగు కాటన్ వస్త్రాలు ధరించాలని పేర్కొంది. ఎండ నుంచి వచ్చిన వెంటనే నీరు, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ వంటి పానీయాలను తీసుకోవాలని తెలిపింది. ఆ సమయంలో తేనె వంటి తీపి పదార్థాలకు, శీతల పానీయాలకు దూరంగా ఉండాలని పేర్కొంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల మధ్య ఎండలో శారీరక శ్రమను పెంచే పనులు చేయొద్దని సూచించింది. తల తిరగడం, వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు వస్తే వడదెబ్బగా గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించాలని స్పష్టం చేసింది. వడదెబ్బ తగిలిన వ్యక్తి సాధారణ స్థితికి రాకుంటే వెంటనే శీతల వాతావరణంలో సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించాలని సూచించింది.



నేను తెలివైనవాడినని చెప్పగలను.
ఎందుకంటే నాకేమీ తెలీదని నాకు తెలుసు.
– సోక్రటీస్

సాక్షి

గురువారం, 4 ఏప్రిల్ 2024

నిప్పుల కొలిమి

ఎవరో తరుముకొచ్చినట్టు ఈసారి చాలాముందుగానే ఎండాకాలం వచ్చిపడింది. ఫిబ్రవరి నుంచే సెగలూ పొగలూ ఎగజిమ్మిన సూరీడు అంతకంతకూ తన ప్రతాపాన్ని పెంచుతూ పోతున్నాడు. రోజూ నమోదవుతున్న ఉష్ణోగ్రతలను చూస్తుంటే భారత వాతావరణ విభాగం(ఐఎండీ) హెచ్చరించినట్టు నిరుటికన్నా వేసవితాపం మరింత అధికంగా వుంటుందని అర్థమవుతోంది. ఇంచుమించు రోజూ 39–41 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలుంటున్నాయి. వాస్తవానికి పదేళ్లుగా దేశంలో ఎండల తీవ్రత పెరిగింది. పాత రికార్డులు బద్దలవుతున్నాయి. నిరుడు మార్చి ఎండ తీవ్రత 1901 నాటి రికార్డును అధిగమించిందని ఐఎండీ తెలిపింది. ఆ తర్వాత వరసగా ఏప్రిల్, మే, జూన్ నెలలు వేటికవే అత్యధిక ఉష్ణోగ్రతల్లో కొత్త పోకడలను నమోదు చేశాయి. రానున్న రోజుల్లో ఈ తీవ్రత మరింత పెరుగుతుందే తప్ప తగ్గదని వాతావరణ శాస్త్రజ్ఞులు చెప్తున్న జోస్యాలు భయపెడుతున్నాయి. దీనికి తోడు ఈసారి వానలు సైతం అంతంతమాత్రం కావటంతో జలాశయాలు నిండుకున్నాయి. భూగర్భ జలాలు లోలోతులకు పోతున్నాయి. నిరుడు ఎల్‌నినో ప్రభావం కారణంగా దక్షిణాసియా ప్రాంత దేశాలన్నీ తక్కువ వర్షపాతాన్ని నమోదు చేశాయి. రివాజుగా జూన్ నెల మొదట్లో కేరళను తాకాల్సిన రుతుపవనాలు ఏడు రోజులు ఆలస్యంగా వచ్చాయి. ఆ తర్వాత సెప్టెంబర్ వరకూ మెరుగ్గానే వర్షాలు పడ్డాయి. కొన్నిచోట్ల భారీ వర్షాలు పడటంతో వరదలు కూడా ముంచుకొచ్చాయి. మొత్తానికి దాదాపు 94 శాతం వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత అక్టోబర్ మొదలుకొని మార్చి వరకూ వర్షాల మాట అటుంచి కనీసం మబ్బుల జాడైనా కనబడలేదు. ఇది చాలదన్నట్టు ఫిబ్రవరి నుంచే ఎండల తీవ్రత పెరగటంతో జలాశయాల్లో నీరు అంతంతమాత్రంగానే వుంది.

ఈ మూడు నెలలూ సాధారణంగా అయితే నాలుగు నుంచి ఎనిమిది రోజులు మాత్రమే వడగాడ్పులు తీవ్రంగా వీచాలి. కానీ ఇది పది నుంచి 20 రోజుల వరకూ ఉండొచ్చని ఐఎండీ చెబుతోంది. ముఖ్యంగా గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశాల్లో ఉష్ణోగ్రతలూ, వడగాడ్పుల తీవ్రత అధికంగా వుండొచ్చని వాతావరణ విభాగం హెచ్చరిస్తోంది. మండే ఎండలు, తీవ్ర వడగాడ్పులు, కుండపోత వర్షాలు, ముంచెత్తే వరదలు ఎవరూ ఆపగలిగేవి కాదు. కానీ ప్రపంచ దేశాలు సమష్టిగా నిర్ణయాలు తీసుకుని, సమర్థంగా అమలు చేయగలిగే కార్యాచరణను రూపొందిస్తే వీటి తీవ్రతను తగ్గించటానికి ఆస్కారం వుంటుంది. ప్రపంచ వాతావరణ సంస్థలు(డబ్ల్యూఎంఓ) మొన్న మార్చి 19న విడుదల చేసిన ప్రపంచ వాతావరణ నివేదిక ఏమంత ఆశాజనకంగా లేదు. నిరుటికన్నా 2024 మరింత ప్రమాదకరంగా వుండగలదని హెచ్చరించింది. కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, క్లోరోఫ్లోరో కార్బన్లు వంటి గ్రీన్ హౌస్ వాయువులు వాతావరణంలో పరిమితులకు మించి పెరిగిపోవటం వల్ల ఉష్ణోగ్రతలు అధికమై సముద్ర ఉపరితల జలాలను వేడెక్కిస్తున్నాయని ఆ నివేదిక తెలిపింది. ఆఖరికి అంటార్కిటిక్, ఆర్కిటిక్ ప్రాంతాల్లో భారీ మంచు పలకలు కరగటం నిరుడు బాగా ఎక్కువైందని వివరించింది. ఆర్థికవృద్ధి పేరుతో ప్రభుత్వాలు పర్యావరణానికి నష్టం చేకూర్చే విధానాలు అవలంబించటమే ప్రస్తుత పరిస్థితికి కారణం. భారత, బంగ్లాదేశ్‌లలో పర్యావరణ విధ్వంసం వల్ల నిరుడు ఏప్రిల్ నెలలో వడగాడ్పుల తీవ్రత 30 రెట్లు పెరిగిందని వాతావరణ శాస్త్రవేత్తలు లెక్కేశారు. ఎండల తీవ్రత, వడగాడ్పుల వల్ల సహజంగానే రానున్న రోజుల్లో నీటి కొరత మరింత ఎక్కువకావొచ్చు. ఎన్నికల సీజన్ కావటంతో ఈ సమస్యపై వాగ్యుద్ధాల మోత కూడా ఎక్కువేవుంటున్నది. కారణం మీరంటే మీరని తెలంగాణ రాష్ట్రంలో అధికార, విపక్షాలు మాటలు విసురుకుంటున్నాయి. ఆ మాటెలావున్నా ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండి వడ గాడ్పులపై, ఎండల తీవ్రతపై ప్రజలను హెచ్చరించటం అవసరం. లేనట్టయితే వడదెబ్బ మరణాలు పెరిగే అవకాశం వుంది.

మన దేశంలో వడగాడ్పులను ప్రకృతి వైపరీత్యంగా పరిగణించటం లేదు. చెప్పాలంటే వేటిని వడదెబ్బ మరణాలుగా లెక్కేయాలన్న అంశంలో ఎలాంటి కొలమానమూ లేదు. నిరుడు డిసెంబర్‌లో లోక్‌సభలో వడగాడ్పులను ప్రకృతి విపత్తుగా లెక్కేసి, బాధిత ప్రజల సహాయపునరావాసాల కోసం నిధులందించాలని డిమాండ్ వచ్చింది. కానీ కేంద్రం నుంచి పెద్దగా స్పందన లేదు. పర్యవసానంగా బాధిత కుటుంబాలకు ఎలాంటి సాయమూ అందటం లేదు. కేవలం కొన్ని రాష్ట్రాలు మాత్రమే ఇందుకు మినహాయింపు. ఎన్‌డీఎంఏ 2016 నుంచి కొన్ని మార్గదర్శకాలు విడుదల చేస్తోంది. అక్కడితో దాని పాత్ర ముగుస్తోంది. ఎండ తీవ్రత ఉన్నపుడు ఆరుబయట కార్మికులతో పనిచేయించకుండా చూడటం, ఎక్కడికక్కడ తాగునీటి సౌకర్యం కల్పించటం, ప్రజారోగ్య సిబ్బందిని సంసిద్ధంగా ఉంచటం, అవసరమైన ప్రాంతాలకు సహాయబృందాలను తరలించటం కీలకం. ఇలాంటి జాగ్రత్తలతో వడగాడ్పు మరణాల నివారణ సాధ్యమే. అలాగే ఇరుకిరుకు ఇళ్లలో మగ్గిపోయే మురికివాడల ప్రజలనూ, మరీ ముఖ్యంగా వృద్ధులనూ, గర్భిణులనూ, బాలింతలనూ వడగాడ్పుల నుంచి సంరక్షించటానికి ఏం చేయగలమో ప్రభుత్వాలు ఆలోచించాలి. ఈ కృషిలో స్థానిక సంస్థల పాత్ర పెంచటం, అందుకు అవసరమైన నిధులు అందించటం ప్రభుత్వాల బాధ్యత. అన్నిటికీ మించి వడగాడ్పులను ప్రకృతి వైపరీత్యంగా పరిగణించి, ఆ విషయంలో పౌరులను అప్రమత్తం చేసేందుకూ, వారిని కాపాడేందుకూ అనుసరించాల్సిన విధానాలను రూపొందించటం తక్షణావసరమని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలి.

రూల్‌బుక్‌ను మార్చి రాయాలా?!

విశ్లేషణ



అశోక్ లావాసా

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు కనివిని ఎరుగని విధంగా చేపడుతున్న చట్టపరమైన చర్యల పరంపరపై రచ్చ నడుస్తోంది. ఈ చర్యలు ఏమైనా 'ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య పద్ధతి' ఉల్లంఘనకు దారితీస్తున్నాయా అనే విషయాన్ని ఎన్నికల సంఘం నిర్ధారించవలసిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రజాస్వామ్య ప్రక్రియల సమగ్రతను, నైతికతను కాపాడుకోవటానికి 'అందరికీ సమానావకాశాలు' (ఎల్.పి.ఎఫ్.) అనే భావన కీలకం అవుతోంది. అలాంటి ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల తరుణంలో ఎల్.పి.ఎఫ్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ – ఎం.సి.సి.) అమలుపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించి వివిధ అంశాలను విశ్లేషించడం అవసరమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

2024 సార్వత్రిక ఎన్నికలను ప్రకటించిన రోజున భారత ఎన్నికల సంఘం, మీడియాకు వివరాలు అందిస్తూ తెలిపిన మంచి అంశాలలో ఒకటి ఏమిటంటే, లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్... ఆటలో అందరికీ సమానావకాశాలు (ఎల్పీఎఫ్)కి ఈసీ ఇస్తున్న ప్రాధాన్యం. అన్ని రాజకీయ పార్టీలకూ ప్రవర్తనా నియమావళిని ఈసీ పంపిందనీ, దానిని ఆ యా పార్టీలు తమ స్టార్ క్యాంపెయినర్ల దృష్టికి తీసుకెళ్లాలనీ అభ్యర్థించినట్లు కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈసీ) రాజీవ్ కుమార్ తెలిపారు. ఎల్పీఎఫ్‌కు భంగం కలిగించే చర్యలకు సంబంధించిన ఫిర్యాదులపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు.

ఎల్పీఎఫ్ అనేది క్రీడలు లేదా యుద్ధాల విషయంలో వర్తించని వ్యక్తీకరణ. సమవుజ్జీలైన రెండు జట్లు మాత్రమే ఒకదానితో ఒకటి ఆడాలి అనేది ఉండదు. క్రికెట్‌లో, స్వదేశీ జట్లు పిచ్‌ను తమకు అనుకూలంగా మార్చుకుంటాయి, అయితే ఈ 'అన్యాయమైన అభ్యాసం' మన్నించబడింది ఎందుకంటే పాల్గొనే జట్లు తమ వంతు కోసం ఎదురు చూస్తుంటాయి. అదేవిధంగా, ఒక శక్తిమంతమైన సైన్యం పోరాటంలో ఒక చిన్న ప్రతిపక్షాన్ని దెబ్బతీస్తే దాన్ని అన్యాయంగా పరిగణించరు. ప్రేమలో, యుద్ధంలో అంతా న్యాయమైనదే అంటారు.

ఎల్పీఎఫ్ అనేది స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలకు ఒక పవిత్రమైన సూత్రం. ప్రజాస్వామ్యంలో ఎన్నికలనేవి యుద్ధం లేదా ప్రేమ పోటీ కానే కాదు. వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఒకరితో ఒకరు పోటీపడి ప్రతినిధుల సభలో ప్రాతినిధ్యం వహించడానికి ఓటర్ల ఆదేశాన్ని పొందడం ప్రజాస్వామ్యంలో కీలకమైన సంఘటన. ఓటు అనేది విశ్వాసంపై, వాస్తవాలపై ఆధారపడిన సామాజిక ఒప్పందం.

ఈ పోటీ నిష్పక్షపాతంగా ఉండాలంటే, పోటీదారులు సమానంగా ఉండకపోవచ్చని అంగీకరించినప్పటికీ, ఎన్నికల సమయంలో ఎల్పీఎఫ్ లభ్యత ఒక తప్పనిసరి షరతుగా పరిగణించబడుతుంది. స్వాభావిక అసమానతను ఆటలో భాగంగా గుర్తిస్తే, ఎన్నికల సమయంలో వారు ఓటర్లను తమకు అనుకూలంగా ప్రభావితం చేయడానికి ప్రయత్నించినప్పుడు ఎల్పీఎఫ్ ఉండేలా చూసుకోవడమనేది ప్రక్రియ నియంత్రణాధికారి బాధ్యత.

ఎల్పీఎఫ్‌కి చెందిన ఈ సూత్రాన్ని నిశితంగా పరిశీలిస్తే, ప్రతిపక్ష అభ్యర్థులతో పోలిస్తే అధికార పక్షం పొందే ప్రయోజనానికి 'సమం చేయడం' నిర్దిష్టమైనదని చూపిస్తుంది. క్రీడలలో బలహీనమైన జట్టు బలమైన వారితో పోటీపడవచ్చు. వాస్తవానికి, టెన్నిస్ వంటి ఆటలలో పోటీ ప్రారంభ రౌండ్లలో, బలహీనమైన అన్ సీడెడ్ ఆటగాళ్లు ర్యాంకింగ్ పట్టికలను శాసించే ఆటగాళ్లతో తలపడతారు. అత్యున్నతమైన నైపుణ్యాలు, పరాక్రమాలు కలిగిన వారి చేతుల్లో ఓడిపోయినప్పుడు కన్నీళ్లు కూడా రావు. ఎందుకంటే క్రీడలు తాము ప్రజాస్వామికమని చెప్పుకోలేవు. అయితే నిజమైన ప్రజాస్వామ్యంలో ఎన్నికలు మాత్రం అందుకు భిన్నమైన ఆట అనే చెప్పాలి.



సాధారణ సమయాల్లో సాధారణ పౌర ప్రవర్తనను నియంత్రించడానికి సాధారణ చట్టాలు ఉన్నప్పటికీ, రాజకీయ పార్టీల వారు, అభ్యర్థులు ఎన్నికల సమయంలో ఒక నిర్దిష్ట వైఖరిని పాటించాలని భావిస్తున్నారు, దీనిని వారు ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలోనే స్వచ్ఛందంగా అంగీకరించారు. అయితే సూచించిన నిబంధనలన్నీ నిర్దిష్టంగా చట్టంలో లేవు. కొన్నిసార్లు ఇది మంచి ప్రజా ప్రవర్తన పట్ల వారి నిబద్ధతకు గుర్తు. ఈసీ పాటించే సమతూకం విధానానికి చెందిన ప్రదర్శన. ఎన్నికల సమయంలో ఈసీ అమలు చేయాలని భావిస్తున్న ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)కి ఆవిర్భావం ఇది.

ఎంసీసీని పరిశీలిస్తే కోడ్ పరిధిలో నలుగురు ప్రధాన ఆటగాళ్లు ఉన్నారని అర్థమవుతుంది. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, అధికార పార్టీ, బ్యూరోక్రసీ. చివరి రెండూ పాలక వ్యవస్థలో భాగమే కానీ వాటికి కూడా విడిగా కోడ్ వర్తిస్తుంది. కోడ్‌లో ఎక్కువ భాగం ఇప్పటికే ఉన్న విభేదాలను తీవ్రతరం చేయడం, లేదా పరస్పర ద్వేషాన్ని పాదుకొల్పటం, లేదా వివిధ కులాలు, వర్గాల మధ్య ఉద్రిక్తతలను సృష్టించటం, లేదా ధ్రువీకరించలేని ఆరోపణలు చేయడం, చట్టంలో పొందుపరచబడిన ఉల్లంఘనల చుట్టూ ఉంటుంది. ఓట్లను పొందడం కోసం కులం లేదా మతపరమైన భావాలను ప్రేరేపించరాదనీ, పార్టీలు, అభ్యర్థులు అవినీతి విధానాలను ఆశ్రయించరాదనీ, పార్టీలు, వారి కార్యకర్తలు ప్రత్యర్థి పార్టీల కార్యకలాపాలకు అంతరాయం కలిగించరాదనీ కోడ్ నిర్దేశిస్తుంది. ప్రచార సభలు, ఊరేగింపులు, పోలింగ్ బూత్‌లు, మేనిఫెస్టోలపై కూడా ఇలాంటి సెక్షన్లు ఉన్నాయి.

అయితే, గమనించదగ్గ విషయం ఏమిటంటే, 'కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ' కోసం ఎంసీసీ ఒక ప్రత్యేక విభాగాన్ని కేటాయించింది. 'అధికారిక పదవిని ఉపయోగించినట్లు ఎటువంటి ఫిర్యాదు రాకుండా, ఎటువంటి ఫిర్యాదుకూ కారణం చూపే అవకాశం లేకుండా చూసుకోవా'లని కోడ్ ఆజ్ఞాపించింది. కోడ్ పరిధిలోకి వచ్చిన దుర్వినియోగమంటే... అతిథి గృహాలు, రవాణా వంటి ప్రభుత్వ సౌకర్యాల వినియోగానికి సంబంధించినవి. అలాగే ప్రకటనల్ని జారీ చేయడానికి లేదా కొత్త ఆంక్షలను మంజూరు చేయ డానికి ప్రభుత్వ నిధులను వినియోగించడం, అందుకు అధికారాన్ని ఉపయోగించడం కూడా! ఎంసీసీ వీటిని దాటి వెళ్లదు.

రాష్ట్ర యంత్రాంగం, న్యాయ వ్యవస్థ సాధారణ పని తీరు ప్రస్తుత ఎంసీసీ ద్వారా ఏ విధంగానూ పరిమితమైపోదు. న్యాయస్థాన విచా రణల వంటి న్యాయ ప్రక్రియలో ఈసీ జోక్యం చేసుకోవడం, లేదా చట్టాన్ని అమలు చేసే సంస్థల సాధారణ విచారణ ఈసీ ఆదేశాలకు లోబడి ఉండాలా వద్దా అనేది చర్చనీయాంశం. బహుశా, ప్రారంభంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముసాయిదాను రూపొందించినప్పుడు ప్రభుత్వ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల అధికార దుర్వినియోగం అనేది ఊహకైనా రాలేదు.

అయితే, ఎంసీసీ అనేది మానవ ప్రవర్తన లాగా కాలగతిలో మారుతూ వచ్చే పురోగమన పత్రం. 2009లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో, ఈసీ 2009 మార్చి 19 నాటి తన లేఖను పరిశీలించి, ఎంసీసీ వర్తింపు చట్టబద్ధమైన స్వయంప్రతిపత్తి గల ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌ల వంటి కమిషన్‌లకు విస్తరించిందని స్పష్టం చేసింది. బడ్జెట్ సమర్పణపై ఎంసీసీ వర్తింపు గురించి ఆ నాటి ఈసీ లేఖ స్పష్టం చేసింది.

ప్రస్తుతం నెలకొన్న వాతావరణం, ప్రభుత్వ సంస్థల జోరు ఫలితంగా అన్ని పక్షాలకూ సమాన అవకాశాలు లేని స్థితి చూశాక ఎన్నికల సంఘం రంగంలోకి దిగాల్సిందేనేమో! తాజా ఫిర్యాదులకు దారితీసిన పరిస్థితులను పరిశీలించాలేమో!! గతంలో ఇలాంటి పరిస్థితుల్లోనే 2019లో ఎన్నికల సంఘం రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు ఒక సలహాను జారీ చేసింది. ఇప్పుడు మళ్ళీ ఆ విధంగానే ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల అపూర్వమైన చర్యల పరంపర ఏదైనా 'ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య అభ్యాసాన్ని' ఉల్లంఘిస్తున్నదేమో ఈసీ నిర్ధారించాలి.

ఇప్పుడు ఎన్నికల సంఘానికి ఉన్న ప్రధానమైన సందిగ్ధత ఏమిటంటే... 'స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు' నిర్వహించే తన ఏకైక బాధ్యతకు కట్టుబడి రూల్ బుక్‌ను అనుసరించాలా, లేక 'స్క్రిప్టు'ను తిరిగి రాయాలా అనేది! 'స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు' అనే పదం రాజ్యాంగంలో పేర్కొన లేదు కానీ ఈసీ 'పర్యవేక్షణ, దిశానిర్దేశం' అనే మాటలోనే ఆ స్ఫూర్తి నిండి ఉంటుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనేది కూడా మనం సాధారణంగా అర్థం చేసుకునే దానికంటే చాలా పెద్దది. సంపూర్ణంగా గ్రహించి, అమలు చేయాల్సిన న్యాయమైన స్ఫూర్తి అందులో ఉంటుంది.

వ్యాసకర్త మాజీ ఎన్నికల కమిషనర్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆదర్శ భారత్!



ఇటీవలి నా భారత పర్యటనలో ఎ.ఐ, డి.పి.ఐ. విద్య అనేవి ఏ విధంగా ఆరోగ్య సంరక్షణను, చిన్న రైతుల జీవితాలను మెరుగుపరుస్తున్నాయో, ఈ రెండు సాంకేతిక పరిజ్ఞానాలతో ప్రపంచాన్ని ఎంత అద్భుతంగా మార్చవచ్చో ప్రత్యక్షంగా చూశా.

– బిల్ గేట్స్, మైక్రోసాఫ్ట్ దిగ్గజం

నవ్వులాట కాదు



ఇదొక ఫన్ ఫ్యాక్ట్. ప్రస్తుతం లోక్‌సభలో బీజేపీకి 295 సీట్లు ఉన్నాయి. సభలో మెజారిటీకి మార్కు 272. అంటే బీజేపీ 272 కంటే దిగువకు పడిపోయిన రోజు దాని మిత్రపక్షాలన్నీ (సీబీఐ, ఈడీలను వాడి కలుపుకొన్నవి) బీజేపీకి దూరంగా వెళ్లిపోతాయి. మోదీకి నిద్ర పట్టకపోవడానికి కారణం లేకపోలేదు.

– సాకేత్ గోఖలే, రాజ్యసభ ఎంపీ

పడవ మునగబోతోందా?



కేజ్రీవాల్ అరెస్టయ్యాక పార్టీలో మద్దతు తగ్గుతోంది. కేజ్రీవాల్ జైల్లోనే కొనసాగితే తమకు సీఎం అయ్యేందుకు అవకాశం ఉందని కలలు కంటున్న ఆతిషి, సౌరభ్ భరద్వాజ్ 'ఆప్'ను వీడక పోవచ్చు. ఆ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా లండన్‌లోనే ఉండిపోయారు. మరో ఎంపీ స్వాతి యు.ఎస్.లో ఉన్నట్లు తెలుస్తోంది.

– అమిత్ మాల్వియా, బీజేపీ ఐటీ సెల్

అన్వయ దోషం



ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేయటానికి మూడు రోజుల ముందు ఎస్.పి.ఎం.సి.ఎల్. ద్వారా 1 కోటి రూపాయల విలువజేసే 10 వేల బాండ్ల ముద్రణకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. అయితే పేరున్న పత్రిక ఆ సంఖ్యను 10 వేల కోట్ల రూపాయల విలువైన పదివేల బాండ్లుగా ప్రచురించింది!

– మహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్ చెకర్

నిరుద్యోగ రాజ్యం



అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రకారం భారతదేశ పట్టభద్రులలో నిరుద్యోగిత రేటు 29.1 శాతం. ఇది... చదవటం, లేదా రాయటం రాని వారి 3.4 శాతం కంటే 9 రెట్లు ఎక్కువ. ఇక టెన్త్, ఆపై ఉన్నత విద్య అభ్యసించిన యువతలో నిరుద్యోగిత రేటు 6 రెట్లు ఎక్కువగా 18.4 శాతం వద్ద ఉంది!


– సుశాంత్ సింగ్, యేల్ యూనివర్సిటీ

ఇన్ బాక్స్

సమతావాది... సంస్కరణవాది

ధీరోదాత్తత, నిష్కాపట్యం, కరుణ, జాలి, దేశభక్తి, దైవభక్తి లాంటి ఎన్నో గొప్ప లక్షణాలు ఉన్న మహనీయుడు డా॥ బాబూ జగ్జీవన్ రామ్. ఒకవైపు దేశ స్వాతంత్రం కోసం పోరాడుతూనే మరో వైపు సామాజిక సమానత్వం కోసం అలుపెరగని సమరం సాగించిన యోధుడాయన.

జగ్జీవన్ రామ్ చమార్ కుటుంబంలో 1908 ఏప్రిల్ 5వ తేదీన బిహార్ రాష్ట్రంలోని చాంద్వా గ్రామంలో జన్మించారు. బెనారస్ విశ్వవిద్యాలయంలో చదివేటప్పుడు సంఘంలోని హెచ్చుతగ్గులు, కులాల మధ్య తేడాలు పూర్తిగా తెలుసుకున్నారు. కుల సమస్యతో సహా దేశంలోని అనేక సమస్యలు పరిష్కారం కావాలంటే దేశానికి స్వాతంత్ర్యం రావాలని ఆశించారు.



డా॥ బాబూ జగ్జీవన్ రామ్

అస్పృశ్యుల ఉద్ధరణకు 1928లో 'రవిదాస్ మహాసభ'ను ఏర్పాటు చేశారు. హరిజనులు అపరిశుభ్రమైన వృత్తులను విడనాడటం, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఆరోగ్య నియమాలను పాటించటం, మద్యపానాన్ని మానడం వంటి అంశాలను కార్యకర్తలు చేపట్టేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. నిరక్షరాస్యతను తొలగించటానికి రాత్రిపూట వయోజన పాఠశాలలు నిర్వహించేలా చూశారు.

1934లో బిహార్‌లో భూకంపం వచ్చినప్పుడు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. దళితులందరినీ సంఘటిత పరచి 1934 సంవత్సరం కలకత్తాలో తొలి 'అఖిల భారత రవిదాస్ మహాసభ'ను ఏర్పాటు చేశారు. బిహార్ శాసనసభకు 1935లో జరిగిన ఎన్నికల్లో మొత్తం 15 ఎస్సీ రిజర్వుడ్ స్థానాలకు జగ్జీవన్ నిలిపిన అందరూ గెలిచారు. వీరిలో 14 మంది ఏకగ్రీవం కావడం మరో విశేషం. 1936లో బిహార్ శాసనమండలికి నామినేట్ అయ్యారు. 1930లో గాంధీజీ దృష్టిలో పడ్డారు. కాన్పూర్‌లో జరిగిన 'ఆలిండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్' మహాసభలకు అధ్యక్షత వహించారు. ఈ మహాసభలను గాంధీజీ ప్రారంభించడం విశేషం.

వ్యక్తిగత సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని జైలుకెళ్లారు. స్వాతంత్ర్యం అనంతరం రాజ్యాంగంలో చేర్చిన దళితుల హక్కులను కాపాడడానికి ఎంతగానో కృషి చేశారు. భారతదేశంలో సుదీర్ఘకాలం క్యాబినెట్ మంత్రిగా ఉన్న రికార్డు ఆయన సొంతం. కేంద్రంలో కార్మిక, కమ్యూనికేషన్స్, రవాణా, రైల్వే, ఉపాధి, పునరావాసం, ఆహార, వ్యవసాయ మంత్రి పదవులను ఆయన నిర్వహించారు. ఆయన పేరుకు ముందు 'బాబు' అనే పదం చేర్చి గౌరవంగా పిలుచుకోవడం చూస్తే ఆయన జన జీవితంలో ఎంతగా కలిసిపోయారో అర్థం చేసుకోవచ్చు. అటువంటి మహానుభావుడు 1986 జూలై 6న తుది శ్వాస విడిచారు. అంతకు ముందటేడాదే దేశ ప్రజలు ఆయన జన్మదినోత్సవాన్ని 'సమతా దివస్'గా జరుపుకోవడం విశేషం.

– నర్సింగు కోటయ్య; చరిత్ర అధ్యాపకులు, మిర్యాలగూడ

(రేపు డా॥ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి)

ఆ అందాలు గ్రంథాలకే పరిమితమా?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

రుతువులన్నింటిలోనూ ఏది ఆహ్లాదకరమైనదని ప్రశ్నించినప్పుడు 'వసంతం' అని చెప్పుకోవడం మన అలవాటు. కానీ గత సంవత్సరంపైగా పరిణామాల్ని గమనిస్తే ఆ వసంతం కొంతకాలంగా తన 'ధర్మాన్ని' తప్పింది. శిశిర రుతువులో చలికి కుంచించుకుపోయిన వసంతం తన వంతు రాగానే మానవాళికి యవ్వనాన్ని ప్రసాదిస్తుంది. ఈ వసంత కాల యవ్వనోదయాన్ని మహాకవి నన్నయ భారతం ఆది పర్వంలో తన్మయంతో వర్ణించాడు. కోకిలమ్మల కిలకిలా రావాలను చెవులకు కట్టి మరీ వినిపించాడు. కానీ జనవరి–ఫిబ్రవరి నెలల్లో ఎన్నడూ లేనంతగా అధిక ఉష్ణోగ్రతలు ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా నమోదు కావడాన్ని ఆందోళనతో అధికార సంస్థలు పేర్కొన్నాయి.

బహుశా ఈ అసాధారణ వాతావరణ పరిస్థితుల్ని నిరంతర పరిశీలనతో ఏళ్ల తరబడిగా గమనిస్తూన్నందుననే కావచ్చు మహాకవి శ్రీనాథుడు ప్రకృతి సమయస్తంభన ఎప్పుడు ఎలా సాధ్యమవుతుందో 'కాశీఖండం' కావ్యంలో అక్షరసత్యంగా వివరించడం ఆశ్చర్యం గొలిపే సన్నివేశం! తానూ సూర్యబింబంతో పాటు ప్రయాణించి తెలుసుకున్నంత వివరంగా వర్ణించాడు. కాలం కదలకుండా స్తంభించిపోతే లోకం ఎలా ఉంటుందో ఊహించి చెప్పాడు. ఫలితంగా కొన్ని దేశాలు విపరీతమైన ఎండలతో 'కుమిలి' పోతాయనీ, కొన్ని అతి చలితో కుంగిపోతాయనీ, కొన్ని దేశాలు ఈ రెండింటి తీవ్రత వల్ల దెబ్బతిని పోతాయనీ పేర్కొన్నాడు. అంతేగాదు, వాతావరణంలో తారుమారు పరిస్థితుల వల్ల చిత్రగుప్తాదులు సహితం లెక్కలు తప్పి చిక్కుల్లో పడతారని, వర్షాలు గాడితప్పి పంటలు నాశనం అయి ప్రజలు ఇబ్బందుల్లో పడతారనీ – శ్రీనాథుడు ఊహించి హెచ్చరించాడు. అలాగే సాలెపురుగు తన శిల్పకళా నైపుణ్యంతో ఆలయాల్ని ఎలా తీర్చిదిద్దిందో ధూర్జటి మహాకవి 'కాళహస్తి మహత్మ్యం' రచనలో వర్ణించాడు.

1970 నుంచి డిసెంబర్–ఫిబ్రవరి మాసాల్లో చలికాలాల్లోనే దేశంలో ఎక్కువ ప్రాంతాల్లో ఎక్కువ డిగ్రీల ఉష్ణోగ్రతలు విజృంభించడాన్ని సాధికార నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఫలితంగా పెక్కు రాష్ట్రాలు 'వసంత' రుతువును కోల్పోయాయి. వాతావరణ శాస్త్రవేత్తల అంచనా ప్రకారం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి మాసాలు చలికాలాలు. కానీ ఇటీవల కాలంలో ఈ క్రమగతి కాస్తా తప్పి వసంతం దూరమైపోతోంది. ఈ ప్రపంచం అణు సంయోగం వల్ల ఏర్పడిందన్నది పరమాణువాదుల నిర్ణయం. ఈ సత్యాన్ని 3 వేల ఏళ్ల పూర్వం పరమాణువాది కణ్వ మహర్షి స్పష్టం చేశాడు. ఆ పద్ధతిలోనే ఆధునిక శాస్త్రవేత్తలు అణువుల్ని బద్దలు కొట్టగల్గుతున్నారు. ఎటుతిరిగీ పరమాణువులే ఇంకా అంకెకు రావలసి ఉంది, వాటిని బద్ధలుకొట్టి లోబరచుకునే విశ్వప్రయత్నంలోనే శాస్త్రవేత్తలు ఉన్నారు. ఆ దీర్ఘకాల ప్రయత్నం ఎలా ఉన్నా రానున్న మాసాలలో పెక్కు ప్రాంతాలు 42.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతకు గురి కానున్నాయని తాజా అంచనాలు. ఫలితంగా ఇప్పటికే అనూహ్యమైన వేడికీ, ఉడకబోతకూ పౌరులు గురవుతున్నారు. వృద్ధుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

రెండో మాట



సూర్యచంద్రులు, ఇతర గ్రహాలు నియమం ప్రకారం నడుచుకుంటాయి. నియమాలలో ఉన్న వస్తువులు క్రమబద్ధంగా ఉంటాయని సుప్రసిద్ధ పండిత గోపదేవ్ భావన. అందుకే సంపదను త్యాగభావంతో మాత్రమే అనుభవించాలని, అంటే 'నాది కాదనే' భావంతో అనుభవించాలని గోపదేవ్ అంటారు. 'ఏదో ఒక రోజున ఈ శరీరమనే అద్దె కొంపను ఖాళీ చేయవలసి ఉంటుందని బోధిస్తూ 'అద్దె కొంప లోకమింతేరా తమ్ముడు' అన్న ఓ సినిమా రికార్డును వినిపించారాయన. అలాగే ఈ సంపదలను త్యాగ భావంతో మాత్రమే అనుభవించాలని యాజ్ఞవల్క్య మహాముని భార్య మైత్రేయి భావించి భర్తను ప్రశ్నిస్తుంది. దానికి యాజ్ఞవల్క్యుడు సమాధానమిస్తూ 'భర్త తన భార్యను ప్రేమిస్తున్నాడంటే, అది భార్య కోసం కాదు, తన సుఖం కోసం, అలాగే స్త్రీ కూడా పురుషుణ్ణి (భర్తను) ప్రేమించడం తన సుఖం కోసమేనని గ్రహించాలంటాడు. ఈ సందర్భంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి తన భార్య గురించి ఆర్ద్రంగా చెప్పిన మాటలు గుర్తుకు రావలసిందే:

'నాకు మతం లేదు, కులం అసలే లేదు. నేను మనిషిని. హృదయవాదిని. నేను చావును కోరుకోను. ఎందుకంటే భార్యకు దూరమవుతానని. ఆమెను విడిచి ఉండలేనని!' అనేక దుర్ఘటనలతో అల్లకల్లోలంలో పడిన కృష్ణశాస్త్రి హృదయం తనను 'మనసారా ఏడ్వనివ్వమని' మనల్ని కోరడానికి కారణం ఆ హృదయ ప్రక్షాళన కోసమే! అందుకే బుద్ధిమంతులకు, మూర్ఖులకూ మధ్య తేడాను వివరిస్తూ విజ్ఞులు అన్నారు:

"కావ్య శాస్త్ర వినోదేన కాలో గచ్ఛతి ధీమతాం /వ్యసనేన చ మూర్ఖాణాం నిద్రయా కలహేన వా"

బుద్ధిమంతుల కాలం కావ్య శాస్త్ర వినోదాలతో గడుస్తుంది. మూర్ఖుల కాలం వ్యసనాలతో, నిద్రతో, కలహాలతో గడుస్తుంది!

abkprasad2006@yahoo.co.in

అహంకారమే అడ్డంకి!

సాధారణంగా సద్గురువు చుట్టూగల కాంతివలయం, ఆయన నుండి వెలువడే ఆకర్షణ శక్తి... ఆయన ఆధ్యాత్మిక వలయంలోనికి వచ్చే వారి మనస్సులను పరిశుద్ధం చేస్తుంది. కావున గురువుకు చేరువలో ఉండటాన్ని ఎవరూ తోసివేయలేరు. ఈ కారణం చేతనే భక్తులు సమీప, దూరపు ప్రదేశాల నుండి మళ్ళీ మళ్ళీ వచ్చి సద్గురువు దర్శనం చేసుకోవడం ఓ నియమంగా ఏర్పరచుకొంటున్నారు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

సద్గురువు సాన్నిధ్యాన్ని శిష్యుడు తన ఆత్మ పరివర్తనకు ఉప యోగించుకోవాలి. ఎప్పుడైతే శిష్యుడు దైవత్వాన్ని క్రమంగా వృద్ధి పరచుకొంటాడో, అపుడే సద్గురువు సాన్నిధ్యం సఫలమవుతుంది. ఆ తర్వాత, ఆ భక్తుడు గురువు విశ్వ వ్యాపకత్వాన్నీ, దైవత్వాన్నీ అనుభవిస్తాడు. దైవం, గురువు, ఇష్టదేవత... అందరూ మన ఆధ్యాత్మిక మార్గానికి శక్తిమంతమైన సహాయకులే. కానీ, సహాయాన్ని ఫలవంతం చేసుకోవాలంటే కృషి ఎంతో అవసరం.

'శరణాగతి' చేయనిదే మనకు ఆత్మానుభూతి ఎన్నటికీ సాధ్యపడదు. శరణాగతి సద్గురువుకు చేసినా లేక భగవంతునికి చేసినా ఒక్కటే. నీవు శరణాగతి చేసిన తర్వాత 'నీవు' అనేది ఉండదు. అపుడు నీలోనికి భగవంతుడే (సద్గురువే) ప్రవేశిస్తాడు. దేవుడి లేక సద్గురువు ఆదేశానుసారం నడచుకోవడమే శరణాగతి. అహంకారంతో నీ మనస్సును అనుసరించి నీ ఇష్టానుసారంతో నడిస్తే, నువ్వు చేసే శరణాగతి ఏ స్థాయిలో ఉంటుందో నువ్వే నిర్ణయించుకోవాలి.

శిష్యుడికి గురువు ఎంత పవిత్రుడో, గురువుకు శిష్యుడు కూడా అంతే పవిత్రుడు. అజ్ఞానం వలన ఒక భక్తుడు గురువు గురించి చెడుగా మాట్లాడినా, అలాంటి శిష్యునికే సహాయం చాలా అవసరం ఉన్నదని గురువుకు తెలిస్తే ఆయన వెంటనే సహాయం చేస్తాడు. చంచలమైన మనస్సును స్వాధీనంలోకి తీసుకొనిరావడమనేది కేవలం భక్తి వల్లనే సాధ్యమవుతుంది.

ఈ విధంగా మనస్సును స్వాధీనపరచుకోకపోయినచో, కోరికలు అగ్ని జ్వాలల మాదిరిగా పైపైకి లేస్తాయి. ప్రతి వ్యక్తి తన శరీరాన్నీ, మనస్సునూ, ఆత్మనూ గురువునకు లేక దేవునికి సమర్పించి, నిస్వార్థమైన భక్తిని ఆచరించాలి. అజ్ఞానం కలగడానికి మూలకారణం మన అహంకారమే. ఎప్పుడైతే 'నేను' అను భావన తొలగిపోతుందో అపుడే అజ్ఞానం మాయమైపోతుంది. నిస్వార్థ భక్తి మార్గంలో సాధకుడికి అడ్డుగా నిలిచేది అహంకారమే. అదే అతి పెద్ద అవరోధం.

భగవంతునికి కావలసినది అహంకార రహిత భక్తి మాత్రమే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.దశమి ప.12.02 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** శ్రవణం సా.4.31 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.8.18 నుండి 9.46 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.00 నుండి 10.48 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.44 వరకు, **అమృత ఘడియలు:** ఉ.6.34 నుండి 8.07 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.57, **సూర్యాస్తమయం:** 6.10.

నిర్జీవం బాబు సంస్కృతి.. జవజీవం జగన్ జాగృతి!


చిత్తూరు డెయిరీకి జగన్ హయాంలోనే జవజీవాలు

చంద్రబాబు హయాంలో మూతపడిన సహకార చక్కెర కర్మాగారాలు, డెయిరీల పునరుద్ధరణకు ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. తన పాదయాత్రలో పాడి రైతులకు ఇచ్చిన హామీ మేరకు చిత్తూరు డెయిరీ పునరుద్ధరణకు వైఎస్ జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చిత్తూరుతో సహా రాష్ట్రంలోని చక్కెర కర్మాగారాల కార్మికులకు గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బకాయిలను అణాపైసలతో సహా చెల్లించడమే కాదు..స్థానిక రైతులకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో ఆయా ఫ్యాక్టరీల ఆవరణలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టింది. ఇవేమీ పచ్చ మీడియాకు కనిపించడం లేదు. మేమంతా సిద్ధం అంటూ చేపట్టిన బస్సు యాత్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు పర్యటనను పురస్కరించుకుని 'జగన్... ఇదేనా మీ విశ్వసనీయత' అంటూ ఈనాడు అబద్ధాలను అచ్చేసింది. వాస్తవాలను ముసుగేసి జగన్ ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా విషం కక్కింది. ఈ కథనంలో రామోజీ మరుగున పెట్టిన వాస్తవాలివి...

- సాక్షి, అమరావతి/ చిత్తూరు అగ్రికల్చర్

బాబు హయాంలోనే నిర్వీర్యం..

సహకార రంగంలో ఉన్న డెయిరీలనే కాదు..చక్కెర కర్మాగారాలనూ నిర్జీవం చేసిన ఘనత చంద్రబాబుదే. ఈయనగారి హయాంలో మూతపడిన చిత్తూరు, రేణిగుంట, కొవ్వూరు, ఎన్వీఆర్ జంపని సహకార చక్కెర కర్మాగారాలను దివంగత మహానేత వైఎస్సార్ అధికారంలోకి వచ్చీరాగానే పునరుద్ధరిస్తే, వాటిని మళ్లీ చంద్రబాబు మూతపడేలా చేశారు. లాభాల బాటలో నడుస్తున్న ఈ నాలుగు చక్కెర కర్మాగారాలను తన అనుయాయులకు కట్టబెట్టే లక్ష్యంతో కొరగాకుండా చేసి, వాటిని 2003-04లో మూతపడేలా చేశారు. ఫలితంగా పదింటికి తొమ్మిది మూతపడగా, ఆ ప్రభావంతో 15 ప్రైవేటు కర్మాగారాలు సైతం మూతపడ్డాయి. చిత్తూరు చక్కెర కర్మాగారాన్ని ఒక పథకం ప్రకారం నీరుగార్చి 2015 జనవరిలో మూతపడేలా చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా దాదాపు 16 వేల మంది చెరకు రైతులు, 550 మంది కార్మికులు రోడ్డున పడ్డారు.



డెయిరీల మూతకు కారకుడు బాబే..

సహకార స్ఫూర్తితో ఏర్పాటైన వివిధ జిల్లాల పాల యూనియన్లను ప్రభుత్వ అనుమతి లేకుండానే మాక్స్ పరిధిలోకి తీసుకొచ్చి, ఆ తర్వాత వాటిని సొంత కంపెనీలుగా తమను తాము ప్రకటించుకున్నారు. ఇలా 2016 జనవరి 6న విశాఖ మిల్క్ యూనియన్, 2013 జూన్ 18న గుంటూరు, 2013 ఫిబ్రవరి 13న ప్రకాశం జిల్లా యూనియన్లు కంపెనీల యాక్టు–1956 కింద కంపెనీలుగా మారిపోయాయి. అంతేకాదు... 1.20 లక్షల పాడి రైతుల కుటుంబాలకు జీవనాధారమైన చిత్తూరు విజయ డెయిరీని తన సొంత డెయిరీ హెరిటేజ్ అభివృద్ధి కోసం పణంగా పెట్టారు. 2002 ఆగస్టు 31న చిత్తూరు డెయిరీని మూతపడేలా చేశారు. ఇంకా.. 2017 జనవరి 23న పులివెందుల , 2018 జూలై 31న రాజమండ్రి డెయిరీలు, 2018 నవంబర్ 30న కంకిపాడు మిని డెయిరీ, 2019 మార్చి 15న మదనపల్లి డెయిరీలు చంద్రబాబు పాలనలోనే మూతపడ్డాయి. వీటిలో ఏ ఒక్క డెయిరీనీ తెరిపించేందుకు బాబు కనీస ప్రయత్నమూ చేయలేదు. పైగా ఉద్యోగులకు, రైతులకు వందల కోట్లు చెల్లించకుండా ఎగనామం పెట్టారు.


చిత్తూరు డెయిరీ ఆవరణలో చురుగ్గా జరుగుతున్న ప్రాసెసింగ్ యూనిట్ భవన నిర్మాణ పనులు

చిత్తూరు డెయిరీ అభివృద్ధి ఇలా..

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చిత్తూరు డెయిరీ పునరుద్ధరణకు చిత్తశుద్ధితో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డెయిరీకి ఉన్న రూ.182 కోట్ల అప్పులను ప్రభుత్వమే చెల్లించింది. రూ. 385 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన అమూల్ సంస్థకు 99 ఏళ్ల లీజుకు ఇచ్చేందుకు అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. డెయిరీ పునరుద్ధరణ ద్వారా ప్రత్యక్షంగా 5 వేల మందికి , పరోక్షంగా 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తొలుత రూ.150 కోట్ల అంచనాతో దేశంలోనే అతిపెద్ద ఐస్‌క్రీమ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దశల వారీగా పాల కర్మాగారం, వెన్న, పాలపొడి, చీజ్, పనీరు, యాగార్ట్, స్వీట్ల తయారీ విభాగాలతో పాటు అల్ట్రా హై ట్రీట్‌మెంట్ (యూహెచ్‌టీ) ప్లాంటునూ ఈ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. ఇప్పటికే రూ.35 కోట్ల మేరకు వెచ్చించి 20 లక్షల లీటర్ల సామర్థ్యం గల ప్రాసెసింగ్ యూనిట్ భవన నిర్మాణ పనులు చేపట్టింది. వే బ్రిడ్జి , ప్రధాన గేటు నిర్మాణ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. వెన్న, నెయ్యి ప్రాసెసింగ్ ఖయూనిట్ నిర్మాణ పనులూ చురుగ్గా జరుగుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా డెయిరీ నిర్మాణ పనులు పూర్తి చేసి పాడి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.

బాబు ఎగ్గొట్టిన బకాయిల్ని చెల్లించిన జగన్ సర్కార్...

రాష్ట్ర వ్యాప్తంగా చక్కెర కర్మాగారాలకు సంబంధించి బాబు ఎగ్గొట్టిన బకాయిలతో సహా ఈ ఐదేళ్లలో రైతులకు రూ.346.47 కోట్లు ఈ ప్రభుత్వం చెల్లించింది. ఉద్యోగులకు బకాయిపెట్టిన 72.86 కోట్లు చెల్లించింది. 2015 జనవరిలో మూతపడిన చిత్తూరు చక్కెర కర్మాగారానికి సంబంధించి 450 మంది సీజనల్ కార్మికులకు పెండింగ్‌లో ఉండిన రూ. 31.22 కోట్ల వేతనాలను గతేడాది జూలైలో ఒకేసారి జగన్ ప్రభుత్వమే చెల్లించింది. దీంతో ప్రతి కార్మికునికి రూ. 15 లక్షల నుంచి రూ. 35 లక్షల వరకు పెండింగ్ వేతనాలు చేతికందాయి. మరో వైపు ఉపసంఘం సిఫార్సుల మేరకు బాబు హయాంలో నీరుగారిపోయిన అనకాపల్లి, తాండవ, ఏటికొప్పాక, విజయరామ కర్మాగారాల పునరుద్ధరణకు చర్యలు చేపట్టినప్పటికీ సామర్థ్యానికి తగినట్టుగా చెరకు దొరకని పరిస్థితి నెలకొనడంతో స్థానిక రైతులకు లబ్ధి చేకూర్చేలా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. చిత్తూరు ఫ్యాక్టరీ ఆవరణలో 25 ఎకరాలను ఈ మేరకు కేటాయించగా, త్వరలోనే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయబోతున్నారు. వీటిని ప్రభుత్వమే స్వయంగా నిర్మించి లీజు పద్ధతిన వాటి నిర్వహణను మాత్రమే ఆసక్తి గల సంస్థలకు అప్పగించాలని సంకల్పించింది. కర్మాగారాల ఆస్తులపై కానీ, స్థలాలపై కానీ ఆయా సంస్థలకు ఎలాంటి హక్కులు ఉండవన్నది సుస్పష్టం.

కార్మికులనూ ఆదుకున్నది ఈ ప్రభుత్వమే..



ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే 2015 జనవరిలో చిత్తూరు సుగర్ ఫ్యాక్టరీని ఉద్దేశ్యపూర్వకంగా చంద్రబాబు ప్రభుత్వం మూసేసింది. ఈ చర్యతో కార్మిక కుటుంబాలు వీధిన పడ్డాయి. కనీసం పెండింగ్ వేతనాలైనా చెల్లించాలని అప్పటి బాబు ప్రభుత్వాన్ని పలుమార్లు వేడుకున్నా ఏమాత్రం కనికరించలేదు. ప్రస్తుత జగన్ ప్రభుత్వం కార్మికులకు పదేళ్లుగా పెండింగ్‌లో ఉండిన రూ. 31.22 కోట్ల వేతనాలను ఒక్కసారిగా చెల్లించి ఆదుకుంది.

– కేశవరెడ్డి, కార్మికుడు, చిత్తూరు సుగర్ ఫ్యాక్టరీ

క్లుప్తంగా...

మాదిగాని వైఎస్సార్‌సీపీ నేత కాదు..

- పార్టీ రాష్ట్ర కార్యదర్శి వరప్రసాదరావు

సాక్షి, అమరావతి : మాదిగాని గురునాథం వైఎస్సార్‌సీపీ నాయకుడు కాదని, పార్టీలో ఏ రకమైన సభ్యత్వం లేదని, కేవలం పదవుల కోసమే టీడీపీలో చేరారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెరికె వరప్రసాదరావు తెలిపారు. తాడేపల్లిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బహుజన పరిరక్షణ సమితిలోని నాయకులందరూ సీఎం వైఎస్ జగన్ వెంటే ఉన్నారని చెప్పారు. మాదిగాని గురునాథంకు బహుజన పరిరక్షణ సమితితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బహుజన పరిరక్షణ సమితి నేతలు టీడీపీలో చేరినట్టు ఎల్లో మీడియాలో రావడం దురదృష్టకరమన్నారు. బహుజన పరిరక్షణ సమితి పేరును మాదిగాని ఉపయోగించడం సరికాదని, ఇక ముందు ఇలా చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. చంద్రబాబు జిమ్మిక్కులతో ప్రజలను మభ్యపెట్టేందుకే ఎల్లో మీడియాలో ఇలాంటి అసత్యవార్తలను ప్రసారం చేయిస్తుంటారని చెప్పారు. సమావేశంలో ఇందుపల్లి సుభాషిణి, వైఎస్సార్‌సీపీ నేతలు మల్లవరపు సుధారాణి, లీడ్ క్యాప్ డైరెక్టర్ సాంగ సందీప్ తదితరులున్నారు.

19 నుంచి ఇంద్రకీలాద్రిపై బ్రహ్మోత్సవాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బ్రహ్మోత్సవాల విశేషాలను ఆలయ ఈవో కేఎస్ రామారావు, వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి మీడియాకు బుధవారం వెల్లడించారు. 19వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయి. 22వ తేదీ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దివ్య కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు నిర్వహిస్తారు. 24వ తేదీ పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. సాయంత్రం శ్రీగంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులకు హంస వాహనంపై కృష్ణానదిలో తెప్పోత్సవం నిర్వహిస్తారు. 27వ తేదీ ఆదిదంపతుల పవళింపు సేవతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆది దంపతులు 19న వెండి పల్లకీ సేవ, 20న రావణ వాహన సేవ, 21న వెండి రథోత్సవం, 22న నంది వాహన సేవ, 23న సింహ వాహన సేవలో భక్తులకు దర్శనమిస్తారు.

తెలంగాణ

తెలంగాణలో ఆర్గానిక్స్ పరిశ్రమలో ఘోర ప్రమాదం

- రియాక్టర్ పేలి ఐదుగురు దుర్మరణం
- మృతుల్లో పరిశ్రమ యజమానుల్లో ఒకరు
- మృతులు వివిధ రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తింపు
- 30 మందికి పైగా కార్మికులకు గాయాలు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ హత్నూర/ సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్‌లో ఉన్న ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. పరిశ్రమలో ఉన్న ఆయిల్ రియాక్టర్ బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా పేలిపోయింది. ఆ సమయంలో 60 మంది కార్మికులు విధుల్లో ఉన్నారు. పేలుడు ధాటికి పరిశ్రమలో ఉన్న వారు ఎగిరి కొన్ని మీటర్ల దూరంలో చెల్లాచెదురుగా పడిపోయారు. అగ్నికీలల్లో చిక్కుకుని పరిశ్రమ యజమానుల్లో ఒకరైన హైదరాబాద్‌కు చెందిన రవి (45), ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన సుబ్రహ్మణ్యం (36), దయానంద్ (48), మధ్యప్రదేశ్‌కు చెందిన మెయింటెనెన్స్ ఇన్‌చార్జి సురేష్ పాల్ (45) సజీవ దహనమయ్యారు. చందాపూర్ గ్రామానికి చెందిన కార్మికుడు చాకలి విష్ణు (35) హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ప్రమాదంలో సుమారు 30 మందికి పైగా కార్మికులు తీవ్రంగా గాయపడినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రకటించారు. గాయపడిన వారిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, స్థానిక ఎంఎన్‌ఆర్ ఆసుపత్రికి, హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రులకు తరలించినట్లు తెలిపారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. పరిశ్రమతో పాటు, చుట్టుపక్కల ఉన్న భవనాలు ధ్వంసమయ్యాయి. ముందు జాగ్రత్తగా చుట్టుపక్కల వారందరినీ అక్కడి నుంచి తరలించారు. రాత్రి తొమ్మిది గంటల తర్వాత మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహలు, ఉన్నతాధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కాలం చెల్లిన రియాక్టర్!

ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో పేలిన రియాక్టర్ కాలం చెల్లినదిగా పరిశ్రమల శాఖ వర్గాలు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. అందువల్లే రియాక్టర్ నుంచి ఆయిల్ లీకయి, పేలిపోయిందని అధికారులు బావిస్తున్నట్లు తెలిసింది. ఈ యూనిట్‌లో గైనిడైన్ నైట్రేట్, గైనిడైట్ కార్బొనేట్ తయారవుతుందని, ఇవి పేలుడు పదార్థాలకు సంబంధించిన ఉత్పత్తులని అధికారులు తెలిపారు.

మీది పిరికితనం, చేతగానితనం

- బ్లేడ్‌బ్యాచ్ వచ్చేస్తుందన్నప్పుడు రాజకీయాలు మానేయండి
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు మాజీ మంత్రి ముద్రగడ సూచన

రాజమహేంద్రవరం రూరల్: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేతగానితనం, పిరికితనంతోనే బ్లేడ్ బ్యాచ్ దాడి చేయడానికి వచ్చేస్తోందంటున్నారని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం విమర్శించారు. అలాంటప్పుడు రాజకీయాలు మానేయాలని సూచించారు. రాజమహేంద్రవరం బొమ్మూరులోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్‌కళ్యాణ్‌కు కార్యకర్తలు వచ్చి షేక్‌హ్యాండ్ ఇవ్వకూడదని, వారిని అడ్డుకునేలా ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున జీతాలిచ్చి బౌన్సర్లను పెట్టుకున్నారని చెప్పారు. ప్రజలు ముట్టుకోకూడదని, షేక్‌హ్యాండ్ ఇవ్వకూడదనే.. బ్లేడ్‌బ్యాచ్ వచ్చేస్తోందంటూ పవన్ నెపం వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తామంతా ప్రజల్లోనే తిరుగుతున్నాం కదా.. తమపై బ్లేడ్‌బ్యాచ్ దాడులు చేయలేదే అని ప్రశ్నించారు.

చంద్రబాబు మాటలు అసహ్యంగా ఉన్నాయి

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మాటలు వింటుంటే అసహ్యంగా ఉందని ముద్రగడ పద్మనాభం చెప్పారు. సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేస్తామని చెబుతున్న చంద్రబాబు, ఆయన స్నేహితులు.. గతంలో ఆయన పాలనలో అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని సూచించారు. సీఎం జగన్‌కు ఒక చాన్స్ ఇచ్చానని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు ఒక్కచాన్స్ ఇచ్చారని, ప్రజాసంక్షేమ పథకాలతో మంచిపాలన చేస్తునఆయన్ని మరోసారి సీఎం చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పి.కె.రావు, మాజీ ఎంపీ గిరిజాల వెంకటస్వామినాయుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

'ఫాం-26'పై వివరాలివ్వండి

- కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం
- విచారణ మే మొదటి వారానికి వాయిదా



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సమర్పించే ఆస్తులు, కేసులకు సంబంధించిన అఫిడవిట్ (ఫాం–26)ను తెలుగులో కూడా అందుబాటులో ఉంచే వ్యవహారంలో పూర్తివివరాలను తమ ముందుంచాలని హైకోర్టు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను మే మొదటి వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. ఫాం–26ను తెలుగులో కూడా అందుబాటులో ఉంచేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ కృష్ణా జిల్లా మాచవరానికి చెందిన ఆయుర్వేద వైద్యుడు, తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ సామల రమేష్‌బాబు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారించింది. పిటిషనర్ న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్‌బాబు వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల గురించి తెలుసుకునే హక్కు ఓటర్లకు ఉందన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు సైతం స్పష్టమైన తీర్పునిచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ఫాం–26 ఇంగ్లిష్‌లో మాత్రమే అందుబాటులో ఉందన్నారు. రాష్ట్రంలో 83 శాతం మందికి తెలుగు మాత్రమే తెలుసని, అందువల్ల ఫాం–26ను తెలుగులో కూడా అందుబాటులో ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో పూర్తి వివరాలు తెలుసుకుని తమ ముందుంచాలని ఎన్నికల సంఘం న్యాయవాది శివదర్శన్‌ను ధర్మాసనం ఆదేశించింది. ఓటర్లు చాలా తెలివిగలవాళ్లని, స్థానిక అభ్యర్థుల గురించి వారికి అన్నీ తెలుసని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

పూనం, జితేందర్‌శర్మ తదితరులకు నోటీసులు

- కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశం
- పూనం మాలకొండయ్య, జితేందర్‌శర్మలపై తదుపరి చర్యల ఉపసంహరణ జీవోపై పిల్

సాక్షి, అమరావతి: ఏపీ మెడ్‌టెక్ జోన్ ఏర్పాటులో అక్రమాలు, జాతీయ హెల్త్‌మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిధుల దుర్వినియోగం జరిగాయని, ఈ వ్యవహారంలో సీనియర్ ఐఏఎస్ అధికారిణి పూనం మాలకొండయ్య, మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేందర్‌శర్మపై తదుపరి చర్యలను ఉపసంహరిస్తూ ప్రభుత్వం 2021లో జారీచేసిన జీవో 1645ను సవాలు చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఏపీ మెడ్‌టెక్ జోన్ ఏర్పాటులో అక్రమాలు, జాతీయ హెల్త్‌మిషన్ నిధుల దుర్వినియోగంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి దర్యాప్తు చేయించేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించాలని కోరుతూ విశాఖపట్నానికి చెందిన లీడర్ దినపత్రిక ఎడిటర్ వి.వెంకటరమణమూర్తి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం విచారించింది. వాదనలు విన్న ధర్మాసనం ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ తదితరులతోపాటు వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా ఉన్న పూనం మాలకొండయ్య, జితేందర్‌శర్మలకు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. అంతకు ముందు పిటిషనర్ న్యాయవాది వి.వి.నారాయణ రావు వాదనలు వినిపిస్తూ.. ఏపీ మెడ్‌టెక్ జోన్ ఏర్పాటులో అక్రమాలు, జాతీయ హెల్త్‌మిషన్ నిధుల దుర్వినియోగం జరిగినట్లు విజిలెన్స్ విచారణలో తేలిందని, ఆ మేరకు ఆ విభాగం ప్రభుత్వానికి నివేదిక కూడా ఇచ్చిందని చెప్పారు. వందల కోట్ల రూపాయల మేర అక్రమాలు జరిగాయన్నారు. బాధ్యులపై చర్యలకు సైతం విజిలెన్స్ సిఫారసు చేసిందన్నారు. అనంతరం ఏసీబీ విచారణలో నిధుల దుర్వినియోగం, అక్రమాలు జరగలేదని తేలిందంటూ పూనం మాలకొండయ్య, జితేందర్‌శర్మలపై తదుపరి చర్యలను ఉపసంహరిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చిందని చెప్పారు. వీరికి వ్యతిరేకంగా పలు నివేదికలున్నాయని, అయినా ప్రభుత్వం వారిపై చర్యలను ఉపసంహరించిందని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రతివాదులందరికీ నోటీసులు జారీచేసింది.

జూన్ నుంచి కర్నూలులోనే 'ఏపీఈఆర్‌సీ'



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ప్రధాన కార్యాలయం కార్యకలాపాలు జూన్ 1వ తేదీ నుంచి కర్నూలు జిల్లాలో ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంసిద్ధంగా ఉండాలంటూ ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి బుధవారం సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్ కేంద్రంగా 1999 మార్చిలో ఏపీఈఆర్‌సీ ఏర్పడింది. రాష్ట్ర విభజన తరువాత ఏపీఈఆర్‌సీని అమరావతి ప్రాంతానికి తరలిస్తూ 2014 ఆగస్టులో ఆదేశాలు జారీ అయ్యాయి. అయినా మండలి మాత్రం హైదరాబాద్ కేంద్రంగానే పనిచేస్తోంది. ఆ తర్వాత విశాఖలో క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి, అక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఏపీఈఆర్‌సీ ప్రధాన కార్యాలయం కర్నూలులో ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు 25న నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం అక్కడ భవన నిర్మాణం మొదలైంది. ఈ భవనం జూన్ నెలకల్లా అందుబాటులోకి వస్తుండటంతో ప్రధాన కార్యాలయాన్ని అక్కడికి తరలించాలని నిర్ణయించారు. హైదరాబాద్ నుంచి కర్నూలుకు తరలించేందుకు ఫైళ్లు, ఇతర సామగ్రిని సిద్ధం చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగులు నివాసాన్ని కర్నూలుకు మార్చుకోవాలని, వసతి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. అందుకు స్థానికంగా ముగ్గురు డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇంజనీర్ స్థాయి అధికారుల సహాయాన్ని తీసుకోవాలని సూచించింది. వారి ఫోన్ నంబర్లను కూడా సిబ్బందికి ఇచ్చింది.

మూడు ప్రాంతాల్లోనూ మండలి పని

కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు అందుబాటులో ఉండేలా విశాఖలో ఇప్పటికే ఏపీఈఆర్‌సీ క్యాంపు కార్యాలయం ఉంది. అంతకు ముందు ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వార్షిక టారిఫ్ ఆర్డర్ (విద్యుత్ చార్జీల సవరణ)పై ప్రజాభిప్రాయ సేకరణ, ఆర్డర్ విడుదల, బహిరంగ విచారణ వంటివి నిర్వహించేవారు. ఇటీవల 2024–25 ఏడాదికి టారిఫ్ ఆర్డర్‌ను విజయవాడలో ఏపీఈఆర్‌సీ విడుదల చేసింది. ఈ విధంగా మూడు ప్రాంతాల్లోనూ మండలి విస్తరిస్తోంది.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు పిలుపునిచ్చారు. పేద బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నిండాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మాలలంతా ఏకతాటిపైకి వచ్చి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 12వేల పై చిలుకు సచివాలయాలు ఏర్పాటు చేసి 1.35లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. 2.50 లక్షల మంది వలంటీర్లను నియమించి 66 లక్షల మంది పింఛన్‌దారులకు, వివిధ వర్గాల లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను డోర్ డెలివరీ చేశారన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలతో వలంటీర్లపై ఫిర్యాదులు చేసి అవ్వా తాతలకు ఇంటి వద్దనే పెన్షన్లు అందకుండా అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ , చంద్రబాబు పాలనకు తేడా గమనించాలని కోరారు. కాగా, మాలమహానాడు లీగల్ సెల్ అధ్యక్షుడిగా న్యాయవాది జయరాజును నియమించారు.

గిరిజన సంస్కృతిని కాపాడాలి

విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా): గిరిజన సంస్కృతిని కాపాడాలని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పిలుపునిచ్చారు. అల్లూరి, విజయనగరం జిల్లాల సరిహద్దు ఎగువకొండపర్తిలోని ప్రకృతి రమణీయమైన అందాల నడుమ పర్వతం శిఖరంపై వైకుంఠ గిరిపై నిర్మించిన శ్రీ అనంత వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని స్వరూపానందేంద్ర సరస్వతి, పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ బుధవారం ప్రారంభించారు. 9.5 అడుగుల అనంత వేంకటేశ్వరస్వామి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠాపన చేశారు. స్వరూపానందేంద్ర మాట్లాడుతూ..ప్రకృతి వరమిచ్చిన పర్వత శిఖరాల్లో నిర్మించిన దేవాలయం హిందూ ధర్మ అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. గిరిజన గ్రామాల్లో శారదాపీఠం విశిష్టమైన సేవలను అందిస్తోందని చెప్పారు. విశాఖ నుంచి అరకు వెళ్లే మార్గంలోని కాశీపట్నం నుంచి 36 మలుపులతో కూడిన 18 కిలోమీటర్లు ఘాట్‌రోడ్డు ప్రయాణం సాగించి, పుణ్యక్షేత్రాన్ని సందర్శించాలని కోరారు. అనంత వేంకటేశ్వరస్వామితో పాటుగా గోదాదేవి, పద్మావతి దేవి, ఆళ్వార్, వరాహస్వామి, సంకల్పసిద్ధి మహా గణపతి విగ్రహాలకు ఉత్తరాధికారితో కలిసి ప్రాణప్రతిష్ట చేశారు.


ప్రాణప్రతిష్ఠలో పూజలు నిర్వహిస్తున్న స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

కలిదిండి/తణుకు అర్బన్/కై కలూరు/గణపవరం/మచిలీపట్నం టౌన్/పెనమలూరు/కలిగిరి: ఏలూరు జిల్లాలోని కలిదిండి గ్రామ పరిధి దేవునితోట ప్రాంతానికి చెందిన 100 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు సర్పంచ్ మారుతి ప్రసన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సమక్షంలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. జనసేన పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండల కార్యదర్శి పెద్దిరెడ్డి సాయిరాం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమక్షంలో తణుకులో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏలూరు జిల్లా కైకలూరులోని దాకరం గ్రామానికి చెందిన జనసేన నేతలు పసుపులేటి సాయి కుమార్, గండివలస జయకృష్ణ, పొట్ల శ్రీనివాసరావు, కొడుసు వెంకటేష్ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏలూరు జిల్లా చిన రామచంద్రపురంలో 50 మంది టీడీపీ కార్యకర్తలు ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం 48వ డివిజన్‌లో టీడీపీ సీనియర్ నేత, మాజీ కౌన్సిలర్ అనుమకొండ రామకృష్ణ, అనుమకొండ బాబు, పొన్నూరు సత్యం, కూతాడి సుబ్బరాజులతో పాటు 20 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే పేర్ని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం తాడిగడపలో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు మంత్రి జోగి రమేశ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాణిక్యపల్లి శ్రీనివాసరావు, సాంబ తదితరులున్నారు.

బీజేపీ నేత కుటుంబానికి రూ.4.50 లక్షల సంక్షేమ లబ్ధి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరి మండల బీజేపీ కన్వీనర్ కల్లూరి చంద్రమౌళి దుత్తలూరులోని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. చంద్రమౌళి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తమ కుటుంబానికి రూ.4.50 లక్షల లబ్ధి చేకూరిందన్నారు. పోలంపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు సురేంద్ర, సన్నిబోయిన పరిపూర్ణ, వంగల్లు కిరణ్, వంగల్లు మాలకొండయ్య, ఎస్కే మస్తాన్ సాహెబ్ వైఎస్సార్‌సీపీలో చేరారు.


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు


టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని, పేర్ని కిట్టు


మంత్రి జోగి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు


బీజేపీ నేత చంద్రమౌళితో ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి

తైవాన్‌లో తీవ్ర భూకంపం

రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదు

- ధ్వంసమైన పలు భవనాలు, వంతెనలు, సొరంగాలు
- 9 మంది మృతి.. 934 మందికి గాయాలు
- బొగ్గు గనుల్లో చిక్కుకున్న 70 మంది కార్మికులు
- సునామీ హెచ్చరికలు జారీ... తర్వాత ఉపసంహరణ



బుధవారం తైవాన్‌ను అతలాకుతలం చేసిన భూకంపం
ధాటికి ఒరిగిపోయిన భవనం

తైపీ: ద్వీప దేశం తైవాన్‌లో శక్తివంతమైన భూకంపం సంభవించింది. బుధవారం ఉదయం 8 గంటలకు చోటుచేసుకున్న భూప్రకంపనల వల్ల పలు భవనాలు ధ్వంసమయ్యాయి. 9 మంది మరణించారు. మరో 934 మంది క్షతగాత్రులుగా మారారు. ఈ భూకంపం రిక్టర్ స్కేల్‌పై 7.2గా నమోదైనట్లు తైవాన్ భూకంప పర్యవేక్షక ఏజెన్సీ ప్రకటించగా, 7.4గా నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. దేశావ్యాప్తంగా భూకంప ప్రభావం కనిపించింది. రాజధాని తైపీకి 150 కిలోమీటర్ల దూరంలో తైవాన్ తూర్పు తీరంలో ఉన్న హాలీన్ కౌంటీకి 18 కిలోమీటర్ల దూరంలో 35 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం కేంద్రీకృతమైనట్లు అధికారులు వెల్లడించారు. భూకంపం కారణంగా దేశవ్యాప్తంగా రైలు సర్వీసులను రద్దు చేశారు. సెల్‌ఫోన్ సేవలు నిలిచిపోయాయి. తొలుత సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తర్వాత ఎత్తివేశారు. దేశంలో గత 25 ఏళ్లలో ఇదే అతిపెద్ద భూకంపమని చెబుతున్నారు. భూప్రకంపనల వల్ల పునాదులు ధ్వంసం కావడంలో పలు భవనాలు 45 డిగ్రీల మేర పక్కకు ఒరిగిపోయిన దృశ్యాలు కనిపించాయి. బలహీనంగా ఉన్న పాత భవనాలు కూలిపోయాయి. పాఠశాలల నుంచి విద్యార్థులను బయటకు పంపించారు. భూకంపం సంభవించగానే సహాయక సిబ్బంది రంగంలోకి దిగారు. ధ్వంసమైన ఇళ్ల నుంచి వృద్ధులు, చిన్నారులను బయటకు తీసుకొచ్చారు. భూకంపం, ఆ తర్వాత చోటుచేసుకున్న ప్రకంపనల కారణంగా 24 చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. 35 రోడ్లు, వంతెనలు, సొరంగాలు దెబ్బతిన్నాయి. భారీగా ఆస్తి నష్టం జరిగింది. నేషనల్ పార్కులో ఓ బస్సులో ప్రయాణిస్తున్న 50 మందితో సంబంధాలు తెగిపోయాయని అధికారులు పేర్కొన్నారు. అలాగే రెండు బొగ్గు గనుల్లో 70 మంది కార్మికులు చిక్కుకుపోయారని తెలిపారు. వారి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని వివరించారు.



జపాన్, చైనాలోనూ ప్రకంపనలు

జపాన్ దక్షిణ ప్రాంతంలోనూ ప్రకంపనలు నమోదయ్యాయి. జపాన్‌లో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. యొనాగుని, ఇషికాగి, మియాకో దీవుల్లో సముద్రపు అలలు పోటెత్తాయి. బుధవారం మధ్యాహ్నం తర్వాత సునామీ హెచ్చరికలను ఉపసంహరించారు. తైవాన్, చైనా మధ్య దూరం 160 కిలోమీటర్లు ఉంటుంది. బుధవారం చైనాలోని షాంఘైతోపాటు ఆగ్నేయ తీరంలోని పలు ప్రావిన్స్‌ల్లో సైతం భూప్రకంపనలు సంభవించాయని స్థానిక మీడియా తెలియజేసింది.

భూ విలయాల గడ్డ తైవాన్

కంప్యూటర్ చిప్‌ల తయారీకి, అత్యాధునిక టెక్నాలజీకి పేరుగాంచిన తైవాన్‌లో తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్'లో ఉండడమే ఇందుకు కారణం. ఈ ప్రాంతంలో భూ అంతర్భాగంలో సర్దుబాట్లు ఎక్కువగా జరుగుతుంటాయి. హాలీన్ కౌంటీలో 2018లో తీవ్రమైన భూకంపం సంభవించింది. అప్పట్లో 17 మంది మరణించారు. 1999 సెప్టెంబర్ 21న తైవాన్‌లో సంభవించిన భూకంపం రిక్టర్ స్కేల్‌పై 7.7గా నమోదైంది. ఈ భూవిలయం 2,400 మందిని బలితీసుకుంది. లక్ష మందికిపైగా గాయపడ్డారు. వేలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. భూకంపాల విపత్తులను సమర్థంగా ఎదుర్కొనే యంత్రాంగం తైవాన్‌లో ఉంది.

4.5 కేజీలు తగ్గిన కేజ్రీవాల్

ఆయన ప్రాణాలతో బీజేపీ చెలగాటం • ఆప్ మండిపాటు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్‌చేసిన రోజు నుంచి కేజ్రీవాల్ ఇప్పటి దాకా 4.5 కేజీల బరువు తగ్గారని ఆప్ నాయకురాలు, ఢిల్లీ మంత్రి అతిశి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఢిల్లీలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'కేజ్రీవాల్, ఆప్‌ను అణిచేసేందుకు బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది. కస్టడీలో వున్న కేజ్రీవాల్‌కు ఏమైనా జరిగితే దేశం కాదు ఆ దేవుడు కూడా బీజేపీని క్షమించడు. ఆయనను బీజేపీ జైలులో పడేసి ఆయన ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది. చక్కెర స్థాయి భారీగా పడిపోవడంతో కేజ్రీవాల్ ఆరోగ్యానికి ముప్పు ఏర్పడింది. ఈడీ కస్టడీలో ఉన్నప్పుడూ మూడు సార్లు ఆయన ఆరోగ్యం క్షీణించింది. ఒక సారి చక్కెర స్థాయిలు ఏకంగా 46కు పడిపోయింది. ఇది ఎంతటి వ్యక్తికైనా ప్రాణాంతకం' అని అతిశి అన్నారు. ''సీఎం ఆరోగ్య పరిస్థితిపై చట్టపరమైన సాయం కోరతాం' అని అన్నారు. అయితే ఈ వాదనలతో తిహార్ జైలు యంత్రాంగం విభేదిస్తోంది. ' ఆయన జైలుకు వచ్చినపుడు 65 కేజీలు ఉన్నారు. ఇప్పుడూ అదే బరువున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. ఇంటి భోజనమే అందిస్తున్నాం' అని అన్నారు. దీనిపై అతిశి మాట్లాడారు. '' జైలుకు వెళ్లేటప్పటికి ఆయన బరువు 69.5 కేజీలు. ఇప్పుడు 65 కేజీలు. ఇది రికార్డుల్లో నమోదైంది. సీఎం స్థాయి వ్యక్తి ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య వైఖరి ఏమాత్రం పనికిరాదు' అని అన్నారు. బుధవారం ఉదయం సైతం కేజ్రీవాల్ ఒంట్లో చక్కెర స్థాయిలో తక్కువగానే నమోదయ్యాయి. షుగర్ లెవెల్స్ తరచూ మారుతున్నాయని అధికారులు వెల్లడించడం గమనార్హం.

సీజేఐ కళ్ల ముందే గొంతు కోసుకున్నాడు!

కర్ణాటక హైకోర్టులో కలకలం

బెంగళూరు: కర్ణాటక హైకోర్టులో బుధవారం రక్తం చిందింది. మైసూరుకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి ఒకటో నంబర్ కోర్టు హాల్లో ఏకంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నీలాయ్ విపిన్‌చంద్ర అంజారియా కళ్లెదుటే గొంతు కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు! దాంతో అంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. భద్రతా సిబ్బంది అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి కారణం తెలియరాలేదు. భద్రతా వైఫల్యంపై సీజే ఆగ్రహించారు. ''కోర్టు హాలులోకి కత్తితో ఎలా వచ్చాడు? తనిఖీలు చేయడం లేదా?'' అంటూ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. అతన్నుంచి సమగ్ర వివరాలు రాబట్టాలని పోలీసులను సీజే ఆదేశించారు. గొంతు కోసుకోవడానికి ముందు సిబ్బందికి అతనిచ్చిన ఫైల్‌ను నిర్దేశించిన లాయర్‌కివ్వాలని సూచించారు.

54 మందికి రాజ్యసభ వీడ్కోలు

ముగిసిన మన్మోహన్ మూడు దశాబ్దాల ఇన్నింగ్స్

న్యూఢిల్లీ: రాజ్యసభలో 54 మంది సభ్యుల కాలపరిమితి ముగిసిపోయింది. వీరిలో మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ కూడా ఉన్నారు. ఈయన స్థానంలో రాజస్తాన్ నుంచి కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ మొట్టమొదటిసారిగా ఎగువ సభలో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టబోతున్నారు. రాజ్యసభలో పదవీకాలం ముగిసిన వారిలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, పశు సంవర్థక, మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా, ఐటీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, సహాయ మంత్రి వి.మురళీధరన్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి నారాయణ్‌రాణె, పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ ఉన్నారు. 49 మంది మంగళవారం రిటైర్‌కాగా, ఐదుగురు బుధవారం రిటైర్ అయ్యారు. కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వీ సైతం రిటైర్ అయ్యారు. ఈయనకు పార్టీ మరోసారి అవకాశం ఇచ్చినప్పటికీ హిమాచల్ ప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎన్నికల్లో అనూహ్యంగా ఓడిపోవడంతో ఇంకోసారి పెద్దలసభలో అడుగుపెట్టే చాన్స్ కోల్పోయారు. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి బాటలో పయనింపజేసిన మన్మోహన్ 1991 అక్టోబర్‌లో తొలిసారిగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. మరోవైపు కొత్తగా ఎన్నికైన 12 మంది నూతన సభ్యులతో బుధవారం రాజ్యసబ చైర్మన్ జగదీప్ ధన్‌కడ్ ప్రమాణం చేయించారు. ధర్మశీల గుప్తా, మనోజ్ కుమార్ ఝా, సంజయ్ యాదవ్, గోవింద్ భాయ్ లాల్జీభాయ్ ధోలకియా, సుభాష్ చందర్, హర్ష్ మహాజన్, జీసీ చంద్రశేఖర్, ఎల్.మురుగన్, అశోక్ సింగ్, చంద్రకాంత్ హందోరె, మేధా విశ్రమ్ కుల్‌కర్ణి, సాధనా సింగ్‌లు ప్రమాణంచేశారు. వీరిలో ఏడుగురు బీజేపీ, ముగ్గురు కాంగ్రెస్, ఇద్దరు ఆర్జేడీ నుంచి ఉన్నారు.


దేవభూమిలో ఈసారీ... కమల వికాసమే!

స్టేట్ స్కాన్

ఉత్తరాఖండ్‌లో కొన్నేళ్లుగా బీజేపీదే హవా • రెండు ఎన్నికల్లోనూ స్వీప్ • ఈసారి సత్తా చాటేందుకు కాంగ్రెస్ యత్నం

హిమాలయ పర్వత సిగలో బద్రీనాథ్, కేధార్‌నాథ్ వంటి ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రాలకు నెలవైన 'దేవభూమి' ఉత్తరాఖండ్. 2000 సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ నుంచి విడిపోయి ఉత్తరాంచల్‌గా ఏర్పాటైన ఈ రాష్ట్రం పేరు 2006లో ఉత్తరాఖండ్‌గా మారింది. ఇక్కడి రాజకీయాల్లో ప్రధానంగా బీజేపీ, కాంగ్రెసే చక్రం తిప్పుతున్నాయి. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలకంగా నిలిచిన ఉత్తరాఖండ్ క్రాంతి దళ్ (యూకేడీ), బహుజన సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) కూడా కాస్త ప్రభావం చూపుతున్నాయి. పదేళ్లుగా ఉత్తరాఖండ్ పూర్తిగా కాషాయమయమైంది. అటు అసెంబ్లీలో, ఇటు లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ హవాయే నడుస్తోంది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిన కమలనాథులు ఈసారి హ్యాట్రిక్ కోసం ఉవ్విళ్లూరుతున్నారు. ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఉత్తరాఖండ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన నాటి నుంచి బీజేపీ, కాంగ్రెస్ మధ్య అధికారం చేతులు మారింది. 2012 నుంచీ మాత్రం రాష్ట్రం బీజేపీ గుప్పిట్లోనే ఉంది. 2002లో కొత్త రాష్ట్రంలో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీ తివారీ సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టింది. ఉత్తరప్రదేశ్‌కు మూడుసార్లు సీఎంగా చేసిన ఆయన రెండు రాష్ట్రాల్లోనూ సీఎం పదవి చేపట్టిన తొలి, ఏకైక నేతగా చరిత్ర సృష్టించారు. 2007లో ఉత్తరాఖండ్‌లో మళ్లీ బీజేపీ అధికారం దక్కించుకుంది. 2012 ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలుచుకుంది. బీఎస్‌పీ, యూకేడీ, స్వతంత్రుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. విజయ్ బహుగుణ, హరీశ్ రావత్ రూపంలో ఆ ఐదేళ్లలో ఇద్దరు సీఎంలను మార్చింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల తిరుగుబాటు, రాష్ట్రపతి పాలన, సుప్రీంకోర్టు ఆదేశాలతో రావత్ విశ్వాస పరీక్షలో నెగ్గడం వంటి నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 5 సీట్లను దక్కించుకున్న బీజేపీ 2017 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బంపర్ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. మొత్తం 70 సీట్లలో ఏకంగా 57 స్థానాలను కొల్లగొట్టింది! 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ కాషాయ పార్టీ మరోసారి క్లీన్ స్వీప్ చేసింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాస్త మెజారిటీ తగ్గినప్పటికీ 47 సీట్లతో మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకుంది. 19 సీట్లతో కాంగ్రెస్ కాస్త పుంజుకుంది. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో పూర్వ వైభవం కోసం వ్యూహరచన చేస్తోంది. రాష్ట్రంలోని 5 ఎంపీ సీట్లలో ఒకటి ఎస్సీ రిజర్వుడు స్థానం.





సర్వేలు ఏం చెబుతున్నాయి...

రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పూర్తి ఆధిపత్యంతో బీజేపీ మంచి జోరు మీదుంది. అయోధ్య రామమందిర నిర్మాణం, హిందుత్వ, మోదీ ఫ్యాక్టర్, అభివృద్ధి నినాదాలతో హోరెత్తిస్తోంది. కాంగ్రెసేమో ఇండియా కూటమి దన్నుతో మొత్తం ఐదు స్థానాల్లో సింగిల్‌గా పోటీ చేస్తోంది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, కార్పొరేట్లతో మోదీ సర్కారు కుమ్మక్కు వంటివాటిని ప్రచారాస్త్రాలుగా చేసుకుంది. కులగణన, సంక్షేమ పథకాలు, యువతకు ఉద్యోగాలు వంటి హామీలను గుప్పిస్తోంది. అయితే సర్వేలు మాత్రం బీజేపీకే జై కొడుతున్నాయి. ఈసారి కూడా 5 సీట్లూ గెలుచుకుని హ్యాట్రిక్ కొడుతుందని అంచనా వేస్తున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

సుప్రీంకోర్టులో సింగిల్ మాల్ట్ ఎపిసోడ్

నవ్వులు పూయించిన మద్యం సంగతులు

న్యాయవాది ద్వివేదిపై సీజేఐ చెణుకులు
మద్యం కేసు విచారణలో సరదా చర్చ



న్యాయవాది ద్వివేది, సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్

న్యూఢిల్లీ: సంక్లిష్టమైన కేసులపై సీరియస్‌గా విచారణ జరిగే సుప్రీంకోర్టులో సరదా సన్నివేశం చోటుచేసుకుంది. విస్కీ, దాని రకాలు తదితరాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, సీనియర్ న్యాయవాది దినేశ్ ద్వివేది మధ్య జరిగిన ఆసక్తికరమైన సంభాషణ నవ్వులు పూయించింది. సీజేఐ హాస్య చతురత అందరినీ అలరించింది. పారిశ్రామిక ఆల్కహాల్ ఉత్పత్తి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలకు సంబంధించిన వివాదంపై సీజేఐ నేతృత్వంలోని 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముందు జరిగిన విచారణ ఇందుకు వేదికైంది. ఈ కేసులో యూపీ తరఫున వాదిస్తున్న ద్వివేది తెల్ల జుట్టు రంగులమయంగా కన్పించడంపై జస్టిస్ చంద్రచూడ్ సరదాగా ఆరా తీశారు. హోలీ సంబరాలు కాస్త శ్రుతి మించడమే కారణమంటూ ద్వివేది కూడా అంతే సరదాగా బదులిచ్చారు. ''ఈ విషయంలో దయచేసి నన్ను క్షమించాలి. నా మనవల నిర్వాకం కూడా ఇందుకు కొంతవరకు కారణమే. సంతానం, మనవలు మరీ ఎక్కువగా ఉంటే, అందులోనూ వారంతా మనతో పాటే ఉంటుంటే ఇలాంటి గమ్మత్తైన సమస్యలుంటాయి. తప్పించుకోలేం'' అన్నారు. సీజేఐ అంతటితో వదల్లేదు. 'అంతేగానీ, ఆల్కహాల్‌కు ఏ సంబంధమూ లేదంటారు!' అంటూ చెణుకులు విసిరారు. విస్కీప్రియుడైన ద్వివేది అందుకు చిరునవ్వులు చిందించారు. ''విస్కీ పాత్ర కూడా ఉందని నేను ఒప్పుకుని తీరాలి. హోలీ అంటేనే ఆల్కహాల్ పార్టీలు. పైగా నేను విస్కీకి వీరాభిమానిని'' అనడంతో అంతా గొల్లుమన్నారు. సింగిల్ మాల్ట్ విస్కీ విషయంలో ఇంగ్లండ్‌లో తనకెదురైన గమ్మత్తైన అనుభవాన్ని విచారణ సందర్భంగా ద్వివేది ఏకరువు పెట్టారు. ''నేను సింగిల్ మాల్ట్ విస్కీనే ఇష్టపడతా. ఆ విస్కీకి స్వర్గధామంగా చెప్పదగ్గ ఎడింబర్గ్ వెళ్లానోసారి. సింగిల్ మాల్ట్ తెప్పించుకుని ఐస్‌క్యూబ్స్ వేసుకోబోతుంటే వెయిటర్ అడ్డుకున్నాడు. 'ఇదేం పని! అది సింగిల్ మాల్ట్ విస్కీ. దాన్నలాగే నేరుగా ఆస్వాదించాలి. అంతే తప్ప ఇలా ఐస్‌క్యూబులూ సోడాలూ కలపొద్దు! పైగా దానికంటూ ప్రత్యేకమైన గ్లాస్ ఉంటుంది. అందులో మాత్రమే తాగాలి' అంటూ సుదీర్ఘంగా క్లాస్ తీసుకున్నాడు. సింగిల్ మాల్ట్ తాగేందుకు ఇంత తతంగం ఉంటుందని అప్పుడే నాకు తెలిసొచ్చింది'' అంటూ వాపోయారు. దాంతో న్యాయమూర్తులతో పాటు కోర్టు హాల్లో ఉన్నవాళ్లంతా పడీ పడీ నవ్వారు. ధర్మాసనంలోని మిగతా న్యాయమూర్తులు కూడా తమ చెణుకులతో ఈ సరదా సన్నివేశాన్ని మరింత రక్తి కట్టించారు. పారిశ్రామిక ఆల్కహాల్‌తో పాటు విస్కీ, వోడ్కా వంటివి కూడా రాష్ట్రాల నియంత్రణ పరిధిలోకే వస్తాయంటూ ద్వివేది వాదించడంతో ఒక న్యాయమూర్తి కల్పించుకున్నారు. ''ఇంతకీ మీరనేదేమిటి? ఆల్కహాల్ మందుబాబులకు కిక్కిచ్చినా, ఇవ్వకపోయినా రాష్ట్రాల ఖజానాకు మాత్రం కిక్కివ్వాల్సిందేనంటారా?'' అనడంతో నవ్వులు విరిశాయి. ఇంకో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ, ''కొన్ని రకాల మద్యం రుచి కాలం గడిచేకొద్దీ పెరుగుతుందని, కొన్ని తేలిక రంగులోనూ మరికొన్ని ముదురు రంగులోనూ ఉంటాయని... ఇలా ఆల్కహాల్‌కు సంబంధించిన చాలా అంశాలను మీరు ఎంతో చక్కగా వివరించారు. సాక్ష్యంగా ఆయా రకాల మద్యం బాటిళ్లను ప్రవేశపెడితే ఎలా ఉంటుందంటారు!'' అనడంతో కోర్టు హాలంతా మరోసారి నవ్వులతో దద్దరిల్లిపోయింది.

ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడి కన్నుమూత



కారకాస్ (వెనెజులా): ప్రపంచంలోనే అత్యంత వృద్ధ వ్యక్తిగా గిన్నిస్ రికార్డుకెక్కిన వెనెజులాకు చెందిన 114 ఏళ్ల జువాన్ విసెంటీ పెరేజ్ మోరా మంగళవారం మరణించారు. ఆయనకు ఆరుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు. ఏకంగా 41 మంది మనవలు, మనవరాళ్లు, 18 మంది మునిమనవలు, మనవరాళ్లున్నారు! ఆ తర్వాత తరంలోనూ ఇంకో 12 మంది వారసులుండటం విశేషం. జువాన్ 1909 మే 27న పుట్టారు. చనిపోయేదాకా పొలంలో పనిచేశారు. బాల్యం నుంచీ రోజూ పొలం పని, త్వరగా నిద్రపోవడం, రోజూ ఒక మద్యం తన దీర్ఘాయు రహస్యమనేవారు!



ఎన్నికల విచిత్రం

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పశ్చిమబెంగాల్‌లోని జల్‌పాయ్‌గురిలో తృణమూల్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ ఓ స్థానిక టీ కొట్టులో చాయ్ చేసి అలరించారు. అనంతరం ఇలా స్వయంగా కప్పుల్లో పోసి మరీ అందరికీ అందించారు.

ఎలక్షన్ బీట్

రికార్డులు బద్దలు కొట్టాల్సిందే: మోదీ

లక్నో: దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల ఉత్సాహాన్ని, ఆత్మస్థైర్యాన్ని చూసి ప్రతిపక్షాలకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈసారి ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించాలని, పాత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టేలా కష్టపడి పని చేయాలని పార్టీ నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కొత్త రికార్డులు సృష్టించడమే మన లక్ష్యం కావాలన్నారు. బుధవారం ఉత్తరప్రదేశ్‌లో 10 లోక్‌సభ స్థానాల పరిధిలోని 22,648 పోలింగ్ బూత్‌లకు చెందిన బీజేపీ శ్రేణుల డిజిటల్ ర్యాలీని ఉద్దేశించి 'నమో' యాప్ ద్వారా ప్రధాని మోదీ ప్రసంగించారు. ఎన్నికల్లో విజయం పోలింగ్‌బూత్ స్థాయిలో సాధించే విజయంపై ఆధారపడి ఉంటుందన్నారు. పోలింగ్ బూత్‌లో నెగ్గకపోతే ఎన్నికల్లో నెగ్గలేమని స్పష్టం చేశారు. రాబోయే సార్వత్రి ఎన్నికల్లో పోలింగ్ బూత్ స్థాయిల్లో రికార్డులను బద్దలు కొట్టేలా పని చేయడం అని కార్యకర్తలకు సూచించారు.

బీజేపీ ఆటలు సాగనివ్వం: రాహుల్

మరోసారి వయనాడ్ నుంచి పోటీకి నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న రాహుల్. చిత్రంలో ఆయన సోదరి ప్రియాంక

వయనాడ్: భారత ప్రజాస్వామ్య లక్షణాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి రాహుల్ గాంధీ శ్రీకారం చుట్టారు. బుధవారం కేరళలోని వయనాడ్‌లో భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు రాబోయే ఎన్నికల్లో మళ్లీ వయనాడ్ నుంచి పోటీ చేయడానికి నామినేషన్ దాఖలు చేశారు. తన సోదరి ప్రియాంకాగాంధీ వాద్రా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్‌తో కలిసి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఆ తర్వాత రోడ్‌షోలో మాట్లాడుతూ.. బీజేపీపై నిప్పులు చెరిగారు. రాబోయే ఎన్నికలు దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి జరుగుతున్న యుద్ధమని అభివర్ణించారు. మన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడానికి కాచుకొని కూర్చున్న శక్తులు ఒకవైపు, వాటిని పరిరక్షించుకోవడానికి పోరాడుతున్న పార్టీలు మరోవైపు మోహరించి ఉన్నాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వేస్తున్న ఎత్తులను విపక్ష 'ఇండియా' కూటమి చిత్తు చేయడం తథ్యమని తేల్చిచెప్పారు. వయనాడ్ ప్రజలకు అండగా నిలుస్తానని, వారి సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.

బీజేపీలో చేరుతున్నా: సుమలత

మండ్య(కర్ణాటక): కమలదళంలో త్వరలో చేరబోతున్నట్లు మండ్య స్వతంత్ర ఎంపీ, ప్రముఖ నటి సుమలతా అంబరీశ్ బుధవారం ప్రకటించారు. అయితే ఈసారి మండ్య ఎంపీ స్థానం నుంచి పోటీ చేయట్లేనని స్పష్టంచేశారు. బుధవారం మండ్యలో సుమలత మాట్లాడారు. ' మండ్యను విడిచివెళ్లేది లేదు. మీ కోసం పనిచేస్తూనే ఉంటా. నా అవసరం లేదన్న కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లను. స్వతంత్ర ఎంపీగా గెలిచినా నాకు ప్రతి దశలో బీజేపీ నాయకులు అండగా నిలిచారు. రాజకీయంగా వేరే ఏ ఇతర నిర్ణయం తీసుకోవద్దని ప్రధాని మోదీ నన్ను కోరారు. అది నిజమైన నాయకత్వం. నాకు ఇచ్చిన నిజమైన గౌరవం. మోదీ నాయకత్వం అద్భుతం. అలాంటి నాయకుడిని అభినందించాలి. అందుకే బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నా' అని సుమలత చెప్పారు.

కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి విజేందర్



న్యూఢిల్లీ: గత సార్వత్రిక ఎన్నికలకు ముందు కాంగ్రెస్ కండువా కప్పుకున్న ప్రముఖ బాక్సర్, భారత తొలి ఒలంపిక్ గోల్డ్ మెడలిస్ట్ విజేందర్ సింగ్ బుధవారం బీజేపీలో చేరారు. మోదీ నేతృత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశ, విదేశాల్లో భారతీయ క్రీడాకారుల పట్ల అందరికీ గౌరవం మరింత పెరిగిందన్నారు. ఆయన గతంలో కేంద్రానికి వ్యతిరేకంగా రైతు ఉద్యమానికి మద్దతివ్వడంతోపాటు మహిళా రెజ్లర్ల నిరసనల్లో పాల్గొని మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించడం తెల్సిందే. సోషల్ మీడియాలోనూ బీజేపీ వ్యతిరేక పోస్టులు పెట్టేవారు.

లోక్‌సభ బరి నుంచి తప్పుకున్న అబ్దుల్లా

శ్రీనగర్: అనారోగ్య సమస్యలతో లోక్‌సభ ఎన్నికల సమరం నుంచి వైదొలగాలని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, శ్రీనగర్ సిట్టింగ్ ఎంపీ ఫరూక్ అబ్దుల్లా నిర్ణయించుకున్నారు. ఆయన కుమారుడు, పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా బుధవారం ఈ మేరకు వెల్లడించారు.

బీజేపీకి గట్టిగా బదులిస్తాం

ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ • తిహార్ జైలు నుంచి విడుదల



న్యూఢిల్లీ: విపక్షాలపై తీవ్ర నిర్బంధ చర్యలకు పాల్పడుతున్న బీజేపీకి గట్టిగా బదులివ్వాల్సిన సమయం వచ్చిందని ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ అన్నారు. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఆర్నెల్ల పాటు తిహార్ జైల్లో గడిపిన ఆయనకు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే. వైద్య పరీక్షల అనంతరం ఆయన గురువారం రాత్రి విడుదలయ్యారు. ఆప్ కార్యకర్తలు వెంట రాగా ఓపెన్ టాప్ కార్లో ర్యాలీగా ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసానికి వెళ్లారు. కేజ్రీవాల్ భార్య సునీతను కలిసి ఆమెకు పాదాభివందనం చేశారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. జైల్లో ఉన్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌ల నివాసాలకు కూడా వెళ్లి వారి కుటుంబీకులను పరామర్శిస్తానని చెప్పారు. మోదీ నియంత పాలనలో దేశమంతా నలిగిపోతోందంటూ దుమ్మెత్తిపోశారు. ''మోదీ సర్కారు ఎంతగా వేధించినా ఆప్ బెదరబోదు. కేజ్రీవాల్ రాజీనామా చేయబోరు. 2 కోట్ల మంది ఢిల్లీవాసుల ప్రయోజనాల పరిరక్షణకు జైలు నుంచే సీఎంగా విధులు నిర్వర్తిస్తారు. ఆయన, సిసోడియా, జైన్ త్వరలోనే విడుదలవుతారు'' అని అన్నారు. అవినీతి ఆరోపణలపై విపక్ష పాలిత రాష్ట్రాల పోలీసులు మోదీ ఇంటి తలుపు తడితే విచారణకు ఆయన సహకరిస్తారా అని సంజయ్ ప్రశ్నించారు.



ఘనంగా ఇఫ్తార్ విందు

మచిలీపట్నంటౌన్: ఎమ్మెల్యే పేర్ని నాని బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ బందరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర రావు, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు పాల్గొన్నారు.



దుర్గమ్మ సన్నిధిలో క్రోధి వేడుకలు

ఇంద్రకీలాద్రిపై ఈ నెల తొమ్మిదో తేదీన క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు తెలిపారు. -8లో▸

స్కూళ్లలో వాటర్ బెల్



జగ్గయ్యపేట: ఎండల తీవ్రత దృష్ట్యా పిల్లల్లో డీ హైడ్రేషన్ నివారణకు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం వాటర్‌బెల్స్ మోగించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 8.45, 10.50, 11.50 గంటలకు తాగునీరు అందించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహరి (శుక్ర)
విజయవాడ	6.25	4.42
జగ్గయ్యపేట	6.28	4.47
మచిలీపట్నం	6.25	4.40
గుడివాడ	6.25	4.42

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి బుధవారం పలువురు భక్తులు విరాళాలను అందజేశారు. అనంతపురానికి చెందిన శ్రీదుర్గా మారుతీ ఆటోమోటివ్స్‌కు చెందిన ఎస్. వెంకటేశ్వరరావు నిత్యాన్నదానానికి రూ. లక్ష, విజయవాడ పాయకాపురానికి చెందిన పాములపాటి కాశీలింగాచారి కుటుంబం రూ. 1,11,111 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ పర్యవేక్షకులు జగదీష్, అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల పనివేళల్లో మార్పు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల పనివేళల్లో మార్పు చేసినట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాలు ఈ నెల 4వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనిచేస్తాయని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత పిల్లలను ఇంటికి పంపిస్తారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు మే 1 నుంచి 15వ తేదీ వరకు, అంగన్వాడీ సహాయకులకు మే 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించామన్నారు. కార్యకలాపాలను జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి జి.ఉమాదేవి పర్యవేక్షిస్తారని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

210 కిలోమీటర్ల ట్రాక్ పునరుద్ధరణ పూర్తి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో 210 కిలోమీటర్ల ట్రాక్ పునరుద్ధరణ పనులను విజయవంతంగా పూర్తి చేసినట్లు డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా విజయవాడ డివిజన్ పరిధిలో చేపట్టిన ఈ పనులు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. అదే విధంగా 148 కిలోమీటర్ల పరిధిలో దెబ్బతిన్న స్లిప్పర్‌ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశామన్నారు. గత రెండు దశాబ్దాలతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో మంచి పురోగతి సాధించామన్నారు. మెత్తం రైల్వే ట్రాక్‌ను పునరుద్ధరణ చేపట్టడం కష్ట సాధ్యమైన పని అయినప్పటికీ తమ సిబ్బంది దీన్ని సమర్థంగా పూర్తి చేశారన్నారు. రైల్వే ట్రాక్ పునరుద్ధరణ చేయటంతో పాటు ట్రాక్ కింద మట్టిని కూడా మార్చామన్నారు. దీని ద్వారా రైలు ప్రమాదాలు తగ్గుతాయని అదేవిధంగా రైళ్ల వేగం కూడా పెరుగుతుందన్నారు.

దుర్గమ్మ సేవలో ఎన్నికల వ్యయ పరిశీలకురాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకురాలు నీనా నిగం బుధవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నీనా నిగంకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఎఈవో ఎన్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలతో సత్కరించారు.

ఈ పాపం బాబుదే! ఏడి పింఛెన్'

పెన్షన్ల కోసం పండుటాకుల పడిగాపులు

- వలంటీర్లు లేక సచివాలయాల బాట పట్టిన అవ్వాతాతలు
- 58 నెలల తర్వాత మళ్లీ క్యూలు
- జిల్లా వ్యాప్తంగా మండుటెండలో ఇబ్బందులు
- పింఛను పంపిణీని ప్రారంభించిన సచివాలయ ఉద్యోగులు



కొత్తపేట కేబీఎన్ కళాశాల వద్ద పింఛను కోసం వృద్ధుని పాట్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎండ తీక్షణంగా కాస్తోంది. తెల్లవారే సరికే భానుడు భగభగ మంటున్నాడు. 38 డిగ్రీల ఉష్ణోగ్రత. చేతిలో చిన్న సంచి.. పెన్షన్ పుస్తకం.. ఆధార్ కార్డు.. ఊతకర్ర సహాయంతో అవ్వా తాతలు రోడ్డెక్కారు. సచివాలయాల వైపుగా పయనమయ్యారు. నెత్తిన చెంగు వేసుకుని అవ్వలు, కండువా కప్పుకుని తాతలు.. మధ్య మధ్యలో ఆగుతూ తెలిసిన వారి సహాయం కోరుతూ సచివాలయాల వద్దకు చేరుకున్నారు. అక్కడ ఎర్రటి అగ్గిలో.. అరకొరగా ఉన్న చెట్ల కింద, రోడ్ల పక్కన పింఛను కోసం బారులు తీరారు. సచివాలయాల వద్దకు వచ్చిన వారందరిదీ ఒకటే మాట. 58 నెలలుగా ఎండకన్ను చూడలేదు. తూర్పు తెలతెల్లావారకముందే వలంటీర్ వచ్చి పెన్షన్ చేతికి అందించాడు. ఇపుడు మాకీ ఖర్మేమిటి? ఈ వయస్సులో మమ్మల్ని రోడ్డుకీడ్చి ఏం సాధిద్దామని? అంటూ రుసరుసలాడారు. కొందరు సొమ్మసిల్లిపోగా.. కొందరు మెట్ల పక్కనో.. సిమెంట్ బల్లల పైనో తలవాల్చారు. వలంటీర్లు లేని లోటును తలచుకుంటూ క్యూలైన్‌లోనే నిలుచుని పింఛను అందుకున్నారు. కొందరు పెద్ద వాళ్లు ఆధార్ మరిచిపోయి మరలా ఇంటికి తిరిగి వచ్చిన సంఘటనలు చోటుచేసుకున్నాయి.

జిల్లాలో పరిస్థితి ఇది..

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 2,37,365 మంది పెన్షనర్లు ఉన్నారు. తొలిరోజు సచివాలయ సిబ్బంది 1,04,335 మందికి పింఛన్ పంపిణీ చేశారు. మొత్తం పింఛన్లలో ఇది కేవలం 43.96 శాతం మాత్రమే. గతంలో వలంటీర్లు ఇంటి వద్దనే పెన్షన్లు అందించినపుడు తొలి రోజే 85 శాతానికి పైగా పెన్షన్ పంపిణీ జరిగేది. కానీ వలంటీర్లు పింఛను పంపిణీ చేయకూడదంటూ కోర్టు తీర్పులు, ఎన్నికల కమిషన్ ఆంక్షల నేపథ్యంలో పెన్షనర్లు సచివాలయాల వద్దకు వెళ్లాల్సి వచ్చింది. దీంతో పంపిణీ మందకొడిగా జరిగింది. మధ్యాహ్నం నుంచి పెన్షన్ పంపిణీ ప్రారంభమైంది. జిల్లాలో అత్యధికంగా తిరువూరు(అర్బన్)లో 73.74 శాతం, నందిగామ అర్బన్‌లో 73.58 శాతం, జి. కొండూరు మండలంలో 68.58 శాతం పంపిణీ జరిగింది. అత్యల్పంగా చందర్లపాడు మండలంలో 20.43, వత్సవాయి లో 19.21 శాతం, నందిగామలో 17.67 శాతం పంపిణీ పూర్తయింది. విజయవాడ అర్బన్‌లో 24.82 శాతం పంపిణీ చేశారు. కొండపల్లి అర్బన్‌లో 18.86 శాతం పంపిణీ జరిగింది. రాష్ట్ర సరిహద్దులో ఉన్న వత్సవాయి, వీరులపాడు వంటి రూరల్ మండలాల్లో పింఛను పంపిణీ ఆశించిన స్థాయిలో జరగలేదు.

తిట్లు.. శాపనార్థాలు

నెలనెలా క్రమం తప్పకుండా అందుతున్న రూ. 3వేల పెన్షన్‌తో వృద్ధులు, వితంతువులు తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఏ ఆదరణ లేని వారు ఆ డబ్బుతోనే జబ్బుకు మందులు, ఆకలి తీర్చుకుంటున్నారు. 58 నెలలుగా ఒకటో తేదీనే పెన్షన్ అందుతుండటంతో నెలంతా ప్రణాళిక ప్రకారం ఖర్చులకు వాడుకుంటున్నారు. నెలాఖరుకు చేతిలో చిల్లి గవ్వ లేకుండా పోతోంది. ఎలాగూ నెల ఒకటో తేదీ పెన్షన్ అందుతుంది కదా అనుకున్న అవ్వాతాతలకు చంద్రబాబు రూపంలో షాక్ తగిలింది. వలంటీర్లు పెన్షన్లు ఇవ్వడానికి వీల్లేదంటూ అడ్డుకోవడం, మూడో తేదీ వరకు పెన్షన్ డబ్బులు రాకపోవడంతో అవ్వాతాతలు ఇబ్బందులు పడ్డారు. ఎన్నడూ లేనిది సచివాలయాల వద్దకు వెళ్లి తెచ్చుకోవాలని చెప్పడంతో అవస్థలు పడ్డారు. తమ అవస్థలకు చంద్రబాబే కారణమని అవ్వా తాతలు తిట్ల దండకం ఎత్తుకున్నారు.

సచివాలయానికి దారి తెలియదు..



గత ఐదేళ్లలో వలంటీర్లు ఇంటి వద్దకే పింఛను తెచ్చి ఇస్తుండటంతో మా గ్రామ సచివాలయం ఎక్కడుందో కూడా నాకు తెలియదు. ఇప్పుడు సచివాలయంలో పింఛను ఇస్తున్నారని చెప్పడంతో వెతుక్కుంటూ వచ్చా. ఇలా మమ్మల్ని ఇబ్బంది పెడితే ఎలా? నా బాధ ఎవరికి చెప్పుకోను? వలంటీర్లు ఉంటే నాలాంటి వాళ్లకు బావుంటుంది.

– గిరిశెటి చిలకమ్మ, రామచంద్రాపురం, ఎ.కొండూరు మండలం

తీవ్ర ఇబ్బంది..



ప్రతినెలా కోడి కూయకముందే గుమ్మం ముందుకు వచ్చి వలంటీర్లు పింఛను అందించేవారు. ఈ నెల అనేక అగచాట్లకు గురికావాల్సి వచ్చింది. పెన్షన్ తెచ్చుకునేందుకు సచివాలయానికి రావడం మాలాంటి ముసలి, ముక్క, వికలాంగులకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది.

– చింతల వీరయ్య, గంపలగూడెం



జూపూడి సచివాలయం వద్ద లబ్ధిదారుల పడిగాపులు

క్షుణ్ణంగా తనిఖీలు



గన్నవరం: మండలంలోని కేసరపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం కృష్ణాజిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి పరిశీలించారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల వేళ డబ్బు, ఇతర వస్తువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు నియోజకవర్గంలో నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ చెక్‌పోస్టులు వద్ద సిబ్బంది మూడు షిఫ్టులుగా 24 గంటల పనిచేస్తారని చెప్పారు. త్వరలో మొబైల్ తనిఖీ బృందాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. వీటి పనితీరును స్వయంగా తెలుసుకునేందుకు పరిశీలించినట్లు తెలిపారు. ఈ చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు జరపాలని సిబ్బందికి ఎస్పీ సూచించారు. ఎటువంటి రికార్డులు, ఆధారాలు లేకుండా రవాణా చేసే నగదు, వస్తువులను సీజ్ చేయాలని తెలిపారు. డీఎస్పీ జయసూర్య, సీఐ వరప్రసాద్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ నిషేధాజ్ఞలు

విజయవాడస్పోర్ట్స్: ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో 30 పోలీస్ యాక్ట్ నిషేధాజ్ఞలను అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు 91 రోజులు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్న సమయంలో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు, ధర్నాలు నిర్వహించేందుకు ముందస్తు పోలీస్ అనుమతి తీసుకోవాలన్నారు. ఈ ఆదేశాలను అతిక్రమించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొత్త జిల్లా.. ప్రగతి భళా



విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనం

జిల్లా ముఖ చిత్రం ఇలా..

జిల్లా జనాభా:	22.18లక్షలు
విస్తీర్ణం: (చదరపు కి.మీ.)	3,316
మండలాల సంఖ్య:	20
గ్రామాలు:	321
కార్పొరేషన్ :	01
మునిసిపాలిటీలు:	05
పంచాయతీలు:	288
ఓటర్లు:	16,86,952



చేరువైన పాలనతో అభివృద్ధి పరుగులు

- వెనువెంటనే పరిష్కారం అవుతున్న సమస్యలు
- పల్లె చెంతకు సకల సౌకర్యాలు
- విద్య, వైద్యాభివృద్ధికి రాష్ట్ర సర్కారు పెద్దపీట
- విజయవాడపై మరింత ఫోకస్
- మెట్ట ప్రాంతాల ప్రజలకు అందుబాటులో అధికారులు
- నేడు మూడో వసంతంలోకి ఎన్టీఆర్ జిల్లా

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లాల పునర్విభజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2022 ఏప్రిల్ 4న తేదీన 50 మండలాలు ఉన్న ఉమ్మడి కృష్ణా జిల్లాను మూడు జిల్లాలుగా విభజించారు. 20 మండలాలతో ఎన్టీఆర్ జిల్లాను ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పడిన జిల్లా అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తోంది. ఇప్పటికే వాణిజ్య నగరంగా గుర్తింపు పొందిన విజయవాడ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. గతంలో నగరంలో ఉన్నతాధికారుల క్యాంపు కార్యాలయాలు మాత్రమే ఉండేవి. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మచిలీపట్నం వెళ్లాల్సి వచ్చేది. విజయవాడలో వీఐపీల తాకిడికి తోడు, సమావేశాలు ఇక్కడే జరుగుతుండటంతో అధికారులు అందుబాటులో ఉండేవారుకాదు. దీంతో ప్రజల కష్టాలు పడాల్సి వచ్చేది. ప్రస్తుతం జిల్లాల పునర్విభజనతో ప్రజలకు ఈ కష్టాల నుంచి ఉపశమనం కలిగింది. ఐదేళ్లలో 72,20,324 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా రూ.12,096,39 కోట్ల జమయ్యాయి. రూ.1,383 కోట్లతో విజయవాడను అభివృద్ధి చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో తొలిదశలో 83,723 మంది పేద లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి

శివారు ప్రాంతాల వారికి వరం..

ప్రధానంగా తిరువూరు, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలకు గతంలో మచిలీపట్నం జిల్లా కేంద్రం చాలా దూరంలో ఉండేది. ఉదాహరణకు తిరువూరు నియోజక వర్గంలోని గంపలగూడెం మండల ప్రజలు మచిలీపట్నం వెళ్లాలంటే దాదాపు 180 కిలోమీటర్లకు పైగా దూరం వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా కేంద్రం విజయవాడ ఏర్పాటు చేయడంతో ప్రజలకు పాలన చేరువైంది. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ నగరంలోని తూర్పు, సెంట్రల్, వెస్ట్ నియోజకవర్గాలు కీలకంగా మారాయి. ఇప్పటికే రైల్వే, విమాన, హైవే సదుపాయాలు ఉండటంతో నగరం వాణిజ్య పరంగా, పారిశ్రామికంగా అభివృద్ధి బాటలో పయనిస్తోంది.

అసాధారణ నిర్ణయం..

వైఎస్ జగన్ ప్రజాసంకల్పయాత్రలో భాగంగా 2018 ఏప్రిల్ 30న దివంగత ఎన్టీ రామారావు స్వస్థలం కృష్ణా జిల్లా నిమ్మకూరులో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ జిల్లాగా పేరు పెడతానని చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రాజకీయాలకతీతంగా జిల్లాకు ఆయన పేరు పెట్టారు. మూడు సార్లు ముఖ్యమంత్రి పదవిలో వెలుగొందిన ఎన్టీఆర్ సొంత అల్లుడు చంద్రబాబు చేయలేని పనిని జగన్ చేసి చూపించారు.

అభివృద్ధి పథాన బెజవాడ..

మెగా మెట్రో పాలిటన్ నగరాలతో పోటీ పడుతూ బెజవాడ నగరం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. భారీ రోడ్డు రవాణా ప్రాజెక్టు పనులు రికార్డు సమయంలో పూర్తయ్యాయి. బెంజిసర్కిల్ జంట ఫ్లై ఓవర్‌లు అందుబాటులోకి వచ్చాయి. విజయవాడ నగరం పచ్చందాలతో ఫరిఢవిల్లుతోంది. నగరానికి సెంటరాఫ్ అట్రాక్షన్‌గా అంబేడ్కర్ స్మృతి వనం కొలువుదీరింది. కృష్ణా నదిపై రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి కావడంతో ముంపు సమస్య శాశ్వతంగా తప్పింది. వెస్ట్ బైపాస్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. తూర్పు బైపాస్‌కు సంబంధించిన ప్రతిపాదనలకు తుది రూపు వచ్చింది. విజయవాడ జీజీహెచ్ ఆస్పత్రిలో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతోంది. నాడు–నేడు పనులు పూర్తి చేయడంతో పాటు సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌ను ప్రారంభించారు.

ఇంద్రకీలాద్రికి కొత్త శోభ..

ఇంద్రకీలాద్రిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. విజయవాడలోని కనుకదుర్గానగర్ గోశాల వద్ద ఆయన రూ.216.05కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ.23.145కోట్లతో పూర్తి చేసిన పనులను ప్రారంభించారు.



రివర్ ఫ్రంట్ పార్కులో పర్యాటకుల సందడి(ఫైల్)

విజయవాడ అభివృద్ధికి చేసిన ఖర్చు..

- అంబేడ్కర్ స్మృతివనం: రూ. 400కోట్లు
- ఇంద్రకీలాద్రి అభివృద్ధి: రూ.239.19కోట్లు
- విజయవాడ జీజీహెచ్: రూ.320కోట్లు
- కృష్ణా నది వెంబడి రిటైనింగ్ వాల్: రూ.394.27కోట్లు

కష్టాలు తీరాయి..



గతంలో కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నం మా గ్రామానికి 175 కిలోమీటర్ల దూరం ఉండేది. ఏ పని నిమిత్తం వెళ్లినా రెండు రోజులు పట్టేది. అధికారులు అందుబాటులో లేకపోతే మళ్లీ వ్యయప్రయాసల కోర్చి వెళ్లవలసి వచ్చేది. జిల్లాల పునర్విభజన చేసి విజయవాడ కేంద్రంగా ఎన్టీఆర్ జిల్లా ఏర్పాటు చేయడంతో సగం దూరం తగ్గింది. అధికారులు అందుబాటులో ఉంటున్నారు. పనులు సత్వరం పూర్తవుతున్నాయి.

– సముద్రాల సత్యనారాయణ, రిటైర్డు ఉద్యోగి, నెమలి, గంపలగూడెం మండలం

వ్యయప్రయాసలు తగ్గాయి..



జిల్లాల పునర్విభజనతో ఎన్నో వ్యయప్రయాసలు తగ్గాయి. గతంలో మా గ్రామం నుంచి జిల్లా కేంద్రానికి పనిమీద వెళ్లాలంటే మచిలీపట్నం వెళ్లాలంటే 150 కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేది. సరైన ప్రయాణ సౌకర్యాలు కూడా ఉండేవి కావు. వెళ్లి వచ్చేందుకు ఒక రోజు పట్టేది. ఇంత కష్టపడి వెళ్లినా సంబంధిత అధికారులు లేకపోతే మరలా ఒకరోజు వీలు చూసుకుని వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడలో అన్ని కార్యాలయాలు ఉండటంతో ప్రయాణానికి ఎంతో సౌకర్యాంగా ఉంది.

– లగడపాటి నాగేశ్వరరావు, రైతు నాయకుడు, శివాపురం, పెనుగంచిప్రోలు మండలం

పార్టీల ఎన్నికల ప్రచారంపై ఫోకస్

ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్ కుమార్



మాట్లాడుతున్న జేసీ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ అన్నారు. పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూ.చ. తప్పక పాటించాల్సిందేనన్నారు. రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారానికి సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల నుంచి తీసుకోవాల్సిన ముందస్తు అనుమతులపై బుధవారం జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసే బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రదర్శనల నిర్వహణ, లౌడ్ స్పీకర్లు, వాహనాల వంటి వాటికి సంబంధించి తప్పనిసరిగా ఆయా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో వినియోగించే ప్రచార వాహనాలకు హెలిప్యాడ్, హెలికాప్టర్, ఎల్ఈడీ, ఎయిర్ బెలూన్ వినియోగానికి సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ఒక నియోజకవర్గ పరిధిలో బహిరంగ సభలు, ర్యాలీలు, తాత్కాలిక పార్టీ కార్యాలయాల ఏర్పాటు, వాహనాలకు అనుమతి, బహిరంగ సభలలో స్పీకర్లు బ్యారికేట్స్ నిర్మాణంతో పాటు ఇంటింటి ప్రచారానికి, ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులను తీసుకోవాలన్నారు. ఒకటికి పైగా నియోజకవర్గాలలో ప్రదర్శనలు, ర్యాలీలను నిర్వహించాల్సి వస్తే ఆయా రాజకీయ పార్టీలు పార్లమెంటరీ రిటర్నింగ్ ఎన్నికల అధికారి నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లు ముద్రించి పంపిణీ చేసేటప్పుడు ఆయా పోస్టర్లపై ముద్రణ సంస్థ పేరు, ముద్రించిన ప్రతుల సంఖ్యను తప్పనిసరిగా ముద్రించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి ముద్రణ సంస్థకు రాజకీయ పార్టీలు ఇచ్చిన ప్రింట్ ఆర్డర్ కాపీని సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, సెక్షన్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో అంజనా సిన్హా



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసిన శ్రీమహాలక్ష్మి అమ్మవారిని రాష్ట్ర రోడ్డు సేఫ్టీ అథారిటీ చైర్‌పర్సన్ అంజనా సిన్హా కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన అంజనా సిన్హాకు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు సాదరంగా స్వాగతం పలకగా, ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఆహ్వానించారు. అమ్మవారితో పాటు ఆలయ ప్రాంగణంలోని శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ కమిటీ అంజనా సిన్హాకు పట్టువస్త్రాలు, దేవస్థానం తరఫున కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, రాంపిళ్ల శ్రీనివాసరావు, రాయన గురునాథరావు, గూడెల రామకృష్ణ జ్ఞాపిక అందజేశారు.


30 కిలోల గంజాయి పట్టివేత



హనుమాన్‌జంక్షన్ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై బాపులపాడు మండలం బొమ్ములూరు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద 30 కిలోల గంజాయిని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ట్రైనీ డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, హనుమాన్ జంక్షన్ సీఐ అల్లునవీన్ నరసింహమూర్తి, ఎస్‌ఐలు ఏడీఎల్ జనార్దన్, పి.ఆర్జమ్మ నేతృత్వంలో చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో 30 కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తూ పోలీసులకు చిక్కారు. అదుపులోకి తీసుకుని విచారించగా వారు మహారాష్ట్రలోని పూనేకు చెందిన దీపక్ అబాజీ తూపే, ప్రతీక్ ప్రతాప్ జాదవ్‌గా పోలీసులు గుర్తించారు. విజయనగరం సమీపంలోని ఏజెన్సీ ఏరియాలో గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ బొమ్ములూరు చెక్‌పోస్ట్‌ను సందర్శించారు. ఈ కేసు వివరాలను తెలుసుకున్నారు. చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్‌టీ టీం ఇన్‌చార్జి కె.సుజాత, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

రైతుల కడగండ్లకు పరిష్కారం

- గతంలో ఎన్నడూ లేనివిధంగా తువ్వకాలువ అభివృద్ధి
- కట్టను పటిష్టం చేయటంతో పాటు గండ్లు పూడ్చివేత
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు



నాడు : పోలంపల్లి వద్ద వరదకు కొట్టుకుపోయిన కరకట్ట గోడ (ఫైల్)



నేడు : కొట్టుకుపోయిన గోడ స్థానంలో నూతన నిర్మాణం



నాడు : తువ్వకాలువకు పడ్డ గండి (ఫైల్)



నేడు : గండ్లు పడిన చోట గ్రావెల్‌తో అభివృద్ధి

పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అని మరోసారి నిరూపించుకుంది. గత ఏడాది జూలైలో వచ్చిన వరదలకు మునేరు కరకట్ట దెబ్బతింది. తువ్వ కాలువకు గండ్లు పడ్డాయి. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో అధిక వర్షాలు కురవటంతో పాటు చెరువులు తెగటంతో రెండు లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చింది. దీంతో వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద మునేరుపై బ్రిటీషు పాలనలో నీటి నిల్వ కోసం 200 మీటర్ల మేర నిర్మించిన కరకట్ట గోడ 100 మీటర్ల వరకు వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. మునేరు నుంచి నీరు ప్రవహించే తువ్వ కాలువలకు 38 చోట్ల గండ్లు పడ్డాయి. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఈ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే నిధులు మంజూరు చేశారు.

రూ.1.80 కోట్లతో యుద్ధప్రాతిపదికన పనులు

బ్రిటీషు పాలనలో నిర్మించిన కరకట్ట గోడ కొట్టుకుపోవటంతో ముఖ్యమంత్రి ఆదేశాలతో రూ.1.80 కోట్లతో కాంక్రీట్ పనులను అధికారులు యుద్ధ ప్రాతిపదికన పటిష్టంగా పూర్తిచేశారు. గోడ కట్టడంతో గతంలో కంటే నీరు ఎక్కువగా నిల్వ ఉండి ఆయకట్టు రైతులకు సాగునీరు పుష్కలంగా అందుతోంది. తువ్వ కాలువకు గతంలో గండ్లు పడితే పక్కనే ఉన్న మట్టితో తూతూ మంత్రంగా పూడ్చేవారు. కాలువ గట్టుపై ఏ వాహనమైనా రాకపోకలు సాగించే పరిస్థితి ఉండేది కాదు. దశాబ్దాలుగా ఈ కాలువ పరిస్థితి దయనీయంగా మారటంతో పాటు చివరి భూముల వరకు నీరు వెళ్లేది కాదు. ప్రస్తుతం వత్సవాయి మండలం ఆలూరుపాడు నుంచి పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదుర్రు వరకు కాలువకు పడ్డ 38 గండ్లు పూడ్చటంతో పాటు అవసరమైన చోట పటిష్ట రక్షణ చర్యలు, కాలువపై గ్రావెల్‌తో పక్కా రోడ్డు నిర్మించారు. దీంతో చివరి భూముల వరకు నీరు వెళ్లటంతో పాటు రైతులు వ్యవసాయ యంత్ర పరికరాలను తీసుకెళ్లేందుకు, ట్రాక్టర్లు, బండ్లు రాకపోకలు సాగించేందుకు మార్గం ఏర్పడింది.

తెలంగాణ రైతులకూ నష్టపరిహారం

ఆనకట్ట వద్ద గండి పడటంతో పక్కనే ఉన్న తెలంగాణలోని పెదమండవ రైతులకు చెందిన పొలాలు కోతకు గురయ్యాయి. ఏటా గండ్లు పడుతున్నా తమకు నష్టపరిహారం ఇవ్వటం లేదని మరమ్మతులకు పెదమండవ రైతులు ఆటంకాలు కలిగిస్తున్నారు. ఎమ్మెల్యే ఉదయభాను ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం స్పందించి టీడీపీ హయాంలో జరిగిన నష్టానికి సంబంధించి 51 మంది తెలంగాణ రైతులకు రూ.55 లక్షల పరిహారం మంజూరుచేశారు. దీంతో ఆ రైతులు కూడా రాష్ట్ర ప్రభుత్వ పనితీరును ముక్తకంఠంతో అభినందిస్తున్నారు.

కాలువలకు మరమ్మతులు

గత ప్రభుత్వ హయాంలో కాలువల మరమ్మతులను పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మునేరు కాలువలకు రూ.60 లక్షలతో మరమ్మతులు చేయించింది. మరో రూ.15 లక్షలతో కాచవరం బ్రాంచి కెనాల్‌కు మరమ్మతులు చేయించడంతో వరద ముప్పు తప్పింది. జగ్గయ్యపేటలోని ఎర్రకాలువ, వేపలవాగుకు రూ.40 లక్షలతో మరమ్మతులు చేశారు. ఈ కాలువలకు రెండు పక్కలా రక్షణ గోడల పటిష్టానికి రూ.5.50 కోట్లు మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ పనులు ఆగిపోయాయి. ఎన్నికలు పూర్తవగానే పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.

మనసున్న ముఖ్యమంత్రి



అధిక వర్షాలకు పోలంపల్లి వద్ద బ్రిటీషు హయాంలో నిర్మించిన కరకట్ట గోడ కొట్టుకుపోయింది. తువ్వ కాలువకు 38 చోట్ల గండ్లు పడ్డాయి. ఈ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే రూ.1.80 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో కరకట్టపై కాంక్రీట్ పనులు చేయటంతో పాటు తువ్వకాలువ గండ్లు మొత్తం పూర్తి స్థాయిలో పూడ్చాం. రైతులకు ఇబ్బందులు లేకుండా సాగు నీరు అందించాం. పోలంపల్లి డ్యాం వద్ద గండి పూడ్చివేత పనులు జరుగుతున్నాయి. నష్టపోయిన తెలంగాణ రైతులకు కూడా రూ.55 లక్షల పరిహారం ఇవ్వటం ముఖ్యమంత్రి మంచితనానికి నిదర్శనం.

–సామినేని ఉదయభాను,
ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే

పటిష్టంగా గండ్లు పూడ్చివేత



తువ్వ కాలువకు పడిన గండ్లను పూడ్చి వేయటంతో పాటు దశాబ్దాలుగా పట్టించుకోని కాలువ గట్లను పటిష్టం చేశారు. గతంలో గట్ల పక్కన ఉన్న మట్టితో గండ్లకు మరమ్మతులు చేసేవారు. ఇప్పుడు గ్రావెల్‌తో గండ్లు పూడ్చి, గట్లును అభివృద్ధి చేయటంతో రహదారులుగా కనిపిస్తున్నాయి. సకాలంలో మరమ్మతులు పూర్తి చేసి సాగునీరు అందించారు. వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్లు, బండ్లు వెళ్లే అవకాశం కలిగింది. రైతుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారు.

–కోలా రామారావు,
రైతు, అనిగండ్లపాడు

నేడు సరిహద్దు జిల్లాల అధికారుల సమావేశం

తిరువూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నడుమ డబ్బు, మద్యం అక్రమ రవాణా నిరోధానికి గురువారం తిరువూరులో ఎన్టీఆర్, ఖమ్మం జిల్లా అధికారుల సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తిరువూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.మాధవి తెలిపారు. తిరువూరు శ్రీరస్తు కల్యాణ మండపంలో మధ్యాహ్నం 12 గంటలకు ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. రెండు జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొంటారని వివరించారు.

రూ.4.20 లక్షలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



బంటుమిల్లి: మండల పరిధిలోని 216 జాతీయ రహదారిపై ముంజులూరు టోల్ ప్లాజా వద్ద ఎస్ఐ జి.వాసు పోలీసు సిబ్బందితో బుధవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేని రూ.4.20 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. మచిలీపట్నం నుంచి పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి వెళ్తున్న గూడ్స్ వ్యాన్‌ను తనిఖీ చేయగా అందులో ఈ నగదు లభించింది. నగదుకు సంబంధించిన పత్రాలను వ్యాన్‌లో ఉన్న వ్యక్తులు చూపకపోవడంతో ఆ సొమ్మును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వాసు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు సీజ్



ట్రాక్టర్లు, నిందితులతో ఎస్ఈబీ, పోలీసు, రెవెన్యూ అధికారులు

కంకిపాడు: ఇసుక అక్రమ రవాణాపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, పోలీసు శాఖలు కొరడా ఝుళిపించాయి. ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నాయి. ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి కథనం మేరకు.. మండలంలోని మద్దూరు పరిధిలోని ఏటిపాయలో ఇసుక అక్రమ రవాణా సాగుతుందన్న సమాచారంతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, పోలీసు శాఖలు సంయుక్తంగా బుధవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించాయి. దాడుల్లో అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఆరు ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేశారు. ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్లలో రవాణా చేస్తున్న 20 టన్నుల ఇసుక సీజ్ చేశారు. అక్రమ రవాణాకు పాల్పడ్డ మద్దూరు గ్రామానికి చెందిన వల్లభనేని దేవునిదయ, వల్లభనేని కోటేశ్వరరావు, వల్లభనేని గోపాలరావు, పోతాబత్తిన హేమంత్‌కుమార్, గోసాల గ్రామానికి చెందినన వల్లభనేని మల్లికార్జునరావు, వణుకూరుకు చెందిన బడుగు తరుణ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి వాహనాలను కంకిపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో ఎస్ఈబీ ఎస్ఐ ఎం. దుర్గాప్రసాద్, కంకిపాడు అదనపు ఎస్ఐ డి.ఎస్. తాతాచార్యులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

విజయవాడస్పోర్ట్స్: మద్యం మత్తులో స్నేహితుడిని రాయితో కొట్టి హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.శేషయ్య బుధవారం తీర్పు చెప్పారు. నరేష్ బహదూర్ బోగాటి, ప్రకాష్ సింగ్ అలియాస్ ప్రకాష్ బహదూర్ అలియాస్ తోలరాజు స్నేహితులు. వారిద్దరూ వాచ్‌మన్లుగా పని చేసేవారు. 2016 జూలై పదో తేదీన స్నేహితులు ఇద్దరూ, మరో ఇద్దరితో కలిసి ఇబ్రహీంపట్నం సెంటర్‌లో మద్యం తాగారు. వారితో కలిసిన మద్యం తాగిన ఇద్దరు కొంత సమయం తరువాత అక్కడి నుచి వెళ్లిపోయారు. అనంతరం ఇంకా మద్యం తాగేందుకు డబ్బులు కావాలని నరేష్ బహదూర్‌ను ప్రకాష్ సింగ్ అడిగాడు. నరేష్ బహదూర్ డబ్బులు ఇవ్వలేదు. దీంతో ఆగ్రహించిన ప్రకాష్ సింగ్ రాయి తీసుకుని నరేష్‌పై దాడి చేశాడు. తలపై తీవ్ర గాయాలైన నరేష్‌ను జాకీర్ హుస్సేన్ కళాశాల మైదానం ఎదురుగా జాతీయ రహదారి పక్కనే వదిలేసి ప్రకాష్ సింగ్ వెళ్లిపోయాడు. సమీపంలోని వ్యక్తులు 108 సాయంతో నరేష్‌ను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి నరేష్ మరుసటి రోజు మృతి చెందాడు. ఈ ఘటనపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి అదే నెల 15వ తేదీన నిందితుడు ప్రకాష్‌సింగ్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.పుల్లారెడ్డి కోర్టుకు వాదనలు వినిపించారు. 14 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు ప్రకాష్‌సింగ్‌కు జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

దుర్గమ్మ సన్నిధిలో క్రోధి వేడుకలు



విలేకరులతో మాట్లాడుతున్న దుర్గగుడి ఈఓ రామరావు, వైదిక కమిటీ సభ్యులు తదితరులు

- 9 నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు
- ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కొలువైన ఇంద్రకీలాద్రిపై ఈ నెల తొమ్మిదో తేదీన క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు తెలిపారు. ఈ వేడుకలను పురస్కరించుకుని అమ్మవారికి స్నపనాభిషేకం, విశేష పూజలతో పాటు పంచాంగ పఠనం జరుగుతుందని పేర్కొన్నారు. తొమ్మిదో తేదీ నుంచి 27 వరకు పండుగలు, పర్వదినాలు ఉన్న నేపథ్యంలో బుధవారం దేవస్థానం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈఓ రామరావు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, రంగావఝ్జల శ్రీనివాసశాస్త్రి, ఈఈ ఎల్.రమా, ఏఈఓ ఎన్.రమేష్‌బాబు ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈఓ రామరావు ఉత్సవాలు, ప్రత్యేక పూజా వివరాలను వివరించారు. తొమ్మిదో తేదీన క్రోధి నామ సంవత్సరాదిని పురస్కరించుకుని తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, అలంకరణ, నిత్య పూజల అనంతరం ఉదయం ఎనిమిది గంటలకు భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. ఉగాది పర్వదినం నేపథ్యంలో పండుగ శోభ ఉట్టి పడేలా అమ్మవారి ఆలయాన్ని మామిడి తోరణాలు, అరటి పిలకలతో అందంగా అలంకరిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై పంచాంగ పఠనం జరుగుతుందన్నారు. సాయంత్రం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు వెండి రథంపై నగర వీధుల్లో విహరిస్తారని పేర్కొన్నారు.

చైత్రమాస వసంత నవరాత్రులు

చైత్రమాస వసంత నవరాత్రులను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి విశేష పుష్పార్చన జరుగుతుందని ఈఓ రామరావు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి విగ్రహం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి పుష్పాలతో విశేష అర్చన జరుగుతుందని పేర్కొన్నారు. అమ్మవారికి రోజుకో విశేషమైన పుష్పాలతో అర్చన జరుగుతుందని, ఈ సేవలో భక్తులు భాగస్వాములు కావచ్చని సూచించారు. సేవలో పాల్గొనే వారు రూ.2500 టికెటు కొనుగోలు చేయాలని తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు సేద తీరేందుకు పందిళ్లలో కూలర్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇక దాహార్తిని తీర్చేందుకు పలు ప్రాంతాల్లో వాటర్ కూలర్లు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. మరో వైపున ఆలయ ప్రాంగణంలో దాతలు, భక్తుల సహకారంతో మజ్జిగ వితరణ చేస్తున్నామన్నారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ అమ్మవారికి జరిగే విశేష పుష్పార్చనలో భక్తులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

రైతులు జమ చేసిన డబ్బుతో సొసైటీ కార్యదర్శి పరారీ!

రెడ్డిగూడెం: మండల పరిధిలోని శ్రీరామపురం సొసైటీలో రైతులు చెల్లించిన బకాయిలు సుమారు రూ.30 లక్షలతో కార్యదర్శి దాస్ పరారైనట్లు సమాచారం. మార్చి నెలాఖరు కావడంతో సొసైటీలో రుణాలు పొందిన రైతులు అప్పులను తిరిగి చెల్లించారు. రైతులు చెల్లించిన డబ్బులను సొసైటీ కార్యదర్శి దాస్ విస్సన్నపేట కేడీసీసీ బ్యాంకులో జమచేయాల్సి ఉంది. మార్చి 31వ తేదీ ఆదివారం, ఏప్రిల్ ఒకటో తేదీ బ్యాంకులకు సెలవు కావడంతో రెండో తేదీన జమ చేయాల్సి ఉంది. సొసైటీ కార్యదర్శి దాసు రైతులు చెల్లించిన మొత్తాన్ని బ్యాంకులో జమచేయలేదు. సొసైటీ విధులకు హాజరుకాలేదు. అధికారులు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్లు తేలింది. విస్సన్నపేట కేడీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీప్రసాద్, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఇతర సిబ్బంది బుధ వారం శ్రీరామపురం సొసైటీ కార్యాలయానికి చేరుకుని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులు చెల్లించిన మొత్తానికి రసీదులు సక్రమంగానే ఉన్నా యని, బ్యాంకులో మాత్రం నగదు జమచేయలేదని బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలిస్తున్నామని సొసైటీ కార్యదర్శి దాస్‌పై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. తమకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కృష్ణా జిల్లాను రక్తహీనత రహితంగా మారుద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో గీతాభాయి

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాను రక్తహీనత రహితంగా మార్చేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. తన కార్యాలయంలో పట్టణ, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ సిబ్బందితో డీఎంహెచ్ఓ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ గీతాబాయి మాట్లాడుతూ.. సిబ్బంది అందరూ రక్తహీనత రహిత జిల్లాగా మార్చేందుకు నూరుశాతం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో మాతృ, శిశు మరణాలను పూర్తిస్థాయిలో తగ్గించాలన్నారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు, సేవలు, కౌమారదశ, పిల్లల్లో రక్తహీనత నివారణ కోసం ఎర్ర మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లలో పనిచేసే సిబ్బందిని తప్పనిసరిగా హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీలో నమోదు చేయించాలని ఆదేశించారు. షెడ్యూలు ప్రకారం గర్భిణులు, చంటి బిడ్డలకు వ్యాధి నిరోధక టీకాలను అందించాలన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని రాబోయే మూడు నెలలు వడదెబ్బ వాటి వల్ల వచ్చే పర్యవసానాలపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకుని అవసరమైన వారికి అందజేయాలని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా నిర్వహించే క్యాంపుల్లో సిబ్బంది సమూహంగా పాల్గొని ఆ ప్రాంతంలోని ప్రజలందరికీ ఫ్యామిలీ డాక్టర్ విధానంపై అవగాహన కల్పించి వైద్యసేవలు అందించాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సీతాకుమారి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ బి.రామారావు, ఫ్యామిలీ డాక్టర్ నోడల్ అధికారి డాక్టర్ విజయ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమికి బుద్ధి చెప్పండి

ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)



టీడీపీ నాయకులకు కుండవా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో అమలైన సంక్షేమ పాలనను చూసి ఎంతో మంది ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. కరుడుకట్టిన టీడీపీ నాయకులు సైతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని పేర్కొన్నారు. పట్టణంలోని 48వ డివిజన్‌లో టీడీపీ సీనియర్ నాయకులకు ఆయన బుధవారం పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లకు సూచించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన మాజీ కౌన్సిలర్ రామకృష్ణ మాట్లాడుతూ.. టీడీపీ ఆవిర్భావం నుంచి పలు పదవులు నిర్వహించానని, 1992లో కాపునాయకుడు ముద్రగడ పద్మనాభం నిర్వహించిన సైకిల్ యాత్రలో కూడా పాల్గొన్నానని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన తనను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. ఆయన వంటి గొప్ప నాయకుడ్ని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), డివిజన్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తులను అలరించిన భక్తిరంజని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై బుధవారం సాయంత్రం ఆలపించిన భక్తిరంజని భక్తులను అలరించింది. బుధవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన ఎస్.సురేఖ పలు అమ్మవారి కీర్తనలను ఆలపించారు. సురేఖకు రేవేష్ వయోలిన్, జగన్మోహిని మృదంగంపై చక్కటి సహకారం అందించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ధర్మపథం వేదిక వద్దకు చేరుకుని భక్తి గీతాలను ఆస్వాదించారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ఆలయాల పునఃప్రతిష్ఠ



ఉయ్యూరు: పట్టణంలో వేణుగోపాల స్వామి, శ్రీ పంచపట్టాభిరామస్వామి ఆలయాల పునఃప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా కొనసాగుతున్నాయి. శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయాలు జీర్ణదశకు చేరుకోవటంతో దేవదాయశాఖ, పాలక మండలి సంయుక్తంగా దాతల సహకారంతో పునర్నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులు పూర్తి కావటంతో ఈనెల 4న ప్రతిష్ఠా కార్యక్రమానికి ముహూర్తం నిర్ణయించారు. ఈ నేపథ్యంలో యాగశాలలో గత నెల 31వ తేదీ నుంచి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆగమ పండితుడు డాక్టర్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి పర్యవేక్షణలో బుధవారం విశేష హోమాలు జరిపించారు. ఆలయ చైర్మన్ లోయ చింతయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు సతీ సమేతంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

జెడ్పీ హైస్కూల్లో ఐఎఫ్పీ బోర్డుల చోరీ



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని జెడ్పీ హైస్కూల్లో ఐఎఫ్పీ డిస్‌ప్లే బోర్డులు చోరీకి గురయ్యాయి. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అవగాహన చేసుకునేందుకు వీలుగా రెండు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్పీ) డిస్‌ప్లే బోర్డులను ప్రభుత్వం పంపిణీ చేసింది. పాఠశాలలోని తరగతి గదుల్లో బిగించిన ఈ ఐఎఫ్పీ డిస్‌ప్లే బోర్డులను దుండగులు మంగళవారం అర్ధరాత్రి సమయంలో అపహరించారు. గది తాళాలు బద్దలుకొట్టి బోర్డులను ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు విషయాన్ని గుర్తించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్. పద్మజ ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ ఘటనాస్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం సీసాలు స్వాధీనం

పెనమలూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వణుకూరు ఆంజనేయస్వామివారి గుడి ప్రాంతానికి చెందిన బడుగు శ్రీనివాసరావు అక్రమంగా మద్యం విక్రయిస్తుండటంతో అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 10 మద్యం సీసాలు, రూ.1,500 నగదు స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని తెలిపారు.

తెలంగాణమద్యం పట్టివేత

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇన్నర్ రింగ్ రోడ్ సమీపంలో వాహనాల తనిఖీల్లో భాగంగా ఒక వ్యక్తిని గుణదల పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 17 తెలంగాణా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం ఇన్నర్‌రింగ్ రోడ్డు సమీపంలో గుణదల పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఇంతలో చేతిలో ఒక సంచితో వస్తున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఎస్ఐ వెంకట్రావు సిబ్బందితో కలిసి సదరు వ్యక్తిని పట్టుకుని సంచిని పరిశీలించగా తెలంగాణాకు చెందిన 17 మద్యం సీసాలు కనిపించాయి. వివరాలు అడగ్గా తన పేరు చంద్రపాటి నరేంద్రబాబు అని ఒంగోలులో ఉంటున్నట్లు ఒక ఫార్మా కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. తనకు మద్యం సేవించే అలవాటు ఉండటంతో తాను కరీంనగర్‌లో 17 బీరు బాటిళ్లు కొనుగోలు చేసి విజయవాడలోని స్నేహితుడి ఇంటికి వెళ్తున్నట్లు తెలిపారు. గుణదల పోలీసులు మద్యం సీసాలను సీజ్‌చేసి కేసు నమోదు చేశారు.

మా ఉసురు చంద్రబాబుకు తగులుతుంది

- ఐదేళ్లుగా ప్రశాంతంగా ఫించన్ తీసుకుంటున్నాం
- ఇప్పుడు తిరగలేక చస్తున్నామంటూ వృద్ధుల ఆవేదన
- తూర్పులో వంద సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభం



కృష్ణలంకలో పింఛన్ కోసం సచివాలయానికి వస్తున్న వృద్ధులు

సాక్షి నెట్‌వర్క్, విజయవాడతూర్పు: ఐదేళ్లుగా ప్రశాంతంగా పింఛన్లు తీసుకుంటున్నాం. ప్రతి నెలా మొదటి తేదీనే వలంటీర్ ఇంటికొచ్చి తలుపు తట్టి పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడు సచివాలయాల చుట్టూ తిరగలేక పోతున్నాం. మా ఉసురు చంద్రబాబుకు తగులుతుందని పింఛన్ తీసుకునేందుకు సచివాలయాలకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పేర్కొంటున్నారు. ఆయన దుర్మార్గపు రాజకీయాల కోసం మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారంటూ మండిపడుతున్నారు. పేదలను ఇబ్బంది పెట్టడం చంద్రబాబుకు అలవాటేనని పెన్షన్‌దారులు అంటున్నారు. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా ఎప్పుడు పింఛన్ ఇస్తారో తెలియక పడుగాపులు పడేవాళ్లమంటున్నారు. కానీ వైఎస్ జగన్ తమ కష్టాలు తొలగిస్తూ వలంటీర్లను పెట్టి పింఛన్ పంపిణీ చేశారని అంటున్నారు.

పాపం ఊరికినే పోదు..

వృద్ధులను ఇబ్బందులకు గురిచేసిన పాపం ఊరికినే పోదని, చంద్రబాబు మట్టికొట్టుకుపోతారని వృద్ధులు అంటున్నారు. లోఫర్ రాజకీయాలు చేయడం ఆయనకు అలవాటేనని, నిమ్మగడ్డ రమేష్‌తో ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయించడంతో మేము కష్టాలు పడాల్సి వస్తుందని మండిపడుతున్నారు. అసలే ఎండాకాలం ఇంటి నుంచి బయటకు రాలేక పోతున్నాం. చంద్రబాబు చేసిన దుర్మార్గపు పనికి ఇబ్బంది పడుతున్నాం అంటూ వృద్ధులు, దివ్యాంగులు శాపనార్థాలు పెడుతున్నారు.

ఉదయం నుంచే పడిగాపులు..

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో వంద వార్డు సచివాలయాలు ఉండగా, ఉదయం నుంచే పింఛన్‌దారులు పడుగాపులు కాశారు. మండుటెండలో కూర్చునేందుకు సైతం సరైన స్థలం లేక ఇబ్బందులు పడ్డారు. మళ్లీ మాకు ఐదేళ్ల కిందట పడిన నరకం గుర్తొస్తుందని పలువురు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఆకలి ఆయనకు ఏమి తెలుసని పలువురు శాపనార్థాలు పెట్టారు. కాగా బ్యాంకుల నుంచి నగదు తీసుకు వచ్చిన సచివాలయ సిబ్బంది ఒక్కొక్కరికీ పింఛన్ పంపిణీ చేయడం ప్రారంభించారు.



పింఛన్ కోసం వస్తున్న వృద్ధుడు



నాలుగున్నరేళ్లలో ఇబ్బంది లేదు

గడిచిన నాలుగున్నరేళ్లలో పింఛన్ కోసం ఎప్పుడూ ఇబ్బంది పడలేదు. ఇంటి నుంచి కాలు కదపకుండా సూర్యోదయాన్నే వలంటీర్ చేతికి పింఛన్ ఇచ్చే వారు. వలంటీర్లపై ఫిర్యాదు చేసే ముందు దాని వల్ల ఇబ్బందులు ఎవరెవరికి వస్తాయో తెలియని వాళ్లు రాజకీయాల్లోనూ.. పెద్ద పెద్ద హోదాల్లోనూ ఉండటం మన రాష్ట్రం చేసుకున్న దౌర్భాగ్యం. మా ఇబ్బందులకు కారణమైన వ్యక్తులకు అంతకంతకు కచ్చితంగా ఇబ్బందులు పడతారు.

-గొల్లపల్లి మేరి, గుణదల



జగన్ మరలా సీఎం కావాలి..

నా వయస్సు 63 సంవత్సరాలు. ప్రతి నెల పింఛన్‌ను వలంటీర్ మా ఇంటి వద్దకు తెచ్చి 1వ తేదీనే ఉదయాన్నే అందజేసేవారు. టీడీపీ నాయకుల ఫిర్యాదుతో ఈ నెల సచివాలయం వద్ద పింఛన్ ఇస్తున్నారు. పింఛన్ కోసం సచివాలయం వద్ద పడిగాపులు పడాల్సి వస్తుంది. సచివాలయానికి ఉదయం నుంచి ఐదు సార్లు తిరిగాను. ఎండకు వడదెబ్బ తగులుతుందోనని భయమేస్తోంది. ఇంటికే సంక్షేమ పథకాలు అందాలంటే మరలా వైఎస్ జగన్ సీఎం కావాలి.

- సూరసాని బ్రహ్మారెడ్డి, సంగుల పేరయ్య వీధి, రాణిగారితోట

తలుపుతట్టి పింఛన్ ఇచ్చేవారు..



ప్రతి నెల ఒకటో తేదీన వలంటీర్ పింఛన్ తీసుకొని ఇంటికి వచ్చేవారు. తలుపుతట్టి మరీ ఇచ్చేవారు. ఎండలో నడుచుకుంటూ సచివాలయానికి రాలేక ఇబ్బందిపడ్డా. ఆపసోపాలు పడి రావాల్సి వచ్చింది. స్థానికుల సహకారంతో అగసాట్లు పడుతూ వచ్చాను. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్‌లు ఠంఛన్‌గా ఇచ్చారు. టీడీపీ వాళ్ల ఫిర్యాదు చేయడం వల్ల ఈ కష్టాలు వచ్చాయి. మా ఉసురు వారికి తప్పకుండా తగులుతుంది.

- ఎం.పద్మావతి, వీఎంఆర్ రోడ్డు, రామలింగేశ్వరనగర్

'పేదలంటే చంద్రబాబుకు చులకనభావం'

లబ్బీపేట(విజయవాడతూర్పు): పేదలంటే చంద్రబాబుకు ఎప్పుడు చులకన భావన అని, ఆ విషయం పలు మార్లు ఆయన మాటల్లోనే వెల్లడైందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి చందా కిరణ్‌తేజ అన్నారు. మాచవరంలో బుధవారం ఆయన మీడియాతో మట్లాడుతూ.. ప్రతి నెలా వృద్ధులు, దివ్యాంగులు, వితంతుల ఇంటికెళ్లి తలుపు తట్టి పింఛన్ అందజేస్తుంటే, తన మనిషి నిమ్మగడ్డ రమేష్‌తో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్ల సేవలు నిలుపుదల చేయించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శింగనమల నియోజకవర్గంలో టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే అభ్యర్థిగా టిక్కెట్ ఇస్తే, దానిని కూడా చంద్రబాబు అవహేళన చేస్తూ మాట్లాడారన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మీడియా సాక్షిగా ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అన్న విషయం తెలిసిందేనన్నారు. ఇలా చంద్రబాబు దళితులు, పేదల పట్ల తన అసూయ, చులకన భావాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు మరోసారి పరాభవం తప్పదని, ఇదే పేదలు ఆయనను సొంత రాష్ట్రం తెలంగాణా పంపించేందుకు సిద్ధంగా ఉన్నారని చందా కిరణ్ తేజ తెలిపారు.

9న ఉగాది పంచాంగ శ్రవణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 9వ తేదీన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రామకృష్ణాపురం శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో భారతీయ సంస్కృతీ పరిరక్షణ సమితి ఆధ్వర్యాన ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.గోపీచంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు మైసూర్ దత్త పీఠం ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ క్రోవి పార్థసారథి ఉగాది పంచాంగ శ్రవణం చేస్తారన్నారు. భక్తులు పంచాంగ శ్రవణంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రాష్ట్రానికి పట్టిన శాపం

- సీఎం జగన్ జనరంజక పాలనలో సంతోషంగా ప్రజలు
- ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్



21వ డివిజన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ కేశినేని నాని, దేవినేని అవినాష్, కార్పొరేటర్లు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రాష్ట్రానికి పట్టిన శాపం అని ఎంపీ కేశినేని నాని, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంక, 21వ డివిజన్‌లోని రణధీర్‌నగర్ కరకట్ట ప్రాంతంలో బుధవారం ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని గత ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అడుగడుగునా హారతులతో ఎంపీ కేశినేని నాని, దేవినేని అవినాష్‌లకు డివిజన్ ప్రజలు ఘన స్వాగతం పలికారు.

పేదలకు చంద్రబాబు ద్రోహం చేశారు..

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ.. గడప గడపలో జగన్ ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రాష్ట్రంలో వలంటీర్ల ద్వారా ప్రతి నెల ఒకటో తేదీన సీఎం జగన్ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు వారి ఇళ్ల వద్దే పెన్షన్స్ ఇస్తుంటే ఓర్వలేక చంద్రబాబు కుట్ర చేశారన్నారు. పేదలకు పింఛన్లు అందకుండా చేసి పేదలకు చంద్రబాబు ద్రోహం చేశారని విమర్శించారు. చంద్రబాబు అండ్ కో అందరూ కలిసి వలంటీర్లు, పేదలపై కక్ష కట్టి పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకున్నారన్నారు. పేదలంటే చంద్రబాబుకు అసహ్యభావం, హేళన, ఎగతాళి అని, ఈ రాష్ట్రంలో సుఖంగా ఉండకూడదనేదే చంద్రబాబు లక్ష్యమన్నారు. సామాన్యుడైన టిప్పర్ డ్రైవర్‌కి జగన్ సీట్ ఇస్తే చంద్రబాబు చులకనగా మాట్లాడుతూ హేళన చేస్తున్నారని మండిపడ్డారు. పేదల మీద చిత్తశుద్ధితో రూ.2లక్షల 60 వేల కోట్లు సంక్షేమం కోసం వెచ్చించి దేశంలోనే రికార్డు సృష్టించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఎమ్మెల్యే కాకుండానే దాదాపు రూ.500 కోట్లతో ఈ ప్రాంతానికి రిటైనింగ్ వాల్ నిర్మించి దేవినేని అవినాష్ అండగా నిలిచాడని తెలిపారు. గత 10 ఏళ్లలో ఇక్కడ ఎమ్మెల్యే ఈ ప్రాంతంలో చేసింది, సాధించింది శూన్యమన్నారు. చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా ద్వారా జగన్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. దేవినేని అవినాష్ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు.

ఇళ్ల పట్టాలు అందిస్తాం..

ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే ఎవరో తెలియని పరిస్థితి నియోజకవర్గంలో నెలకొందన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పుకోగలరా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఏ విధంగా ప్రజలను మోసం చేస్తున్నాడో, నిజమేంటో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చే బాధ్యత తమదేనన్నారు. పేదలకు హెల్త్ క్లినిక్‌ల ద్వారా 140 రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని నానిని ఆశీర్వదించాలని కోరారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు పుప్పాల కుమారి, కొండారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి వైఎస్ జగన్



4వ డివిజన్ అంబేడ్కర్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని సుధీర

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో కులం, మతం, రాజకీయాలు చూడకుండా, అన్ని వర్గాలకు చెందిన పేదలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు చేశారని వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి అన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె బుధవారం 10వ డివిజన్ పీఅండ్‌టీ కాలనీ, 13వ డివిజన్ మెగా టౌన్‌షిప్ ప్రాంతాల్లో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేసిన దేవినేని అవినాష్, పార్లమెంటు సభ్యునిగా కేశినేని శ్రీనివాస్‌లను గెలిపించాలని ఆమె కోరారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో సైతం నియోజకవర్గంలోని ప్రజలకు అన్ని రకాలుగా అండగా నిలిచారని, ప్రజలకు అందుబాటులో ఉండేదెవరో, మంచి ఎవరు చేశారో గుర్తించి ఓట్లు వేయాలని ఆమె కోరారు. తాము నియోజకవర్గ ప్రజలకు చేసిందే చెబుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట 10వ డివిజన్ ఇన్‌చార్జి కరుటూరి హరీష్, 13వ డివిజన్ ఇన్‌ఛార్జి రామాయణపు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

దేవినేని సుధీర విస్తృతంగా ప్రచారం..

దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర బుధవారం పలు ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా నాలుగో డివిజన్ అంబేడ్కర్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిచారు. ప్రజలకు అన్ని వేళలా అండగా ఉండే అవినాష్‌ను,కేశినేని శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. ఏ సమస్య ఉన్న తక్షణమే స్పందించి పరిష్కరించే వారిని ఆదరించాలన్నారు. ఆమె వెంట నాలుగో డివిజన్ పార్టీ అధ్యక్షుడు గల్లా రవి, కో ఆప్షన్ సభ్యుడు ముసునూరు సుబ్బారావు, 8వ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్ తదితరులు ఉన్నారు.

టీడీపీ నేత నిర్వాకంపై ఆందోళన



బాపులపాడు సీఎస్ఐ చర్చి వద్ద ఆందోళన చేస్తున్న సంఘ సభ్యులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక బాపులపాడు పరిశుద్ధ సీయోను సీఎస్ఐ దేవాలయం సంఘస్తులు బుధవారం ఆందోళనకు దిగారు. చర్చి పునర్నిర్మాణం కోసం దాతల నుంచి సేకరించిన విరాళాలను సంఘ సభ్యుడు, టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు పెద్ద ఎత్తున గోల్‌మాల్ చేశారని ఆరోపించారు. విరాళాలు అందించిన దాతల వివరాలు, చర్చి నిర్మాణ ఖర్చుల వివరాలు తెలియజేయకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సీఎస్ఐ చర్చి బిషప్‌కు సంఘస్తులు ఫిర్యాదు చేశారనే అక్కసుతో ఇప్పుడు ఏకంగా చర్చి నిర్మాణ పనులను అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారని సంఘస్తులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సీఆర్‌డీఏ అనుమతి లేకుండా చర్చి నిర్మాణం జరుగుతుందంటూ దయాల రాజేశ్వరరావు తన సొంత బావమరిది డొప్పల జయప్రకాష్‌ను అడ్డుపెట్టుకుని న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తీసుకువచ్చారని దుయ్యబట్టారు. దీంతో ప్రస్తుతం నూతన చర్చిను అధికారులు సీజ్ చేశారని సంఘస్తులు వాపోయారు. చర్చి నిర్మాణానికి అన్ని రకాల అనుమతులు తీసుకున్నామని గతంలో చెప్పినా దయాల రాజేశ్వరరావు ఇప్పుడు దుర్భుద్ధితో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సుదీర్ఘ చరిత్ర కలిగిన బాపులపాడు పరిశుద్ధ సీయోను సీఎస్ఐ దేవాలయం సంఘస్తులకు ఇప్పుడూ ప్రార్థనా మందిరం లేకపోవటంతో నడిరోడ్డుపై నిలబడ్డామని వాపోయారు. చర్చి పునర్నిర్మాణ కమిటీకి సారథ్యం వహించిన దయాల రాజేశ్వరరావు నిర్వాకం వల్లే నేడు ఈ దుస్థితి వచ్చిందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ గోడును అర్థం చేసుకుని ప్రార్థనా మందిరంలోకి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు గుర్తింపు



నవభారతిని సత్కరిస్తున్న విద్యార్థులు

గన్నవరం: ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు, టీచర్స్ సంఘానికి దాసరి నవభారతి అందించిన సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక చింతలపేట ఎంపీపీ పాఠశాలలో బుధవారం ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయురాలు దాసరి నవభారతి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను యూటీఎఫ్ సంఘ నేతలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు సత్కారించారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ రంగంలో 40 ఏళ్ల పాటు నవభారతి సుదీర్ఘమైన సేవలందించారని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఆమె రాజీలేని పోరాటాలు చేశారని గుర్తుచేశారు. జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనేది ఆమెను చూసి నేర్చుకోవచ్చాని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎంఈఓ-1, 2లు కె.రవికుమార్, కమల, విశ్రాంత ఎంఈఓ జయబాబు, విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లెనిన్‌బాబు, జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

కంకిపాడు: వేల్పూరు శివారు లక్ష్మీపురం ప్రధాన రహదారి నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఈ రహదారిని అభివృద్ధి చేయాలని విన్నవించారు. దీంతో అభివృద్ధి పనులకు అధికారులు అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.9 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.8 లక్షలు రోడ్డు అభివృద్ధికి కేటాయించారు. రూ.17 లక్షలతో తారురోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. పనులను పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, స్థానిక వైఎస్సార్ సీపీ నేత చెన్నుబోయిన సుబ్బారావు బుధవారం పరిశీలించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు.

ఔషధ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

రామవరప్పాడు: అన్ని రంగాల్లో ఔషధ రంగం అత్యుత్తమైనదని, నానాటికీ ఈ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని సీఈఎంఎస్ అకడమిక్ లీడర్ బిజినెస్ అడ్వైజర్ డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో 15వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మురళీ కృష్ణ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఫార్మా విద్యార్థులు పరిశోధనలు చేసి నూతన ఔషధాలు తయారు చేయాలని సూచించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రమీల రాణి మాట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుత పరిస్థితుల్లో సమర్థవంతమైన ఔషధాలను ఫార్మసిస్టులు తయారు చేయగలుగుతున్నారన్నారు. అనంతరం పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల నిర్వాహకుల తరుపున విజయలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ఎస్ఆర్ఆర్ విద్యార్థులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): పీబీ సిద్ధార్థ కళాశాలలో తెలుగు భాషపై పట్టు.. చూపెట్టు పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటడం ఆనందంగా ఉందని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు భాషపై పట్టు.. చూపెట్టు పోటీల్లో విజేతల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థిని కీర్తన లేఖ రచన విభాగంలో ద్వితీయ స్థానం సాధించిందన్నారు. అలాగే కళాశాల నుంచి పోటీల్లో పాల్గొని విజయం సాధించిన వారితో పాటు ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులను అభినందించారు. మిగతా విద్యార్థులు విజేతలను స్ఫూర్తిగా తీసుకుని పోటీల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె.వి.శాంతకుమారి, ఏ.భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మాన్ని గెలిపించండి

పూతలపట్టు సభలో ప్రజలకు సీఎం వైఎస్ జగన్ పిలుపు

> ఒక మనిషి జీవిత కాలంలో ప్రతి రోజూ ఎంతో విలువైనది. ఇందులో భాగంగా వచ్చే 5 సంవత్సరాలు అంటే 1,825 రోజులు.. మీ భవిష్యత్ ఎవరి చేతిలో పెట్టాలన్నది ఆలోచించండి. ఎవరి వల్ల మంచి జరుగుతుందో ఆలోచించి మీ ఓటు వేయండి. అవ్వాతాతలు, పిల్లలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు.. ఇలా అందరూ కలిసి మాట్లాడి నిర్ణయం తీసుకోండి. ఈ ఐదేళ్లలో, అంతకు ముందు బాబు పాలనలో ఐదేళ్లలో.. ఏం మంచి జరిగిందో చర్చించండి. ఎవరి హయాంలో మీ కుటుంబం బాగుపడిందో గమనించండి. అప్పుడు – ఈ ఐదేళ్లలో మీ బ్యాంకు స్టేట్‌మెంట్‌నూ పరిశీలించండి. మీరు వేసే ఓటు ఎమ్మెల్యేలు, ఎంపీలను మాత్రమే ఎన్నుకోవడానికి కాదని, ఇది మీ తల రాతలు మార్చే ఓటు అని గుర్తుంచుకోండి.
>
> - సీఎం వైఎస్ జగన్



సభాస్థలి వద్ద ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

సాక్షి, తిరుపతి : 'విశ్వసనీయత ఒకవైపు, మోసం మరోవైపు.. నిజం ఒకవైపు, అబద్ధం మరో వైపు.. ఇంటింటి ప్రగతి ఒకవైపు, తిరోగమనం మరోవైపు.. ప్రతి ఇంట్లో అభివృద్ధి ఒకవైపు, అసూయ మరో వైపు.. మంచి ఓవైపు, చెడు మరో వైపు.. వెలుగు ఓ వైపు, చీకటి మరో వైపు.. ధర్మం ఓ వైపు, అధర్మం మరోవైపు.. ఇలా విశ్వసనీయత, మోసం అనే రెండింటిలో ఎటు వైపు మొగ్గాలన్న దానిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. ధర్మాన్ని గెలిపించాలి' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను కోరారు. ఈ ఎన్నికలు జగన్‌కు, చంద్రబాబు నాయుడుకు మధ్య యుద్ధం కాదని, ఒక హాబిట్యువల్ అఫెండర్ అంటే ప్రజలను మోసం చేయడమే అలవాటుగా పెట్టుకున్న చంద్రబాబుకు, ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధమని చెప్పారు. ఈ యుద్ధంలో మీ బిడ్డ జగన్ ప్రజల పక్షం అని చెప్పడానికి గర్వపడుతున్నానన్నారు. బుధవారం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సాగిన మనమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా ఏడవ రోజు ఆయన చిత్తూరు జిల్లా పూతలపట్టులో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఇంటింటి ప్రగతి, ఇంటింటి అభివృద్ధి, ఇంటింటికి మంచి, పిల్లల భవిష్యత్తు కోసం పరితపిస్తూ మనందరి ప్రభుత్వం ఓవైపు ఉంటే.. ఒకసారి కాదు.. గతంలో మూడుసార్లు అధికారంలో ఉన్నా కూడా.. అబద్ధం, మోసం, అన్యాయం, తిరోగమనం, చెడు, చీకటినే ప్రజలకు రిటర్న్ గిఫ్ట్‌గా ఇచ్చిన చంద్రబాబు బృందం మరోవైపున మన కళ్ల ఎదుటే కనిపిస్తోందన్నారు. ఈ యుద్ధంలో చంద్రబాబు, ఓ దత్తపుత్రుడు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5, వీరందరూ కాక ఈ రాష్ట్రాన్ని విడగొట్టిన పార్టీ, ఈ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా అన్యాయం చేసిన మరో పార్టీ ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్ర ప్రజలను వ్యతిరేకించే పక్షంగా చంద్రబాబు పక్షాన నిలిచారని చెప్పారు. మీ బిడ్డ ఒక్కడిపై వీరందరూ యుద్ధం చేస్తున్నారని, ఈ యుద్ధంలో ధర్మాన్ని గెలిపించడానికి అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 175కు 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ స్థానాలకు 25 ఎంపీ స్థానాలు గెలిపించుకుని డబుల్ సెంచరీ సర్కార్‌ను స్థాపిద్దామని చెప్పారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

చంద్రముఖిని పెట్టెలో బిగిద్దాం

- మనం వేసే ఈ ఓటుతో మన తలరాతలు మారతాయి. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి విషయం చెప్పండి. జగనన్ననే మళ్లీ తెచ్చుకోవాలి.. జగనన్నే మళ్లీ వస్తే మళ్లీ వలంటీర్ నేరుగా మీ ఇంటికి వస్తాడు.. ప్రతి పథకం నేరుగా మీ ఇంటికే వస్తుంది.. అని చెప్పండి. ప్రతి ఇంట్లో నుంచి స్టార్ క్యాంపెయినర్లును బయటకు రావాలి. జరిగిన మంచి గురించి ప్రతి ఒక్కరూ మరో వంద మందికి చెప్పి రెండు బటన్లు ఫ్యాను మీద నొక్కేలా చూడాలి. చంద్రబాబు నాయుడు అనే చంద్రముఖిని పెట్టెలో బిగించి మళ్లీ లక లక లక అంటూ మన రక్తం తాగేందుకు రాకుండా జాగ్రత్త పడాలి.
- ఎన్నికల సంగ్రామంలో అబద్ధాన్ని, మోసాన్ని మట్టి కరిపించడానికి నేను సిద్ధం. మరి మీరంతా కూడా సిద్ధమా.. (సిద్ధమే అని కేకలు). అలాగైతే సెల్ ఫోన్లు బయటకు తీసి.. టార్చ్ లైట్ బటన్ ఆన్ చేయండి. (ప్రజలందరూ సెల్‌లో టార్చ్ లైట్ ఆన్ చేసి పైకి ఎత్తి చూపించారు).
- చిత్తూరు జిల్లా నుంచి మీ ఎంపీ అభ్యర్థి రెడ్డప్ప, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్, పలమనేరు ఎమ్మెల్యేగా వెంకటే గౌడ, చంద్రగిరి నుంచి భాస్కర్‌రెడ్డి కొడుకు, యువకుడు, ఉత్సాహవంతుడు మోహిత్, జీడీ నెల్లూరు నుంచి మన డిప్యూటీ సీఎం నారాయణ స్వామి కూతురు కృపాలక్ష్మి, చిత్తూరు నుంచి విజయ్, నగరి నుంచి నా చెల్లెలు రోజమ్మ, కుప్పం నుంచి మీ వాడు, మీ లోకల్, మీ బీసీ సామాజిక వర్గానికి చెందినవాడు, నా తమ్ముడు భరత్‌ను ఆశీర్వదించి గెలిపించండి. భరత్‌కు కేబినెట్‌లో మంత్రి పదవి ఇచ్చి మీ అందరికీ మంచి చేయిస్తాను. మన గుర్తు ఫ్యాన్ అని మరచిపోవద్దు.



'నేనున్నా... అవ్వా...' అంటూ కల్లూరులో వృద్ధురాలికి సీఎం వైఎస్ జగన్ భరోసా

మనది మనసున్న ప్రభుత్వం

- మీ బిడ్డ జగన్.. మీ గ్రామానికి, మీ ఇంటికి ఏం చేశాడన్నది ఏ గ్రామానికి, ఏ పట్టణానికి వెళ్లినా కనిపిస్తుంది. గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, నాడు–నేడుతో రూపురేఖలు మారిపోయిన ప్రభుత్వ పాఠశాల, ఇంగ్లిష్ మీడియం, విలేజ్ క్లినిక్.. ఫ్యామిలీ డాక్టర్.. ఆరోగ్య సురక్ష, ఇంటింటికీ పౌర సేవలు డోర్ డెలివరీ, ప్రతి నెలా ఒకటవ తేదీన అది సెలవు దినమైనా సరే, ఆదివారమైనా సరే.. అవ్వాతాతల ఇంటికే వెళ్లి తలుపుతట్టి చిరునవ్వుతో పింఛన్ ఇచ్చే వలంటీర్ వ్యవస్థ, ఉన్న ఊళ్లోనే అన్ని పనులు అయ్యేలా సచివాలయ వ్యవస్థ, మహిళా పోలీసు, దిశ యాప్.. ఇలా ఎన్నో కనిపిస్తాయి.
- ప్రతి గ్రామంలో ఏ ఇంట్లో ఎవరికి ఏ టెస్టులు కావాలన్నా, ఆ టెస్టులు ఉచితంగా చేయించి మందులు కూడా వాళ్ల చేతుల్లో పెట్టి ఏకంగా ఆరోగ్యశ్రీని రూ.25 లక్షల దాకా ప్రతి పేదవాడికీ అందుబాటులోకి తీసుకువచ్చింది మీ బిడ్డే. అక్కచెల్లెమ్మల పేరిట ఇచ్చిన 31 లక్షల ఇళ్ల పట్టాలతో అక్కడే నిర్మాణం అవుతున్న కాలనీలు చూస్తుంటే గుర్తుకొచ్చేది మీ బిడ్డ జగనే.
- మధ్యలో ఏ దళారి ప్రమేయం లేకుండా ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లో జమ చేశాం. లంచాలు, వివక్షకు చోటే లేదు. ఇలా 130 సార్లు బటన్ నొక్కి లబ్ధి చేకూర్చాం. ఇంతగా మేలు జరగడం తట్టుకోలేక చంద్రబాబు, ఆయన కూటమి, ఆయన పొత్తుల జెండాలు, ఆయన ఎల్లో మీడియా అసూయ పడుతోంది.



కల్లూరులో హారతి ఇచ్చి, బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు

రామరాజ్యం ఇప్పుడు చూస్తున్నాం..

వైఎస్సార్ ముద్దు బిడ్డ, సంక్షేమ సృష్టికర్త, సామాజిక న్యాయ రూపశిల్పి, మహిళా సాధికారత సాధనకర్త, రాజకీయానికే రాజసమైన మన పులివెందుల పులిబిడ్డ ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ఒక సాధారణ డాక్టర్ అయిన నాకు రాజకీయ అవకాశం కల్పించి, రెండోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చినందుకు నమస్సుమాంజలి. పాలకుడు అంటే ప్రజలను పరిపాలించే వాడు కాదు.. ప్రజల సంక్షేమాన్ని చూసుకునే నాయకుడు అని అధికార పీఠానికి కొత్తభాష్యం చెప్పిన ఆదర్శమూర్తి సీఎం జగన్. రామరాజ్యం ఎలా ఉంటుందో మేము చూడలేదు కానీ, రామరాజ్యం లాంటి రాజన్న బిడ్డ రాజ్యం ఎలా ఉంటుందో ఈ తరానికి చూపిస్తున్న నాయకుడు మన సీఎం వైఎస్ జగన్ అని గర్వంగా చెప్పగలుగుతా. మీరు మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నదే మా లక్ష్యం.

– సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, పూతలపట్టు

66.36 లక్షల మందికి పెన్షన్

- రూ.3 వేలు పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం దేశంలో ఎక్కడా లేదు. 66.36 లక్షల మందికి మనం పింఛన్ ఇస్తున్నాం. నా అవ్వాతాతలు, వితంతు అక్కచెల్లెమ్మలు, దివ్యాంగులకు అందించిన మొత్తం రూ.84,731 కోట్లు. రైతన్నలను చేయి పట్టుకుని నడిపిస్తున్నాం. 53.58 లక్షల మంది రైతన్నలకు రైతు భరోసాగా రూ.34,370 కోట్లు అందించాం. సున్నా వడ్డీగా మరో రూ.2,050 కోట్లు, ఉచిత పంటల బీమాగా రూ.7,800 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.3,261 కోట్లు ఇచ్చాం.
- 53 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు మంచి చేస్తూ వారి పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ అమ్మ ఒడి కింద రూ.26,067 కోట్లు వారి చేతుల్లో పెట్టాం. విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా 29.65 లక్షల మంది పిల్లలకు, వారి తల్లులకు మరో రూ.18 వేల కోట్లు అందించాం. వైఎస్సార్ చేయూతగా 33 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.19,189 కోట్లు ఇచ్చాం.
- ఈబీసీ నేస్తం కింద 4.95 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.1,876 కోట్లు, కాపు నేస్తం కింద 3.58 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.2,029 కోట్లు అందించాం. చంద్రబాబు మాటలు నమ్మి నష్టపోయిన పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు మేలు చేస్తూ 78.94 లక్షల పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.25,571 కోట్లు లబ్ధి చేకూర్చాం. వీరికి సున్నా వడ్డీ కింద మరో రూ.4,960 కోట్లు ఇచ్చాం.
- పేదవాడు వైద్యం కోసం అప్పులపాలయ్యే పరిస్థితి రాకూడదని ఒక్క ఆరోగ్యశ్రీ కింద ఏకంగా 39.39 లక్షల మందికి రూ.12,463 కోట్లు ఇచ్చాం. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా 23.29 లక్షల మందికి రూ.1,390 కోట్లు సాయం చేశాం. మత్స్యకార భరోసాగా 2.44 లక్షల మందికి రూ.538 కోట్లు, నేతన్న నేస్తం ద్వారా 82 వేల మందికి రూ.982 కోట్లు, చేదోడు కింద నా రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు 3.38 లక్షల మందికి రూ.1,260 కోట్లు, వాహన మిత్ర ద్వారా 2.76 లక్షల మంది సొంత ఆటో, క్యాబులు నడుపుతున్న నా అన్నదమ్ములకు రూ.1,300 కోట్లు అందించాం.
- 10.40 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటూ రూ.906 కోట్లు ఇచ్చాం. ఇలా ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు గతంలో ఎప్పుడూ జరగని విధంగా మీ బిడ్డ బటన్ నొక్కడం ద్వారా నా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి వెళ్లాయి. చంద్రబాబు హయాంలో ఒక్క రూపాయి మీ బ్యాంకు ఖాతాల్లో వేసినట్లు కనిపిస్తుందా?
- రాష్ట్రంలో 31 లక్షల ఇళ్ల పట్టాలు నా అక్కచెల్లెమ్మల పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాం. అందులో 22 లక్షల ఇళ్లు కడుతున్నాం. ఆ ప్రాంతాన్ని బట్టి ఒక్కో ఇంటి విలువ కనీసం రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షలు పలుకుతుంది. ఈ రకంగా నా అక్కచెల్లెమ్మలకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.3 లక్షల కోట్లు పైచిలుకు వారి చేతుల్లో పెట్టినట్లవుతుంది.
- నా అక్కచెల్లెమ్మల కుటుంబాల తలరాతలు మార్చాలని, ఆ పేదింటి పిల్లల చదువుల మీద, వారి బడి మీద మనం ఖర్చుకు వెరవకుండా విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చాం. తద్వారా ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యనభ్యసించి మరో 10 సంవత్సరాల్లో ఈ పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో ఇంగ్లిష్‌లో మాట్లాడుతూ పోటీ పడే పరిస్థితి ఉంటుంది. ధనికులే ఆ పిల్లలను చూసి తమ పిల్లలకన్నా ఆ పేద పిల్లాడు గొప్పగా మాట్లాడుతున్నాడనే విధంగా విద్యా రంగంలో సంస్కరణలు తీసుకొస్తున్నాం.

జెండాలు జత కట్టడమే వారి అజెండా

- చంద్రబాబు నాయుడు 2014లో కూడా మీ అందరి దగ్గరకు వచ్చాడు. కూటమి అన్నాడు. జెండాలు జత కట్టాడు. ఒక దత్తపుత్రుడిని, ఆయనతోపాటు ఢిల్లీకి వెళ్లి మోడీ గారిని తీసుకొచ్చాడు. అలవిగాని హామీలతో కూడిన ఈ పాంప్లెట్ (చూపిస్తూ) సంతకం పెట్టి మరీ ప్రతి ఇంటికీ పంపించాడు.
- రైతుల రుణ మాఫీపై మొదటి సంతకం అన్నాడు. రూ.87,612 కోట్లు.. రుణ మాఫీ చేశాడా? పొదుపు సంఘాల రుణాలు రూ.14205 కోట్లు మాఫీ అన్నాడు. ఒక్క రూపాయి అయినా చేశాడా? ఆడ బిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకు అకౌంట్లో డిపాజిట్ చేస్తామన్నాడు. చేశాడా? ఇంటింటికీ ఉద్యోగం, ఉద్యోగం ఇవ్వలేకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి అన్నాడు. ఐదేళ్లలో నెలకు రూ.2 వేల చొప్పున రూ.1.20 లక్షలు ఇచ్చాడా?
- అర్హులైన వాళ్లందరికీ 3 సెంట్ల స్థలం ఇచ్చారా? రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాలన్నీ మాఫీ అన్నాడు.. చేశాడా? మహిళల రక్షణకు ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు జరిగిందా? రాష్ట్రాన్ని సింగపూర్‌ను మించి అభివృద్ధి చేస్తానన్నాడు. ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. ఇలా 650 హామీలు ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ అదే మోసం. అవే పొత్తులు. ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ మళ్లీ మోసం చేయడానికి వస్తున్నాడు. ఈ ముగ్గురూ కలిసి ఇంటింటికీ కేజీ బంగారం అంటున్నారు. ఇంటింటికీ బెంజ్ కారు కొనిస్తామంటున్నారు.



చిత్తూరు జిల్లా పూతలపట్టులో జరిగిన సభకు హాజరైన భారీ జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం జగన్



సభాస్థలి నిండిపోవడంతో బయటే వేచి ఉండి సీఎం జగన్ ప్రసంగాన్ని వింటున్న ప్రజలు

నేడు మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఇలా..



- గురవరాజుపల్లె ప్రాంతం నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభం
- చిన్న సింగమల వద్ద 11 గంటలకు లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లతో సీఎం ముఖాముఖి
- నాయుడుపేట సమీపంలోని జాతీయ రహదారి పక్కన బహిరంగ సభ
- చింతరెడ్డిపాలెం సమీపంలో రాత్రి బస

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర 8వ రోజు గురువారం(ఏప్రిల్ 4) షెడ్యూల్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం బుధవారం విడుదల చేశారు. సీఎం జగన్ బుధవారం రాత్రి బస చేసిన గురవరాజుపల్లె దగ్గర నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. మల్లవరం, ఏర్పేడు, పనగల్లు, శ్రీకాళహస్తి బైపాస్ మీదుగా చిన్న సింగమల సమీపానికి సీఎం జగన్ చేరుకుంటారు. అక్కడ ఉదయం 11 గంటలకు లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లతో ముఖాముఖిలో సీఎం పాల్గొంటారు. చావలి చేరుకొని భోజన విరామం తీసుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు నాయుడుపేట సమీపంలోని చెన్నై జాతీయ రహదారి పక్కన జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సభ అనంతరం ఓజిలి క్రాస్, బుదనం, గూడూరు బైపాస్, మనుబోలు, నెల్లూరు బైపాస్ మీదుగా చింతరెడ్డిపాలెం వద్ద రాత్రి బసకు చేరుకుంటారు.

చిత్తూరు జిల్లా సిద్ధమా?

మేమంతా సిద్ధం బస్సు యాత్ర బుధవారం చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా 'చిత్తూరు జిల్లా సిద్ధమా?' అంటూ సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. మేమంతా సిద్ధమంటూ అశేష జనసందోహం సీఎం జగన్‌తో కలిసి ముందుకు సాగింది.

- సాక్షి, అమరావతి

7 వ రోజు
స్టార్ క్యాంపెయినర్‌లతో సీఎం వైఎస్ జగన్

మన ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన ప్రతి ఒక్కరు స్టార్ క్యాంపెయినర్‌గా బయటికి రావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. తమకి జరిగిన మంచిని మరో వందమందికి చెప్పి ప్రతి ఓటు కూడా రెండు బటన్లు ఫ్యాన్ మీద నొక్కి చంద్రబాబు అనే చంద్రముఖిని పెట్టెలో బిగించి మళ్లీ లకలక అంటూ మన రక్తం తాగేందుకు రాకుండా జాగ్రత్తపడాల్సిన సమయమొచ్చింది.. అని సీఎం జగన్ బుధవారం ట్వీట్ చేశారు.

- సాక్షి, అమరావతి

















పూలు జల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్న యువకులు



సదుంలో అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





పూతలపట్టులో అడుగో జగనన్న... జయహో జగన్ అంటూ యువతుల నినాదాలు

వన్స్‌మోర్ జగన్

బస్సు యాత్ర దారిపొడవునా అందరి నోటా ఇదే మాట

(మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

'అవ్వా.. చెప్పులేసుకో. లేదంటే కాళ్లు కాలుతాయి' అని మనువరాలు చెబుతున్నా వినిపించుకోకుండా.. 'ఆ చెప్పులతోనేమి.. బిర్నా రా ఆ సామి వెళ్లిపోతాడేమో' అంటూ వృద్ధురాలు అలివేలమ్మ వేగంగా పొలంలో నుంచి రోడ్డు మీదకు వచ్చింది. అటుగా బైక్ మీద వెళుతున్న వ్యక్తిని ఆపి.. 'ఎంత వరకు వచ్చాడు?' అని ఆరా తీసింది. ఇంకా రాలేదు.. వస్తున్నాడని చెప్పి ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. ఈ లోపు మనవరాలు అలివేలమ్మ దగ్గరకు వచ్చి.. 'చెబితే వినవు.. సీఎం జగన్ రావడానికి ఇంకా చానాసేపు పడుతుంది. చెట్టునీడకు రా..' అని పిలవగా.. 'ఉదయం నుంచి ఎదురు చూస్తున్నా.. కొద్దిసేపు ఇక్కడ నిలబడితే ఏం కాదులే.. ఐదేళ్ల క్రితం ఇదే దారిలో వెళుతుంటే కలిశాను. అధికారంలోకి వస్తావ్ అని అప్పట్లో చెప్పాను.. అనుకున్నట్టే సీఎం అయ్యాడు. మాటిచ్చినట్టే ఇంటి దగ్గరకే పెన్షన్ పంపాడు. ఐదేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు వస్తున్నాడు. మళ్లీ నువ్వే అధికారంలోకి వస్తావ్ అని ఆ సామికి చెబుతానమ్మి..' అంటూ అవ్వబదులిచ్చింది.

చిత్తూరు జిల్లా సదుం ఎస్టీ కాలనీకి చెందిన ఎం.మునెమ్మకు వందేళ్లు ఉంటాయి. స్వతహాగా నడవలేదు, నిల్చోలేదు. అయినప్పటికీ ఎంతో ఓపికగా ఉదయం నుంచి సదుం నుంచి కల్లూరుకు వెళ్లే రహదారి పక్కన కుర్చీలో కూర్చుని ఉంది. ఎక్కువసేపు నువ్ కూర్చోలేవ్ ఇంట్లో పడుకుందువ్ రా.. అని మనవడు పిలిచినా వినడం లేదు. ఆమె గంటల తరబడి అక్కడే వేచి ఉండటానికి కారణం ఏంటని ఆరా తీస్తే.. ఈ రోడ్డు మీదుగా సీఎం జగన్ వస్తున్నారని, ఆయన్ని ఓ సారి చూద్దామని ఎదురు చూస్తోందని ఆమె మనవడు తెలిపాడు. ఇలా అలివేలమ్మ, మునెమ్మల తరహాలో ఎందరో వృద్ధులు.. మహిళలు, వికలాంగులు, విద్యార్థులు, రైతులు ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా గంటల తరబడి రోడ్లపై బారులు తీరి తమ అభిమాన నాయకుడిని చూడటానికి పోటీపడ్డారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా తమకు అండగా నిలిచిన నేతను కళ్లారా చూసి ఉబ్బితబ్బిబ్బయ్యారు. 'తమను అన్ని విధాలుగా ఆదుకున్న మీకే మా మద్దతు.. ఎన్ని జెండాలు జత కట్టినా మరోసారి చంద్రబాబు మా చేతుల్లో చిత్తవ్వడం ఖాయం' అని సీఎం జగన్‌కు ప్రజలు తేల్చి చెప్పారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 'మేమంతా సిద్ధం' అంటూ బస్సు యాత్ర నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తూరు, తిరుపతి జిల్లాల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పుంగనూరు నియోజకవర్గం అమ్మగారిపల్లెలో బస శిబిరం నుంచి బుధవారం ఉదయం 9.45 గంటల ప్రాంతంలో ఏడో రోజు యాత్రను ప్రారంభించారు. శిబిరం నుంచి బయటకు వస్తుండగానే అమ్మగారిపల్లె గ్రామస్తులు సీఎంకు ఘన స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చిన మహిళలు బంతి పూల వర్షం కురిపించారు. మంగళ హారతులు పట్టి జననేతపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం సదుంలోకి ప్రవేశించిన సీఎంకు రోడ్డుకు ఇరు వైపులా బారులు తీరిన జనసందోహం ఆత్మీయ స్వాగతం పలికింది. బస్సుపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం జగన్ రోడ్‌షో నిర్వహించారు. అనంతరం కల్లూరు వైపు బయలుదేరిన రోడ్‌షోకు మార్గంమధ్యలో వివిధ గ్రామాల ప్రజలు సంఘీభావం తెలిపారు.

పెత్తందార్లకు ఓటు వేయం...

బహిరంగ సభ అనంతరం పి.కొత్తకోట, పాకాల క్రాస్, గాదంకి, ఐతేపల్లి క్రాస్, చంద్రగిరి క్రాస్, రేణిగుంట మీదుగా రాత్రి 9 గంటలకు గురువరాజుపల్లెలో ఏర్పాటు చేసిన బస శిబిరానికి సీఎం జగన్ చేరుకున్నారు. బెంగళూరు–తిరుపతి జాతీయ రహదారిపై యాత్రగా వెళుతున్న సీఎం జగన్‌కు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపారు. ప్రజాభిమానం అడ్డు పడటంతో నిర్దేశించిన షెడ్యూల్ కంటే ఎంతో ఆలస్యంగా యాత్ర సాగినప్పటికీ.. ప్రజలు మాత్రం ఎంతో ఓపికగా సీఎం రాక కోసం వేచి ఉన్నారు. అభిమాన నేతను చూసి ఎంతో సంతోషపడ్డారు. రోడ్లపై బారులు తీరిన వారిలో ఎవ్వరిని కదిలించినా.. 'వన్స్‌మోర్ సీఎం జగన్' అన్న నినాదమే వినిపించింది. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న నేత వైఎస్ జగన్‌కు కాకుండా.. పెత్తందారులకు కొమ్ముకాసే చంద్రబాబు, ఆయన తొత్తులకు ఏ విధంగా ఓటు వేస్తాం అంటూ ప్రజలు గర్జించారు.



చంద్రగిరి నియోజకవర్గంలో క్రేన్‌లపై భారీ గజమాలలు పెట్టి సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

చంద్రగిరి నియోజకవర్గానికి ముందే ఉగాది

పుంగనూరు నియోజకవర్గం నుంచి తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోకి ప్రవేశించిన సీఎం జగన్ బస్సు యాత్రకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. దామలచెరువులో సంబరాలు అంబరాన్ని అంటాయి. సీఎం రాక నేపథ్యంలో చంద్రగిరి నియోజకర్గ ప్రజలకు ముందే ఉగాది పండుగను తెచ్చిపెట్టాయి. దామలచెరువులో ఊరంతా అరటి ఆకులు, మామిడి తోరణాలతో శోభాయమానంగా అలంకరించి, సుమారు 20 క్రేన్లతో భారీ గజమాలలతో సీఎంకు ఘన స్వాగతం పలికారు. అక్కచెల్లెళ్లు సీఎంకు హారతులు పట్టి, గుమ్మడికాయలతో దిష్టి తీశారు. కోలాటం, చెక్కభజన సహా వివిధ కళారూపాలతో మహిళలు పలికిన ఆత్మీయ స్వాగతం అబ్బుర పరిచింది. ఎర్రటి ఎండను ఏ మాత్రం లెక్క చేయకుండా వేల సంఖ్యలో ప్రజలు దామలచెరువుకు చేరుకున్నారు. రోడ్డు అంతా జనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం ఒంటి గంట దాటాక దామలచెరువు చేరుకున్న సీఎం.. ఎర్రటి ఎండలోనే బస్ పైకి ఎక్కి ఊరంతా రోడ్ షో నిర్వహించారు. సీఎం కాన్వాయ్‌తో పాటు సమాంతరంగా నడుస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చుకోవడానికి మేమంతా సిద్ధం అంటూ ప్రజలు నినదించారు. అనంతరం పూతలపట్టుకు పయనమైన సీఎంకు దారిపొడవునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఐరాల మండలం గుండ్లపల్లి, కొలకలతో పాటు వివిధ గ్రామాల ప్రజలు యాత్రకు సంఘీభావం తెలిపారు. పూతలపట్టు నియోకవర్గం తేనెపల్లి వద్ద సీఎం జగన్ భోజన విరామ శిబిరానికి చేరుకుని కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో విరామ శిబిరం నుంచి బస్సు యాత్ర ప్రారంభించి, రంగంపేట క్రాస్ మీదుగా పూతలపట్టు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు.

నేను విన్నాను.. నేను ఉన్నాను

చిత్తూరు జిల్లా మండల కేంద్రమైన సదుం గ్రామానికి చెందిన 23 ఏళ్ల ముఖేష్ రెండేళ్ల కిందట పెరాలసిస్‌కు గురయ్యాడు. చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకువస్తున్న తల్లిదండ్రులకు ముఖేష్ వైద్య ఖర్చులు తలకు మించిన భారం అయ్యాయి. అతని వైద్యానికి మరో రూ.15 లక్షలు అవసరం అవుతాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సీఎంను కలిస్తే తప్పక తమకు సహాయం దొరుకుతుందని ముఖేష్ తల్లి నమ్మింది. ఈ నేపథ్యంలో మేమంతా సిద్ధం యాత్రలో సదుం వద్ద ముఖేష్ కుటుంబం ముఖ్యమంత్రిని కలిసింది. సీఎం జగన్ వారిని బస్సు వద్దకు పిలిపించుకుని ముఖేష్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కచ్చితంగా ప్రభుత్వం ఆదుకుంటుందని వారికి భరోసా ఇచ్చారు. ముఖేష్ వివరాలను తీసుకోవాలని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అధికారులను సూచించారు. వైఎస్ జగన్ ఇచ్చిన భరోసాతో తమ బిడ్డకు వైద్యం అంది, మామూలు మనిషి అవుతాడనే నమ్మకం కలిగిందని ఆ కుటుంబం సంతోషం వ్యక్తం చేసింది.

అభిమానం చాటుకున్న ముస్లిం మైనార్టీలు

ఎన్నో పథకాలు, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ముస్లిం మైనార్టీలకు అండగా నిలిచి, ఆ వర్గాలకు రాజకీయంగా తగు ప్రాధాన్యం ఇచ్చిన సీఎం జగన్ తమ ఊరికి వస్తుండటంతో తెల్లవారుజాము నుంచే కల్లూరు గ్రామంలో సందడి నెలకొంది. సీఎం జగన్ గ్రామానికి చేరుకోగానే మైనార్టీ సోదరులు, అక్కచెల్లెమ్మలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. మత పెద్దలు ముస్లిం సంప్రదాయం ప్రకారం సీఎంకు శాలువ కప్పి, హిమామ్ జామీన్ కట్టి ప్రార్థనలు నిర్వహించి, ఆశీర్వదించారు. అనంతరం బస్సుపై నుంచి సీఎం జగన్ ప్రజలకు నమస్కరిస్తూ ముందుకుసాగారు. ఆ తర్వాత కల్లూరు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన కురుబ సామాజికవర్గం ఆత్మీయ సమావేశానికి సీఎం హాజరయ్యారు.



కల్లూరులో అశేష జనవాహినికి సీఎం వైఎస్ జగన్ అభివాదం

రెహ్మాన్ కోరిక తీరింది

బస్సు యాత్రలో మానవత్వం పరిమళించిన ఘటన

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడు
- జగన్ మామయ్యను చూడాలనే కోరిక
- బాలుడిని చూసి చలించిపోయిన సీఎం జగన్
- ఆప్యాయతతో అక్కున చేర్చుకున్న వైనం
- తప్పకుండా ఆదుకుంటానని సీఎం హామీ

'ఆ బాలుడికి సోకింది అరుదైన వ్యాధి. డచ్చినే మస్క్యులర్ డిస్ట్రోఫి (డీఎండీ). దీనికి ప్రపంచంలో ఎక్కడా చికిత్స లేదు. ఇదే అంశాన్ని వైద్యులు ఆ బాలుడి తల్లిదండ్రులకు చెప్పారు. బాబుకి ఏమైనా కోరికలుంటే తీర్చాలన్నారు. దీనిపై గుండె దిటువు చేసుకున్న తల్లిదండ్రులు ఎవరంటే ఇష్టమోనని అడిగితే జగన్ మామయ్యను ఒక్కసారి కలవాలని తన మనసులోని మాట చెప్పాడు. అష్టకష్టాలపై బుధవారం సిఎం జగన్‌ను బాలుడు కలిసాడు. అంతే అతని ఆనందానికి అంతు లేకుండా పోయింది. వ్యాధి గురించి తెలుసుకున్న సీఎం జగన్ చలించిపోయారు. ఆ కుటుంబాన్ని అక్కున చేర్చుకున్నారు. ఆ క్షణమే ఆ వ్యాధికి సంబంధించి వైద్య సదుపాయాల గురించి ఆరోగ్యశ్రీ రాష్ట్ర కోఆర్డినేటర్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ అయిన వెంటనే తప్పనిసరిగా కుటుంబాన్ని ఆదుకుంటానని హామీ ఇచ్చారు'.

కలికిరి: అన్నమయ్య జిల్లా కలికిరికి చెందిన జి.నిస్సార్ ద్విచక్రవాహన మెకానిక్. ఆయన భార్య షమీమ్, కుమార్తె హుమేర, కుమారుడు మొహమ్మద్ రెహ్మాన్ ఉన్నారు. కుమార్తె స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతోంది. కుమారుడు 6 ఏళ్ల వరకు బాగానే ఉన్నాడు. తర్వాత అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యాడు. క్రమంగా అవయవాలు పనిచేయడం మానేశాయి. తల్లిదండ్రులు చాలా చోట్ల వైద్యం చేయించినా నయం కాలేదు. ఎక్కడికి వెళ్లినా వ్యాధిని గుర్తించలేక పోయారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర ప్రాంతాల్లో వైద్యం చేయించినా లాభం చేకూరలేదు. చివరికి వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో రెహ్మాన్‌కు సోకింది అరుదైన వ్యాధి డచ్చినే మస్క్యులర్ డిస్ట్రోఫిగా గుర్తించారు. 12 సంవత్సరాల తరువాత వ్యాధి తీవ్రత పెరగవచ్చని వెల్లడించారు. ఈ స్థితిలో రెహ్మాన్ సీఎం జగన్ మామయ్యను కలవాలని, తల్లిదండ్రులు సొంత ఇల్లు కట్టుకుంటే తాను రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేయాలనే ఆశ ఉందని చెప్పాడు. అలాగే అమ్మ, నాన్న, అక్కతో కలిసి మక్కాకు వెళ్లాలని ఉన్నట్లు చెప్పాడు. ఆ కుంటుంబానికి వైఎస్సార్ జగనన్న ఇల్లు మంజూరైంది. దాదాపు నిర్మాణం పూర్తయింది. ఆరు నెలలుగా సీఎం జగన్‌ను కలవడానికి ఆ కుటుంబం చేయని ప్రయత్నం లేదు. ఈ నేపథ్యంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి బస్సుయాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా సదుం మండలం అమ్మగారిపల్లి వద్ద ఉన్నట్లు తెలుసుకున్న చిన్నారి కుటుంబం బుధవారం అమ్మగారిపల్లి వద్దకు చేరుకుని సీఎంను కలిసి పరిస్థితి వివరించారు.



మా గోడు విన్న దేవుడాయన



మా బాబుకి ఇలాంటి వ్యాధి సోకడం బాధ కలిగిస్తోంది. సీఎం జగన్ అంటే రెహ్మాన్‌కు విపరీతమైన అభిమానం. స్వయంగా సిఎంను కలవాలని కోరాడు. బుధవారం ఉదయం సదుం మండలం అమ్మగారిపల్లి వద్ద సీఎంను కలిసి మా బాధను వెళ్లబోసుకున్నాం. మా బాధ పూర్తిగా విన్న దేవుడాయన. తప్పకుండా ఆదుకుంటానని హామీ ఇచ్చారు.

– తల్లి షమీమ్, తండ్రి నిస్సార్



వైఎస్సార్‌సీపీలోకి కుప్పం టీడీపీ నేతలు

సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన ఉమ్మడి చిత్తూరు జెడ్పీ మాజీ చైర్మన్ ఎం.సుబ్రమణ్యంనాయుడు

కుతూహలమ్మ కుమారుడు, టీడీపీ నేత ఎ.హరికృష్ణ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర సందర్భంగా టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. బుధవారం అమ్మగారిపల్లె స్టే పాయింట్ వద్ద సీఎం జగన్ సమక్షంలో బాబు నియోజకవర్గమైన కుప్పానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ ఎం.సుబ్రమణ్యంనాయుడు, కృష్ణమూర్తి, బేతప్ప వైఎస్సార్ సీపీలో చేరారు. అలాగే మాజీ మంత్రి కుతూహలమ్మ కుమారుడు, టీడీపీ సీనియర్ నేత ఎ.హరికృష్ణ, పలమనేరు టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎల్.లలిత కుమారి, బంగారుపాళ్యం మండలం నలగాం పల్లె మాజీ సర్పంచ్ టి.థామస్, టీడీపీ నేతలు కుమారస్వామినాయుడు, సందీప్, డాక్టర్ ప్రదీప్, టీడీపీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు రావూరి ఈశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నేత, చిత్తూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సరళమేరీ సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్ పాల్గొన్నారు.



సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన హరికృష్ణ

'మేమంతా సిద్ధం' యాత్రతో పాటు అభిమాని బైక్ యాత్ర



సదుంలో బైక్ యాత్ర చేస్తున్న అమర్‌నాథరెడ్డి

సీఎం జగన్‌పై ఉన్న అభిమానంతో వైఎస్సార్ జిల్లా పొద్దుటూరుకు చెందిన అమర్‌నాథ్‌రెడ్డి మేమంతా సిద్ధం యాత్రతో పాటు బైక్ యాత్ర నిర్వహిస్తున్నారు. మండుటెండలను లెక్క చేయకుండా ఆయన యాత్రను కొనసాగిస్తున్నారు. బుధవారం ఆయన సదుం మండల కేంద్రంలో యాత్ర నిర్వహించారు. కుటుంబ సభ్యులకు దూరంగా..బైక్ మొత్తం వైఎస్సార్‌సీపీ రంగులతో అలంకరించిన జెండాలతో యాత్ర చేపట్టాడు. విశాఖలో ఉద్యోగం చేసుకుంటున్న ఆయన సీఎం జగన్‌పై అభిమానంతో ఉద్యోగం వదిలి ఎన్నికల వరకు ప్రచారంలో పాల్గొనాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్ధం సభలకూ తాను హాజరైనట్లు తెలిపారు. బస్సు యాత్ర పూర్తయ్యేవరకు సీఎం జగన్ వెంటే ఉంటానని స్పష్టం చేశారు.

- సదుం (చిత్తూరు జిల్లా)

దిగ్విజయంగా పింఛన్ల పంపిణీ

పని చేయని చంద్రబాబు అండ్ కో కుట్రలు

సాక్షి, అమరావతి: సంకల్పం ఉంటే ఎవరెన్ని అడ్డంకులు కల్పించినా లక్ష్యం నెరవేరుతుంది. ఈ విషయాన్ని మరోసారి నిరూపించింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. సంక్షేమ పథకాల అమలులో చంద్రబాబు అండ్ కో ఎన్ని అడ్డంకులు సృష్టించినా, దిగ్విజయంగా ముందుకు సాగుతున్న వైఎస్ జగన్ ప్రభుత్వం.. పింఛన్ల విషయంలోనూ పచ్చ గ్యాంగు కుట్రలకు ఏమాత్రం వెరవకుండా అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులకు ఠంఛన్‌గా పింఛన్లు అందజేసింది. ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి చంద్రబాబు అండ్ కో వలంటీర్లను పింఛన్ల పంపిణీ నుంచి తప్పించి ఆటంకాలు సృష్టించినా.. ప్రభుత్వం అవ్వాతాతలకు ఠంఛన్‌గా పింఛన్ డబ్బులను అందజేసింది. బుధవారం మధ్యాహ్నం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో పంపిణీని ప్రారంభించి, కేవలం ఆరు గంటల్లోనే 26,00,064 మంది లబ్ధిదారులకు రూ. 785.25 కోట్లు అందజేసింది.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక గత నాలుగున్నరేళ్లకు పైగా రాష్ట్రంలో వలంటీర్ల ఆధ్వర్యంలో ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంఛన్‌గా అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులకు ఇంటి వద్దే పింఛన్లు అందజేస్తున్నారు. అయితే, టీడీపీ అధినేత చంద్రబాబుకు సన్నిహితుడు, రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ నేతృత్వంలోని సిటిజన్ ఫర్ డెమొక్రసీ సంస్థ చేసిన ఫిర్యాదుల మేరకు మార్చి 30న కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వం వలంటీర్లను ఈ కార్యక్రమం నుంచి పక్కన పెట్టాల్సి వచ్చింది. దీంతో ప్రశాంతంగా సాగుతున్న పింఛన్ల పంపిణీలో హఠాత్తుగా గందరగోళం నెలకొంది. అయినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల్లోనే ప్రత్యామ్నాయ పద్ధతులను రూపొందించింది. మంగళవారం రాత్రికే రాష్ట్రంలోని అన్ని సచివాలయాలకు వాటి పరిధిలోని లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా పింఛన్ల నిధులను విడుదల చేసినట్లు అధికారులు చెప్పారు. సచివాలయాల సిబ్బంది బుధవారం బ్యాంకులు తెరిచిన తర్వాత డబ్బులు డ్రా చేసి, మధ్యాహ్నం 12.30 నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. రాత్రి ఏడు గంటల వరకు పింఛన్ల పంపిణీ కొనసాగిందని అధికారులు తెలిపారు.

39.58 శాతం మేర పంపిణీ పూర్తి

ఏప్రిల్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 66 లక్షల మందికి పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం రూ. 1,951.69 కోట్లు విడుదల చేయగా, బుధవారం రాత్రి వరకు 26,00,064 మందికి రూ. 785.25 కోట్లను సచివాలయాల సిబ్బంది పంపిణీ చేశారు. మొత్తం 39.58 శాతం మందికి పింఛన్లు అందాయి. మరో మూడు రోజులు సచివాలయాల వద్ద ఈ పంపిణీ కొనసాగుతుంది. దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యాల కారణంగా పింఛన్లు పొందుతున్న వారు, మంచం లేదా వీల్ చైర్‌కు పరిమితమైన వారికి తప్పనిసరిగా వారి ఇంటి వద్దనే పంపిణీ చేసేలా అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు చెప్పారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో బుధవారమే 54.82 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు ఆ జిల్లాలో 3,16,492 మంది లబ్ధిదారులు ఉండగా, బుధవారం రాత్రి వరకు 1,73,485 మందికి పంపిణీ పూర్తయింది. ఆ తర్వాత విశాఖపట్నం జిల్లాలోనూ 52.13 శాతం, వైఎస్సార్ కడప జిల్లాలో 50.42 శాతం, ఏలూరు జిల్లాలో 48.88 శాతం, ప్రకాశం జిల్లాలో 46.60 శాతం, తిరుపతి జిల్లాలో 46.26 శాతం చొప్పున పంపిణీ పూర్తయినట్టు అధికారులు వివరించారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎక్కువ భాగం ఆఫ్‌లైన్ విధానంలో పంపిణీ జరుగుతున్నందున, ఆ వివరాలు అందాల్సి ఉందని అధికారులు వివరించారు.

నేడు ఉదయం 7 గంటల నుంచే పింఛన్ల పంపిణీ

వేసవి, వేడి గాలుల నేపథ్యంలో నేటి (గురువారం) నుంచి ఉదయం 7 గంటల నుంచే సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కువగా అనారోగ్య సమస్యలు ఉన్న వృద్ధులు, దివ్యాంగులు వంటి వారికి తప్పనిసరిగా ఇంటి వద్దే పింఛను అందించేలా నిబంధనలు సవరించినట్లు చెప్పారు. ఈ విభాగాల పింఛన్‌దారులు సచివాలయాలకు రానవసరం లేదని, వారికి ఇంటి వద్దే పింఛను ఇస్తారని స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టర్లందరికీ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.



విశాఖ ఆరిలోవ సచివాలయంలో వృద్ధురాలితో వేలిముద్ర వేయిస్తున్న సిబ్బంది



విజయవాడ రాణీగారితోట సచివాలయంలో పింఛను తీసుకుని వస్తున్న అంజనీదేవి



ఏలూరు గాంధీనగర్ సచివాలయంలో వృద్ధురాలితో వేలిముద్ర వేయిస్తున్న సిబ్బంది

బంధం తెంచిన బాబు

బుధవారం మధ్యాహ్నం తర్వాత పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందని కొత్త మార్గదర్శకాల్లో ప్రభుత్వం స్పష్టంగా చెప్పింది. వలంటీర్లు ఉండి ఉంటే ఈ సమాచారం వెంటనే లబ్ధిదారులకు తెలిసి ఉండేది. వలంటీర్లు లేకపోవడంతో వారికి సరైన సమాచారం అందలేదు. తాజా మార్గదర్శకాల గురించి ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసినా, ఎక్కువగా ఇంటికే పరిమితమయ్యే అవ్వాతాతలకు స్పష్టంగా తెలియలేదు. దీంతో లబ్ధిదారులు బుధవారం నుంచే గ్రామ, వార్డు సచివాలయాల వద్దకు చేరుకోవడంతో కొంత గందరగోళం నెలకొందని అధికారులు చెప్పారు. 2019 ఆగస్టులో రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ఏర్పడిన తర్వాత.. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల వివరాలను నేరుగా వలంటీర్ల ద్వారా సంబంధిత లబ్ధిదారులకు సకాలంలో, స్పష్టంగా అందుతుండేదని అధికారులు చెప్పారు. లబ్ధిదారులకు ఏదైనా సహకారం అవసరమైనా వలంటీర్లు అందించేవారని తెలిపారు. హఠాత్తుగా వలంటీర్లను పింఛన్ల పంపిణీ సహా అన్ని ప్రభుత్వ కార్యక్రమాల నుంచి తప్పించడంతో ఇప్పుడు వారి ద్వారా సమాచారం తెలిసే పరిస్థితి కూడా లేకుండా పోయిందని, ఆ కారణంగా పింఛన్ల పంపిణీ బుధవారం మధ్యాహ్నం నుంచి మొదలవుతుందన్న ప్రభుత్వ సమాచారం కూడా లబ్ధిదారులకు తెలియలేదని అధికారులు వివరించారు. నాలుగున్నరేళ్లకు పైగా ప్రభుత్వానికీ ప్రజలకు మధ్య వారధిగా ఉన్న వలంటీర్ల బంధాన్ని చంద్రబాబు అండ్ కో తెంచడంతో పేదలకు ఈ ఇబ్బందులు వచ్చాయని రాజకీయవర్గాలు పేర్కొంటున్నాయి.

అవ్వాతాతల ఉసురు బాబుకు తగలక తప్పదు

పచ్చనేతల కుట్రలపై మాజీమంత్రి పేర్ని నాని ఫైర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రశాంతంగా జీవిస్తున్న అవ్వాతాతలకు ఇబ్బంది కలిగిస్తున్న చంద్రబాబుకు ఆ వృద్ధుల ఉసురు తగలక తప్పదని... పేదల ఆగ్రహంతో కూటమి ఓటమి తప్పదని మాజీ మంత్రి పేర్ని నాని హెచ్చరించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెన్షన్లపై బాబు దొంగ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఈ చివరి రెండు నెలలు పెన్షన్ ఆపితే.. వలంటీర్లపై మీరు గెలిచినట్టా? అని ప్రశ్నించారు. చేసిందంతా చేసి ఇప్పుడేమో సచివాలయాల చుట్టూ చంద్రబాబు, ఆయన పార్టీ నేతలు భయంతో పరుగులు పెడుతున్నారనీ, ఈ డ్రామాలను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లూ వలంటీర్లపై నోటికొచ్చినట్టు వాగిన చంద్రబాబు ఇప్పుడు మొసలికన్నీరు కార్చడం దేనికని ఆయన ప్రశ్నించారు.

నాడు జన్మభూమి కమిటీలకు దోచిపెట్టిన బాబు

చంద్రబాబునాయుడుకు హామీలు ఇవ్వడం వాటిని ఎగ్గొట్టడం ఆయనకు రివాజుగా మారిందని పేర్ని నాని మండిపడ్డారు. గతంలో రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. కానీ ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్లు ఇచ్చిన ఘన చరిత్ర వై.ఎస్.జగన్‌దని కొనియాడారు. బాబు హయాంలో ప్రజల సొమ్మును జన్మభూమి కమిటీల ద్వారా టీడీపీ కార్యకర్తలకు దోచిపెట్టారని మండిపడ్డారు. 2019 ఎన్నికల సమయంలో రకరకాలుగా జన్మభూమి కమిటీ ద్వారా డబ్బులు పంచుతున్నా తాము అడ్డుకోలేదన్నారు. పసుపు కుంకుమ పేరుతో డబ్బులు వేసినా ఆపాలని తాము ఈసీకి ఫిర్యాదు చేయలేదని గుర్తు చేశారు. నిన్నటివరకూ వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగమైనా ఇవ్వలేదని ఇన్నాళ్లూ బాబు అండ్‌కో అభాండాలు వేశారని, మరి సచివాలయాల్లో లక్షా 60వేల మంది ఉద్యోగులు ఉన్నారని... వారి ద్వారా పెన్షన్లు పంపిణీ చేయాలని చెబుతున్నారని, ఈ ఉద్యోగులు ఎలా వచ్చారని నాని నిలదీశారు. మిగతా ఉద్యోగుల గురించి కూడా రేపోమాపో మీనోటితో మీరే పలికే విధంగా దేవుడు తీర్పు ఇవ్వబోతున్నారని పేర్కొన్నారు.

తప్పును కప్పిపుచ్చుకోవడానికి బాబు అండ్ కో పాట్లు

గడచిన 58 నెలలుగా జగన్ ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే తీసుకెళ్లి వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ చేస్తే, దాన్ని అడ్డుకుని ఇప్పుడు ఆ తప్పును కప్పిపుచ్చుకునేందుకు బాబు అండ్ కో నానా పాట్లు పడుతున్నారని ఎద్దేవా చేశారు. అసలు ఏనాడైనా ఒకటో తేదీనే పింఛన్లు అందించిన చరిత్ర చంద్రబాబుకు ఉందా అని నిలదీశారు. అదే జగన్ హయాంలో అయితే ఒకటోతేదీ తెల్లవారుజాము నుంచే ప్రారంభించి, సాయంత్రానికి 95 శాతం పంపిణీ పూర్తిచేసేవారనీ ఈ విషయం ఏ ఇంటికి వెళ్లి అడిగినా వారు చెబుతారని పేర్కొన్నారు. 2014లో తన పార్టీకి ఓటేయలేదని సుమారు 15 లక్షల పింఛన్లను తొలగించిన చరిత్ర బాబుదని తెలిపారు. చంద్రబాబు తన శ్రేయోభిలాషులతో 'ఎల్లో ఎలక్షన్ వాచ్ అనే సంస్థ'ను ఏర్పాటు చేయించి వాళ్లతో సుప్రీం కోర్టు, ఢిల్లీ హైకోర్టు, ఏపీ హైకోర్టుల్లో వలంటీర్లు పింఛన్లు పంచకూడదని పలుచోట్ల పిటిషన్లు వేయించారనీ ఆ విధంగా పింఛన్లు వారిచేత పంపిణీ చేయించకుండా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. ఇప్పుడు సచివాలయాల దగ్గరకు చేరి పేదల పట్ల జాలి నటిస్తూ లోలోపల భయం, వణుకుతో చచ్చిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఈనాడు దినపత్రికలో బుధవారం కొందరు ప్రభుత్వ ఉన్నతాధికారులపైనా విషం చిమ్ముతూ తప్పుడు వార్తలు ఇచ్చారనీ, దళితులు, రెడ్డి అధికారులంటే మీకు అంత చిన్నచూపా అని నిలదీశారు. కమ్మ కులాన్ని వాడుకుని వదిలేయడమే గానీ, ఏనాడైనా వారికి ప్రయోజనం కలిగించే సుగుణాలు చంద్రబాబు, రామోజీరావు, ఏబీఎన్ రాధాకృష్ణకు ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు.

చంద్రబాబు రాక్షసానందం: కారుమూరి



తణుకు అర్బన్: పింఛన్ల పంపిణీ నుంచి వలంటీర్లను తప్పించడంతో.. పేదలు పడుతున్న అవస్థలను చూసి.. టీడీపీ అధినేత చంద్రబాబు రాక్షసానందం పొందుతున్నాడని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో సామాజిక పింఛన్లు అందుతున్న తీరు చూసి చలించిపోయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి పింఛన్లు, సంక్షేమం ఇంటి గడపలోకే పంపిస్తుంటే ప్రతిపక్షాలకు కళ్లు కుడుతున్నాయని విమర్శించారు. పేదల ద్రోహిగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు బుద్ధిచెప్పే రోజు దగ్గర్లోనే ఉందని కారుమూరి హెచ్చరించారు.

పండుటాకులు విలవిల

పింఛన్ కోసం సచివాలయాలకు వెళ్లొస్తూ ఒక్కరోజే 20 మంది మృత్యువాత



అనంతపురంలోని వినాయకనగర్‌లో సచివాలయంలో అవస్థలు



విశాఖపట్నంలో పింఛన్ కోసం బారులు తీరిన వృద్ధులు



శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లిలో..

సాక్షి నెట్‌వర్క్: టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిల కుట్రలతో అవ్వాతాతలు విలవిలలాడుతున్నారు. ఎన్నికల సంఘంపై తమ అనుకూలురుతో ఒత్తిడి తెచ్చి పింఛన్ల పంపిణీ చేయనీయకుండా వలంటీర్లను ఈ ముగ్గురు అడ్డుకున్న సంగతి తెలిసిందే. దీంతో అవ్వాతాతలు, ఇతర పింఛన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వలంటీర్ల ద్వారా ప్రతినెలా 1నే లబ్ధిదారులు ఇళ్ల వద్దే ప్రభుత్వం పింఛన్ అందిస్తుండగా ఈసారి టీడీపీ, జనసేన కుతంత్రాలతో సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ప్రస్తుతం వేసవి తాపానికి వడదెబ్బ కొట్టి మృత్యువాత పడుతున్నారు. బుధవారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 20 మంది పింఛన్ లబ్ధిదారులు మృత్యువాత పడటం విషాదాన్ని నింపింది. చంద్రబాబు కుట్రల వల్లే ఈ కష్టాలు వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఉసురు చంద్రబాబుకు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. చేయాల్సిందంతా చేసి టీడీపీ నేతలు డ్రామాలాడుతున్నారని నిప్పులు చెరిగారు.

ఒక్కరోజే 20 మంది మృత్యువాత

అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లెకు చెందిన ఎస్.రాజమ్మ (85) సచివాలయం వద్దకు నడిచి వెళుతూ మార్గమధ్యంలో రాయి కాలుకు తగిలి ముందుకుపడి మృతి చెందింది. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం గొల్లవాండ్లపల్లిలో టీడీపీ కుట్రలతో ఆందోళనకు గురైన దుగ్గిలమ్మ(70) అనే వృద్ధురాలు మృతిచెందింది. అలాగే గుండెపోటుకు గురై మహిళ మృతి చెందిన ఘటన శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం మద్దులచెర్వులో చోటు చేసుకుంది. అదేవిధంగా కొండకమర్ల పంచాయతీ పోలేవాండ్లకొత్తపల్లిలో సన్నాయప్ప (73) తన భార్య పింఛన్ కోసం ఎండలో నడుచుకుంటూ వెళ్లి తిరిగి వచ్చిన తర్వాత వడదెబ్బకు గురై మృతి చెందాడు. సూళ్లూరుపేట సాయినగర్‌లో ఈశ్వరవాక లలితమ్మ (58) వితంతు పింఛను కోసం గాంధ్లవీధి సచివాలయం వద్ద క్యూలో నిలబడి ముందుకు పడిపోయి ప్రాణాలు విడిచింది. తిరుపతి జిల్లా నారాయణవనం మండలం ఎరికంబట్టు దళితవాడకు చెందిన అప్పాస్వామి(75), చంద్రగిరి నియోజకవర్గం ఎర్రావారిపాళెం మండలం నెరబైలుకు చెందిన నన్నేసాహెబ్ (76), ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం ఘడియపూడి పునరావాస కాలనీలో బొమ్మల శేషయ్య (70), గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మామిళ్ళపల్లికి చెందిన బుర్ర శామ్యూలు (71), గుంటూరు జిల్లా కొల్లిపరలో దొప్పలపూడి బాబూరావు (62), గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరుకు చెందిన సయ్యద్ ఖాదర్‌బాషా, కాకినాడ జిల్లా తూరంగి పగడాలపేటకు చెందిన అడపా వీర్రాజు (67), అలాగే ఏటిమొగ ప్రాంతానికి చెందిన పట్టా అప్పారావు(61), కృష్ణా జిల్లా పామర్రు మండలం కురుమద్దాలికి చెందిన పిల్లి నాగేశ్వరమ్మ (75), పల్నాడు జిల్లా దుర్గి మండల పరిధిలోని నెహ్రూనగర్ తండాకు చెందిన రమావత్ సాలిబాయి (70), అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం చెర్లోపల్లె పంచాయతీ దిగువతొట్లివారిపల్లె గ్రామానికి చెందిన టి. మంగమ్మ(68), అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఆనందపురం గ్రామానికి చెందిన దివ్యాంగుడు రాజుబాబు (48), అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ వేలమామడికి చెందిన పాడి సాములు(65), ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన పింఛన్ లబ్ధిదారుడు పాతకోకిల పెద్దిరాజు (63) ప్రాణాలు విడిచారు.

చేతులు విరిగి..

అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం కొర్లకుంట సచివాలయానికి పింఛన్ తీసుకునేందుకు వెళ్లిన పోలి తులసమ్మ అనే వృద్ధురాలు తిరిగి వస్తూ కింద పడటంతో చేయివిరిగింది. ప్రకాశంజిల్లా ముండ్లమూరు మండలం వేంపాడుకు చెందిన గ్రంధి మరియమ్మ (71) పింఛను నగదు కోసం ముండ్లమూరు సచివాలయానికి వెళ్లింది. ఎండధాటికి సొమ్మసిల్లి కింద పడిపోయింది. కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం వక్కలగడ్డకు చెందిన పరుచూరి కృష్ణకుమారి (74) గుండెపోటుకు గురయ్యారు.

పింఛన్ తీసుకోవాలంటే 30 కి.మీ వెళ్లాల్సిందే

టీడీపీ నేతల నిర్వాకంతో వలంటీర్లు ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో గిరిజనులు అల్లాడుతున్నారు. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం చెన్నపాలెం గ్రామం గార్‌పెంట పంచాయతీలో ఉండగా దాని సచివాలయం పుల్లలచెరువులో ఉంటుంది. పుల్లలచెరువు నుంచి చెన్నపాలెం గిరిజనగూడెం వెళ్లాలంటే రానుపోను కలిపి 30 కి.మీ దూరం. ఇప్పటి వరకు వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ ఇస్తున్నారు. ఈనెల వలంటీర్లు రాకపోవడంతో కదలలేని స్థితిలో ఉన్న వృద్ధులు, వికలాంగులు కూడా సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాల్సి వచ్చింది. మండుటెండలో అంతదూరం వెళ్లి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి కల్పించారంటూ వృద్ధులు, వికలాంగులు టీడీపీ నేతలపై మండిపడ్డారు.

టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల డ్రామాలు

ఎక్కడ వ్యతిరేకత వస్తుందోనని పాలకొల్లు టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు డ్రామాలు మొదలుపెట్టారు. బుధవారం పట్టణంలోని సచివాలయాల వద్దకు వచ్చి పింఛన్ల పంపిణీకి సంబంధించి టీడీపీ వల్ల ఎలాంటి తప్పు జరగలేదని చెప్పి వృద్ధులను నమ్మించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఇలా ఎందుకు కూర్చోబెట్టారు అంటూ సచివాలయ ఉద్యోగులను ప్రశ్నించారు. సచివాలయం బయటకు వచ్చి పింఛన్‌దారులతో మాట్లాడుతూ ఇంకా పింఛన్ డబ్బులు రాలేదు కానీ టీడీపీ వల్లే పింఛన్లు ఇంటికి రావడం లేదని అంటున్నారన్నారు. ఎమ్మెల్యే నిమ్మల వెళ్లిపోయిన తర్వాత అక్కడున్న పింఛన్‌దారులంతా ఇంటికి పింఛన్లు రాకుండా ఈ టీడీపీ నాయకులే అడ్డుకున్నారని మండిపడ్డారు.

• చంద్రబాబూ మాకేంటి ఈ అవస్థలు



అనంతపురంలో ..



విజయవాడలో..



రాజమండ్రిలో ఓ దివ్యాంగుడి అవస్థ



చంద్రబాబు వైఖరిపై పింఛన్‌దారుల ధర్నా

పింఛను పంపిణీ విధానంపై చంద్రబాబు వైఖరి పట్ల లబ్ధిదారులు నిరసన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం తునికిపాడులో సచివాలయం వద్ద పింఛనుదారులు బుధవారం ధర్నా నిర్వహించారు. ప్రతి నెల వలంటీర్ల ద్వారా ఇంటికి వచ్చి ఇచ్చే పెన్షన్ల కార్యక్రమాన్ని అడ్డుకున్న చంద్రబాబు వైఖరి నశించాలని నినాదాలు చేశారు. పాత పద్ధతిలో వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

కృష్ణా జిల్లా గంగూరులో 'బోడె' శవ రాజకీయం

టీడీపీ, జనసేన కుట్రలతో ఈసారి పింఛన్ ఇవ్వటానికి వలంటీర్ లేకపోవటంతో కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గంగూరులో వెంపటి వజ్రమ్మ (80)గుండెపోటుకు గురై మరణించింది. గంగూరు ఏఆర్ నగర్ కాలనీలో ఉంటున్న వజ్రమ్మ గంగూరు 2 సచివాలయానికి పింఛన్ సొమ్ము కోసం వెళ్లగా బ్యాంకు నుంచి సొమ్ము రావాలని, సాయంత్రం పింఛన్ ఇస్తామని చెప్పడంతో తిరిగి ఇంటికి వచ్చింది. సచివాలయం నుంచి ఇంటికి వచ్చిన కొద్ది క్షణాలకే గుండెపోటుకు గురై మృత్యువాత పడింది. మరోవైపు చేయాల్సిందంతా చేసి డ్రామాలకు టీడీపీ నేతలు తెరలేపారు. వజ్రమ్మ మృతిని శవ రాజకీయం చేయాలని టీడీపీ నేతలు యత్నించగా స్థానిక మహిళలు తీవ్ర అభ్యంతరం తెలిపి తిప్పికొట్టారు. వజ్రమ్మ మృతి సమాచారం తెలుసుకున్న రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జోగి రమేష్ బాధితురాలి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వజ్రమ్మకు నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. కాగా.. మంత్రి అక్కడ ఉన్న సమయంలోనే టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ కూడా తన అనుచరులతో రావటంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. మంత్రి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సమయంలో టీడీపీ అభ్యర్థి బోడెప్రసాద్, అతని అనుచరులు కల్పించుకుని జగన్ పింఛన్ ఇవ్వకపోవటంతోనే వజ్రమ్మ మరణించిందంటూ ఆరోపించారు. బోడె ప్రసాద్ వ్యాఖ్యల పట్ల మహిళలు అభ్యంతరం తెలిపారు. వజ్రమ్మ మరణాన్ని శవ రాజకీయం చేయాలని టీడీపీ నేతలు చేసిన యత్నాన్ని లబ్ధిదారులే తిప్పికొట్టారు. వలంటీర్‌లు పింఛను ఇస్తే చంద్రబాబుకు బాధ ఏంటని బోడె ప్రసాద్‌ను మహిళలు, పింఛన్ లబ్ధిదారులు ప్రశ్నించారు. జగనన్న పాలనలో ప్రతి నెల వేకువజామునే వలంటీర్‌లు ఇళ్లకు వచ్చి పింఛన్ ఇస్తుంటే చంద్రబాబుకు ఎందుకు కడుపు మంట అని మండిపడ్డారు. వజ్రమ్మ అన్యాయంగా చనిపోయిందని, ఇప్పుడు పరామర్శించడానికి వచ్చారా అని నిలదీశారు. ఒక్కసారిగా మహిళలు తిరగబడటంతో టీడీపీ నేతలు వెనక్కి తగ్గారు.

నా పథకాలతో జనాభా పెరుగుతుంది

- డబ్బు ఖాతాల్లో వేస్తా.. మహిళలు ఎక్కువగా పిల్లల్ని కంటారు
- రావులపాలెం ప్రజాగళం సభలో చంద్రబాబు



ప్రజలను ఆపడానికి అడ్డంగా పెట్టిన లారీ

సాక్షి అమలాపురం/కొత్తపేట/రావులపాలెం/రామచంద్రపురం రూరల్: దేశ జనాభా తగ్గిపోతోందని, తాను తీసుకొచ్చిన ఆరు గ్యారంటీ స్కీమ్‌ల ద్వారా జనాభా పెరుగుతుందని తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబునాయుడు చెప్పారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం కెనాల్ రోడ్డులో బుధవారం నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. ఒక ఆడపిల్ల ఉంటే రూ.15 వేలు, ఇద్దరికి రూ.30 వేలు, నలుగురికి రూ.60 వేల చొప్పున ఖాతాల్లో వేస్తానని చెప్పారు. ఇదిచూసి మహిళలు పిల్లల్ని ఎక్కువగా కంటారన్నారు. ఈ ఎన్నికల నాటికి మద్యం లేకుండా చేస్తానన్న జగన్ నాసిరకం మద్యం అమ్ముతున్నారని, ధరలు పెంచి దోచేశారని పేర్కొన్నారు. 'రాష్ట్రంలో మాఫియా పాలన సాగుతుంది. ఇక్కడ కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అవినీతి చేస్తుంటే.. అక్కడ జగన్ దోపిడీ చేస్తున్నాడు' అని చెప్పారు. రాష్ట్రానికి పట్టిన శని పోవాలని పవన్‌కళ్యాణ్ పట్టుదలతో ఉన్నారని, ఓటు చీలకూడదని టీడీపీతో కలిసి వచ్చాడని పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థకు తాను వ్యతిరేకం కాదన్నారు. వలంటీర్‌కు రూ.5 వేలు వస్తుంటే.. తాను రూ.50 వేలు వచ్చేలా చేస్తానని చెప్పారు. 2014లో తాను రాగానే రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2 వేలకు పెంచానని చెప్పారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ పంపిణీ చేయవచ్చన్నారు. మూడో తారీకు వచ్చినా ఉద్యోగులకు జీతాలు, పేదలకు పింఛన్లు లేవు అని విమర్శించారు. సానుభూతి కోసం పెన్షన్ డ్రామా ఆడుతున్నారని విమర్శించిన ఆయన జగన్ తొలినుంచి సానుభూతి కోరుకుంటున్నారని చెప్పారు. జగన్ డ్రామాలకు చీఫ్ సెక్రటరీతో సహా కొందరు ఉద్యోగులు సహకరిస్తున్నారన్నారు. రైతులు, కూలీలు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు ఇలా అందరూ నాశనం.. జగన్ ఒక్కరే బాగున్నారు.. అంటూ వ్యాఖ్యానించారు. కరెంట్ బిల్లులు పెంచేయడంతో ఆక్వారంగం దెబ్బతిందని ఆయన చెప్పారు.

జనం లేక రోడ్డుకు అడ్డంగా లారీ..

చంద్రబాబు ప్రజాగళం యాత్రకు జనం లేకపోవడంతో ఆ పార్టీ నేతలు గిమ్మిక్కులకు పాల్పడ్డారు. చంద్రబాబు ద్రాక్షారామం ప్రధాన రహదారిపై మూడు రోడ్ల జంక్షన్ అయిన బోసుబొమ్మ సెంటర్‌లో సభ నిర్వహించారు. జనం పెద్దగా రాకపోవడంతో ద్రాక్షారామం నుంచి కాకినాడ వైపు వెళ్లే ప్రధాన రహదారిని చంద్రబాబు హోర్డింగు ఉంచిన లారీతో బ్లాక్ చేశారు. జనం ఆ రోడ్డుకు వెళ్లకుండా కొంతమేర అడ్డుకున్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం ॥ 4-4-2024



డాక్టర్ అనితా శర్మ

ఆమె పోలియో బాధితురాలు.
ఐ.ఐ.ఎం. ఇండోర్‌లో పీహెచ్‌డీ చేసిన విద్యాధికురాలు.
కాని ఆమె తన జీవితాన్ని దివ్యాంగుల కోసం అంకితం చేసింది.
పట్టుదలగా డ్రైవింగ్ నేర్చుకోవడమేగాక
దివ్యాంగులకు డ్రైవింగ్ నేర్పించే స్కూల్ నడుపుతోంది.
ఏయే పరికరాలు అమర్చడం ద్వారా
దివ్యాంగులు సులభంగా డ్రైవ్ చేయవచ్చో తెలుపుతోంది.
'డ్రైవ్ ఆన్ మై ఓన్' సంస్థ నడుపుతున్న
డాక్టర్ అనితా శర్మ గురించి.

కదలండి కదిలించండి

అనితాశర్మకు కారు డ్రైవింగ్ నేర్చుకోవాలనిపించింది. జైపూర్ ఆమెది. జైపూర్‌లో పదిహేను, ఇరవై కాల్స్ చేసింది. ఎవరూ నేర్పించము అన్నారు. ఢిల్లీలో నేర్పుతారేమోనని అక్కడా ఒక పది, ఇరవై కాల్స్ చేసింది. అక్కడా ఎవరూ నేర్పము అన్నారు. కారణం? అనిత కుడికాలుకు పోలియో ఉంది. పోలియోతో బాధ పడుతున్నవారికి, లేదా ఇతర దివ్యాంగులకు కారు డ్రైవింగ్ నేర్పించే తర్ఫీదు డ్రైవింగ్ స్కూల్స్‌కు లేదు. అలా చేయడానికి అవసరమైన మోడిఫైడ్ కార్లు వారి దగ్గర ఉండవు.



దివ్యాంగుల కోసం డ్రైవింగ్ క్లాసులు నిర్వహిస్తున్న అనితా శర్మ

దివ్యాంగులు చక్రాల కుర్చీకి పరిమితం కావలసిందేనా? వారు తమకు తాముగా బయటకు తిరగకూడదా అనుకుంది అనితా శర్మ.

తల్లి సహాయంతో...

అనితా శర్మ ఇండోర్ ఐ.ఐ.ఎంలో పీహెచ్‌డీ చేసింది. అమృతసర్ ఐ.ఐ.ఎంలో ప్రొఫెసర్ ఉద్యోగం సంపాదించింది. అయితే ఆమెకు కారు నడపాలన్న కోరిక మాత్రం తీరలేదు. 'మొదట నేను అదనపు చక్రాలు బిగించిన టూ వీలర్ నడిపాను. నా ఆనందానికి అవధుల్లేవు. కారు నడిపితే ఎంత బాగుండో అనిపించింది. హ్యాండ్ కంట్రోల్ ఉండేలా కారును మోడిఫై చేయించి మా అమ్మ సహాయంతో నేర్చుకున్నాను. ఇప్పుడు నేను ఎప్పుడైనా ఎక్కడికైనా నా కారులో ప్రయాణించగలను. నేను కారు నడపడం చూసి చాలా మంది దివ్యాంగులు మాకు నేర్పించవచ్చు కదా అనడిగేవారు. వారి కోసం పని చేయాలనిపించింది. అందుకే నా ఉద్యోగానికి రాజీనామా చేసి'డ్రైవ్ ఆన్ మై ఓన్' సంస్థ స్థాపించాను. దివ్యాంగులకు కారు డ్రైవింగ్ నేర్పించి, సొంత కారు కొనుక్కోవడంలో అవసరమైన సాయం చేయడమే మా సంస్థ ఉద్దేశం' అంటుందామె.

కస్టమైజ్డ్ కార్లు

అనితాశర్మ సంస్థ దివ్యాంగుల కోసం డ్రైవింగ్ క్లాసులు నిర్వహిస్తుంది. వెబినార్లు, సెమినార్లు నిర్వహిస్తుంది. దివ్యాంగుల కమ్యూనిటీలో ఒకరికొకరికి పరిచయాలు చేసి ప్రోత్సహించుకునేలా చేస్తుంది. శారీరక పరిమితులను అనుసరించి కారులో ఎటువంటి మోడిఫికేషన్ చేస్తే కారు నడపవచ్చో సూచిస్తుంది. ఆ మోడిఫికేషన్ పరికరాలు సమకూర్చడంలో సాయం చేస్తుంది. ఆ తర్వాత కార్ల రిజిస్ట్రేషన్, జిఎస్‌టి వంటివి దివ్యాంగుల పక్షంలో జరిగేలా చూస్తుంది. 'ఇదంతా చేయడానికి మేము కొంత ఫీజు తీసుకుంటాం. దివ్యాంగులు ఛారిటీ మీద కాకుండా తమ కాళ్ల మీద తాము బతకాలన్నదే నా ఉద్దేశం' అంటుంది అనితా శర్మ.

కుటుంబ సభ్యులు

'దివ్యాంగులు కారు నడపడానికి వారి కుటుంబసభ్యులను ఒప్పించడమే పెద్ద సమస్య. దివ్యాంగులు కారు నడపగలరు. వారిని డ్రైవింగ్ సీట్‌లో స్లయిడర్స్ ద్వారా సులువుగా చేర్చవచ్చు. కాళ్లతో పని లేకుండా చేతులతోనే మొత్తం కంట్రోల్ చేయొచ్చు. వారికి తిరగాలని ఉంటుంది. ధైర్యం చెప్పి సహకరించి తిరగనివ్వండి' అని సూచిస్తోంది అనితా శర్మ.

న్యూస్ మేకర్



సంపన్న కుటుంబ నేపథ్యం లేని మిక్కీ జగ్తియాని
'ల్యాండ్‌మార్క్'తో ఒక్కోమెట్టు ఎక్కుతూ
ప్రపంచ కుబేరుల సరసన నిలిచాడు.
భర్త అడుగు జాడల్లో నడిచి వ్యాపార నైపుణ్యాన్ని
సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని
'ల్యాండ్ మార్క్'కు తనదైన మార్క్ జోడించి
ఆ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించింది.
తాజాగా... ఫోర్బ్స్ న్యూ బిలియనీర్స్
2024 జాబితాలో చోటు సాధించింది.

విజయాలకు ల్యాండ్ మార్క్

రేణుకా జగ్తియాని

రేణుకా జగ్తియాని నేతృత్వంలోని దుబాయ్ చెందిన రిటైలింగ్ దిగ్గజం 'ల్యాండ్‌మార్క్' 21 దేశాలలో పాదరక్షల నుంచి గృహోపకరణ వస్తువుల వరకు వివిధ బ్రాండ్‌లతో విజయపథంలో దూసుకుపోతుంది.

హాస్పిటాలిటీ బిజినెస్‌లో కూడా గెలుపు జెండా ఎగరేసింది. ఎప్పటికప్పుడు కొత్త ప్రణాళికలతో ముందుకువెళ్లే రేణుక మిడిల్ ఈస్ట్, ఇండియా, ఆగ్నేయాసియాలోని కీలక మార్కెట్‌లలో రాబోయే కాలంలో వందలాది స్టోర్‌లను ప్రారంభించాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

ఎలాంటి వ్యాపార అనుభవం లేని రేణుక 1993లో ల్యాండ్‌మార్క్ గ్రూప్‌లోకి అడుగు పెట్టింది.

'ఇది సాధ్యమా!' అనుకునే వాళ్ల సందేహాల దగ్గరే తచ్చాడుతారు.

'కచిత్యంగా సాధ్యమే' అనుకునే వాళ్లు ముందుకు దూసుకుపోతారు.

రేణుక రెండోకోవకు చెందిన మహిళ. వేగంగా వ్యాపార నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవడమే కాదు ఫాస్ట్–ఫ్యాషన్ బిజినెస్ 'స్ప్లాష్'తో తనదైన ముద్ర వేసింది. 'స్ప్లాష్' పదకొండు దేశాలలో 200 స్టోర్స్ వరకు విస్తరించింది. మన దేశంలో 1999లో లైఫ్‌స్టైల్, హోమ్ సెంటర్ అండ్ మాక్స్‌లాంటి అయిదు ఫార్మట్స్‌లో ప్రస్థానం ప్రారంభించి 900 స్టోర్స్‌లో విస్తరించింది ల్యాండ్‌మార్క్.

2017లో రేణుక ల్యాండ్ మార్క్ గ్రూప్ చైర్‌పర్సన్, సీయీవోగా బాధ్యతలు స్వీకరించింది.

రేణుక భర్త మిక్కీ జగ్తియాని సౌత్ ఆఫ్రికా ఇమిగ్రెంట్స్‌ను దృష్టిలో పెట్టుకొని బహ్రెయిన్‌లో బేబీ ప్రొడక్ట్స్ స్టోర్‌ను మొదలుపెట్టాడు. అక్కడినుంచి ప్రారంభమైన బుడి బుడి అడుగుల వ్యాపారం 'ల్యాండ్ మార్క్' రూపంలోఎక్కడికో వెళ్లింది.

భర్త నిర్మించిన వ్యాపార సామ్రాజ్యాన్ని చెక్కుచెదరకుండా నిలబెట్టడం అంత సులువు కాదు. కాని ఎక్కడా రేణుక వెనకడుగు వేయలేదు. అయితే ప్రపంచంలోని ఎన్నో కంపెనీలపై పడినట్లే కోవిడ్ సంక్షోభ ప్రభావం 'ల్యాండ్ మార్క్' పై పడింది. రెండు నెలలకు పైగా స్టోర్స్ అన్నీ క్లోజ్ అయిపోయాయి. ఆ తరువాత మెల్లమెల్లగా కొత్త గైడ్‌లైన్స్‌తో తెరుచుకోవడం మొదలైంది.

> **భర్త అడుగుజాడల్లో నడిచి, వ్యాపారనైపుణ్యాన్నే కాదు సేవా దృక్పథాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని వ్యాపారంతోపాటు సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తోంది.**

'విపత్కరమైన పరిస్థితుల్లో ఆపరేషనల్ ప్రాసెస్‌లో ర్యాపిడ్ చేంజెస్ చేశాము. ఉద్యోగుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాం. క్వారంటైన్‌లో ఉన్న ఉద్యోగులు లేదా వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయం అందించాం, వారిలో ధైర్యం నింపాం. ఆఫీస్, స్టోర్ ఉద్యోగుల కోసం ప్రత్యేక వసతి ఏర్పాటు చేశాం. ఉద్యోగుల కోసమే కాదు కోవిడ్ బాధితుల కోసం మా ఫౌండేషన్ తరపున ఎన్నోరకాల సేవాకార్యక్రమాలు చేపట్టాం' అంటూ ఆ రోజులను గుర్తు తెచ్చుకుంటుంది రేణుక.

చిన్న వ్యాపారంగా మొదలైన 'ల్యాండ్ మార్క్' గల్ఫ్‌కు సంబంధించి 'కింగ్ ఆఫ్ రిటైల్'గా పేరు తెచ్చుకుంది.

విజయపథంలో దూసుకుపోతున్న 'ల్యాండ్‌మార్క్' ముందున్న కర్తవ్యం... సమాజానికి తిరిగి ఇవ్వాలి. ఆదరించిన ప్రజలకు అండగా ఉండాలి. పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్న ల్యాండ్ మార్క్ గ్రూప్ చెన్నై, ముంబై మురికివాడల్లో రకరకాల సేవాకార్యక్రమాలు చేపడుతోంది.

రేణుక జగ్తియాని భర్త మిక్కీ జగ్తియాని 71 సంవత్సరాల వయసులో చనిపోయారు. కొన్ని సంవత్సరాల క్రితం ఒక రిపోర్టర్ ఆయనను 'మీ నెక్స్ట్ ప్లాన్ ఏమిటి?' అని అడిగాడు.

దీనికి మిక్కీ జగ్తియాని చెప్పిన జవాబు...

'నా గురించి నేను పూర్తిగా తెలుసుకోవడానికి ఎక్కువ సమయం గడపాలనుకుంటున్నాను. వ్యాపార సంబంధిత విషయాల గురించి కాకుండా నేనెవరిని? జీవితపరమార్థం ఏమిటి? లాంటి విషయాల గురించి ఆలోచిస్తుంటాను. వ్యాపార లాభాలే కాదు జీవితానికి సంబంధించిన ఎన్నో అంశాలలో ఆనందం దొరుకుతుంది'

భర్త అడుగుజాడల్లో నడిచి, వ్యాపార నైపుణ్యాన్నే కాదు సేవాదృక్పథాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని వ్యాపారంతో పాటు సేవాకార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తోంది.

బటర్‌ఫ్లై మామ్

ఇల్లంటే ఎలా ఉండాలి? ఇంటి ముందు గుమ్మానికి ఆకుపచ్చ తోరణం ఉండాలి. గుమ్మానికి ఇరువైపులా పచ్చటి మొక్కలుండాలి. ఆ మొక్కలకు రంగురంగుల పువ్వులుండాలి. ఇంట్లోకి అడుగుపెడుతుంటే పరిమళాలు స్వాగతం పలుకుతుండాలి. ఇవన్నీ ముంబయి నగరంలో, మల్టీ స్టోరీడ్ బిల్డింగ్‌లో సాధ్యమయ్యే పనేనా? సాధ్యం కాదని ఊరుకుంటే ప్రియాంక సింగ్ బటర్‌ఫ్లై మామ్ అయ్యేదే కాదు. ఆమె ఇల్లు వేలాది సీతాకోక చిలుకలకు పుట్టిల్లయ్యేదీ కాదు.

ప్రియాంక సింగ్‌ది ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి పట్టణం. గంగానది తీరాన, వందల ఏళ్ల నాటి మహావృక్షాల నీడన పెరిగిన బాల్యం ఆమెది. చదువు, ఉద్యోగం, పెళ్లి... ఆమె గమ్యాన్ని నిర్దేశించాయి. ముంబయిలో అడుగు పెట్టింది. ఆమె ఫ్లాట్ ఆ భవనంలో పదమూడవ ఫ్లోర్‌లో ఉంది. తాను గడిపిన అందమైన బాల్యం తన పిల్లలకు ఉండదని దిగులు పడిందామె. మహావృక్షాల నీడన కాకున్నా, కనీసం అడుగు ఎత్తు మొక్కల మధ్య పెరిగినా చాలనుకుంది. బాల్కనీలో రకరకాల మొక్కలు పెంచింది. మొక్కలను సేంద్రియ పద్ధతిలో పెంచాలనుకోవడమే ఆమెకు తెలియకుండా ఆమె చేసిన ఓ మంచిపని. మొక్కలకు చీడపీడలకు రసాయన క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రియాలతో పెంచింది. ఒకరోజు ఒక లార్వా ఆమె మొక్కల ఆకుల కింద కనిపించింది. రోజుల్లోనే అది ప్యూపా దశకు చేరడం, ఆ తర్వాత రంగురంగుల సీతాకోక చిలుక రెక్కలు విచ్చుకుని ఎగరడం అన్ని దశలూ చూస్తుండగానే జరిగిపోయాయి.

అప్పటి నుంచి ఆమె సీతాకోక చిలుకల పరిణామక్రమాన్ని చదవడం మొదలు పెట్టింది. ఆ తర్వాత రసాయన క్రిమిసంహారిణులను ఇంట్లోకి తీసుకురావడమే మానేసింది. ఇప్పుడామె బాల్కనీలో నిమ్మజాతి చెట్లు, అక్షింతల చెట్టు, కరివేపాకు, వెస్ట్ ఇండియన్ జాస్మిన్... వంటి మొక్కలున్నాయి. వాటి మీద మోనార్క్ బటర్‌ఫ్లై, కామన్ జాయ్, లైమ్ స్వాలోటెయిల్ వంటి అరుదైన జాతుల సీతాకోక చిలుకలు కనిపిస్తున్నాయి. అలా వచ్చి వెళ్లిపోకుండా ఆ చెట్ల ఆకుల మీదనే గుడ్లు పెడుతున్నాయి. సంతతిని వృద్ధి చేస్తున్నాయి. ఆమె ఇంట్లో సీతాకోక చిలుకలకు అనువైన వాతావరణం ఉంది. ఆ వాతావరణాన్ని పరిరక్షిస్తోందామె. అందుకే ప్రియాంక సింగ్‌ను బటర్ ఫ్లై మామ్ అంటున్నారు ఆమె స్నేహితులు. తాను జీవవైవిధ్యత కోసం అంకితమవుతానని వారణాసి నుంచి ముంబయికి పయనమైనప్పుడు కలలో కూడా ఊహించలేదు... అంటుంది ప్రియాంక సింగ్. ఆమెకు సీతాకోక చిలుకలను చూస్తూ తేడాలను గుర్తించడంతో పాటు ప్రతి సీతాకోక చిలుకనూ ఫొటో తీయడం అలవాటైంది. ఇప్పటివరకు ఆమె మినీ గార్డెన్‌లో ఐదు వేలకు పైగా సీతాకోక చిలుకలు కొలువుదీరాయి. రెక్కలొచ్చిన తర్వాత ఎగిరి వెళ్లిపోయాయి.



ప్రియాంక సింగ్





విపుల్ వర్షిణే

'కోరుకున్న రంగంలో రాణించాలంటే
మనలో ఒక తపన ఉండాలి.
ఒక తపస్సులా ఆ రంగాన్ని స్వీకరించాలి.
ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎదుర్కోడానికి
సిద్ధంగా ఉండాలి' అంటారు
ఐదు పదుల వయసు దాటిన విపుల్ వర్షిణే.
లక్నోవాసి అయిన విపుల్ వర్షిణే ముప్పైఏళ్లుగా
ఆర్కిటెక్చర్ రంగంలో తనదైన ముద్ర వేస్తూ,
గుర్తింపు పొందారు.
ఒక్కరూ తన మాట వినడం లేదు అనే నిరాశ నుంచి
రెండు విమానాశ్రయాల రూపకల్పన చేసేంత
స్థాయికి ఎదిగారు.
విపుల్ వర్షిణే తనను తాను శక్తిగా మలుచుకున్న విధానం
నేటి మహిళలకు స్ఫూర్తిని కలిగిస్తుంది.

ఎదుర్కోడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి

'నా పేరు విపుల్ అనే ఉండటంతో మగ ఆర్కిటెక్ట్ అనుకుని, సంప్రదించేవారు. నేను మహిళను అని తెలిసి వర్క్ ఇవ్వడానికి వెనకడుగు వేసేవారు. ఇప్పుడు ఈ పరిస్థితుల్లో కొంతమార్పు చూస్తున్నాను కానీ, 30 ఏళ్ల క్రితం నేను ఆర్కిటెక్ట్ అని చెబితే చాలామంది ఆశ్చర్యపోయేవారు. ఇప్పుడు నేను రెండు విమానాశ్రయాలను డిజైన్ చేసే స్థాయికి ఎదిగాక ఈ రంగంలో అమ్మాయిలూ రాణించగలరు అనే స్పష్టత వచ్చింది. ఈ విషయాన్ని నిరూపించడానికి నేను చేసిన ప్రయత్నం ఆషామాషీ కాదు.

సృజనతో అడుగు

పుట్టి, పెరిగింది లక్నోలో. స్కూల్ ఏజ్ నుంచి పెయింటింగ్స్ వేయడం, కార్టూన్స్ గీయడం వంటివి చూసి వాటిని పత్రికలకు పంపించే వారు నాన్న. మొదట నేను మెడిసిన్ చదవాలని కోరుకున్న మా నాన్న నాలోని సృజనాత్మకత చూసి ఆర్కిటెక్ట్ ఇంజినీరింగ్ చేయమని సలహా ఇచ్చారు. ఎందుకంటే ఆర్కిటెక్చర్ సైన్స్, సృజనాత్మకతల సమ్మేళనంగా ఉంటుంది. మా నాన్న మనసులో నేను గవర్నమెంట్ ఉద్యోగం చేయాలని, అది నాకు సురక్షితమైనదని భావించేవారు. నేను ఎంచుకున్న రంగం చాలా శ్రమతో కూడుకున్నదని ఆయనకు తెలియదు. అప్పట్లో కంప్యూటర్లు లేవు కాబట్టి రాత్రంతా డ్రాయింగ్ బోర్డ్ పైనే పని చేయాల్సి వచ్చేది.

ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు..

''నేను ఆర్కిటెక్చరల్ ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడు మా క్లాస్‌లో ముగ్గురం మాత్రమే అమ్మాయిలం. ఈ వృత్తిలో అబ్బాయిలదే అధిపత్యమని అప్పుడు అర్థమైంది. కాలేజీలో చదివే సమయంలోనే పెళ్లి అయ్యింది. మావారు సివిల్ ఇంజనీర్ కాబట్టి పెళ్లయ్యాక ఆయనతోనే కెరీర్ ప్రారంభించాను. భవనాలు కట్టే లొకేషన్‌కు వెళ్లేటప్పుడు నాతో మాట్లాడేందుకు కూలీలు తడబడేవారు. మేస్త్రీలు నా మాటలను అస్సలు పట్టించుకునేవారు కాదు. ఒక మహిళ యజమానిగా మారడం వారెవరికీ ఇష్టం ఉండదని అప్పుడు అర్థమైంది. అసలు నన్ను వారు నిర్మాణశిల్పిగా అంగీకరించలేదు. నిరాశగా అనిపించేది. కానీ, నా డిజైన్ ప్రకారమే పనిచేయాల్సి ఉంటుందని నా నిర్ణయాన్ని సున్నితంగానూ, అంతే కచ్చితంగానూ తెలియజేశాను. అక్కడ నుంచి ఆర్కిటెక్ట్‌గా ఎదగడానికి నన్ను నేను మార్చుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. ఆఫీస్‌లో నాకు, నా భర్తకు విడివిడిగా క్యాబిన్లు ఉండేవి. క్లయింట్స్ వచ్చినప్పుడల్లా నా సలహా తీసుకోవాలని నా భర్త తరచూ వారికి చెప్పాల్సి వచ్చేది. తీసుకున్న ప్రాజెక్ట్ పూర్తి చేయడం పట్ల పూర్తి శ్రద్ధ పెట్టేదాన్ని. కానీ వచ్చిన వాళ్లు మాత్రం 'మిస్టర్ విపుల్ వర్షిణే ఎప్పుడు వస్తారు' అని అడిగేవారు. నేనే విపుల్ అని, ఆర్కిటెక్ట్ అని తెలిసి ఆశ్చర్యపోయేవారు.

200 భవనాల జాబితా

భవన నిర్మాణంలో నా వర్క్‌ని కొనసాగిస్తూనే లక్నోలోని చారిత్రక కట్టడాలపై, వాటి పరిరక్షణ గురించి ప్రాజెక్ట్ వర్క్ చేశాను. అక్కడి వారసత్వ కట్టడాల పట్ల ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోవడం లేదని తెలుసుకొని దాదాపు 200 భవనాల జాబితాను తయారు చేశాను. ఆ జాబితాను పురావస్తు శాఖకు అప్పగించాను. ఆ సమయంలోనే 500 పేజీల ఆ ప్రాజెక్ట్ వర్క్‌ని పుస్తకంగా తీసుకువస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్న సన్నిహితుల సలహాతో బుక్‌గా తీసుకువచ్చాను. అలా రచనా ప్రపంచంలోకి అడుగుపెట్టాను. ఇప్పటి వరకు మన దేశ వారసత్వ సంపద పైన ముఖ్యంగా లక్నో సంస్కృతి, వారసత్వ నగరం, చరిత్ర ద్వారా నడక, మ్యూజింగ్స్ ఇన్ బెనారస్, ఎ కెలిడోస్కోప్ ఆఫ్ ది హార్ట్, లక్నో ఎ ట్రెజర్ పేర్లతో 5 పుస్తకాలు ప్రచురితమయ్యాయి. ఇటీవలే అయోధ్యకు సంబంధించి ఎ వాక్ త్రూ ది లివింగ్ హెరిటేజ్ ప్రచురితమైంది.

'షామ్ ఎ అవధ్ పుస్తకంలో లక్నో సంస్కృతిపై స్కెచ్‌లు కూడా వేశాను. లక్నోలోని చికంకారీ ఎంబ్రాయిడరీ, ఈ నగరంలోని వీధులు, మార్కెట్ల గురించి ప్రస్తావించాను. లక్నో ఇన్‌టాక్‌కి కన్వీనర్‌గా ఉన్నాను.

లేహ్ విమానాశ్రయం .. ఓ సవాల్!

2018లో లేహ్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ చేసే అవకాశం వచ్చింది. ఈ ప్రాజెక్ట్ నాకు అత్యంత సవాల్‌గా ఉండేది. ఎందుకంటే అక్కడ భూమి, పర్యావరణం చాలా భిన్నంగా ఉంటాయి. పర్వతాల కారణంగా భూభాగం చాలా తేడాగా ఉంటుంది. విమానాశ్రయం అరైవల్, డిపార్చర్ లాంజ్‌ల మధ్య 3 అంతస్తుల వ్యత్యాసం ఉంది. అక్కడ లగేజీ బెల్ట్ రివర్స్ చేయాల్సి వచ్చింది. ఉష్ణోగ్రత చాలా తక్కువ కాబట్టి, ఎయిర్ కండీషనర్లలో ఉపయోగించే ద్రవం ఘనీభవన స్థానం కంటే తక్కువగా ఉంది. అలాంటప్పుడు ప్రత్యేక రసాయనాలను ఉపయోగించి, దానిని ఏర్పాటు చేశాను. లేహ్‌లో అనేక బౌద్ధ విహారాలు ఉన్నాయి. ప్రవేశం ద్వారం వద్ద 30 అడుగుల ఎత్తైన బుద్ధుని విగ్రహాన్ని ఉంచాను. అక్కడి స్థానిక సంస్కృతి, కళ, హస్తకళలను దృష్టిలో ఉంచుకుని రంగు రంగుల వలలు, ప్రార్థన చక్రాలను ఏర్పాటు చేయించాను. అయోధ్య విమానాశ్రయం పని ప్రారంభించినప్పుడు అక్కడ మహంతులు, సాధువులను కలుస్తూ ఉండేదాన్ని. ఎందుకంటే అక్కడి నిర్మాణాన్ని బాగా అర్థం చేసుకోవాలి, సరైన సమాచారం కోసం చాలా పుస్తకాలు చదివాను. వివిధ వృత్తులలో ఉన్న వ్యక్తులతో మాట్లాడాను. దీంతో అయోధ్యపై నాకు ఆసక్తి పెరుగుతూ వచ్చింది. ఆ తర్వాత దానినే పుస్తకంగా తీసుకు వచ్చాను.

ఒక సృజనాత్మక వ్యాపకం నన్నూ నా దిశను మార్చింది. సవాల్‌గా ఉన్న రంగంలో సమున్నతంగా నిలబడేలా చేసింది. ఏ రంగం ఎంచుకున్నా అందులో మనదైన ముద్ర తప్పక వేయాలి. అప్పుడే, ఎక్కడ ఉన్నా సరైన గుర్తింపు లభిస్తుంది' అని వివరిస్తారు విపుల్ వర్షిణే.

బ్యూటిప్స్

పెడిక్యూర్ సింపుల్‌గా

పాదాలు అందంగా ఆరోగ్యంగా ఉండాలంటే చర్మం మీద మృత కణాలు తొలగించడం ప్రధానం. ఇంట్లోనే చేసుకోగలిగిన సింపుల్ పెడిక్యూర్ చేసుకునేటప్పుడు ఒక జాగ్రత్త తప్పనిసరిగా పాటించాలి. పాదాలను శుభ్రం చేయడానికి వాడే పమిస్ స్టోన్ మరీ పాతదై పోయి స్టోన్ రంధ్రాలు మురికితో నిండినప్పటికీ కొందరు దానినే ఉపయోగిస్తుంటారు. అది అసలు మంచిది కాదు. దాని వల్ల చర్మం మీదున్న మృతకణాలు తొలగకపోగా ఇతర ఇన్‌ఫెక్షన్‌లు వచ్చే ప్రమాదం ఉంటుంది.



- గోరు వెచ్చటి నీటిలో రెండు చుక్కలు లిక్విడ్ సోప్ లేదా షాంపూ వేసి కలిపి అందులో పాదాలను పది నిమిషాల సేపు ఉంచాలి. ఆ తర్వాత పాదాలను, వేళ్లను పమిస్ స్టోన్ లేదా ఫుట్ ఫైలర్‌తో రుద్ది శుభ్రం చేయాలి.
- పాదాలను పొడి వస్త్రంతో తుడిచి మాయిశ్చరైజర్ లేదా బాడీ క్రీమ్ రాయాలి.
- క్రీమ్ రాసిన తర్వాత పాదాలకు, వేళ్లకు మర్దన చేయాలి. ఇలా చేయడం వల్ల పాదాలు అలసట తొలగి సాంత్వన పొందుతాయి. రక్త ప్రసరణ మెరుగవడంతో పాదాల నొప్పులు, పాదాల కండరాలు పట్టేయడం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి.



నిఖత్ విదేశీ శిక్షణకు క్రీడా శాఖ ఆమోదం

పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తెలంగాణ స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్‌తోపాటు ప్రీతి, పర్వీన్, లవ్లీనా విదేశీ గడ్డపై శిక్షణ తీసుకోనున్నారు. ఒలింపిక్స్ సన్నాహాల కోసం ఈ నలుగురు బాక్సర్లు టర్కీ వెళ్లనున్నారు. ఈ నలుగురు బాక్సర్ల శిక్షణకు అయ్యే మొత్తం ఖర్చును భరిస్తామని కేంద్ర క్రీడా శాఖ ప్రకటించింది. క్రొయేషియా, చెక్ రిపబ్లిక్‌లో జరిగే అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనేందుకు భారత టేబుల్ టెన్నిస్ స్టార్ మనిక బత్రాకు అయ్యే ఖర్చులు భరిస్తామని క్రీడా శాఖ తెలిపింది.

ఐపీఎల్ టోర్నీకి శివమ్ మావి దూరం

పక్కటెముకల గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో భారత క్రికెటర్, లక్నో సూపర్ జెయింట్స్ జట్టు పేస్ బౌలర్ శివమ్ మావి ఐపీఎల్ 17వ సీజన్ నుంచి వైదొలిగాడు. గత ఏడాది ఐపీఎల్‌లో రన్నరప్‌గా నిలిచిన గుజరాత్ టైటాన్స్ జట్టులో శివమ్ మావి సభ్యుడిగా ఉన్నాడు. అయితే అతనికి ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. గత డిసెంబర్‌లో జరిగిన మినీ వేలంలో లక్నో ఫ్రాంచైజీ ఏకంగా రూ. 6 కోట్ల 40 లక్షలకు శివమ్ మావిని కొనుగోలు చేసింది.



పోరాడి ఓడిన సుమిత్

మరాకెష్ (మొరాకో): గ్రాండ్‌ప్రి హసన్–2 ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 95వ ర్యాంకర్ సుమిత్ 6–1, 3–6, 4–6తో ప్రపంచ 61వ ర్యాంకర్ లొరెంజో సొనెగో (ఇటలీ) చేతిలో ఓడిపోయాడు. సుమిత్‌కు 10,165 యూరోల (రూ. 9 లక్షల 16 వేలు) ప్రైజ్‌మనీ, 25 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



యూకీ జోడీ శుభారంభం

ఇదే టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్)–ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో యూకీ–ఒలివెట్టి జంట 6–3, 6–4తో స్టీవెన్స్ (నెదర్లాండ్స్)–పెట్రోస్ సిట్సిపాస్ (గ్రీస్) ద్వయంపై గెలిచింది.

శ్రీలంక క్లీన్‌స్వీప్



చట్టోగ్రామ్: బంగ్లాదేశ్ గడ్డపై తమ అజేయ రికార్డును శ్రీలంక జట్టు కొనసాగించింది. ఆతిథ్య జట్టుతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను ధనంజయ డిసిల్వా సారథ్యంలోని శ్రీలంక జట్టు 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. 511 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 318 పరుగులకు ఆలౌటైంది. చివరి రోజు బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 268/7తో ఆట కొనసాగించిన బంగ్లాదేశ్ మరో 50 పరుగులు జోడించి మిగతా మూడు వికెట్లు కోల్పోయింది. లంక బౌలర్లలో లాహిరు కుమార (4/50), కామిందు మెండిస్ (3/32) రాణించారు.

బంగ్లాదేశ్‌లో భారత మహిళల జట్టు పర్యటన

ఢాకా: ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు ఈనెలలో భారత మహిళల క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించనుంది. బంగ్లాదేశ్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం భారత జట్టు ఈనెల 23న బంగ్లాదేశ్‌కు చేరుకుంటుంది. మే 10వ తేదీన పర్యటన ముగించుకొని తిరిగి వెళుతుంది. సిల్హెట్‌లో జరిగే ఈ సిరీస్‌లో రెండు జట్లు ఏప్రిల్ 28, 30, మే 2, 6, 9వ తేదీల్లో ఐదు టి20 మ్యాచ్‌లు ఆడతాయి.

విశాఖలో పరుగుల సంద్రం

కోల్‌కతా నైట్‌రైడర్స్ స్కోరు 272/7

ఢిల్లీపై 106 పరుగులతో గెలుపు

చెలరేగిన నరైన్, అంగ్‌క్రిష్, రసెల్

సరిగ్గా వారం రోజుల క్రితం... గత బుధవారం హైదరాబాద్ గడ్డపై సన్‌రైజర్స్ భీకర బ్యాటింగ్‌తో ఐపీఎల్‌లో అత్యధిక స్కోరును నమోదు చేసింది. ఇప్పుడు ఈ బుధవారం విశాఖపట్నం వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్ అదే తరహా పరుగుల విధ్వంస రచన చేసింది. రికార్డు స్కోరుకు చేరువగా వచ్చి త్రుటిలో దానిని అందుకోలేకపోయినా... ఐపీఎల్‌లో రెండో అత్యధిక స్కోరును కోల్‌కతా సాధించింది. సునీల్ నరైన్, అంగ్‌క్రిష్ రఘువంశీ, రసెల్ ఇందులో కీలక పాత్ర పోషించారు... ఆ తర్వాత భారీ స్కోరు చూసి ముందే తలవంచిన ఢిల్లీ లక్ష్యానికి చాలా దూరంలో ఆగిపోయింది. కోల్‌కతా ఖాతాలో హ్యాట్రిక్ విజయం చేరగా... ఢిల్లీ మళ్లీ ఓటమి బాట పట్టింది.

సాక్షి, విశాఖపట్నం: మాజీ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) తాజా సీజన్ ఐపీఎల్‌లో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరిగిన పోరులో కేకేఆర్ 106 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. ఐపీఎల్ చరిత్రలో సన్‌రైజర్స్ (277) తర్వాత ఇదే రెండో అత్యధిక స్కోరు. సునీల్ నరైన్ (39 బంతుల్లో 85; 7 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు వేగంతో బ్యాటింగ్ చేయగా... అంగ్‌క్రిష్ రఘువంశీ (27 బంతుల్లో 54; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అంతే జోరుతో అండగా నిలిచాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 48 బంతుల్లోనే 104 పరుగులు జోడించారు. ఆ తర్వాత ఆండ్రీ రసెల్ (19 బంతుల్లో 41; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడు కేకేఆర్‌కు భారీ స్కోరును అందించింది. అనంతరం ఢిల్లీ 17.2 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రిషభ్ పంత్ (25 బంతుల్లో 55; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (32 బంతుల్లో 54; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు.

శతక భాగస్వామ్యం...

తొలి ఓవర్లో ఎక్స్‌ట్రాల రూపంలోనే 7 పరుగులతో కేకేఆర్ ఇన్నింగ్స్ ఆరంభం కాగా... తర్వాతి రెండు ఓవర్లలో సాల్ట్ (12 బంతుల్లో 18; 4 ఫోర్లు), నరైన్ కలిసి 25 పరుగులు రాబట్టారు. అయితే రైడర్స్ అసలు జోరు ఇషాంత్ వేసిన నాలుగో ఓవర్లో మొదలైంది. నరైన్ వరుసగా 6, 6, 4, 0, 6, 4 బాది ఏకంగా 26 పరుగులు సాధించడం విశేషం. సాల్ట్ వెనుదిరిగిన తర్వాత నరైన్‌తో రఘువంశీ జత కలిశాక కోల్‌కతా మరింత వేగంగా దూసుకుపోయింది. సలామ్ ఓవర్లో నరైన్ 3 ఫోర్లు, సిక్స్ కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 88 పరుగులకు చేరింది. 21 బంతుల్లోనే నరైన్ అర్ధ సెంచరీ పూర్తయింది. అక్షర్ కూడా వేసిన ఒక్క ఓవర్లో 18 పరుగులు సమర్పించుకున్నాడు. సుమీత్ ఓవర్లో వరుసగా 6, 4 కొట్టిన రఘు... సలామ్ ఓవర్లో రెండు సిక్సర్లతో చెలరేగాడు. ఎట్టకేలకు 13వ ఓవర్లో మార్ష్ ఈ జోడీని విడదీశాడు. టి20ల్లో తన అత్యధిక స్కోరు సాధించిన నరైన్ సెంచరీ అవకాశాన్ని చేజార్చుకోగా... మరోవైపు 25 బంతుల్లో రఘు హాఫ్ సెంచరీని అందుకున్నాడు. రఘువంశీ కూడా వెనుదిరిగిన తర్వాత రసెల్ తన స్థాయిని ప్రదర్శిస్తూ బౌండరీలతో చెలరేగుతూ స్కోరును 200 పరుగులు దాటించాడు. శ్రేయస్ అయ్యర్ (18) అవుటైన తర్వాత నోర్జే ఓవర్లో 3 సిక్స్‌లు, ఫోర్ బాది రింకూ సింగ్ (8 బంతుల్లో 26; 1 ఫోర్, 3 సిక్స్‌లు) పండగ చేసుకున్నాడు. ఈ ఓవర్లో మొత్తం 25 పరుగులు వచ్చాయి. మరో 14 పరుగులు చేస్తే ఐపీఎల్‌లో అత్యధిక స్కోరు నమోదు చేసే లక్ష్యంతో చివరి ఓవర్లో కేకేఆర్ బ్యాటింగ్‌కు సిద్ధమైంది. అయితే ఇషాంత్ అద్భుత యార్కర్‌తో తొలి బంతికే రసెల్‌ను క్లీన్ బౌల్డ్ చేయడంతో ఆ ఆశలకు తెర పడింది.


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సునీల్ నరైన్


అంగ్‌క్రిష్


రసెల్ బౌల్డ్

పంత్ మెరుపులు...

భారీ ఛేదనలో ఢిల్లీ తడబడింది. 12 పరుగుల వ్యవధిలో ఆ జట్టు తొలి 4 వికెట్లు కోల్పోయింది. పృథ్వీ షా (10), మార్ష్ (0), పొరేల్ (0), వార్నర్ (18) ప్రభావం చూపలేకపోవడంతో గెలుపుపై నమ్మకం ఇక్కడే సడలింది. అనంతరం కొద్ది సేపు పంత్ మెరుపు బ్యాటింగ్ క్యాపిటల్స్ అభిమానులకు ఆనందం పంచింది. తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌గా మలచిన అతను రసెల్ ఓవర్లో మరో 2 సిక్స్‌లు బాదాడు. ఆ తర్వాత వెంకటేశ్ అయ్యర్ వేసిన 12వ ఓవర్లో పంత్ బ్యాటింగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ ఓవర్లో వరుసగా 4, 6, 6, 4, 4, 4తో అతను 28 పరుగులు రాబట్టడం విశేషం. అయితే తర్వాతి ఓవర్లోనే అతను వెనుదిరగడంతో ఢిల్లీ మిగతా ఆట లాంఛనమే అయింది. స్టబ్స్ కూడా కొంత పోరాడినా లాభం లేకపోయింది.

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ × పంజాబ్
వేదిక: అహ్మదాబాద్
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	3	3	0	6	2.518
రాజస్తాన్	3	3	0	6	1.249
చెన్నై	3	2	1	4	0.976
లక్నో	3	2	1	4	0.483
గుజరాత్	3	2	1	4	-0.738
హైదరాబాద్	3	1	2	2	0.204
పంజాబ్	3	1	2	2	-0.337
బెంగళూరు	4	1	3	2	-0.876
ఢిల్లీ	4	1	3	2	-1.347
ముంబై	3	0	3	0	-1.423

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్


స్టబ్స్, పంత్


స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) స్టబ్స్ (బి) నోర్జే 18; నరైన్ (సి) పంత్ (బి) మార్ష్ 85; రఘువంశీ (సి) ఇషాంత్ (బి) నోర్జే 54; రసెల్ (బి) ఇషాంత్ 41; శ్రేయస్ అయ్యర్ (సి) స్టబ్స్ (బి) అహ్మద్ 18; రింకూ (సి) వార్నర్ (బి) నోర్జే 26; వెంకటేశ్ అయ్యర్ (నాటౌట్) 5; రమణ్‌దీప్ (సి) పృథ్వీ షా (బి) ఇషాంత్ 2; స్టార్క్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 272. వికెట్ల పతనం:** 1–60, 2–164, 3–176, 4–232, 5–264, 6–264, 7–266. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4–0–43–1, ఇషాంత్ శర్మ 3–0–43–2, నోర్జే 4–0–59–3, సలామ్ 3–0–47–0, సుమీత్ 2–0–19–0, అక్షర్ 1–0–18–0, మార్ష్ 3–0–37–1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (బి) స్టార్క్ 18; పృథ్వీ షా (సి) వరుణ్ (బి) వైభవ్ 10; మార్ష్ (సి) రమణ్‌దీప్ (బి) స్టార్క్ 0; పొరేల్ (సి) నరైన్ (బి) వైభవ్ 0; పంత్ (సి) శ్రేయస్ (బి) వరుణ్ 55; స్టబ్స్ (సి) స్టార్క్ (బి) వరుణ్ 54; అక్షర్ (సి) (సబ్) పాండే (బి) వరుణ్ 0; సుమీత్ (సి) (సబ్) పాండే (బి) నరైన్ 7; సలామ్ (సి) సాల్ట్ (బి) వైభవ్ 1; నోర్జే (సి) శ్రేయస్ (బి) రసెల్ 4; ఇషాంత్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (17.2 ఓవర్లలో ఆలౌట్) 166. వికెట్ల పతనం:** 1–21, 2–26, 3–27, 4–33, 5–126, 6–126, 7–159, 8–159, 9–161, 10–166. **బౌలింగ్:** స్టార్క్ 3–0–25–2, వైభవ్ 4–0–27–3, రసెల్ 1.2–0–14–1, నరైన్ 4–0–29–1, వరుణ్ చక్రవర్తి 4–0–33–3, వెంకటేశ్ 1–0–28–0.

సినిమా

తాతా... మనవడు?


● రామ్‌చరణ్, అమితాబ్ బచ్చన్

బాలీవుడ్ బిగ్ బి అమితాబ్ బచ్చన్ తెలుగు సినిమాలకు వరుసగా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తున్న అమితాబ్ తాజాగా మరో తెలుగు మూవీలో నటించేందుకు సుముఖత వ్యక్తం చేశారని ఫిల్మ్‌నగర్ టాక్. అది కూడా హీరో రామ్‌చరణ్‌కి తాతయ్య పాత్ర అని భోగట్టా. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో 'ఆర్‌సీ 16' (వర్కింగ్ టైటిల్) చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ అతి త్వరలోనే ప్రారంభం కానుంది. తాత–మనవడు కాన్సెప్ట్ నేపథ్యంలో రూపొందనున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్ తాత పాత్ర కోసం అమితాబ్ బచ్చన్‌ని సంప్రదించారట మేకర్స్. 'ఆర్‌సీ 16' కథ, తన పాత్ర నచ్చడంతో ఈ క్యారెక్టర్ చేసేందుకు అమితాబ్ అంగీకరించారని తెలుస్తోంది. అయితే దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


● 'దిల్' రాజు, శిరీష్, మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ, పరశురామ్


అహంకారం అనుకున్నా సరే...

- విజయ్ దేవరకొండ

''నా సినిమా వంద కోట్ల రూపాయల వసూళ్లు సాధించాలనే నా కల నా నాలుగో సినిమా 'గీత గోవిందం'తో నిజమైంది. ఆ తర్వాత అలాంటి మూవీ నాకు దక్కలేదు. అనంతరం నేను నటించిన మరో సినిమా రెండు వందల కోట్ల వసూళ్లు సాధిస్తుందని చెప్పాను... కానీ, సాధించలేదు. కానీ ఎవరు ఎన్ని అనుకున్నా రెండు వందల కోట్ల రూపాయల వసూళ్ల సినిమా చేస్తాను. ఇది బలుపు, అహంకారం అనుకున్నా సరే.. కానీ ఇది నా మీద నాకున్న నమ్మకం, విశ్వాసం. ఇక ఈ సమ్మర్‌కు మా టీమ్ నుంచి మీకు ఇస్తున్న చిన్న గిఫ్ట్ 'ఫ్యామిలీ స్టార్'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ మూవీ రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''మన కుటుంబంలోని భావోద్వేగాలతో రూపొందిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'' అన్నారు. ''మా సినిమా కథలోని భావోద్వేగాలకు అందరూ కనెక్ట్ అవుతారు'' అన్నారు పరశురామ్ పెట్ల.

రజనీకాంత్ కళుగు?

రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ ఓ సినిమా నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా టైటిల్‌ను ఈ నెల 22న అధికారికంగా ప్రకటించనున్నారు మేకర్స్. అయితే తాజాగా ఈ సినిమా టైటిల్ ఇదేనంటూ పలు పేర్లు కోలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాకు 'కళుగు' (తెలుగులో 'గద్ద' అని అర్థం) అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. మరి... ఇదే టైటిల్ ఖరారు అవుతుందా? లేక మరో టైటిల్ ఫిక్స్ అవుతుందా అనేది తెలియాలంటే ఈ నెల 22 వరకు ఆగాల్సిందే. ఈ చిత్రం షూటింగ్ జూన్ చివర్లో లేదా జూలై మొదటి వారంలో ప్రారంభం కానుందని తెలిసింది. గోల్డ్ స్మగ్లింగ్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్.


● రజనీకాంత్

మా సినిమా దమ్ బిర్యానీలా ఉంటుంది

- కోన వెంకట్


● కోన వెంకట్, అంజలి, శ్రీనివాస్ రెడ్డి

''నా 50వ సినిమా ప్రత్యేకంగా ఉండాలనుకున్నాను. 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రంతో అది నెరవేరింది. కామెడీ, హారర్ ఎలిమెంట్స్ మిక్స్ చేసి చేసిన సినిమా ఇది. మా మూవీ ట్రైలర్ బాగా వచ్చింది. ట్రైలర్ కంటే సినిమా వందరెట్లు బాగుంటుంది'' అని హీరోయిన్ అంజలి అన్నారు. ఆమె లీడ్ రోల్‌లో నటించిన 'గీతాంజలి' (2014)కి సీక్వెల్‌గా రూపొందిన సినిమా 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. శివ తుర్లపాటి దర్శకత్వం వహించారు. అంజలి, అలీ, శ్రీనివాస్ రెడ్డి, 'సత్యం' రాజేశ్, సత్య, 'షకలక' శంకర్, బ్రహ్మాజీ ముఖ్య తారలుగా నటించారు. ఎంవీవీ సినిమాస్‌తో కలిసి కోన ఫిల్మ్ కార్పొరేషన్‌పై కోన వెంకట్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ వేడుకలో కోన వెంకట్ మాట్లాడుతూ– ''ట్రైలర్‌లో చూసింది కొంతే... సినిమా దమ్ బిర్యానీలా ఉంటుంది'' అన్నారు. ''గీతాంజలి మళ్లీ వచ్చింది' ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుంది. సినిమా అంతకు మించి ఉంటుంది'' అన్నారు శివ తుర్లపాటి.

అందమైన ప్రేమకథ


● ఎస్తేర్, విక్రమ్ సహిదేవ్, సందీప్ కిషన్

'సినిమా చూపిస్త మావ, నేను లోకల్, ధమాకా' వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన త్రినాథరావు నక్కిన నిర్మాతగా మారిన సంగతి తెలిసిందే. త్రినాథరావు నక్కిన నెరేటివ్స్ ప్రొడక్షన్‌లో రూపొందనున్న రెండో సినిమా బుధవారం ప్రారంభమైంది. విక్రమ్ సహిదేవ్ లగడపాటి హీరోగా నటిస్తున్న ఈ మూవీలో 'దృశ్యం' ఫేమ్ ఎస్తేర్ అనిల్ హీరోయిన్. వంశీకృష్ణ మళ్ల దర్శకుడు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత శరత్ మరార్ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో సందీప్ కిషన్ క్లాప్ కొట్టారు. హీరో సుమంత్ గౌరవ దర్శకత్వం వహించగా, త్రినాథరావు, నాయుడు కలిసి దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందజేశారు. అనంతరం త్రినాథరావు మాట్లాడుతూ– ''సినిమా చూపిస్త మావ' తర్వాత మళ్లీ ఈ సినిమాకి నేను కథ రాశాను. ఇది కల్ట్ లవ్ స్టోరీ. ఓ టౌన్‌లో జరిగే అందమైన ప్రేమకథ'' అన్నారు. ''త్రినాథరావుగారు ప్రేమించి రాసుకున్న కథని నా చేతిలో పెట్టారు. నన్ను నమ్మి చాన్స్ ఇచ్చిన ఆయనకి రుణపడి ఉంటాను'' అన్నారు వంశీకృష్ణ మళ్ల.


● శ్రీదేవి


● బోనీ కపూర్

శ్రీదేవి బయోపిక్‌కు అనుమతి ఇవ్వను

- బోనీ కపూర్

ప్రముఖ దివంగత నటి శ్రీదేవి బయోపిక్ గురించి బాలీవుడ్‌లో అప్పుడప్పుడు వార్తలు వినిపిస్తూనే ఉంటాయి. కాగా శ్రీదేవి బయోపిక్ గురించి ఆమె భర్త, నిర్మాత బోనీ కపూర్ తాజాగా స్పందించారు. ''శ్రీదేవి చాలా ప్రైవేట్ పర్సన్. ఆమె జీవితం కూడా ప్రైవేట్‌గానే ఉండాలి. అందుకే నేను బతికి ఉన్నంతవరకు శ్రీదేవి బయోపిక్‌ను తెరకెక్కించేందుకు అనుమతి ఇవ్వను'' అంటూ ఓ ఆంగ్ల మీడియాతో బోనీ కపూర్ మాట్లాడినట్లుగా బాలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. అజయ్ దేవగన్ హీరోగా నటించిన స్పోర్ట్స్ డ్రామా 'మైదాన్'కు బోనీ కపూర్ ఓ నిర్మాత. ఈ నెల 10న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా శ్రీదేవి బయోపిక్ ప్రస్తావన వచ్చినప్పుడు బోనీ పై విధంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే... 2018 ఫిబ్రవరి 24న శ్రీదేవి దుబాయ్‌లో మరణించిన సంగతి తెలిసిందే.

పొలిటికల్ డ్రామా

రాకేశ్ వర్రే, రియా సుమన్, 'ఛత్రపతి' శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'జితేందర్ రెడ్డి'. విరించి వర్మ దర్శకత్వంలో ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రెస్‌మీట్‌లో ముదుగంటి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ– ''1980 కాలంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా పొలిటికల్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజులాంటి వాళ్ల చరిత్ర తెలుసుకోవడం ఎంత ముఖ్యమో జితేందర్ రెడ్డి గురించి తెలుసుకోవడం కూడా అలాంటిదే'' అన్నారు. ''కొంతకాలం గ్యాప్ తర్వాత 'జితేందర్ రెడ్డి' లాంటి ఒక మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను'' అన్నారు విరించి వర్మ.


● విరించి వర్మ, రాకేశ్, రవీందర్ రెడ్డి

సీక్రెట్ వార్స్‌కు చాన్స్ ఇవ్వండి

- దర్శకుడు శ్యామ్యుల్ రైమి



హాలీవుడ్ సూపర్ డూపర్‌హిట్ సూపర్ హీరో ఫ్రాంచైజీ 'అవెంజర్స్'. ఈ ఫ్రాంచైజీ నుంచి తాజాగా 'అవెంజర్స్: సీక్రెట్ వార్స్' సినిమా రానుంది. అయితే ఈ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ తనకు దక్కితే బాగుంటుందని దర్శక–నిర్మాత, రచయిత శ్యామ్యుల్ ఎమ్ రైమి చేసిన వ్యాఖ్యలు హాలీవుడ్‌లో చర్చనీయాంశమయ్యాయి. ఇక దర్శకుడిగా 'ది ఈవిల్ డెడ్', 'ది ఈవిల్ డెడ్ 2', 'స్పైడర్ మేన్', 'స్పైడర్ మేన్ 2', 'స్పైడర్ మేన్ 3' వంటి సినిమాలను తెరకెక్కించారు శ్యామ్యుల్. మరి.. 'అవెంజర్స్: సీక్రెట్ వార్స్' చిత్రానికి దర్శకత్వం వహించే చాన్స్ శ్యామ్యుల్ కోరుకున్నట్లు ఆయనకు దక్కుతుందా? అనేది చూడాలి. మరోవైపు 'అవెంజర్స్: సీక్రెట్ వార్స్' సినిమాలోని ప్రధాన తారాగణాన్ని ఇంకా ప్రకటించలేదు మార్వెల్ సంస్థ. అయితే టామ్ హాలండ్, క్రిస్ హెమ్స్‌వర్త్, ఆంథోనీ మాకీ లీడ్ రోల్స్‌లో కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది.

సినిమాల్లోనే ఉంటాను

ప్రముఖ పబ్లిసిటీ డిజైనర్ ధని ఏలే తనయుడు సూర్య తేజ ఏలే హీరోగా పరిచయమవుతున్న సినిమా 'భరత నాట్యం'. కేవీఆర్ మహేంద్ర దర్శకత్వంలో పాయల్ సరాఫ్ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో సూర్యతేజ మాట్లాడుతూ – ''చిన్నప్పట్నుంచి ఫిల్మ్ డైరెక్టర్ కావాలనుకునేవాణ్ని. వినయ్ వర్మ గారి దగ్గర యాక్టింగ్ కోర్స్ చేశాను. అన్నపూర్ణలో ఫిల్మ్ కోర్స్ చేశాను. మెల్లిగా రైటింగ్ పై ఆసక్తి పెరిగి, కథలు రాయడం ప్రారంభించాను. 'భరతనాట్యం'కు నేనే రైటర్‌ని. సో.. వ్యక్తిగతంగా ఫీలైన కొన్ని స్ట్రగుల్స్‌ను ఈ సినిమాలో కామికల్‌గా చెప్పే ప్రయత్నం చేశాను. ఓ మనిషి షార్ట్‌కట్‌లోకి వెళితే ఏం జరుగుతుంది? అన్నదే ఈ చిత్రకథ. నాకు పెయింటింగ్, ఎడిటింగ్‌లపైనా అవగాహన ఉంది. రైటర్, ఎడిటర్, యాక్టర్ అని కాదు.. ఏదో రూపంలో సినిమాల్లోనే ఉండాలనుకుంటున్నాను'' అని చెప్పుకొచ్చారు.


● సూర్యతేజ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
27	19
73,877	22,435

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,321	△	47
డోజోన్స్	39,217	△	47
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,937	△	2
డాక్స్	18,368	△	84
పాంఘై	3,069	▽	6
నికాయ్	39,452	▽	387

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	69,364	△	403
బంగారం (99.5 స్వచ్ఛత)	69,086	△	402
వెండి (కిలో)	77,594	△	1,467

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.97	83.99
£	బ్రిటన్ పౌండ్		103.44	105.98
€	యూరో		88.42	90.77
¥	జపాన్ ఎన్ (100)		54.41	55.63
AUS	ఆస్ట్రేలియా డాలర్		53.25	55.16
S$	సింగపూర్ డాలర్		59.34	64.02
SAR	సౌదీ రియాల్		21.34	22.90
UAE D	యూఏఈ దిర్హామ్		21.82	23.60
¥	చైనా యువాన్		10.41	12.48

టాప్-10లో ముకేశ్ అంబానీ

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ మరోసారి ప్రపంచ కుబేరుల జాబితాలో చోటు సాధించారు. 2024 ఏడాదికి ఫోర్బ్స్ టాప్-10 బిలియనీర్లలో 9వ ర్యాంకును పొందారు. 116 బిలియన్ డాలర్ల సంపదతో 66 ఏళ్ల ముకేశ్ టాప్-9గా నిలిచారు. 2023లో ముకేశ్ సంపద 83.4 బిలియన్ డాలర్లుగా నమోదైంది. కాగా.. దేశీయంగా సంపదలో టాప్-2గా నిలుస్తున్న గౌతమ్ అదానీ 84 బిలియన్ డాలర్లతో ప్రపంచంలో 17వ ర్యాంకును అందుకున్నారు. యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణల కారణంగా 2023లో అదానీ సంపద 47.2 బిలియన్ డాలర్లకు క్షీణించిన సంగతి తెలిసిందే. హిండెన్‌బర్గ్ ఆరోపణలను తోసిపుచ్చిన నేపథ్యంలో అదానీ గ్రూప్ తిరిగి బలపడింది. ఇక 2022లో అదానీ 90 బిలియన్ డాలర్ల నెట్‌వర్త్‌ను సాధించడం ప్రస్తావించదగ్గ అంశం!

ప్రపంచ బిలియనీర్లలో మళ్లీ చోటు



జాబితా ఇలా

ఫోర్బ్స్ 2024 బిలియనీర్ల జాబితాలో 2,781 మంది వ్యక్తులు చోటు సాధించారు. గతేడాది జాబితాతో పోలిస్తే 141 మందికి అదనంగా చోటు లభించింది. 2023తో పోలిస్తే కుబేరుల ఉమ్మడి సంపద 2 లక్షల కోట్ల డాలర్లు పెరిగి 14.2 ట్రిలియన్ డాలర్లను తాకింది. సరికొత్త రికార్డ్ నమోదైన 2021తో పోలిస్తే 1.1 లక్షల కోట్ల డాలర్లు జత కలసింది. ఫ్యాషన్స్, కాస్మెటిక్స్ దిగ్గజం ఎల్‌వీఎంహెచ్‌కు చెందిన బెర్నార్డ్ ఆర్నాల్ట్ 233 బిలియన్ డాలర్లతో టాప్ ర్యాంకును, 195 బిలియన్ డాలర్లతో ఎలన్ మస్క్ రెండో ర్యాంకునూ కొల్లగొట్టారు. 177 బిలియన్ డాలర్లతో ఫేస్‌బుక్ జుకర్‌బర్గ్ టాప్-3గా నిలిచారు.

పునరుత్పాదక విద్యుత్‌లో అదానీ గ్రీన్ ఎనర్జీ రికార్డు

దేశంలో తొలిసారిగా 10 వేల మెగావాట్ల సామర్థ్యం



న్యూఢిల్లీ: దేశీయంగా 10,000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని సాధించిన తొలి కంపెనీగా తమ సంస్థ నిల్చిందని అదానీ గ్రీన్ ఎనర్జీ (ఏజీఈఎల్) తెలిపింది. గుజరాత్‌లోని ఖావ్డా సోలార్ పార్క్‌లో 2,000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంటు ఏర్పాటు ద్వారా దీన్ని సాధించినట్లు సంస్థ వివరించింది. ప్రస్తుతం కంపెనీ పోర్ట్‌ఫోలియోలో 7,393 మెగావాట్ల సౌర విద్యుత్, 1,401 మెగావాట్ల పవన విద్యుత్, 2,140 మెగావాట్ల విండ్-సోలార్ హైబ్రిడ్ ప్లాంట్లు (మొత్తం 10,934 మెగావాట్ల) ఉన్నాయి. 2030 నాటికల్లా 45 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలని కంపెనీ నిర్దేశించుకుంది.

దేశీయంగా తొలి వాణిజ్య క్రూడాయిల్ స్టోరేజీ

కర్ణాటకలోని పాడూర్‌లో నిర్మాణం ● బిడ్లను ఆహ్వానించిన ఐఎస్‌పీఆర్‌ఎల్



న్యూఢిల్లీ: క్రూడాయిల్ సరఫరాలో ఒడిదుడుకులు ఏవైనా తలెత్తితే సమర్థంగా ఎదుర్కొనేందుకు దేశీయంగా తొలి వాణిజ్యపరమైన వ్యూహాత్మక ముడిచమురు స్టోరేజీ యూనిట్ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. కర్ణాటకలోని పాడూర్‌లో 2.5 మిలియన్ టన్నుల నిల్వ సామర్థ్యంతో భూగర్భంలో ముడిచమురు నిల్వ కోసం స్టోరేజీని నిర్మించేందుకు (పాడూర్ 2) ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ (ఐఎస్‌పీఆర్‌ఎల్) బిడ్లను ఆహ్వానించింది. బిడ్ల దాఖలుకు ఏప్రిల్ 22 ఆఖరు తేదీ కాగా, జూన్ 27 నాటికి ప్రాజెక్టును కేటాయిస్తారు. దీనికి సంబంధించిన టెండర్ డాక్యుమెంట్ల ప్రకారం ఇది ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) ప్రాతిపదికన ఉంటుంది. ప్రైవేట్ పార్టీలు స్టోరేజీని డిజైన్ చేయడం, నిర్మించడం, ఫైనాన్స్ చేయడం, నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. పాడూర్-2 స్టోరేజీని ఆపరేటరు ఏ ఆయిల్ కంపెనీకైనా లీజుకివ్వచ్చు. అందులో చమురుని నిల్వ చేసుకునే కంపెనీలు దాన్ని దేశీ రిఫైనర్లకు విక్రయించుకోవచ్చు. అయితే, అత్యవసర పరిస్థితుల్లో మాత్రం నిల్వలను ముందుగా ఉపయోగించుకునేందుకు భారత ప్రభుత్వానికి హక్కులు ఉంటాయి. ఐఎస్‌పీఆర్‌ఎల్ తొలి దశలో విశాఖపట్నంతో పాటు మంగళూరు, పాడూర్‌లో 5.33 మిలియన్ టన్నుల నిల్వ సామర్థ్యంతో వ్యూహాత్మక స్టోరేజీ యూనిట్లను ప్రభుత్వ వ్యయంతో ఏర్పాటు చేసింది. రెండో దశలో భాగంగా అండర్‌గ్రౌండ్‌లో రూ. 5,514 కోట్ల వ్యయంతో వాణిజ్య, వ్యూహాత్మక పెట్రోలియం స్టోరేజీ యూనిట్‌ను ప్రతిపాదిస్తోంది.

కెనరా బ్యాంక్ నుంచి సరికొత్త సేవలు

హైదరాబాద్: కెనరా బ్యాంక్ పలు కొత్త ఉత్పత్తులు, సర్వీసులు ప్రారంభించింది. 'కెనరా హీల్' పేరుతో వినూత్న హెల్త్ ప్రొడక్ట్ ప్రవేశపెట్టింది. ఆసుపత్రుల్లో చికిత్సలకు బీమా క్లెయిమ్ పూర్తిగా రాని సందర్భాల్లో 'కెనరా హీల్' ద్వారా రుణ సహాయం అందించనుంది. మహిళల కోసం 'కెనరా ఏంజెల్' అనే పేరుతో కస్టమైజ్డ్ సేవింగ్స్ ఖాతాను ప్రవేశపెట్టింది. ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులకు ఆన్‌లైన్ ద్వారా తక్షణ రుణ సదుపాయానికి 'కెనరా ఎస్‌హెచ్‌జీ ఈ-మనీ' తీసుకొచ్చింది. అలాగే ప్రీ-అప్రూవ్డ్ వ్యక్తిగత రుణాలకు 'కెనరా రెడీక్యాష్'; ఆన్‌లైన్ టర్మ్ డిపాజిట్ రుణాలకు 'కెనరా మైమనీ'; అవాంతరాలు లేని చెల్లింపులకు 'కెనరా యూపీఐ 123పే ఏఎస్‌ఐ' సేవలు ప్రారంభించింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ సీఈఓ రాజేష్ బన్సాల్, కెనరా బ్యాంక్ ఎండీ, సీఈవో సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-4-2024 ఫామ్ ధర...

విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	403-00
విజయవాడ	403-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	375-00
వరంగల్	377-00
రిటైల్ ధర	4.15

మార్కెట్లోకి టయోటా అర్బన్ క్రూజర్ టైజర్

ధర రూ.7.73 లక్షల నుంచి ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) తాజాగా మార్కెట్లోకి ఎంట్రీ లెవెల్ ఎస్‌యూవీ 'అర్బన్ క్రూజర్ టైజర్'ను విడుదల చేసింది. దీని ధర రూ. 7.73 లక్షల నుంచి రూ. 13.03 లక్షల వరకు (ఎక్స్-షోరూమ్) ఉంటుంది. ఇది మారుతీ సుజుకీకి చెందిన ఫ్రాంక్స్‌కి టీకేఎం వెర్షన్‌గా ఉంటుంది. టైజర్ పెట్రోల్, ఈ-సీఎన్‌జీ ఆప్షన్లలో లభిస్తుంది. ప్రీమియం ఇంటీరియర్స్, కీ లెస్ ఎంట్రీ, 360 వ్యూ కెమెరా, 9 అంగుళాల హెచ్డీ స్మార్ట్‌ప్లే, యాంటీ-థెఫ్ట్ సెక్యూరిటీ సిస్టమ్ తదితర ఫీచర్లు ఉన్నాయి. రూ. 11,000తో టైజర్‌ను బుక్ చేసుకోవచ్చు. మే నుంచి డెలివరీలు ప్రారంభమవుతాయి. మరింత మంది కస్టమర్లకు చేరువయ్యేందుకు ఈ మోడల్ తమకు ఉపయోగపడగలదని కంపెనీ డిప్యూటీ ఎండీ తడాషి అసాజుమా తెలిపారు. కస్టమర్లు చిన్న కార్ల నుంచి క్రమంగా పెద్ద కార్ల వైపు మళ్లుతున్నారని, అందుకే మరిన్ని కొత్త మోడల్స్‌ను ప్రవేశపెట్టేందుకు తాము ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.



కారు ఆవిష్కరణ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు

- మిశ్రమ అంతర్జాతీయ సంకేతాల ప్రభావం
- స్వల్ప నష్టాల ముగింపు
- బ్యాంకింగ్, ఆటో షేర్లకు నష్టాలు

ఒడిదుడుకుల ట్రేడింగ్

ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు బుధవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఇంట్రాడేలో 611 పాయింట్ల పరిధిలో ట్రేడైన సెన్సెక్స్ చివరికి 27 పాయింట్లు నష్టపోయి 73,877 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఇంట్రాడేలో 107 పాయింట్లు శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 19 పాయింట్లు కోల్పోయి 22,435 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు ట్రేడింగ్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ఆర్‌బీఐ ద్రవ్య సమీక్ష సమావేశ ప్రారంభం, యూఎస్ ఛైర్మన్ ప్రసంగం నేపథ్యంలో అప్రమత్తత చోటు చేసుకుంది. బ్యాంకింగ్, ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఐటీ, మెటల్, ఆయిల్ అండ్‌గ్యాస్, విద్యుత్ షేర్లు రాణించాయి. బీఎస్‌ఈల మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.61%, 1.18% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,214 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,102 కోట్ల షేర్లను కొన్నారు.



- ఎస్‌ఆర్‌ఎం కాంట్రాక్టర్స్ షేరు బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.210)తో పోలిస్తే 7% ప్రీమియంతో రూ.225 వద్ద లిస్టయ్యింది. మార్కెట్ అస్థిరతలోనూ ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ట్రేడింగ్‌లో అప్పర్ సర్క్యూట్ తాకింది. చివరికి 12.50% లాభంతో రూ.236 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.542 కోట్లుగా నమోదైంది.
- దేశీయంగా 10,000 మెగావాట్ల (మె.వా.) పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని సాధించిన తొలి కంపెనీగా అవతరించడంతో అదానీ గ్రీన్ ఎనర్జీ (ఏజీఈఎల్) షేరు 5% ఎగసి 618 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది.

ఎన్‌ఎస్‌ఈలో కొత్తగా 4 సూచీలు

ఎఫ్అండ్‌వో, నగదులో ఈ నెల 8 నుంచి షురూ



నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ(ఎన్‌ఎస్‌ఈ) తాజాగా నగదు విభాగంతోపాటు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్(ఎఫ్అండ్‌వో)లో నాలుగు ఇండెక్సులను కొత్తగా ప్రవేశ పెడుతోంది. నిఫ్టీ టాటా గ్రూప్ 25 శాతం క్యాప్, నిఫ్టీ500 మల్టీక్యాప్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ 50:30:20, నిఫ్టీ500 మల్టీక్యాప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 50:30:20, నిఫ్టీ మిడ్‌స్మాల్ హెల్త్‌కేర్ పేరుతో కొత్త సూచీలను రూపొందించింది. ఇవి ఈ నెల 8 నుంచి అమల్లోకి రానున్నాయి. నిఫ్టీ500 మల్టీక్యాప్ ఇండియా ఇండెక్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్, సన్ ఫార్మా, టాటా మోటార్స్ కీలకంగా నిలవనున్నాయి. ఇన్‌ఫ్రా ఇండెక్స్‌లో ఎల్అండ్‌టీ, ఆర్‌ఐఎల్, భారతీ ఎయిర్‌టెల్ ప్రాధాన్యత వహించనున్నాయి.

భారత్‌లో మోటరోలా ఎడ్జ్ 50 ప్రో



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మోటరోలా భారత్‌లో ఎడ్జ్ 50 ప్రో స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. ప్రపంచంలో తొలి ట్రూ కలర్ కెమెరా, 3డీ కర్వ్‌డ్ డిస్‌ప్లే ఫోన్ ఇదేనని కంపెనీ చెబుతోంది. 6.7 అంగుళాల 1.5కే సూపర్ హెచ్‌డీ పీఓఎల్‌ఈడీ డిస్‌ప్లే, ఆన్‌డ్రాయిడ్ 14 ఓఎస్, 30 ఎక్స్ హైబ్రిడ్ జూమ్, 3 ఎక్స్ ఆప్టికల్ జూమ్‌తో 50 ఎంపీ ప్రైమరీ ఏఐ కెమెరా, టర్బో పవర్ 50 వాట్ వైర్‌లెస్ చార్జింగ్, 125 వాట్ టర్బోపవర్ వైర్డ్ చార్జింగ్ వంటి హంగులు ఉన్నాయి. ధర రూ.27,999 నుంచి ప్రారంభం.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

జీటీఆర్‌ఈ, బెంగళూరులో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీ పోస్టులు

బెంగళూరులోని డీఆర్‌డీవోకి చెందిన గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (జీటీఆర్‌ఈ)లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 150
» **పోస్టుల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీ(ఇంజనీరింగ్)-75, గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీ(నాన్ ఇంజనీరింగ్)-30, డిప్లొమా అప్రెంటిస్ ట్రైనీ-20, ఐటీఐ అప్రెంటిస్ ట్రైనీ-25.
» **విభాగాలు:** మెకానికల్/ప్రొడక్షన్/ఇండస్ట్రియల్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్ /ఏరోనాటికల్/ఏయిరో స్పేస్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ /ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ /ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/టెలికాం ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ సైన్స్-టెక్నాలజీ ఇంజనీరింగ్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, బీఈ, బీటెక్, డిప్లొమా(ఇంజనీరింగ్), బీకాం, బీఎస్సీ, బీఏ, బీసీఏ, బీబీఏ(నాన్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 18 నుంచి 37 ఏళ్ల మించకూడదు.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000, ఐటీఐ అప్రెంటిస్‌కు రూ.7000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.04.2024
» **వెబ్‌సైట్:** www.drdo.gov.in/drdo

ఐఐఐటీడీఎం, కాంచీపురంలో ఎండీఈఎస్‌లో ప్రవేశాలు

కాంచీపురం(తమిళనాడు)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్(ఐఐఐటీడీఎం)-జూలై 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ-మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్/డిజైన్/ఆర్కిటెక్చర్ విభాగాల్లో డిగ్రీతో పాటు సీఈఈడీ స్కోరు తప్పనిసరిగా ఉండాలి.
» **ఎంపిక విధానం:** సీఈఈడీ స్కోరు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** పీహెచ్‌డీ-15.04.2024. ఎం.డిజైన్-30.04.2024.
» **ఆన్‌లైన్ ఇంటర్వ్యూ తేది:** 06.05.2024.
» **వెబ్‌సైట్:** www.iiitdm.ac.in

సీమ్యాట్-2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(సీమ్యాట్)-2024 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్(సీబీటీ). ప్రశ్నాపత్రం 400 మార్కులకు ఉంటుంది. 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు ఉంటాయి. క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్, లాంగ్వేజ్ కాంప్రెహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 3 గంటలు. నెగిటివ్ మార్కులు ఉంటాయి. ప్రతి సమాధానానికి ఒక్కో మార్కు చొప్పున తగ్గిస్తారు. ప్రశ్నాపత్రం ఆంగ్లమాధ్యమంలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.04.2024
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 19.04.2024 నుంచి 21.04.2024 వరకు
» **పరీక్ష తేది:** మే, 2024
» **వెబ్‌సైట్:** https://cmat.nta.nic.in


ఐడీఆర్‌బీటీలో పీజీడీబీటీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ(ఐడీఆర్‌బీటీ).. పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ(పీజీడీబీటీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** 60శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ లేదా మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:** డైరెక్ట్ అభ్యర్థులకు గేట్ /క్యాట్ /జీమ్యాట్ /జీఆర్‌ఈ /సీమ్యాట్/గ్జాట్ /మ్యాట్/ఏటీఎంఏ స్కోర్, షార్ట్‌లిస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు. ఇతరులకు గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2024
» **వెబ్‌సైట్:** https://www.idrbt.ac.in

సెబీలో కొలువు.. లక్షకుపైగా వేతనం!

స్టాక్ ఎక్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా.. సంక్షిప్తంగా సెబీ. స్టాక్ మార్కెట్ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, నియంత్రణ చర్యలు చేపట్టే సంస్థ.. సెబీ. సాధారణ పరిపాలన విభాగం మొదలు రీసెర్చ్ వరకూ.. పలు విభాగాల్లో నిపుణుల నియామకాలకు సిద్ధమవుతోంది. తాజాగా ఆఫీసర్ గ్రేడ్-ఎ అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కొలువు సొంతం చేసుకుంటే.. నెలకు రూ.1.11 లక్షల వేతనం లభిస్తుంది! ఈ నేపథ్యంలో.. సెబీ అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల సమాచారం, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, సిలబస్ అంశాలు తదితర వివరాలు..



» 97 అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ
» ఎంపికైతే నెలకు రూ.1.11 లక్షల వేతనం

మొత్తం 97 పోస్టులు

సెబీ తాజా నోటిఫికేషన్ ప్రకారం-మొత్తం ఆరు విభాగాల్లో 97 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను భర్తీ చేయనుంది. వీటిల్లో జనరల్ విభాగంలో 62 పోస్టులు, లీగల్-5 పోస్టులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ -24 పోస్టులు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-2 పోస్టులు, రీసెర్చ్-2 పోస్టులు, అధికార భాష (అఫిషియల్ లాంగ్వేజ్)-2 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ఆయా పోస్టులను అనుసరించి సంబంధిత సబ్జెక్టులలో పీజీ/బీటెక్/బీఏ/బీకాం/ బీఎస్సీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 2024, మార్చి 31 నాటికి 30 ఏళ్లలోపు ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేరకు గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

నెలకు రూ.1.11 లక్షల వేతనం

మూడు దశల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసుకుని.. నియామకం ఖరారు చేసుకున్న వారికి ప్రారంభంలోనే వసతి సదుపాయంతోపాటు నెలకు రూ.1.11 లక్షల వేతనం అందుతుంది. వసతి సదుపాయం లేకపోతే నెలకు రూ.1,49,500 వేతనం అందిస్తారు. వీటితోపాటు ఇతర అలవెన్స్‌లు కూడా లభిస్తాయి.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఆయా విభాగాల్లో అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. అవి.. ఫేజ్-1(ప్రిలిమినరీ రాత పరీక్ష), ఫేజ్-2(మెయిన్ రాత పరీక్ష), పర్సనల్ ఇంటర్వ్యూ.

ఫేజ్-1 పరీక్ష

ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్ష (ఫేజ్-1.. 200 మార్కులు)లో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1 మొత్తం 100 మార్కులకు గంట వ్యవధిలో నిర్వహిస్తారు. ఇందులో జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పేపర్-2లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విభాగానికి సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 50 ప్రశ్నలతో 100 మార్కులు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం ఒక గంట నలభై నిమిషాలు.

ఫేజ్-2 ఇలా

ఫేజ్-1లో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు పది మందిని చొప్పున ఎంపిక చేసి ఫేజ్-2 పరీక్ష నిర్వహిస్తారు. ఫేజ్-2 పరీక్ష కూడా రెండు పేపర్లుగా ఉంటుంది. పేపర్-1: ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్ (100 మార్కులు). ఇందులో ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్, ప్రెసిస్ రైటింగ్ ఉంటాయి. పేపర్-2ను ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో ఎంచుకున్న స్పెషలైజేషన్ నుంచి 70 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు (70 మార్కులు), అదే విధంగా మూడు డిస్క్రిప్టివ్ ప్రశ్నలు (ఒక్కో ప్రశ్నకు 10 మార్కులు) అడుగుతారు.

తుది దశ పర్సనల్ ఇంటర్వ్యూ

ఫేజ్-2లో కూడా విజయం సాధిస్తే నిర్దేశిత కటాఫ్ నిబంధనల ప్రకారం-అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసి తుది దశలో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూలో అకడమిక్ నేపథ్యం, ప్రొఫెషనల్ ఎక్స్‌పీరియన్స్, స్టాక్ మార్కెట్ కార్యకలాపాలపై ప్రశ్నలు ఉంటాయి.

వెయిటేజీ విధానం

పర్సనల్ ఇంటర్వ్యూ కూడా పూర్తయిన తర్వాత.. నియామకాలు ఖరారు చేసే క్రమంలో వెయిటేజీ విధానం పాటిస్తారు. ఫేజ్-2 రాత పరీక్షలో పొందిన మార్కులకు 85 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులకు 15 శాతం వెయిటేజీ కల్పిస్తారు. దీనికి అనుగుణంగా తుది జాబితా రూపొందించి నియామకాలు ఖరారు చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** 2024, ఏప్రిల్ 13
- **ఫేజ్-1 రాత పరీక్ష:** జూన్ మొదటి వారంలో నిర్వహించే అవకాశం.
- **వివరాలకు వెబ్‌సైట్:** www.sebi.gov.in/sebiweb/about/AboutAction.do?doVacancies=yes

రాత పరీక్షలో సక్సెస్ ఇలా

జనరల్ అవేర్‌నెస్

కరెంట్ అఫైర్స్, జీకేతోపాటు ఇటీవల కాలంలో జాతీయ ఆర్థిక రంగంలో మార్పులు, స్టాక్ మార్కెట్ కార్యకలాపాలు, విధి విధానాలు, నూతన నిబంధనలు వంటి అంశాల గురించి తెలుసుకోవాలి. స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన టెర్మినాలజీపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా బాగా ప్రాక్టీస్ చేస్తే.. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

రీజనింగ్

రీజనింగ్ ప్రిపరేషన్‌లో అభ్యర్థులు సిరీస్, అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

ప్రొఫెషనల్ నాలెడ్జ్

ఫేజ్-1, ఫేజ్-2లలో అభ్యర్థులు ఎంచుకున్న విభాగంలో ప్రశ్నలు అడుగుతారు. తాము దరఖాస్తు చేసుకున్న స్పెషలైజేషన్, దానికి సంబంధించి బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను చదవాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్

ఫేజ్-2లో పేపర్-1గా ఉండే ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో రాణించడానికి అభ్యర్థులు ఇంగ్లిష్ కాంప్రహెన్షన్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్‌లలో నైపుణ్యం కోసం ఇంగ్లిష్ దిన పత్రికల ఎడిటోరియల్స్‌ను చదవాలి. వాటి సారాంశంతో సొంతంగా వ్యాసాలు రాసే నైపుణ్యం పెంచుకోవాలి. లెటర్ రైటింగ్‌కు సంబంధించి పర్సనల్, బిజినెస్ లెటర్ల తీరు, పంక్చుయేషన్స్, లెటర్ స్వరూపం(బాడీ ఆఫ్ ద లెటర్)పై పూర్తి అవగాహన పొందాలి.

క్లుప్తంగా...

నేడు వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుల ప్రమాణ స్వీకారం

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభకు ఇటీవల ఎన్నికైన వైఎస్సార్‌సీపీ సభ్యులు గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి గురువారం రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వీరితో ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రమాణం చేయించనున్నారు. కనకమేడల రవీంద్రకుమార్ (టీడీపీ), వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ), సీఎం రమేష్ (బీజేపీ)ల పదవీ కాలం ముగియడంతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సభ్యులు ఏకగ్రీవంగా విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాజ్యసభలో ఏపీకి ఉన్న 11 సీట్లు వైఎస్సార్‌సీపీకే దక్కాయి. పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి తొలిసారిగా రాజ్యసభలో టీడీపీ ప్రాతినిధ్యం లేకుండాపోయింది. తెలంగాణ నుంచి ఎన్నికైన బీఆర్ఎస్ అభ్యర్థి వద్దిరాజు రవిచంద్ర కూడా గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

అంబేడ్కర్ గురుకుల ఇంటర్ ప్రవేశ పరీక్షా ఫలితాలు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఇంటర్ ప్రవేశ పరీక్షా ఫలితాలను రాష్ట్ర సాంఘిక, సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి డా. మహేశ్‌కుమార్ రావిరాల బుధవారం విడుదల చేశారు. తాడేపల్లిలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు రాష్ట్రవ్యాప్తంగా 40,853 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, పరీక్షకు 35,629 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. అంబేడ్కర్ గురుకులాల్లో బాలికలకు 9,280 సీట్లు, బాలురకు 4,280 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతిభ ఆధారంగా ఆయా కేటగిరీల్లో విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తామని చెప్పారు. ఇంటర్ ప్రవేశ పరీక్ష ఫలితాల కోసం అభ్యర్థులు http.// apbragcet.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించగలరని ఆయన సూచించారు.

ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్‌లో చాంపియన్‌గా శ్రీచైతన్య

సాక్షి, హైదరాబాద్: అమెరికా ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్–2024లో శ్రీచైతన్య వరుసగా 11వ సంవత్సరం వరల్డ్ చాంపియన్‌గా నిలిచింది. ఇందులో ప్రపంచంలోని 28కి పైగా దేశాలు పాల్గొనగా శ్రీచైతన్య విద్యార్థులు నెంబర్‌వన్ స్థానంలో నిలిచినట్లు శ్రీచైతన్య డైరెక్టర్ సీమ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాంటెస్ట్‌లో 3 నగదు అవార్డులను ఎన్ఎస్ఎస్ ప్రకటించగా.. అందులో రెండు నగదు అవార్డులను వరుసగా రెండో సంవత్సరం శ్రీచైతన్య విద్యార్థులు సాధించారన్నారు. అలాగే వరల్డ్ ఫస్ట్ ప్రైజ్–7 ప్రాజెక్టులు, వరల్డ్ సెకండ్ ప్రైజ్–11 ప్రాజెక్టులు, వరల్డ్ థర్డ్ ప్రైజ్–15 ప్రాజెక్టులు, హానరబుల్ మెన్షన్స్–29 ప్రాజెక్టులు కలిపి మొత్తం విన్నింగ్ ప్రాజెక్టులు–62 ఒక్క శ్రీచైతన్య మాత్రమే సాధించిందని వివరించారు. ఈ విన్నింగ్ ప్రాజెక్టుల్లో 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొని విజయం సాధించారని ఆమె పేర్కొన్నారు. ఇంతటి విజయం సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులు, ఇతర సిబ్బందిని సీమ అభినందించారు.

ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్‌లో గ్లోబల్ లీడర్‌గా నారాయణ

సాక్షి, హైదరాబాద్: నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గెరార్డ్ కె.ఓ నీల్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్–2024లో నారాయణ విద్యార్థులు సత్తాచాటారు. సైన్స్ ప్రాజెక్టుల్లో వరల్డ్ నంబర్‌వన్ స్థానంలో 2 సెలక్షన్స్ నారాయణ విద్యార్థులు దక్కించుకున్నారని ఆ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ సింధూర నారాయణ, శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వరల్డ్ నంబర్ 2 స్థానంలో 5, వరల్డ్ నంబర్ 3 స్థానంలో 7 సెలక్షన్స్ పాటు 20 హానరబుల్ ప్రైజ్‌లను నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారని వెల్లడించారు. మొత్తంగా 34 ప్రాజెక్టుల్లో విజయకేతనం ఎగురవేసినట్లు పేర్కొన్నారు. 11 ఏళ్లుగా అద్భుత ఫలితాలు సాధిస్తూ ఇప్పటివరకు 334కు పైగా ప్రాజెక్టులు గెలుచుకుని వరల్డ్ నెంబర్‌వన్‌గా నారాయణ నిరూపించుకుందని వారు తెలిపారు. సీబీఎస్సీతో కూడిన ఇంటిగ్రేటెడ్ కరికులమ్‌ను ప్రవేశపెట్టి, విద్యనందించడం వలనే ఇలాంటి ఫలితాలు వెలువడుతున్నాయన్నారు. ఘన విజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునిత్ అభినందించారు.

ప్రైవేటు చేతుల్లోకి స్టీల్‌ప్లాంట్ గెస్ట్‌హౌస్‌లు

30 ఏళ్ల లీజుకు ఈవోఐ ఆహ్వానం

ఉక్కునగరం (విశాఖ జిల్లా): స్టీల్‌ప్లాంట్‌కు చెందిన రాయబరేలీ వీల్‌ప్లాంట్, విశాఖలోని హెచ్‌బీ కాలనీలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లగా ఇప్పుడు స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని ఉక్కుహౌస్, గంగవరం గెస్ట్‌హౌస్ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడానికి రంగం సిద్ధం అయింది. ఈ గెస్ట్‌హౌస్‌ల మెయింటెనెన్స్, ఆపరేషన్లకు సంబంధించి స్టీల్‌ప్లాంట్ ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)కు బుధవారం టెండర్లు ఆహ్వానించింది. ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న ఉక్కుహౌస్‌లో విశాలమైన లాన్‌తో పాటు 108 రూములు, 4 సూట్ రూములు, రెస్టారెంట్, కిచెన్, 20 కార్ల పార్కింగ్ స్థలం ఉన్నాయి. గంగవరం గెస్ట్‌హౌస్‌లో నాలుగు డబుల్ రూమ్‌లు, ఒక సూట్ రూమ్ ఉన్నాయి. ఈ గెస్ట్‌హౌస్‌లను 30 ఏళ్ల లీజుకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నారు. టెండర్లు ఈనెల 15లోగా సమర్పించాలని స్టీల్‌ప్లాంట్ హాస్పిటాలిటీ విభాగం జీఎం పేరిట నోటిఫికేషన్ విడుదలైంది.

బాలికలు, మహిళలను వేధించే వారిని వదలం

ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి హెచ్చరిక

- రూపశ్రీ మృతిపై విశాఖ కళాశాలలో విస్తృత విచారణ
- న్యాయం చేస్తామని విద్యార్థిని తల్లిదండ్రులకు భరోసా



రూపశ్రీ తల్లిని ఓదారుస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి

మధురవాడ(భీమిలి): బాలికలు, మహిళలను ఇబ్బందులకు గురిచేసినా, వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించినా అలాంటి వారిని వదిలే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి హెచ్చరించారు. విశాఖ కొమ్మాది చైతన్య కళాశాలలో ఫ్యాకల్టీ లైంగిక వేధింపులకు విద్యార్థిని రూపశ్రీ మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో విచారణ కమిటీ సభ్యులు, ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావుతో కలిసి బుధవారం ఆమె కళాశాలను సందర్శించారు. తరగతి గదులు, ల్యాబ్‌లు, హాస్టల్ భవనం, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తర్వాత అక్కడి ఇంజనీరింగ్, డిప్లమా ఫ్యాకల్టీ, సిబ్బందితో వేర్వేరుగా సమావేశమయ్యారు. మీ పిల్లలు ఈ పరిస్థితిలో ఉంటే ఇలానే వదిలేస్తారా? ఇక్కడ ల్యాబ్‌లో ఓ వ్యక్తి ఆడబిడ్డల పట్ల అంత దారుణంగా వ్యవహరిస్తున్నాడంటే వాడు మనిషా, పశువా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కళాశాల గుర్తింపు రద్దుకు సిఫార్సు

అనంతరం వెంకటలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ పిల్లలను తీర్చిదిద్దాల్సిన ఫ్యాకల్టీయే విద్యార్థులతో సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించడం దారుణమన్నారు. విద్యా సంస్థకు ఉండాల్సిన కనీస నిబంధనలను ఈ కళాశాల పాటించడం లేదని తెలిపారు. చాలా చోట్ల సీసీ కెమెరాల్లేవని, ల్యాబ్‌లో మానిటరింగ్ సిస్టమ్ లేదన్నారు. ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, రికార్డులు, ఐసీసీ కమిటీలు, యాంటీ ర్యాగింగ్ సిస్టం.. కనీసం కంప్లయింట్ బాక్స్ కూడా లేదన్నారు. కళాశాల గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తున్నామన్నారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పించే వసతులు, భోజనం వంటి విషయాల్లోనూ వివక్ష ఉందని, ప్రభుత్వం నుంచి ఫీజు వచ్చేవారికి నాణ్యమైన భోజనం లేదని, కనీసం మంచాలు కూడా లేవన్నారు. ప్రైవేటు ఫీజులు చెల్లించే వారికి అన్ని సౌకర్యాలూ కల్పించారని చెప్పారు. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురు అరెస్ట్ అయ్యారని, ఇంకా విచారణ కొనసాగుతోందన్నారు. కాగా, రూపశ్రీ మృతిపై వెంకటలక్ష్మి పలు అనుమానాలు వ్యక్తం చేశారు. నాలుగో అంతస్తుపై నుంచి పడి మృతి చెందిన బాలిక శరీరంపై ఏ రకమైన దెబ్బలూ లేకపోవడం, ఒక బాలిక ఉదయం నుంచి రాత్రి వరకు కనిపించకున్నా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం వంటి ప్రశ్నలు ఎన్నో ఉన్నాయన్నారు. అనంతరం ఆందోళన శిబిరంలో ఉన్న రూపశ్రీ తల్లిదండ్రులను పరామర్శించి.. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ, ఏపీఎస్‌సీపీసీ డైరెక్టర్ టి.ఆదిలక్ష్మి, మహిళా కమిషన్ డైరెక్టర్ ఆర్.సుజి, ఏయూ లా కాలేజి ప్రొఫెసర్ విజయలక్ష్మి, మహిళా కమిషన్ లీగల్ కౌన్సిలర్ పూజితయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి నివేదిక ఇవ్వండి

సీఎస్, డీజీపీలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఫ్యాకల్టీయే లైంగికంగా వేధిస్తే ఇంకెవరికి చెప్పను నాన్న.. అంటూ తండ్రికి మెసేజ్ చేసి ఆత్మహత్యకు పాల్పడిన బాలిక ఘటనపై నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) స్పందించింది. బాలిక ఆత్మహత్య ఘటనపై పూర్తి నివేదికను అందించాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు నోటీసులిచ్చింది. మార్చి 28న విశాఖపట్నం కొమ్మాదిలోని 'చైతన్య ఇంజనీరింగ్' కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న రూపశ్రీ(16) లైంగిక వేధింపుల కారణంగా హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తన ఫ్యాకల్టీయే లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు, ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరిస్తున్నాడని తండ్రికి మెసేజ్‌లో తెలిపింది. ఈ ఘటనపై వార్తా పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ సుమోటాగా కేసు నమోదు చేసింది. నాలుగు వారాల్లో బాలిక ఆత్మహత్యకు గల కారణాలతో తమకు నివేదిక అందించాలంటూ సీఎస్, డీజీపీలను ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది. నివేదికతో పాటు రాష్ట్ర పోలీసు శాఖ జరిపిన ఇన్వెస్టిగేషన్‌ను కూడా తెలపాలంటూ సూచించింది. కాగా, బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనను పరిశీలిస్తే కొమ్మాదిలోని «చైతన్య ఇంజనీరింగ్» కళాశాల యాజమాన్యమే కారణం అనే విషయం తెలుస్తోందంటూ ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేర్కొంది. కాలేజీలో ఇంకెంతమంది విద్యార్థినిలు ఫ్యాకల్టీల లైంగిక వేధింపులకు గురవుతున్నారనే విషయాన్ని రాష్ట్ర పోలీసు శాఖ క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని సూచనలు చేసింది. విద్యార్థినులను వేధిస్తున్న వారిపై కేసులను సైతం నమోదు చేయాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేర్కొంది.

నెల్లూరులో ఇక తరచూ జాబ్‌మేళాలు

వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి



ఫార్మా విద్యార్థులతో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): రానున్న రోజుల్లో నెల్లూరు పార్లమెంట్ పరిధిలో జాబ్‌మేళాలను ఆర్నెల్లకోసారి నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులో రామ్మూర్తినగర్‌లోని ఓ కల్యాణ మండపంలో ఫార్మా విద్యార్థులతో బుధవారం నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. ఫార్మా – డీ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తమ ప్రభుత్వం కంకణం కట్టుకుందని చెప్పారు. ఫార్మా చదివిన వారికి వైద్య, ఆరోగ్య శాఖలో ప్రత్యేక అవకాశాన్ని సీఎం జగన్ కల్పించారని చెప్పారు. దేశంలోనే ఫార్మా–డీ కళాశాలలు తెలంగాణ, ఏపీలో ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. తాను రాజ్యసభ సభ్యుడ్ని అయ్యాక డీ–ఫార్మా కోర్సుకు దేశవ్యాప్త గుర్తింపు..ఉద్యోగ కల్పన కోసం పార్లమెంట్ జీరో.. క్వశ్చన్ అవర్‌తో పాటు అప్పటి కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్‌తో చర్చించానని చెప్పారు. ట్రిపుల్ ఐటీ తరహాలో ఫార్మా–డీ కళాశాలల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఫార్మా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనేదే సీఎం ఉద్దేశమన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ఉచిత కోచింగ్ సద్వినియోగం చేసుకోవాలి

ఈ నెల 8 నుంచి మరో బ్యాచ్ ప్రారంభం

- సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి



పాలిసెట్ ఉచిత కోచింగ్ మెటీరియల్ పంపిణీ చేస్తున్న కమిషనర్ నాగరాణి

సాక్షి, అమరావతి: పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి కోరారు. పాలిటెక్నిక్ ప్రవేశాల పెంపు లక్ష్యంగా విద్యార్థులకు ఇస్తున్న సమగ్ర శిక్షణకు మంచి స్పందన లభిస్తోందన్నారు. బుధవారం విజయవాడ, గుంటూరులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు సహా, పలు ఉచిత కోచింగ్ కేంద్రాలను నాగరాణి సందర్శించి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. పాలిటెక్నిక్ ప్రవేశాలను కోరుకునే ప్రతి ఒక్కరికీ వయోబేధం లేకుండా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 87 ప్రభుత్వ, 182 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏప్రిల్ 24 వరకు తరగతులు నిర్వహించి ఏప్రిల్ 25వ తేదీన గ్రాండ్ ప్రీ ఫైనల్ ఎంట్రన్స్ ఎగ్జామ్ నిర్వహిస్తామన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమ విద్యార్థులకు ఉపకరించేలా రెండు భాషల్లోనూ స్టడీ మెటీరియల్ సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఈ శిక్షణకు మంచి డిమాండ్ ఉందని, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోరిక మేరకు ఈ నెల 8వ తేదీ నుంచి కొత్త బ్యాచ్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వివరించారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27వ తేదీ కాగా, ఆన్‌లైన్ అప్లికేషన్‌లకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాలిటెక్నిక్ తరువాత లభించే ఉపాధి అవకాశాలపై స్వయంగా కమిషనర్‌తో వ్యక్తిగతంగా మాట్లాడి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్య, శిక్షణ మండలి కార్యదర్శి రమణబాబు, సంయుక్త కార్యదర్శి జానకిరామ్, ఉప కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఇంటర్, పది ఫలితాలు

- ఎన్నికల నేపథ్యంలో ముందుగా ప్రకటించే అవకాశం
- నేటితో ముగియనున్న ఇంటర్ మూల్యాంకనం
- నాలుగు రోజుల్లో పదోతరగతి పేపర్లు కూడా పూర్తి



గతేడాది ఏప్రిల్ 26న ఇంటర్, మే 6న టెన్త్ ఫలితాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విద్యాశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. విద్యార్థులపై ఎలాంటి రాజకీయ ఒత్తిడి ఉండకూడదన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలను ఈ ఏడాది మార్చి ఒకటో తేదీ నుంచి 30 వరకు నిర్వహించింది. వెంటనే విద్యాశాఖ అధికారులు మూల్యాంకనం చేపట్టారు. ఇంటర్మీడియట్‌లో రెండు సంవత్సరాల విద్యార్థులు మొత్తం 9,99,698 మంది పరీక్షలు రాశారు. వీరి జవాబుపత్రాల మూల్యాంకనం కోసం సుమారు 23 వేలమంది అధ్యాపకులను ఇంటర్ విద్యామండలి నియమించింది. పదో తరగతి పరీక్షలను 6,30,633 మంది రాశారు. వీరికి సంబంధించిన 47,88,738 జవాబుపత్రాల వేల్యూయేషన్ కోసం 25 వేలమంది ఉపాధ్యాయులను నియమించి 26 జిల్లాల్లో సెంటర్లను ఏర్పాటు చేశారు. గతంలో తలెత్తిన ఇబ్బందులను అధిగమించి ఈ ఏడాది మూల్యాంకనం కేంద్రంలో గరిష్ఠంగా 900 మంది వేల్యూయేటర్లు ఉండేలా చర్యలు తీసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఇంటర్మీడియట్ జవాబుపత్రాల మూల్యాంకనం గురువారంతో ముగియనుంది. తరువాత పునఃపరిశీలన, మార్కుల నమోదు వంటి ప్రక్రియ నిర్వహించనున్నారు. అనంతరం ఈనెల 12వ తేదీ నాటికి ఇంటర్మీడియట్ ఫలితాలను వెల్లడించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఏప్రిల్ ఒకటో తేదీన ప్రారంభమైన పదో తరగతి మూల్యాంకనం కూడా ఈనెల ఎనిమిదో తేదీ నాటికి పూర్తికానుంది. ఈ ఫలితాలను సైతం వారం, పది రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. మూల్యాంకన ప్రక్రియలో ఎక్కువమంది సిబ్బంది నియామకం, టెక్నాలజీ వినియోగం, ప్రతి మూల్యాంకన కేంద్రానికి బోర్డు నుంచి ప్రత్యేక అధికారుల పరిశీలన వంటి జాగ్రత్తలు తీసుకున్నారు. ఫలితాల ప్రకటన అనంతరం ఇంటర్మీడియట్, టెన్త్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ ప్రకటిస్తారు. 2022–23 విద్యాసంవత్సరంలో జరిగిన వార్షిక పరీక్షలకు సంబంధించి ఇంటర్మీడియట్ ఫలితాలను ఏప్రిల్ 26న, టెన్త్ ఫలితాలను మే 6వ తేదీన విడుదల చేశారు.

సత్యసాయి ప్రసంగాల అనువాదకుడు కన్నుమూత



పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి సత్యసాయిబాబా ప్రసంగాల ఆంగ్ల అనువాదకుడు ప్రొఫెసర్ కామరాజ్ అనిల్‌కుమార్ (82) కన్నుమూశారు. ఈ నెల ఒకటిన అనారోగ్యంతో పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరిన ఆయన బుధవారం తీవ్ర గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. గుంటూరుకు చెందిన ప్రొఫెసర్ అనిల్‌కుమార్ అక్కడ బోటనీ లెక్చరర్‌గా పని చేశారు. భార్య అనారోగ్యం కారణంగా 1970లో పుట్టపర్తి వచ్చారు. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినా ఆమెకు నయంకాని జబ్బును బాబా నయం చేశారని అనిల్‌కుమార్ తెలిపేవారు. విగ్రహారాధనకు వ్యతిరేకుడైన బ్రహ్మ సమాజానికి చెందిన అనిల్‌కుమార్.. తనకు కలిగిన దివ్యానుభూతితో సత్యసాయి భక్తుడినై ఇక్కడే ఉండిపోయినట్లు సత్సంగ్‌లో చెప్పారు. 1972లో ప్రశాంతి నిలయంలో మొదటి ప్రసంగం చేశారు. ఆకర్షితులైన బాబా ఆయన్ని ఇక్కడే ఉండిపొమ్మన్నారు.

ఘనంగా పీఆర్‌సీఐ వ్యవస్థాపక దినోత్సవం

సాక్షి డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డికి సంవాహన అవార్డు



సంవాహన అవార్డు అందుకుంటున్న సాక్షి డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డి

సంవాహన అవార్డులు అందుకున్నది వీరే..

కేఆర్‌పీ రెడ్డి (డైరెక్టర్, సాక్షి), సీహెచ్ రాకేశ్ (సీపీఆర్ఓ, సౌత్ సెంట్రల్ రైల్వే), జయప్రకాశ్ (జనరల్ మేనేజర్, కార్పొరేటర్ కమ్యూనికేషన్ ఎన్ఎండీసీ), అనురాధ కిషోర్ (జనరల్ మేనేజర్, ఆర్‌కే స్వామి అడ్వర్టయిజింగ్), హేమంత్ అగర్వాల్ (సీఎండీ, అసోసియేటెడ్ అడ్వర్టయిజింగ్), అనూజ్ గుడివాడ (సింగర్), డాక్టర్ నాగేశ్వరరావు (బ్యూరో చీఫ్, వార్త), మంజులత కళానిధి (సీనియర్ జర్నలిస్ట్), డాక్టర్ సయ్యద్ ఫాజిల్ హుస్సేన్ పర్వేజ్ (మీడియా ప్లస్ ఫౌండర్).

సనత్‌నగర్(హైదరాబాద్): పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ) 20వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు బుధవారం బేగంపేటలోని హోటల్ ది ప్లాజాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై ప్యానెల్ చర్చలు జరిగాయి. 'పీఆర్‌ను పునరుద్ధరించడం: డిజిటల్ ఆధిపత్య యుగంలో సాంప్రదాయ మీడియాను సమగ్ర పరచడం', 'న్యూఏజ్ డిజిటల్ కమ్యూనికేషన్స్ ఎ పర్‌స్పెక్టివ్' అంశాలపై సుదీర్ఘ చర్చలు కొనసాగాయి. అనంతరం పబ్లిక్ రిలేషన్స్ రంగంలో అత్యుత్తమ నిపుణులైన తొమ్మిది మందికి సంవాహన అవార్డులను ప్రదానం చేశారు. అలాగే పీఆర్‌సీఐ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇదే వేదికపై చాణక్య మ్యాగజైన్ ప్రత్యేక సంచికను విడుదల చేశారు. ఈ వేడుకలకు హాజరైన ఇండియన్ క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్‌మిశ్రా మాట్లాడుతూ, డిజిటల్ మీడియా ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా సంబంధాల రంగంలో ఉన్నవారు ఎప్పటికప్పుడు తమ ప్రతిభకు పదునుపెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు విరహత్ అలీ, తెలంగాణ స్టేట్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ అనూప్‌రెడ్డిలు మాట్లాడుతూ పబ్లిక్ రిలేషన్స్ రంగంలో అంకితభావం, నిబద్ధతతో పనిచేసినప్పుడే విశ్వసనీయత ఉంటుందన్నారు. పీఆర్‌సీఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ షకీల్ అహ్మద్ మాట్లాడుతూ, 20 ఏళ్ల ప్రస్థానంలో పీఆర్‌సీఐ ఎన్నో మైలురాళ్లను అధిగమించిందని తెలిపారు. పీఆర్ రంగంలోని నిపుణులను, మేధావులను, ఔత్సాహికులను ఒకే వేదికపైకి చేర్చి ప్యానెల్ చర్చలు జరిపామని, దీని ద్వారా మరింత పరిజ్ఞానం సాధించామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌సీఐ చీఫ్ మెంటార్ ఎమెరిటస్ ఎంబీ జయరామ్, జాతీయ అధ్యక్షురాలు గీతాశంకర్, ఆర్‌టీ కుమార్, టి.వినయ్, తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.